ముద్రణ : 2024

ప్రచురణకర్త : డా॥ కొప్పరపు నారాయణమూర్తి, Ph.D, తెనాలి

ముఖపత్రం :

ఐ.ఎస్.బి.ఎన్. సంఖ్య : 978-93-341-6570-8

ప్రతులకు:
1) అనల్ప బుక్ కంపెనీ, సికింద్రాబాద్. సెల్ : 7093800303
2) డా. కొప్పరపు నారాయణమూర్తి, పిహెచ్.డి.
డోర్ నెం. 21-19-14, మామిడి బత్తులవారి వీధి,
రామలింగేశ్వరపేట, తెనాలి - 522201.
సెల్ : 7671909759

వెల : రూ. 225

ముద్రణ :

డి.టి.పి. : శ్రీ దుర్గ గ్రాఫిక్స్, తెనాలి. సెల్ : 9110761291

రచయిత గురించి

అసలు పేరు – సి.ఎస్.హెచ్.ఎన్. మూర్తి. ప్రస్తుతం సంక్షిప్తంగా డా॥ కొప్పరపు నారాయణమూర్తి అనే పేరుతో రచనావ్యాసంగం చేస్తున్నారు. గతంలో 'గిరిజా నారాయణ్' కలం పేరుతో అనేక కథలు, వ్యాసాలు రాశారు. జన్మస్థలం గుంటూరు. కాని విద్యాభ్యాసం ఎక్కువ భాగం ఒంగోలులో సాగింది. చిన్న రామయ్య ప్రైమరీ స్కూల్, పి.వి.ఆర్.ఎమ్.హెచ్. స్కూల్, సి.ఎస్.ఆర్. శర్మా కాలేజీలలో ఎలిమెంటరీ స్కూలు, హైస్కూలు, డిగ్రీ చదువులు పూర్తయినాయి. ఆర్థికంగా బాగా వెనుకబడిన కుటుంబం కావటాన మొత్తం చదువు మెరిట్ స్కాలర్‌షిప్‌ల మీద, మేనమామ ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి గారి సహాయం పైనా, ఇంకా అనేకమంది మిత్రులు, శ్రేయోభిలాషులు చేసిన ఆర్థిక సాయంతో సాగింది. 1977లో డిగ్రీ ముగిశాక వారు జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, న్యూఢిల్లీలో ఎమ్.ఎస్‌సి. లైఫ్ సైన్సెస్ కోర్సుకు అఖిల భారత పోటీ పరీక్షలో సీట్ సాధించారు. కాని ఒక సెమిస్టర్ పూర్తయ్యేటప్పటికి వారికి సహాయం చేస్తామన్న వారు చేసే ఆర్థికసహాయం సరిపోలేదు. ఫలితంగా చదువు మానేసి హైదరాబాద్ వచ్చి 'ఈనాడు' దినపత్రికలో సబ్ ఎడిటర్‌గా ఆదివారం అను బంధంలో చలసాని ప్రసాదరావుగారి దగ్గర పనికి కుదిరారు. అప్పుడే వారి వ్యాసాలు, కథలు 'ఈనాడు' ఆదివారం అనుబంధం, విపుల, చతురలలో ప్రచురితమవ్వటం ప్రారంభమైనాయి.

1979లో ఐ.డి.పి.ఎల్.లో సైంటిఫిక్ అసిస్టెంట్‌గా బయాలజీ డివిజన్ ఆర్&డిలో పరిశోధనా జీవితం ప్రారంభించారు. ఈ కాలంలో ఉద్యోగ బాధ్యతలే గాక స్వతంత్రంగా మొక్కలలో జరిగే 'కిరణజన్య సంయోగక్రియ'పై అనేక పరిశోధనలు చేసి అంతర్జాతీయ పరిశోధనా పత్రికల్లో ప్రచురించారు. ఈ కాలంలోనే పూర్వం కొనసాగించలేకపోయిన ఎమ్.ఎస్‌సి.ని అన్నామలై విశ్వ విద్యాలయం నుంచి పూర్తిచేశారు. దురదృష్టవశాత్తు 1993లో కంపెనీ మూసి వేయాలని భారత ప్రభుత్వం నిర్ణయించడంతో 36 ఏళ్ళకే వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకొని బయటకు వచ్చారు. ఆ తరువాత ఉద్యోగం చూసుకుంటూ బి.ఇడి,

ఎమ్.ఇడి, ఎమ్.ఏ ఇంగ్లీషు, ఎమ్.ఏ. జర్నలిజం, ఎమ్.ఫిల్, జర్నలిజం, పిహెచ్.డి జర్నలిజం కోర్సులు చేశారు. అలాగే అఖిలభారతస్థాయిలో యు.జి.సి. నిర్వహించే నెట్ పరీక్ష పాసై యూనివర్సిటీ అధ్యాపక అర్హత పొందారు. ఈ సమయంలోనే ఆయన 'ఈనాడు' దినపత్రికలో, ఆంధ్రభూమి, ఆంధ్రప్రభ, ఉదయం వంటి పత్రికలకు నిరాఘాటంగా వ్యాసాలు, కథలు రాసేవారు. అలా రాత్రింబవళ్లు కష్టపడి చదివిన చదువు ఫలితంగా, చేసిన శ్రమ ఫలితంగా ఆయన విదేశాలకు మీడియా ప్రతినిధిగా వెళ్ళడం జరిగింది. 2003 నుంచి 2005 వరకు ఎరిట్రియా అనే ఆఫ్రికా దేశానికి యు.ఎన్.డి.పి. నిధులపై సలహాదారుగా పనిచేశారు. తిరిగి స్వదేశం వచ్చాక అనేక ప్రైవేట్, ప్రభుత్వ విశ్వవిద్యాలయాలల్లో జర్నలిజంలో ఆచార్యులుగా పనిచేశారు. సుమారు 25 దేశాలు తిరిగారు. అంతర్జాతీయ, జాతీయ పరిశోధనా జర్నల్స్‌లో 65కుపైగా పరిశోధనా పత్రాలను ఆంగ్లంలో ప్రచురించారు.

వీరు రాసిన కథలు, వ్యాసాలు సంపుటాలుగా విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్‌వారు గతంలో (1993–95) ప్రచురించారు. వారు ఇంకా రాస్తూనే ఉన్నారు. సాహిత్యం (కథ, కవిత, నవల) వీరికి ప్రాణం. వాటిపైనే విశ్లేషణలు, వ్యాసాలు రాస్తారు.

వీరు వ్రాసిన కథల పుస్తకాల పేర్లు : మలుపు–కథల సంపుటి, అనువాద సాహిత్యం: కథా కథంబం–బహుభాషా కథలు, బాల సాహిత్యం: రహస్యం–పిల్లల కథల సంపుటి, పిల్లలు, పెద్దలు ముళ్ళున్నాయి, జాగ్రత్త! (చిన్నారి సాయిరామ్ నవల). వ్యాససంపుటి : వివిధ, సైన్స్ వ్యాసాల సంపుటి : విజ్ఞాన శాస్త్ర వింతలు–విశేషాలు, జంతుపరిణామం.

❖

ఇదీ వరుస...

❖

కృతజ్ఞతలు

ఈ పుస్తకంలోని అనువాద కథలన్నీ ఈనాడు యాజమాన్యం ఆధ్వర్యంలో ముద్రితమైన 'విపుల' మాసపత్రికలో అచ్చయినవి. నేడు విపుల ప్రచురణ జరగటం లేదు. అయినా నాకు అనువాద రచయితగా అవకాశం కల్పించిన విపుల సంపాదకులు చలసాని ప్రసాదరావుగారికి మనఃపూర్వక కృతజ్ఞతలు. అలాగే ఈనాడు యాజమాన్యానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

–డా॥ **కొప్పరపు నారాయణమూర్తి,** Ph.D

❖

ముందుమాట

సాఫీగా సాగిన కథా కదంబం

డా॥ కొప్పరపు నారాయణమూర్తిగారు చాలా కాలంగా తెలుగు సాహిత్య ప్రపంచంలో కృషి చేస్తున్నారు. వీరు చాలా కథలు రాశారు. వ్యాసాలు రాశారు. అవన్నీ అనేక సంపుటాలుగా వెలువడ్డాయి. వీటన్నటితో పాటు వీరు చాలా అనువాదాలు కూడా చేశారు. ఇతర భాషల నుండి వీరు తెలుగులో చేసిన కథల అనువాదాలు 'విపుల' మాసపత్రికలో వెలువడ్డాయి. చాలాకాలం వెలువడి ఇటీవలనే ఆగిపోయిన 'విపుల', 'చతుర' అనే రెండు మాసపత్రికలకు చలసాని ప్రసాదరావు ఎడిటర్‌గా ఉండేవారు. అనువాదాల విషయంలో చలసాని ప్రసాదరావు తనకెన్నో సూచనలు చేస్తుండేవారని, అతని కారణంగానే నేను ఎన్నో అనువాదాలు చెయ్యగల్గానని మూర్తిగారు చెప్పారు.

కథా కదంబం (బహు భాషా కథలు) పేరుతో ఇప్పుడు వీరు వెలువరిస్తున్న గ్రంథంలో 17 అనువాద కథలున్నాయి. తమిళం, సింధీ, పంజాబీ, రాజస్థానీ, ఇండో ఆంగ్లికన్, అమెరికన్, గుజరాతీ, హిందీ, మరాఠి, బెంగాలీ భాషల్లోంచి మూర్తిగారు తెలుగులోకి అనువదించిన 17 కథలను మన మీ సంపుటిలో చూస్తాం. ఏ సాహిత్యంలోనైనా అనువాదరచయితలకు చాలా ప్రాముఖ్యం ఉంటుంది. అనేక ఇతర భాషల్లో సృష్టించిన గొప్ప రచనల్ని మనం చదివి ఆనందించటానికి అనువాదాలు దోహదం చేస్తాయి. నిజానికి మన తెలుగు సాహిత్యం అనువాదాలతోటే ప్రారంభమైందని చెప్పాలి. ఆదికవి నన్నయ్య సంస్కృత మహాభారతాన్ని తెలుగులోకి అనువదించటం ప్రారంభించటంతోటే తెలుగు సాహిత్యం ప్రారంభమైంది.

మంచి అనువాదం చెయ్యటం కత్తిమీద సాములాంటిది. ఎందుకంటే అనువాదం మూలభాషలో ఉన్న రచనకు విధేయురాలుగా ఉండాలి. ఇది అనువాదం అనిపించకుండా చదివే వాళ్ళకు సాఫీగా సాగాలి. ఇప్పుడు మూల భాషకు విధేయురాలుగా ఉండటంకంటే మూలభాషలో ఉన్న కొన్ని ఆ భాషకే వర్తించే పలుకుబళ్ళుగా మార్చే విషయంలో అనువాదకుడు కొంత స్వాతంత్ర్యం తీసుకొనవచ్చునని ఇప్పటి అనువాదకులకు విమర్శకులు సూచిస్తున్నారు. ఒక భాషకు, మరోభాషకు సాంస్కృతిపరమైన విబేధాలుంటాయి. అనువాదకులు ఈ విభేదాలను కూడా దృష్టిలో పెట్టుకొని అనువాదం చెయ్యాలి.

ఉదాహరణకు వేల్చేరు నారాయణరావు, గురజాడ అప్పారావు రాసిన "కన్యాశుల్కం" నాటకాన్ని ఇంగ్లీషులోకి అనువాదం చేసి ప్రచురించారు. ఆయన మూలభాషకు విధేయులుగా ఉండకుండా చాలా లిబర్టీ (స్వేచ్ఛ) తీసుకున్నారని కొందరు తెలుగు పండితులు విమర్శించారు. అందుకు వేల్చేరు వారి సమాధానం యేమిటంటే ఏ పాఠకుడు కూడా అనువాద రచనను చదువుతున్నప్పుడు అది ఏ భాషలోంచి అనువాదం అయిందో ఆ భాషా పుస్తకాన్ని పక్కన పెట్టుకొని మూలభాషలోని ప్రతి వాక్యాన్ని ఉన్నదున్నట్టే అనువాదం చేశాడా? లేదా? – అని పరిశీలించడు అని. కన్యాశుల్కంలో ఉన్న ఎన్నో పలుకుబళ్లు తెలుగువాళ్ళకు అర్థమౌతాయి గాని అమెరికన్ పాఠకులకు అర్థంకావు కదా! అందువల్ల అమెరికన్ పాఠకులకు అర్థమయ్యే (భాషలో) అనువాదం చెయ్యవలసి ఉంటుంది అని వేల్చేరు వారి సమర్ధన.

అనువాదం చెయ్యటంలోని ఈ సూక్ష్మాలను తెలిసినవాడు కావటం వలన డా॥ కొప్పరపు నారాయణమూర్తిగారు అనేక ఇతర భాషల కథల్ని తెలుగులోకి చాలా సమర్థవంతంగా అనువాదం చెయ్యగల్గారు.

ఈ అనువాద రచనలన్నీ 'విపుల' పత్రికలో వెలువడినవే. ఈ సంపుటిలోని కొన్ని కథల్ని పరిశీలిస్తే అవి తెలుగు కథలేనేమో అన్నట్టుగా అనువాదం ఉంది.

"రెండు కన్నీటి చుక్కలు" అనే కథలోని ఈ వాక్యాలు చూడండి. "కళ్ళలోనే ఆకర్షణంతా ఇమిడి ఉందనుకోవాలి. ఆమెదంటూ ప్రత్యేకమైన హాసం గలగల

శబ్దం చేస్తూ పరవళ్ళు తొక్కుతూ పరుగులు తీసే సెలయేరులా ఆహ్లాదకరంగా ఉండేది." ఈ వాక్యాల్ని చదువుకోవడం ఎంత హాయిగా ఉంటుందో పాఠకులు గమనించవచ్చు.

'రెండు కన్నీటి చుక్కలు' అనే సింధీ కథలో సకాలంలో వర్షాలు కురవక పోతే తనకున్న కొద్ది భూమిలో వ్యసాయం చేసుకుంటూ తన కుటుంబాన్ని పోషించుకున్న సన్నకారు రైతు కుటుంబ సభ్యులు ఆకలితో ఎలా మాడిపోతారో ఆ సింధీ రచయిత హీరానందాని చిత్రించిన విధానం, దాన్ని నారాయణమూర్తి అనువాదం చేసిన విధానం చాలా బావున్నాయి.

'మృత్యు గవాక్షం ముంగిట్లో' అనే గ్రాహం గ్రీన్ రచించిన కథలో ఒక కాన్సర్ పేషెంట్ మనస్తత్వం చిత్రించడం జరిగింది.

అమ్మ ఎంతో కష్టపడి తనకు పంపిస్తున్న డబ్బును తను సరిగ్గా చదువుకోక వృధాగా ఖర్చు పెడ్తున్నానన్న అపరాధ భావనకు లోనవుతున్న ఒక విద్యార్థి మనస్తత్వం 'నిశ్చయం' అన్న శరశ్చంద్ర ఉపాధ్యాయ రచించిన రాజస్థానీ కథ చిత్రిస్తుంది.

'జటిన్' అనే గుజరాతీ కథాను రచించిన జయచార్ అనే రచయిత కథలో 'తను స్కూల్లో చేస్తున్న అల్లరిని జటిన్ అనేవాడు చేస్తున్నాడని తరుణ్ వాళ్ళమ్మకు చెబుతుండటం, తన కొడుకు అసలు లేని జటిన్ అనే వాడి పేరుతో తనను మోసం చేస్తున్నాడని ఆ స్కూలుకెళ్ళినప్పుడు తెలుసుకోవడం ఆ తల్లికి ఆశ్చర్యం కలిగిస్తుంది.'

'ప్రాణం విలువ' అనే ఇండో ఆగ్లికన్ కథలో (దీన్ని ఆర్.ఎం. బొర్గాంవ్‌కర్ రచించారు). ఒక డాక్టర్ 'మెర్సీ కిల్లింగ్' చేస్తే తప్పేమిటని ఆ వైద్యాన్ని అనుకరించారు. బాగుకాని ఒక రోగంతో బాధపడ్తూ బతికే ఒక పేషెంట్‌ను అతన్ని ఆ బాధనుండి విముక్తుణ్ని చెయ్యటానికి వాడికొక ఇంజక్షన్ ఇచ్చి చంపేస్తాడు. ఇలా చాలామందిని మెర్సీ కిల్లింగ్ పేరుతో చంపేస్తుంటాడు. త్వరలోనే తప్పు చేస్తున్నానేమో అనే అపరాధ భావం కల్గుతుంది. ఆ బాధతోనే చనిపోతాడు.

'సమర్థత' అనే బెంగాలి కథలో (ఆశాపూర్ణాదేవి రచించిన కథలో) చాలా పాత్రలున్నాయి.

'భూతన్' అనే చిన్నపిల్ల తనీమా కూతురు. తనీమా భర్త అలోక్. వీళ్ళిద్దరూ ఉద్యోగాలు చేస్తూ భూతన్‌ను వాళ్ళ పనిమనిషి మాలతికి అప్పగిస్తారు. ఆ మాలతి ఎప్పుడూ భూతన్‌ను సరిగ్గా చూసుకోదు, సూటిపోటీ మాటలంటూ భూతన్‌ను ఏడిపిస్తూనే ఉంటుంది. తనీమాకు మంచి సినిమాలు చూడాలని ఉంటుంది. సినిమాకు వెళ్తాన్నానని చెబితే భూతన్ తను కూడా వస్తుందనుకొని నేను డాక్టర్ దగ్గరకు వెళ్తున్నానని కూతరుకు అబద్ధం చెప్పి సినిమాకు వెళ్తుంది. సినిమా హాలు దగ్గర ఆమె భర్త అలోక్ కూడా ఉంటాడు. వాళ్ళిద్దరు ముందే ఈ ప్లాన్ వేసుకొని సినిమా చూస్తున్నారని అర్థమౌతుంది. "మీ అమ్మా నాన్నలిద్దరూ డాక్టర్ దగ్గరకు వెళ్తున్నామని నీతో అబద్ధం చెప్పి సినిమాకు వెళ్ళారని మాలతి భూతన్‌కు చెప్పేస్తుంది. తనతో తన తల్లిదండ్రులే ఇంత అబద్ధం చెబుతారా అని ఆ పసిహృదయం తల్లడిల్లుతుంది.

ఇలా ఈ సంపుటిలో చోటు చేసుకున్న కథలన్నీ విభిన్నమైన కథాంశాలతో పాఠకులను అలరిస్తాయి. అనువాదం సాఫీగా సాగటం వల్ల పాఠకులు ఈ కథల్ని హాయిగా చదువుకొని ఆనందిచవచ్చు.

అంపశయ్య నవీన్
కేంద్ర సాహిత్య అకాడమి గ్రహీత
వరంగల్-హనుమకొండ

❖

నా మాట

ఈ పుస్తకంలోని కథలన్నీ అనువాద కథలే. 1989– 2000 మధ్య 'విపుల' మాసపత్రికలో అచ్చయిన కథలివి. ఇవి ప్రధానంగా ఆంగ్లంలో ఈనాడు అనువాద శాఖనుంచి నా బోటి రచయితలకు అందేవి. వాటిని అనువాదం చేసి తిరిగి విపుల సంపాదకులకు అందించేవాడిని. ఈ కథలన్నీ భిన్న భాషా సంప్రదాయ రీతులను ఒక చోట పాఠకుల ముందుంచుతాయి. ఆయా భాషల్లో ఉండే పాత్రల పేర్లు, వారి ఆహార సంప్రదాయ రీతులు, వివాహ కట్టుబాట్లు నాయక, ప్రతి నాయక, నాయికి మధ్య జరిగే వాదనలు, వారిలో జరిగే అంతర్మధనం ఎంతో వివరంగా పాఠకుల ముందుంచాయి ఈ కథలు. ఆయా రాష్ట్రాలు, దేశాలు వెళ్ళని వారికి కూడ ఈ కథలు చదివాక ఆయా ప్రజల జీవన విధానం, వాళ్ళ ఆలోచన విధానం సుబోధకం అవుతుంది ఈ కథలు చదవటం ద్వారా.

ఈ కథల సంపుటిలో తమిళ కథలు–2, సింధీకథ–1, పంజాబీ కథ–1, రాజస్థానీకథ–1, ఇండో ఆంగ్లియన్ కథలు–5, అమెరికన్ కథ–1, గుజరాతీ కథ–1, హిందీకథ–1, బెంగాలీ కథ–1, మరాఠీ కథ–1 ఉన్నాయి.

ప్రముఖ రచయిత్రి జ్యోతిర్లితా గిరిజ రాసిన తమిళకథ 'వేకువ'తో ఈ కథా సంపుటి ఆరంభం అవుతుంది. సంసారానికి ప్రధాన సారధులైన భార్యా భర్తల్లో ఒకరైన భార్య తన పుట్టింటివారు ఉన్న పళాన అనాధలైపోతే వారిని తన భర్త దగ్గరకి తేవటం ఒక నేరంగా పరిగణించే భర్తతో జరిగే సంఘర్షణే 'వేకువ' కథ. మరో తమిళకథ 'తొలిరేయి', కొత్తగా పెళ్ళయిన జంటలోని

మార్తాండం తన తొలిరాత్రి తన భార్యతో జరుపుకొనవలసిన వేళ ఊరికట్టుబాటు ప్రకారం రాత్రంతా ఊరువారు ఏర్పాటుచేసిన 'ఓయిలాట్టం' ఆడటంలో గడిపే యటం ఆ భార్యాభర్తల జంటలో రేపే సంఘర్షణను తెలీపరుస్తుంది. ఊరి కట్టుబాట్లు సంప్రదాయాలు ఎవరికోసం? తొలిరేయి భార్యా భర్తల ఆనందాన్ని కూడ తోసిరాజనేంత కట్టుబాట్ల వల్ల ఎవరికి ప్రయోజనం వంటి చర్చ ఈ కథలో కనిపిస్తోంది.

ఇలా ప్రతి కథ గురించి చెబుతూపోతే పుస్తకంలో దాగిన మకరందం ముందే స్ట్రా పెట్టి పీల్చేసినట్టవుతుంది. భారతీయ భాషలు తమ సొంతమైన కథల ద్వారా ఏయే విషయాలను చర్చించాయి, ఆ చర్చ స్థాయి తెలుసుకోవటం ఈ కథలు చదవటం వలన ఒనగూడే ప్రయోజనం.

అనువాద సాహిత్యం ఎప్పుడూ ఉంది. అయితే అదో సంప్రదాయంగా ప్రారంభమై ఉవ్వెత్తున ఎగిసిపడటానికి 'విపుల' విశ్వకథ వేదిక ఎంతో దోహద పడిందనటంలో సందేహంలేదు. ఇవాళ అనువాదసాహిత్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు, ఇతర సాంస్కృతికసంస్థలు పెద్దపీట వేసి అనువాద సాహిత్యంలో ఉత్తమ రచనలకు బహుమతులుగూడా ప్రకటిస్తున్నాయి.

ఈ సంపుటిలోని కథలు కొన్ని నేను రచయితగా 'విపుల'కు రాస్తున్నప్పుడే సేకరించాను. కొన్ని నా జీవితంలో జరిగిన మలుపుల్లో సేకరించలేకోయాను. నేను ప్రొఫెసర్‌గా రిటైరై ఈ కథలను అచ్చులో తేవాలని అనుకొన్నప్పుడు చాలా కథలు దొరకలేదు. కొన్ని పోస్టులో పోయినయి. పోయిన ఆ సంచికలు కూడ సమగ్రంగా లభించలేదు. అప్పటికీ వేటపాలెం సరస్వతీ నికేతన్ లైబ్రేరియన్ శ్రీవల్లిగారికి, కారా మాష్టారి కథా నిలయంలో వి.వి.ఎన్. మూర్తిగారికి కొంత శ్రమ కలిగించాను. వేటపాలెం సరస్వతీ నికేతన్ శ్రీవల్లిగారు 'ఎత్తుగడ' కథ దొరికిందని పంపారు. ఆమెకు నా హృదయపూర్వక ధన్యవాదాలు.

ఆమె గతములో కూడా నాకు నా పరిశోధనల్లో ఇలానే సహకరించారు. 1975-77 మధ్య ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తిగారు 'పత్రికల్లో భాషా పరిణామం' అన్న అంశంపై చేసిన ప్రసంగా లను ఆంధ్రపత్రిక నుంచి సేకరించి నాకు పంపారు. ఈ విషయములో ఆమె సహాయం మరువరానిది.

అలాగే వి.వి.ఎన్. మూర్తి గారు కూడా కథా నిలయంలో విశ్వప్రయత్నం చేసి ఏదీ దొరకలేదని తెలియపర్చారు. ఈ విషయంలో నాకు సహాయం చేసేందుకు తమ అమూల్య సమయం వెచ్చించిన వి.వి.ఎన్. మూర్తిగారికి కూడా నా మనఃపూర్వక కృతజ్ఞతాంజలి ఘటిస్తున్నాను.

పాఠకులు ఈ కథలని చదివి ఆనందిస్తారని, ఈ సంపుటిని ఆదరిస్తారని భావిస్తూ...

మీ

–డా॥ కొప్పరపు నారాయణమూర్తి, Ph.D

❖

వేకువ

(తమిళ కథ)

జ్యోతిర్లతా గిరిజ

❃

వీధి వెంబట బరువైన పెట్టెను మోస్తూ నడుస్తున్నందుకు కామోసు, చెయ్యి బాగా నొప్పిపెట్టసాగింది. అందుక్కాదు! బరువెక్కిన హృదయం వలన గామోలు.

ఈ చేయి నెప్పిపెట్టటం ఎందుకైతేనేమి? పెట్టెను ప్రతి రెండు నిమిషాలకు కుడి నుంచి ఎడమకు, ఎడమ నుంచి కుడికి మారుస్తూ నడుస్తున్నా నాకు ఆ వీధిలో ఒక్క మనిషి జాడ కూడా కన్పించలేదు.

ఇంతలో ఎంగిలి అరిటాకు మిగిలిన ఆహారపదార్థాలతో విసురుగా ఎక్కణ్ణించో వచ్చి చెత్తకుప్పపై పడగానే, రోడ్లపై ఓ పక్క సూర్యుణ్ని చూసి అరుస్తున్న ఓ కుక్క చప్పున అరవటం మానేసి చెత్తకుప్పవైపు పరుగందుకుంది.

అరిటాకు ఎగిరివచ్చిన దిశవైపు తలెత్తి చూశాను. అక్కడ మంగళ తనింటిముందు నిల్చొని కన్పించింది. ఆవిడ ముఖంపై చిరునవ్వులేదు. ఎవరి కోసమో నిరీక్షిస్తున్నట్లున్న ఆమె కళ్లను ఇట్టే పసిగట్టగల్గాను.

కొంచెం వేంగంగా ఆమె యింటివైపు నడిచాను. మంగళ యింటిముందు ఆగి "మా నాన్నకు ఎలా ఉంది మామి?" అడిగాను.

"గడచిన రాత్రి నుంచి ఆయన కళ్ళు తెరవనే తెరవలేదు. 'మంజు మంజు' అంటూ ఆపస్మారకస్థితిలోకెళ్ళినట్లు నీ పేరు ఒకటే జపిస్తున్నారు"

అంటూ మంగళ తన ఎరుపెక్కిన కళ్లను నావైపు నుంచి నేలవైపునకు మరల్చింది. నా కళ్లలో సుడులు తిరుగుతున్న కన్నీళ్లు ఆమె గుండెను తడిపాయన్న సంగతి నాకు స్పష్టమైంది. నేనిక అక్కడ నిల్చోకుండా తల విదిలించుకొని ముందుకు వేగంగా నడిచాను. మా యింటిని చేరడానికి ఇంకా రెండిళ్ళు దాటాలి.

మా యింటిముందు ఆగి, పెట్టెను అరుగుపై పెట్టి, తలుపుపై కొట్టాను మెల్లగా. మా తమ్ముడు అంబి లోపల్నుంచి తొంగిచూశాడు బయటికి.

నన్ను చూడగానే వాడిలో ఆవేశం ఆనందం కట్టలు తెంచుకు పొంగింది. "మంజు వచ్చింది, మంజు వచ్చింది" అంటూ పెద్దగా కేకలు వేశాడు. ఇల్లదిరి పోయేలా ఊడిపోతున్న లుంగీని చేతపట్టుకొని గబగబ అడుగులేస్తూ వచ్చాడు తలుపు తీయడానికి. వాడివెనకాలే అలమూ పరిగెత్తుకొచ్చింది.

అప్పుడే నా చూపులు దానిపై పడ్డాయి. అలామూ ఎంతో అందంగా, ఏపుగా ఎదిగింది. యవ్వన పరిపక్వంలో ఆమె మిసమిసలాడుతుంటే కన్నీళ్లతో మసకలు కమ్మిన కళ్ళతో కూడా అలమూ అందంపై నుంచి నా దృష్టి మరల్చలేక పోయాను.

'అవును... నా పదమూడవ ఏట నేనూ అలమూలాగానే ఎంతో అందంగా ఉండేదాన్ని' మనస్సులో అనుకొంటూ కళ్ళలో నీళ్ళు తుడుచుకొని అలమూవైపు తిరిగి చిరునవ్వు నవ్వాను.

"నువ్వు టెలిగ్రాం ఇచ్చుంటే నేనే కొడైకెనాల్ రోడ్డు స్టేషన్‌కొచ్చి, నిన్ను తీసుకొచ్చుండేవాణ్ణి" అన్నాడు కొంచెం మందలిస్తున్నట్టుగా.

అంబి అన్నమాటకు సమాధానం యివ్వకుండా "అప్పా ఎలా ఉన్నారు? ఎంతకాలం నుంచి అనారోగ్యంతో ఉన్నారు?' అని అడుగుతూ నాన్న పడుకున్న వైపు నడిచాను.

చినిగిపోయిన ఓ జంపఖాన మీద వెల్లికిలా పడుకొని ఉన్నారాయన. కొద్దిగా నోరు తెరిచి నిద్రపోతున్నారు. గురక కూడా ఉంది. కొద్దిగా అసలిది గురకా లేక శ్వాస తీసుకోను ఇబ్బంది పడటం వలన వచ్చే శబ్దమా నాకు స్పష్టంగా తెలియదు. బిగ్–బెన్ గడియారం చేసే టిక్–టిక్ చప్పుడు విన్పడుతుంటే నాలో ఏదో తెలియని భయం, ఆందోళన అధికం కాసాగాయి.

"గత పదిరోజులుగా అప్పా ఆరోగ్యం బాగాలేదు" చెప్పాడు అంబి.

"అయితే ఇంత ఆలస్యంగా ఎందుకు తెలీపర్చారు? కనీసం ముందుగా రాయనన్నా రాయాల్సింది లేక టెలిగ్రామైనా యివ్వాల్సింది. కనీసం ఒక్కరోజు నే ముందువచ్చినా ముందు వచ్చినట్లేకదా".

నా ప్రశ్నకు సమాధానంగా అలమూ, అంబి ఒకరినొకరు ముఖాలు ఒకరు మార్చిమార్చి చూసుకున్నారు.

"టెలిగ్రాం ఇవ్వడానికి కనీసం ఐదు రూపాయలు కూడా మా దగ్గర లేవంటే నమ్మక్కా" అన్నాడు అంబి తలొంచుకొని.

ఆ మాట సన్నని ముల్లులా అప్పటికే రోదిస్తున్న నా హృదయానికి గుచ్చుకొని మరింత గాయంచేసింది. అంత క్రితం రోజు బెంగుళూరుకు ఆఫీసు పనిమీద వెళ్ళిన నా భర్తకు జన్మదిన శుభాకాంక్షలు టెలిగ్రాం ద్వారా పంపడానికి నేను ఖర్చుపెట్టిన డబ్బు గుర్తుకొచ్చి మరింత ఆవేదనకు లోనైంది నా మనస్సు.

"డబ్బు కోసం నాకు రాసి ఉండాల్సింది, మరి డబ్బుల్లేని సమయంలో ఆయన మందులకెక్కణ్ణించి డబ్బులు తేగల్గారు? డాక్టరేవన్నారసలు?" అడిగాను.

"ఇంతవరకూ నాన్న గారికి అన్ని మందులు కొనగల్గాం– నాన్న జాగ్రత్తగా దాచిన డబ్బుతో. ఈ రోజుతో ఆ డబ్బు కూడా అయిపోయింది. పొద్దున్నే అమ్మ గొలుసు తాకట్టు పెట్టి వందరూపాయలు తెచ్చాను."

"అయితే డాక్టరేమన్నారింతకూ?" మళ్ళీ అడిగాను నేను.

అంబి తన ముఖానికి చేతులు అడుడ్డుపెట్టుకొని, ఏడుపందు కున్నాడు. అలమూ కూడా ఏడుపందుకుంది. వాళ్ళు చెప్పింది విని నేను ఆశ్చర్యపోయాను. మూగదాన్నై కళ్ళప్పగించి చూస్తూ ఉండిపోయాను. "అప్పా, అప్పా... నేను మంజూను. నేనొచ్చాను" అంటూ ఆయన పక్క పైన కూర్చున్నాను మృదువుగా. ఆ క్షణంలో నాలో ఎక్కణ్ణుంచో తల్లిప్రేమ ఉప్పొంగింది. ఆయన తలను ఎత్తి నా ఒడిలో పెట్టుకొని ముద్దుచేయాలనిపించింది. నా హృదయం బరువంతా తగ్గిపోయేవరకూ ఏడవాలనిపించింది. కానీ అవేమీ చేయకుండా కూడా నేను కూడా అలము, అంబితో కలిసి ఏడ్చేశాను.

ఆయన గుండెపై చెయ్యివేసి చూశాను. ముడతలుపడ్డ చర్మం. బలహీనంగా కొట్టుకుంటున్న గుండె నన్ను మరింత కృంగదీశాయి.

"అసలు డాక్టరు ఖచ్చితంగా ఏం చెప్పాడు?" మళ్ళీ అడిగాను నేను.

"ఇక నాన్న బతకరని చెప్పాడు. ఆయన జీవితం రోజుల లెక్కలోకి వచ్చిందట అక్కా" చెప్పాడు అంబి దుఃఖం ఆపుకోలేక.

అంబి చెప్పిన మాటలు నా చెవుల్లో ప్రతిధ్వనించసాగాయి. 'అంటే... అంటే... ఇక అప్పా మనకుండరన్నమాట. అందిరిలాగే ఆయన కూడా శూన్యంలోకి కనుమరుగైపోతారన్నమాట. నాన్నా! ఇక మీరు మాకు కన్పించరా? నువ్వు కూడా పిడికెడు బూడిదగా మారిపోతావా? లేదు నాన్న... లేదు. నేనలా జరగనివ్వను. అదినే సహించలేను' అని నాలో నేనే అనుకొంటూ, నా గుండెను ఎవ్వరో కొట్టి పిండిచేస్తున్నంత బాధకు లోనుకాసాగాను.

నాన్న తలను మృదువుగా కదిలిస్తూ, అంబి, అలమూలనడిగాను "అన్నయ్యకు ఈ విషయం గురించి రాశారా?" అని

"నాన్నగారు రాయవద్దని ఖచ్చితంగా చెప్పాక ఎలా రాయగలం?"

"ఆయన కోపంతో అలా అని ఉండవచ్చు అంతమాత్రానికి మీరు రాయకుండా ఊరుకోవాలా? మీరు ఉట్టి పిచ్చివాళ్ళురా! అన్నయ్య ఈ ఇంటికి పెద్దవాడు కాదురా? రేపు నాన్నగారేమైనాయితే అంత్యక్రియలు చేసేది ఎవర్రా... వాడుకాకపోతే?" అప్రయత్నంగా ఈ అశుభం మాటలు నా నోటినుంచి వెలువడటం నన్ను పశ్చాత్తాపానికి గురిచేశాయి. నేను వెంటనే పెదిమలు కొరుక్కున్నాను. ఎంతటి అశుభం మాటలివి? ఎవరినుద్దేశించి అన్నమాటలివి? డాక్టర్లు బతకరని చెప్పినా రోగులు బతికిన సందర్భాలు లేవా? ఒక్క క్షణం ఆగి "కాదు... కాదు... అలా జరగదు. నాన్నకేమీ కాదు. ఏదియేమైనా అన్నయ్యకు తెలీపర్చండి. వెళ్ళి వాడికి వెంటనే టెలిగ్రాం ఇవ్వండి పరిగెత్తరా" అని పెద్దగా అరిచి చెప్పాను. తంబి గబగబ చొక్కా తొడగటం ప్రారంభించాడు.

"డాక్టర్లకేమీ తెలీదు. ప్రతి ఒక్కటి భగవతుడి చేతుల్లో ఉంది. అలమూ! నేనెందరో పేషెంట్లను చూశాను. వాళ్ళు డాక్టరు చెప్పినదాన్ని అబద్ధమని రుజువు చేసి మరీ బతికారు. ఏడవ్వద్దు. ఏడవ్వద్దు అలమూ. ఉష్..." అంటూ

అలమూను ఓదారుస్తూనే నేను కన్నీటి బొట్లు రాల్చసాగాను.

నా వేడి కన్నీటి చుక్కలు నాన్న ఛాతీమీద పడ్డాయి కాబోలు ఆయనకు స్పృహ వచ్చింది. ముందు కొద్దిక్షణాలు కనురెప్పల్ని టపటపలాడించి, నన్ను గుర్తుపట్టగానే మెరుపునిండిన కళ్ళతో చూశారు నన్ను నాన్న.

"ఎవరూ... మంజూనా?" అని సన్నగా గొణుగుతూ నాన్న నాచేతిని అందుకొని తన హృదయంపైనుంచుకొని తన పెదవులతో ముద్దాడాడు. అంతలోనే ఆయన దుఖపూరితుడయ్యాడు. నా దుఃఖాన్ని నొక్కిపట్టి చీరె కొంగుతో ఆయన కళ్ళని తుడ్చాను మెల్లగా.

"మంజూ... నువ్వు అంబి, అలమూ బాధ్యత తీసుకోగలవా నాకేదైనా అయితే? వాళ్ళని నీవెంట తీసుకెళ్తావా?" అడిగారు నాన్న హఠాత్తుగా.

ఆయన ప్రశ్నలడిగే తీరు నన్ను ఆశ్చర్యచకితురాల్ని చేసింది. నాన్న మామూలుగా ఉన్నప్పుడు నేను రాగానే నా మంచి చెడు, నా భర్త వివరాలు అన్నీ అడిగి కనుక్కొనేవారు. ఈసారి ఆయన ఆ పద్ధతే అనుసరించటంలేదు. అందుక్కారణమైన పరిస్థితే నన్ను ఆశ్చర్యపరిచింది. అంటే నాన్నక్కూడా అర్థమైందన్నమాట తనింక ఎక్కువకాలం ఉండనని. అందుచేతనే యోగక్షేమాలు అడుగుతూ కాలం వృధా కానివ్వటం ఆయనకిష్టం లేదు. నా హృదయం మరింత బరువెక్కసాగింది. కొన్ని క్షణాలపాటు నేను మౌనంగా ఉండిపోయాను. లోపల్నుంచి ఏదో బరువైన భారీ వస్తువు పైకి వచ్చి నా గొంతులో అడ్డుపడ్డ భావన నాలో. దానికితోడు విపరీతమైన మనోవ్యథ, వ్యాకులత, వేదన, ఎలా మాట్లాడగలను? కాని ఎలాగో గొంతు చీల్చుకొని మాట్లాడాలని ప్రయత్నించాను. "అలా మాట్లాడద్దు అప్పా నువ్వు తప్పనిసరిగా బతుకుతావు?"

ముందు పెద్దగా నవ్వబోయి ముసిముసి నవ్వు నవ్వాడు నాన్న ఆయనలో నవ్వేందుక్కూడా ఓపికలేదన్న విషయం తెలుస్తూనే ఉంది. పసిబిడ్డ ఊహలను విని ఆటపట్టించే తల్లిలా ఉన్నాయి నా కళ్ళలోకి చూస్తున్న ఆయన చూపులు. ఆయన చూపుల్లో భావం ఇట్టే పసిగట్టగల్గాను నేను.

నాలోని వివేకాన్నంతా కూడకట్టుకొని కొంచెం స్థిమితపడి "అలా నిరుత్సాహపడద్దు అప్పా. నువ్వు త్వరలోనే మామూలు మనిషివయిపోతావు.

మీరు పక్కపై లేచి కూర్చుని నాలుగైదు రోజుల్లో నన్ను అరటిపువ్వు కూర వండి పెట్టమని కూడా అడుగుతారు" అని చిరునవ్వుతో అనబోయిన నేను నవ్వలేక తలవాల్చేస్తుంటే ఆయనది చూసి చిరునవ్వు నవ్వాడు.

"నువ్వు వట్టి పిచ్చిదానివమ్మా... నేను నిరుత్సాహపడ్తున్నానా? నీ ఉద్దేశంలో నాకు చావంటే భయమనా? నిజానికి చావంటే భయంలేదమ్మా నాకు. చావు ఓ వరం ఓ విశ్రాంతి. అది తెలీనివాళ్ళే భయపడ్తారు. నిరుత్సాహపడ్తారు. నేనలాంటివాణ్ణి కాదు. ఇంకా నేను బతికి ఉంటే అలమూకు పెళ్ళిచేసి పంపగలను. అప్పుడైతే ఇంకా మనశ్శాంతితో ప్రపంచాన్ని వదిలివేయగలను. కాని అందుకు భిన్నంగా జరగబోతున్నదిప్పుడు.... నేను అలమూను నీకు అప్పచెప్తున్నాను. అదే నాకు బాధాకరంగా ఉంది. మంజూ... నువ్వు వీళ్ళని ప్రేమతో చూసుకొంటావు గదా?"

"నీకలు అలాంటి సందేహాలే వద్దు అప్పా."

"మా అల్లుడు నీతో రాలేదా?"

"లేదప్పా ఆయన బెగుళూరు వెళ్ళారు ఆఫీసు పనిమీద. మా అత్తగారి అనుమతి తీసుకొని నేనొచ్చేశాను హడావిడిగా".

"అయ్యో... నేను నీ భర్తతో మాట్లాడి ఈ భారం నీకు అప్పచెపుదామనుకొన్నాను."

"అవసరం లేదప్పా ఆయన చాలా మంచివారు. ఆయనేమీ అనరు."

అలమూ వైపు తిరిగి ఆమెను మంచినీళ్ళు తెమ్మని సైగ చేశారు నాన్న. అలమూ కన్నీళ్ళు తడ్చుకొని వంటింటివైపు వెళ్ళింది. అంతలోనే నాన్న తల కుడిభుజంవైపు ఒరిగిపోయింది. ఆయనికలేరు. అలమూ నీళ్ళు తెచ్చే లోపలే ప్రపంచం వదిలి వెళ్ళిపోయారు. నాన్న అలమూ, అంబీలను అప్పగించటానికే నన్నట్లు నాన్న తన ప్రయాణం ఆపుకొన్నారు. ఇప్పుడాయన శాశ్వతంగా విశ్రాంతి తీసుకొన్నారు.

నాకు నాన్న పోయారన్న నిజం ఇంకా నమ్మబుద్ధి కావటంలేదు. డాక్టరు వచ్చి పరీక్షించి రూఢీచేసి వెళ్ళాకకూడా ఇంకా ఆయన చనిపోయారన్న సత్యం నాకు జీర్ణం కావటం కష్టమనిపిస్తోంది. మావారికి ఉత్తరం వివరంగా రాశాను.

మా అన్నయ్య టెలిగ్రాం పంపినా రాలేదు. మా నాన్న ఎంత చెప్పినా వినకుండా మా అన్నయ్య ఓ తక్కువ కులానికి చెందినమ్మాయిని పెళ్ళాడటంతో వాళ్ళిద్దరి మధ్య సంబంధాలు చెడిపోయాయి. అవి కాలం గడచినా బాగు పడలేదు. అంతటితోనే వారిరువురి మధ్య సమస్తం తెగిపోయాయి. అందువల్లే వాడు రాలేదు.

నేను అలమూ, అంబినీ తీసుకొని మావారు మద్రాసు తిరిగి వచ్చిన మర్నాడే అక్కడికి చేరాను.

ఆ రాత్రే ఆయన నన్ను అడిగారు "చూడు... నీ గురించి నీవు ఏమను కుంటున్నావు? మీ వాళ్ళని తీసుకొస్తున్నానని కేవలం ఒక్క ఉత్తరం ముక్క రాసి పడేసి, వెనువెంటనే వాళ్ళని తేవటంలో నీ ఉద్దేశమేమిటి? అసలిదంతా ఏమిటీ?" అని.

ఆయన కంఠంలోని కాఠిన్యం నన్ను విస్మయురాల్ని చేసింది.

"ఎందుకు మీరు నన్నిలా ప్రశ్నిస్తున్నారు?" అని అడిగాను.

"ఎందుకడుగుతున్నానా? నీకు నా అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేదా?"

ఆ మాటలు నాకు ములుకుల్లా గుచ్చుకున్నాయి. ఆయన కళ్ళలోకి ఆశ్చర్యంగా చూశాను. ఆయన ఓ పుస్తకంలో కాగితాలు తిరగేస్తూ నా చూపుల్ని తప్పించుకుంటున్నారు.

"మీ అనుమతి అడగటానికి కొంత అర్థముండాలా? వద్దా? ఈ పిల్లలు ఎక్కడికెళ్తారు? వాళ్ళను చూసేందుకు ఎవరున్నారు?

"అందుకని వాళ్ళనిక్కడికి తెస్తావా?"

"అయితే నేను ముందు మీకు రాయలేదా? అసలు మీకు చెప్పకుండా వాళ్ళని తేలేదు కదా?"

"ఓ వేళ నేను వాళ్ళని తేవటానికి అనుమతిస్తే అది నా సంస్కారం, సానుభూతి అవుతుంది. కాని నువ్వు కేవలం ఉత్తరం రాసేసి తీసుకువస్తే అది నాపట్ల అమర్యాదతో కూడిన అహంకారం అవుతంది తెల్సా?"

"ఏమిటి... అహంకారమా?"

"లేకోతే ఏమిటి? కొన్నేళ్ళు గడిచాక నీ చెల్లెలికి పెళ్ళి చేయాలి. అది బాధ్యతకాదా? ఇంతటి బాధ్యత నా భుజస్కంధాలపై పెట్టేప్పుడు నాతో సంప్రదించాల్సిన పనిలేదా? ఇప్పుడు. నిన్నేం చేయాలి నేను?"

"గత సంవత్సరం నీ చెల్లెలి పెళ్ళి మనిద్దరం కల్సి చేయలేదా? అందుకు కావల్సిన డబ్బు మనిద్దరి సంపాదన నుంచి కాదా సమకూరింది. నెలనెలా నా జీతంలోంచి ఎక్కువ డబ్బు దాచటం వల్లేకదా అది సాధ్యమైంది. అలానే ఇప్పుడు కూడా మా చెల్లెలి పెళ్ళిచేద్దాం."

"ఓహో... ఎంత తెలివిగలదానివి నువ్వు. ఇప్పుడైతే నీకేమీ అహంకారం లేనట్లు మాట్లాడావు. మరీ మాటలేమిటి? సంపాదించే ప్రతి భార్యకు ఈ అహంకారం ఉంటుంది. ప్రతి సంపదించే స్త్రీకి భర్తపట్ల అమర్యాద, లోకువతనం ఉంటాయంటే ఇదే కామోసు".

నానోటి నుంచి మాటలు పెగల్లేదు.

ఈరోజు సంఘంలో పెళ్ళయాక కూడా ఆడవాళ్లు మగవాళ్ళచేత గెంటబడటం చూసి, వాళ్ళు దిక్కులేనివాళ్లుగా మారటం చూసి మా నాన్న నాకు చదువు చెప్పించాడు. ఫైనల్ పరీక్షలవ్వగానే నాకు పెళ్ళయింది. అందుచేత చదువు సరదా అనుభవించలేకపోయాను. పెళ్ళయి అత్తవారింటికి వచ్చాక మా మరుదులు నన్ను ఉద్యోగం చేయమని కోరటంతో నేను ఉద్యోగం చేరవల్సివచ్చింది. నన్ను ఉద్యోగం చేయమని వాళ్లు కోరడంలో వారి ఉద్దేశం నా జీతం డబ్బు కొంత దాచి నా చిన్న మరదలు పెళ్ళిచేయచ్చని. నా నాలుగేళ్ళ సంపాదనలో వాళ్లు ఓ మంచి సంబంధం చూసి ఆ అమ్మాయికి ఆర్నెల్ల క్రితం పెళ్లి చేసి పంపేశారు.

తన చెల్లిలి పెళ్ళికి నా సంపాదన వాడుకొన్న నా భర్త నా వాళ్ళని తెచ్చినప్పుడు అయిష్టత, కోపం వ్యక్తం చేయటంలోని సంస్కారం నాకు అర్థంకావటం లేదు. నా సంపాదనలో తన చెల్లెలి పెళ్ళి చేయవచ్చును కాని నా చెల్లెళ్ళ పై చిల్లిగవ్వ ఖర్చు పెట్టకూడదా. ఓహో! మాది పైగా ప్రేమ వివాహం కూడా. అసలు 'ప్రేమ' అనే పదానికి అర్థం ఏమిటి ? నా డబ్బు, నా సంపాదన వాళ్ళ వాళ్ళు తినవచ్చుగాని, నా వాళ్ళు తినకూడదా. నిజానికి నా మరదలు కన్నా

నా సొంత చెల్లెలు అలమూ నాకు దగ్గర కాదా? అసలు అతని వాదనలో తర్కం ఏమిటి? ఆయన అనుమతి కోరాల్సిన నిబంధన, షరతులో అర్థం ఏమిటి? అలా ప్రతి చిన్నదానికి అతని అనుమతి కోరడం అంటే ఇక ప్రేమ ఏమిటి? జీవితం కృత్రిమంగా అన్పించదా?

"చూడండి... మీరు నన్ను అన్యాయంగా నిందించకండి. మీ మాటకే వద్దాం. మీ అనుమతి కోరాననే అనుకొందాం. మీరు నిరాకరిస్తే నేను మిమ్మల్ని ధిక్కరించాల్సి వచ్చేది. ఎందుకంటే వాళ్ళు అనాథలు కనుక."

"నీ తెలివంతా నా దగ్గర ప్రదర్శించకు, అంటే నన్ను ధిక్కరించాలన్న నిర్ణయం ముందు తీసుకొనే వచ్చావన్నమాట... దాన్నే అహంకారమని నేనంటున్నా."

"లేదు. మీరు న్యాయంగా వర్తిస్తారని, నాకున్న ఇబ్బందిని అర్థం చేసు కొంటారన్న భావంతో గత్యంతరంలేని పరిస్థితుల్లో నేను వాళ్ళని ఇక్కడికి తెచ్చాను. ఇది నిజంగా తప్పా? చెప్పండీ..?"

"నీకనుకూలమైనవన్నీ నువ్వూహించుకోవటం నీ వంతైతే విను. నేను మీవాళ్ళు ఇక్కడ ఉండటాన్ని నిరాకరిస్తున్నాను. ఇప్పుడు నువ్వు నన్ను ధిక్కరించ గలవా? నిర్మోహమాటంగా చెప్పు!"

నేను మౌనం దాల్చాను. మా యిద్దరి మధ్య ఇప్పుడే ఇనుపతెర వచ్చి నిల్చింది. ఇంతవరకూ అతన్ని ప్రేమిస్తున్న ఈ గుండె క్షణంపాటులో ప్రేమనంతా కోల్పోయినట్లయింది. ఇప్పుడు మా మధ్య బంధాలు వంకర తిరిగాయి. ఇంత వరకూ 'ప్రేమ'కు నేనూహిస్తున్న అర్థాలు నా భర్తకు వర్తించవని తెలిసి నా గుండె బరువెక్కింది. ఆయనలో నా వ్యక్తిత్వం పట్ల అభిప్రాయాల పట్ల కనీస గౌరవం లేదని అర్థమైపోయింది. పోనీ మనిషిగా ఆయనకుండాల్సిన కనీస మానవతా దృక్పథం కూడాలేదు ఆయనలో. నా వ్యక్తిత్వాన్ని గౌరవించాలన్న సంస్కారంలేని మనిషి నన్ను ఎలా ప్రేమించగలడు. నాకు నేనే వేసుకొన్న ప్రశ్నలివి. ఈ ప్రశ్నలు నన్ను మరింత నీరుకార్చేశాయి. ఒక్కక్షణం స్త్రీగా సంఘం నాకు విధించిన పరిమితిని అధిగమిస్తున్నానా అని కూడా ఆలోచించాను నేను. చివరికి నే చేస్తున్నది తప్పు కాదని నా మనస్సు రూఢిగా చెప్పింది.

అందుకు తార్కాణం అతను నా కళ్ళలోకి సూటిగా చూసి మాట్లాడలేకపోవటమే. ఇదే నా వ్యక్తిత్వాన్ని మరింత బలం పుంజుకొనేలా చేసింది.

నా తండ్రి నన్ను నిస్వార్థంగా చదివించాడు. నా ఈనాటి ఉద్యోగానికి కారణం నా తండ్రే. ఆయన చదివించిన చదువుంచుకొని ఉద్యోగం చేస్తూ కూడా ఆయన పిల్లల్ని చూడలేని పక్షంలో అంతకంటే అమానుషం ఇంకొకటి ఉండబోదు. అందుకే నేను భర్తకు పిరికిగా లొంగిపోదల్చుకోలేదు. నాపై ఆధారపడ్డ వీళ్ళని వదిలి ఈయన 'ధర్మపత్ని' అన్న బిరుదు సంపాదించు కోవటం కోసం తాపత్రయపడటం అర్థరహితం.

ఈ తర్జనభర్జనలనంతరం నేను ఓ నిశ్చయానికి వచ్చాను. "ఏ సహృదయం ఉన్న వ్యక్తి ఈ అనాథలు ఇక్కడ ఉండటానికి అభ్యంతరం చెప్పడు. ఓవేళ మీరు సహృదయంకల వ్యక్తి కాదన్న అభిప్రాయం నాలో కల్గేపక్షంలో అలాంటి వ్యక్తిని ప్రేమించి పెళ్ళి చేసుకొన్నందుకు చాలా సిగ్గుపడతాను. నేను ఈ పిల్లల్ని చూసుకొంటానని నా తండ్రికి ప్రమాణం చేశాను. అందుకోసం మిమ్మల్ని ధిక్కరించాల్సి వస్తే నేను వెనుకాడను కూడా. నేనేం చేయగలను? ఎవరైనా చూస్తూ చూస్తూ స్వంత చెల్లెలు, తమ్ముడిని రోడ్లపై దిక్కులేనివాళ్ళుగా వదిలేయ గలరా? అది మానవత్వం అన్పించుకొంటుందా? మిమ్మల్ని మానవత్వం ఉన్న మనిషిగా భావించి నేను మీ అనుమతి తీసుకోలేదు. మీ వాళ్ళపట్ల మీకెంత బాధ్యత ఉందో నాకు నావాళ్ళ పట్ల అంతే బాధ్యత ఉంది. నాకు ఉద్యోగం చేసే స్త్రీలలో ఉండే అహంకారంలాంటిది ఉందని మీరంటే కొంతవరకూ నిజమే కావచ్చు. నేను వాళ్ళనిక్కడకు తెచ్చింది. కేవలం నేను సంపాదిస్తున్నాననే ధీమాతో. అంతేగాదు, ఓవేళ ఈ పిల్లలిక్కడ ఉండకూడదన్న పక్షంలో నేను కూడా ఇక్కడ ఉండటం జరగదు. నేనూ వాళ్ళతోటి వెళ్ళిపోతాను. మీరు మీ పొరపాటు గుర్తించి నా దగ్గర ఆ నిజాన్ని నిస్సందేహంగా ఒప్పుకొన్న నాడు నేను మళ్ళీ మీ దగ్గరికొస్తాను. దయచేసి ఈ విషయం గురించి ఆలోచించి రేపు తెల్లవారేలోగా మీ నిర్ణయం నాకు తెలియపర్చండి" అని ఆయనకు చెప్పి ఆయన సమాధానం కోసం ఓ క్షణం కూడా నిల్చోకుండా అతని గదినుంచి బయటికి వచ్చేశాను.

నా చెల్లెలు, తమ్ముడు పడుకున్న గదిలోకి వెళ్ళి వాళ్లపక్కనే పడుకొన్నాను. నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఏమీ తెలీని ఈ పసివాళ్ళు ఎంత హాయిగా నిద్ర పోతున్నారు. వాళ్ళు ఇక్కడ ఆహ్వానంలేని అతిథులు అని వారికి తెలిస్తే? వారి లోనూ, నాలోను ప్రవహిస్తున్న రక్తం ఒకటేనని తెల్పినపుడు పొంగివచ్చే కన్నీళ్ళను అదుపు చేయలేకపోతున్నాను.

ఈ రాత్రంతా నా భర్త చెప్పిన విషయం గురించి తీవ్రంగా ఆలోచించ వచ్చు. నేను కూడా ఈ రాత్రి నిద్రపోను... అతను న్యాయమైన నిర్ణయం తీసుకోవాలనే భగవంతుణ్ణి కోరుతూ మెళుకువగానే ఉంటాను. రేపటి నా జీవితం తెల్లవారే ఈ రాత్రిపై ఆధారపడి ఉంది.

(విపుల, సెప్టెంబర్ 1989)

❖

రెండు కన్నీటి చుక్కలు!

(సింధీ కథ)

పోపటి హీరానందాని

✻

కళ్ళలోనే ఆకర్షణంతా ఇమిడి ఉందనుకోవాలి. ఆమెదంటూ ప్రత్యేకమైన దరహాసం గలగల శబ్దం చేస్తూ పరవళ్ళు తొక్కుతూ పరుగులు తీసే సెలయేరులా ఆహ్లాదకరంగా ఉండేది.

భారతదేశ విభజన జరిగిపోయింది. మా మాతృభూమైన సింధ్‌కు వీడ్కోలు పల్కి భారతదేశంవైపు కదిలాం. ఠాకూర్ తన కుటుంబాన్ని తీసుకుని తన బావమరదులుండే జోథ్‌పూర్‌కు వెళ్ళిపోయాడు. నేను మాత్రం కరాచీ శివార్ల గ్రామంలో ఉండే మల్లిర్‌లోని ఇంటిని, కొంతభూమిని అమ్మటానికి కొంతకాలం అక్కడే ఉండాల్సి వచ్చింది. అమ్మగా వచ్చిన డబ్బుతో నేను కుటుంబ సమేతంగా బొంబాయిలో అడుగుపెట్టాను.

నా కొడుకు గోవింద్ మెకానికల్ ఇంజనీరింగ్‌లో చేరాడు. అందులో డిప్లమా తీసుకున్న తర్వాత ఓ ప్రైవేటు కంపెనీలో అతనికి మంచి ఉద్యోగం దొరికింది. దాంతో నా సమస్యలకి తాత్కాలికంగా తెరపడింది. అంతకుముందే మాకు రెండుపూట్ల భోజనం దొరకటం కష్టంగా వుండేది. ఇప్పుడు మా అబ్బాయికి, ఉద్యోగం వచ్చాక ఎంతో సంతోషంతో రెండుపూట్లా భోంచేస్తున్నాం.

ఠాకూర్ నాకు ఉత్తరాలు రాస్తుండేవాడు. ఏ ఉత్తరంలోనూ రెండు

వాక్యాలకు మించకుండా రాసేవాడు. ఓరోజు అతని సోదరుణ్ణి కలిశాను. అతను నాతో, "ఠాకూర్ ఆర్థికంగా బాగా చితికిపోయాడు. ప్రస్తుతం నెలకు యాభై రూపాయల జీతానికి పనిచేస్తున్నాడు. దాంతోనే మోహినిని, తన భార్యను, తల్లిని చూసుకుంటూ జీవితం భారంగా నెట్టుకొస్తున్నాడు. నిజం చెప్పాలంటే అతను పూటపస్తుల్తో జీవితం సాగిస్తున్నాడనుకోవాలి" అని అనడంతో నాకు ఎక్కడలేని వేదన, దుఃఖం కల్గాయి. అంతులేని కోపం కూడా వచ్చింది

'వాడేమనుకుంటున్నాడు నా నుంచి ఈ నిజాన్ని దాచాలని ఎందుకు ప్రయత్నించాడు! మూర్ఖుడు!' అని అనుకున్నాను మనస్సులో కోపంగా. వెంటనే అతన్ని బాంబేకి తరలి వచ్చేయమని అర్థిస్తూ ఓ పెద్దజాబు రాశాను.

నేను పరేల్‌లో ఓ గదిని నెలకు 30 రూ. అద్దెకు తీసుకున్నాను. దానికి దాదాపు 1200 రూ. పగిడీ కూడా కట్టాను. ఆ గదిని ఠాకూర్‌కి ఇచ్చాను. ఠాకూర్ బొంబాయి రాగానే నెలకు 150 రూ. జీతంతో ఉద్యోగం దొరికింది. మోహిని కూడా మెట్రిక్ పాసై ఉద్యోగంలో చేరింది. అవసరమైతే సాయం చేయడానికి నేనెప్పుడూ సిద్ధమే. నాకిప్పుడు నిజంగా మనశ్శాంతిగా ఉంది.

కాని ఎప్పుడూ ఉల్లాసంగా, ఉత్సాహంగా జీవితం గడిపే ఠాకూర్ అనేక సమస్యలతో నలిగిన వ్యక్తిగా కన్పించసాగాడు. ఇదివరలో ఏ విషయం గురించైనా మాట్లాడితే చిరునవ్వు విసిరేవాడు. ఇప్పుడు దగ్గటం గాని, మౌనంగా ఉండటంగాని అలవాటు చేసుకున్నాడు.

ఇక మోహిని సంగతంటారా! ఇప్పుడామె దరహాసంలో మునుపటి సౌరభం, సౌందర్యం లేవు. ఆమె పొడుగరి కాకపోయినా, బక్కపల్చగా ఉండ టంతో అలా కన్పించేది.

జీవితం నిశ్చల సముద్రంలా ఒడుదుడుకులు లేకుండా సాగుతున్నప్పటికి, పాతబట్టలతో ఠాకూర్ భార్య దిండ్లు చేయడం, నేను చూడటం జరిగినప్పుడల్లా ఏదో పెద్దబండరాయిని ఢీకొన్న అనుభూతి కల్గేది నాకు.

గోవింద్‌ను యవ్వనం పెనవేయసాగింది. ఎప్పుడు ఠాకూర్ ఇంటినుంచి నేతిరిగొచ్చినా రాగానే వాడిని ఒక ప్రశ్న వేసేవాణ్ణి.

"ఏరా! ఎప్పుడు పెళ్ళి చేసుకుంటావు?" అని.

నోట్లోంచి కాల్తున్న సిగరెట్ తీసి – "నాపెళ్ళి కెందుకు నాన్నా తొందర? నేను గదా పెళ్ళిచేసుకోవాల్సినవాడిని" అనేవాడు గోవింద్.

ఇందుకు భిన్నంగా ఓనాడు నాకు గోవింద్, వాడితోపాటు పెళ్ళికూతురు దుస్తుల్లో ఓ క్రిష్టియన్ అమ్మాయి ఎదురుపడ్డారు.

"దాదా... నేను... మేము పెళ్ళిచేసుకున్నాం. రిజిష్టర్ మ్యారేజ్" అని నీళ్ళు నమిలాడు. నేను ఆ అమ్మాయివంక చూశాను.

"నేను మతం మార్చుకోలేదు దాదా" అన్నాడు గోవింద్ మళ్ళీ.

"నువ్వు మతం మార్చుకోలేదు నిజమే. కాని రేపు పుట్టబోయే నీ కొడుకు మాటేమిటి?" అని మనస్సులో అనుకుంటూ గోవింద్ తల్లిని బయటికి పిల్చి, "ఏయ్ విన్నావా! నీ పుత్రరత్నం పెళ్ళిచేసుకుని వచ్చాడు" అని చెప్పాడు.

ఆమె వంటింట్లోంచి ఒక్క పరుగున బయటకు పరుగెత్తి వచ్చింది చేతులు కడుక్కోడం, దుప్పట్టా కప్పుకోడం కూడా మర్చిపోయింది. "ఏమిటీ" అని అరిచినంత పనిచేసింది. ఆవిడ హతాశురాలైంది దాదాపుగా.

"అమ్మా! నేను కొలాబాలో ఓ గది అద్దెకు తీసుకున్నాను... రోజీకి ఉద్యోగం కొలాబాలోనే" చెప్పాడు గోవింద్.

"దాదా ఇక మేము వెళ్ళొస్తాం" అంటూ నాకు చెప్పి, తల్లివైపు తిరిగి వంగి ఆవిడ పాదాలకు నమస్కరిస్తూ, "అమ్మా నన్ను దీవించు" అన్నాడు.

నా భార్య వాడి మాటలకు, చేష్టలకు విస్తుపోయింది. నేనే ఇంతలో తెలివి తెచ్చుకుని "మంచిదిరా. భగవంతుడు నిన్ను ఆశీర్వదించుగాక" అన్నాను.

మాకు తనేమికానట్టు గోవింద్ వెళ్ళిపోయాక మమ్మల్ని విడిచి గోవింద్ తల్లి దుఃఖం ఆపుకోలేక పెద్దగా ఏడ్చేసింది.

"నేనే పాపం చేశానని భగవంతుడు నాకిలాంటి శిక్ష విధించాడు. నేనే స్వయంగా వాడి శిరస్సుపైన వివాహకిరీటం పెడదామనుకున్నానే. వాళ్ల శోభనానికి కొంగులు ముడి వేద్దామనుకున్నాను. కాని వాడికి తల్లంటూ వుందన్న ఆలోచనే రాలేదే" అంటూ వాపోయింది.

"ఇది సింథ్‌కాదు. ఇక్కడ మనల్ని రక్షించే సంస్కృతి లేదు. ఇక్కడ ఎవ్వరూ ఎవ్వర్నీ చూడరు. సాంఘిక బంధాలు, కుటుంబ బంధాలు విడిపోయాయి.

ఈ దేశంలో వున్న అత్యంత స్వేచ్ఛ ఇక్కడి జీవితాల్ని దెబ్బతీస్తోంది. అటువంటప్పుడు నా కుమారుడికి తల్లిదండ్రుల మనోభావాలతో పనేముంది. అటువంటి నిబంధనే లేదిక్కడ మనిషికి" అని మనసులో అనుకోకుండా ఉండలేకపోయాను.

గోవింద్ నా ఆనందైశ్వర్యాలను తనతోనే తీసుకువెళ్లి పోతున్నా నేను వేలెత్తి వాడిది తప్పు అని చెప్పలేకపోయాను.

గోవింద్ వెళ్లిపోయాక ఓసారి నా ఆర్థిక పరిస్థితిని సమీక్షించుకున్నాను. వాడి పేరు మీద కొన్న వేరు వేరు కంపెనీల వాటాలు అమ్మేశా. ఓ చిన్న ప్లాటు తీసుకుని అద్దెకిచ్చా... గోవింద్ తల్లి ఇంకా వేదనపడుతూనే ఉంది. అత్యంత ప్రియంగా దాచుకున్న వజ్రాలతో ముత్యాలతో చేసిన గొలుసును బయటకి తీసింది ఆవిడ. "నేను ఈ గొలుసును గోవింద్ భార్యకు యివ్వలేను. అదో వ్యభిచారిణి. నా కొడుకుని బలవంతంగా నా నుంచి దూరం చేసిన పతిత, దీన్ని అమ్మేసి రండి. ఇదుంటే అనుక్షణం పాతజ్ఞాపకాలు వరదలా పొంగుతూ నాకు మనశ్శాంతి లేకుండా చేస్తుంటుంది" అంది.

నా హృదయం కూడా ఎంతో వేదనకు గురయింది. కానీ అది నేను బయటకు వ్యక్తంచేయలేదు. ఇప్పుడు నేను రిటైరయ్యాను. ఈ గొడవ జరిగాక ఓ రోజు నేను నా పాత ఆఫీసుకి వెళ్లాను. ఇదివరలో వాళ్లు ఆడవాళ్ళను ఉద్యోగంలో చేర్చుకునేవాళ్లు కాదు. కానిప్పుడు ముగ్గురు ఆడవాళ్ళు కన్పించారు. ఒకావిడ టైపు చేస్తోంది. రెండో ఆమె తన సీట్లోంచి లేచి ఓ పార్శీ క్లర్కు దగ్గరకు వెళ్లి ఎంతో స్వేచ్ఛగా వాగుడుకాయలా గలగలా మాట్లాడేస్తోంది. మూడో అమ్మాయి మౌనంగా కూర్చుంది. ఆమె నావైపు చూపు సారించింది. ఆమె కనుల చుట్టూ నల్లని వలయాలు ఏర్పడ్డాయి. పెదాలపై లిప్‌స్టిక్ పూత పులుముకుంది. అయినా వాలిపోయిన జొన్నకంకిలా కన్పడిందామె.

ఎందుకో నాలో కల్గిన ఆసక్తితో వాళ్ల వివరాలు కనుక్కున్నాను. మొదటి అమ్మాయిని మినహాయించి మిగతా యిద్దరికీ ఇంకా పెళ్లికాలేదు. ముదురుతున్న వయస్సు వాళ్ళ ముఖాలలో కొత్త పుంతలు తొక్కుతోంది. ముఖ్యంగా రెండో అమ్మాయి ప్రవర్తనలో తనకు రక్షణ లేదన్న భావం స్పష్టంగా వ్యక్తమైంది.

కొందరు పిచ్చివాళ్లు మౌనంగా ప్రశాంతంగా ఉంటారు. కొందరు

అవిశ్రాంతిగా వాగుడుకాయల్లా ఉంటారనిపించింది. అసలు పిచ్చెందుకు వస్తుంది? నిరాశ ఎదురైనప్పుడేననిపించింది కూడా. నాకు కూడా ఇలాంటి నిరాశా నిస్పృహలకే బలై ఉండవచ్చునా అని, అందుకే ఆమెకూడా మిగతా ఆడవాళ్లలాగానే తన నిస్సహాయతను తనకళ్లల్లో వ్యక్తం చేస్తుండవచ్చునా అని సందేహం కల్గింది. ఆమె స్మృతిపథంలో మొదలగానే ఠాకూర్ ఇంటికి వెళ్లాను.

ఠాకూర్ జ్వరంతో ఉన్నాడు నేను పోయేటప్పటికి. అతను కొయ్య మంచం పైన పడుకుని ఉన్నాడు. పొడగరి అయిన అతను ఆ మంచానికి సరిపోవటం లేదు. నా అడుగుల సవ్వడి విని తలతిప్పాడు. మంచం కిర్రుమంది. కాని అతనేమీ పల్కలేదు. ఓ బల్లదగ్గరకు లాక్కుని అతని పక్కనే కూర్చున్నాను. "ఎలా ఉన్నావు ఠాకూర్?" అని అడిగాను.

బదులుగా ఠాకూర్ చిన్నగా దగ్గి మౌనం వహించాడు.

"ఠాకూర్... మన మోహినికి త్వరలో పెళ్లి చేయాలి" అన్నాను. మళ్ళీ ఠాకూర్ దగ్గు ఈసారి అధికమైంది. పక్కకు తిరిగి ఉమ్మేశాడు.

ఠాకూర్ ముసలితల్లి మామిడికాయ పచ్చడి నంచుకుంటూ చపాతిముక్కలు తింటోంది. ఠాకూర్ భార్య పాతచొక్కాలతో ఓ సంచి కుడుతోంది. అప్పటికప్పుడే ఓ నిశ్చయానికి వచ్చి చెప్పాను ఠాకూర్‌తో.

"ఠాకూర్.. మోహిని నా కోడలు, నాకు కొడుకులు లేరు. ఉన్నా లేనట్లే లెక్క. కాని అందుకు బాధపడక్కర్లేదు. చాలామంది కోడలు కోసం వెతుక్కుంటారు. కాని నేనో మంచి కొడుకుకోసం వెతుకుతాను".

ఠాకూర్ లేచి కూర్చుని "కిమా... మన స్నేహం" అంటూ ఏదో చెప్పబోయి మధ్యలోనే ఆగిపోయాడు.

నేను అతనిచేతిని మృదువుగా నొక్కి బయటకు నడిచాను. ఎందుకంటే నా కళ్లలోంచి వచ్చే ఆ రెండు కన్నీటి చుక్కలు ఠాకూర్ చూడకూడదనే ఉద్దేశంతో.

(విపుల, అక్టోబర్ 1989)

❖

ఎంత ఆలస్యమో

(పంజాబీ కథ)

రమేష్‌లూత్ర

❋

ఈసారి వర్షాకాలం మమ్మల్ని మోసగించి మాకు అన్యాయం చేయకూడదనే నా ఆకాంక్ష. ఎందుకో వరుణదేవుడికి మాపై ఇంత పగ, కక్ష. ఒక్కచుక్క, ఒక్కచుక్క కూడ వర్షం పడలేదు. నిండు నీలాకాశంలో ఓ చిన్న మబ్బుతునక కూడా లేదు. ఇక వర్షం కురుస్తుందన్న ఆశెక్కడిది.

నీళ్ళలా చెమటలు కారే ఎండవేడిమి. నాకు ఒళ్ళంతా చెమట పట్టేసింది కూడా. ఆ చెమటతో తడిసిన ఈ చొక్కా... ఉన్న ఒక్కటే చొక్కా ఇంకెంతకాలం నన్ను పట్టుకొని విశ్వాసంతో మనగల్గుతుంది.

కాని... కాని... నాకున్న ఆ ఒక్క భూమితో, పిసరంత భూమితో నా జీవితం ముడిపడి ఉంది. నా చిట్టచివరిక్షణం వరకూ ఆ భూమి నంటిపెట్టుకొని బ్రతకాల్సిందే నేను.

ఈనాడు నా కుటుంబం నేనూ బ్రతుకుతున్న ఆ భూమి తరతరాలుగా మావాళ్లు సేద్యంచేసి, పంటలు పండించిన భూమి. మా రక్తం చెమటతో కల్సిపోయి మా ప్రాణంలో ప్రాణంగా మారిపోయిందా భూమి. మా ప్రాణానికి అత్యంత ఖరీదైందది. ఓసారి భూకామందు దానిని మింగితే మళ్లీ రాబట్టు కోవటం సాధ్యం కాదు.

పిడికెడు మట్టి భూమిపై నుంచి తీసి అప్యాయంగా పట్టుకొని ఆ విశాలమైన పొలాన్ని ఓసారి పరికించాను పూర్తిగా. ఎండిపోయి బీటలుబారిన ఆ భూమి ఇంద్రుడి ఆగ్రహానికి ప్రతీకగా నిల్చింది నా కళ్ళముందు.

ఆ ఎండకు ఖణఖణలాడే అగ్నిగోళంముందు కూర్చున్న అనుభూతి నాలో. నాకళ్ళు ఎర్రగా మండుతున్నాయి. కళ్ళని మూసుకొని గతాన్ని ఓసారి జ్ఞప్తికి తెచ్చుకోడానికి ప్రయత్నించాను. ఒకప్పటి బంగారు రోజులు నా స్మృతిపథంలో ఒకదాని తర్వాత ఒకటిగా మెదలసాగాయి.

ఒకప్పుడు పచ్చటి పొలాలు, పండిన గోధుమల కమనీయమైన వాసన ఎంత దూరానున్నా ఇట్టే ఆకర్షించేవి.

ఇప్పుడో!... ఆకాశాన్ని అంటే తుమ్మముళ్ల చెట్లు, పొదలు, కనీసం పశుగ్రాసానికి కూడా పనికిరాని చెట్లు, బీటలుబారిన భూమి మధ్య తెల్లటి ఉప్పుచవుడుచారలు. చూడ్డానికి ఎంతో అసహ్యంగా కన్పించే దృశ్యం. ఈ నిశ్శబ్దభూమి నాలో ఎక్కడో వణుకు పుట్టిస్తున్న అనుభూతి ఏదో దయ్యం నన్ను గొంతు నులిమి చంపుతున్నద వేదన. ఊపిరి పీల్చుకోను ఓపికలేని నిస్సహాయత నన్ను ఆవహించింది. నమస్కరిస్తున్న చేతులతో స్వర్గద్వారాలవైపు చూస్తూ 'నాలాంటి దీనులపై భగవంతుడికి కరుణకల్గాలి' అని ప్రార్థించాను.

అసలు ఈ ప్రాంతం నుంచి వెళ్లిపోవాలనుకొన్నాను. ఆకలితీర్చని ఈ నేలను వదిలి దూరంగా తరలిపోవాలనుంది. అలాంటప్పుడల్లా గడిచిన కాలంలో పంట కళ్ళాలకు చేరినపుడు జరిపిన ఆనందోత్సవ సంబరాలు, వేడుకలు, కోలాహలం, ఆడవాళ్ళ ఆటపాటలు గుర్తుకొచ్చి మనస్సును వెనక్కిలాగి పట్టేస్తుంటాయి.

ఓసారి అలాగడిచిన వేడుక ఒకటి నా మనో మందిరంలో మెదిలింది. ఆసారి నేను సమీపాన ఉన్న పట్టణానికి పంటనమ్ముకు రావడానికి వెళ్తున్నాను. థానో నా వెంబడి వస్తానని పట్టుపట్టింది. మా యిద్దరికీ కొత్తగా పెళ్లయింది. చివరికి మా నాన్నగారు ఒప్పుకోవటంతో మేమిద్దరం కలిసి పట్నం బయల్దేరాం. అప్పుడు ఆమె పొందిన ఆనందం వర్ణనాతీతం. ఆమె సంతలోని హడావుడికి ఎంతో స్పందించింది. పంట అమ్మిన సొమ్ముతో ఆమెకు ఓ జత

'జుంకాలు' కొన్నాను. జుంకాలంటే థానోకి ఎంతో ప్రాణం.

కాని ఈ నాటకం మాకోనాడు ఆ జుంకాలను కూడా లేకుండా చేశాయి. గతకొద్ది రోజులుగా మేమసలు నిండు భోజనమే చేయలేదు. దీపు పెద్దపెద్ద చపాతీ ముక్కల్ని తినటం చూసి నానోట్లో నీరూరింది. నా ఎదుటే కూర్చున్న థానో అది గమనించింది. అప్పుడే ఆమె చెవికి జుంకాలను లేకపోవటం గమనించి "నీ చెవుల జుంకాలేమైనాయి?" అని అడిగాను.

రెండు చపాతీలు నాముందు పెట్టి చిరునవ్వు నవ్వింది థానో. పాలి పోయిన, మలమలా మాడ్తున్న మిమ్మల్ని, పసికందు దీపును చూడలేక... మధ్యలో ఆగిపోయింది థానో. ఆమె కంఠం రుగ్ధమైంది. కళ్ళలో నీళ్ళు నిల్చాయి. అతికష్టం మీద "....బూ కామందుకు వాటినమ్మేసి గోధుమపిండి తెచ్చాను. కనీసం అదన్నా మరికొన్ని రోజులొస్తుంది. ముందుముందు మనకి కల్సివస్తే నువ్వు ఎన్ని జుంకాలైనా కొనిపెట్టగలవు. కొనిపెట్టవూ?" అంది.

ఆమె బలవంతంమీద చపాతీ తిన్నాడు. కాని నాకది రుచిగా అన్పించ లేదు. నాకు సంబంధించినంతవరకూ ఓస్వర్ణయుగం అంతరించినట్టే అన్పిం చింది. ఒకప్పుడు భూమి బంగారాన్నిస్తే ఇప్పుడు ముళ్లపొదల్ని, ఆకలి కడుపు లను, నిద్రలేని రాత్రులను మిగిల్చింది.

ఇంతలో 'బాబు' నావైపు రావటం గమనించాను. స్వంతభూమిపై పని చేయటం సులభంకాని ఒకరిక్రింద కూలిగా దినవారీ భత్యానికి పనిచేయటం చాలా కష్టం. కాని బాబు ఈ నిజాన్ని గుర్తించలేదు. అతను ఎంత కఠినుడూ, నిర్ధయుడంటే అతనికి వాస్తవ, అవాస్తవాలతో సంబంధంలేదు. యాంత్రికంగా తన పని తాను చేసుకొంటూ హాజరు వేసుకొంటూ పోతున్నాడు. ఎన్నో వేలి ముద్రలు దొంగవని చాలామంది అంటున్నారు. అలాంటి ఖాతా క్రింద ఎంతోమంది జీతం కొట్టేస్తుంటా డతను.

అతనికి మా వేదనలు, ఆవేదనలు ఎప్పుడు తెలుస్తాయి? మాపట్ల ప్రకృతి చూపిన నిర్ణయ అతనికెలా తెలుస్తుంది?

బాబు గొంతు విని థానో కూడా ఈలోకంలోకి వచ్చింది. ఆవిడనెత్తినున్న బుట్టనిండుగా ఇసుక ఉంది. మా నిశ్శబ్దచూపులు అందరిలాగే మా ఆకలి

బాధను కూడా చెప్పకనే చెప్తున్నాయి. కాసేపటి తర్వాత అందరినీడల్లో ఆమెనీడ కూడా కల్సిపోయింది.

ఇష్టమున్నా లేకపోయినా నేను లేచి కాలువ త్రవ్వటం ప్రారంభించాను. తప్పదు కదా మరి! కాని నా చేతిలోని పార చాలా బరువుగా ఉంది. నా బలహీనమైన భుజాలు దానిని మోయలేనంటున్నాయి. ఎప్పుడు పొద్దు గుంకుతుందాని ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నాను. అప్పుడప్పుడు ఇంకా చావని ఆశతో ఆకాశంవైపు చూస్తూనే ఉన్నాను. ఏమో! అక్కడ దేవతలుంటారట. వాళ్లు స్వయంగా మేము అనుభవిస్తున్న ప్రకృతి విలయాన్ని చూసి దయతల్చి వర్షం కురిపిస్తారని నాఆశ. అబ్బ ఎంత సుందరమైన ఆలోచన. అలాంటి ఆలోచనే నాకళ్లవెంబటి నీళ్లు తిరిగేలా చేసింది.

ఇంతలో ఆడవాళ్ళు పనిచేసే వైపు ఏదో అలజడి. ఏదో జరగకూడనిది జరిగిందని ఎందుకో నాలోభయం కల్గింది. ఎప్పుడైతే ఈ కరువు నా కూతురు చునియాను బలికొన్నదో అప్పుడే నా కన్పించింది... ఈ కాటకం యింతటితో ఆగదు – మరెందరినో బలితీసుకొంటుందని.

గబగబ అటువైపు నడిచాను భగవంతుడ్ని ప్రార్థిస్తూ. అంతే అదో పిడుగుపాటులా తగిలింది నాకు. అక్కడ కలకలం ఎవరివల్లనో కాదు. నా భార్య థానో స్పృహతప్పి పడిపోవటం వల్లనే. కొందరు ఆమె పాదాలను చేత్తో రుద్దుతున్నారు. మరికొందరు చేతుల్ని రుద్దుతున్నారు. ఆమె నాడి పట్టుకు చూశాను. ఆమెలో ప్రాణం ఏ కోశానా ఉన్నట్లనిపించలేదు నాకు. నిర్జీవమైన శరీరం మాత్రమే అది. భూమిపై ఆమె తన చిన్నతనం, నవయవ్వనం, గార్హ్యంగా గడిపింది ఎక్కడో, ఆమె తీయని జీవితానికి కలలు కంది ఎక్కడో, ఆ భూమే ఆమెను నిర్ధాక్షిణ్యంగా వంచించింది. పైగా ఆమె గర్భిణిగా వెళ్ళిపోయిందీ ప్రపంచంనుంచి. దీపు ఆమె పక్కనే కూర్చుని ఏడుస్తున్నాడు. అతని ఏడుపులు, రోదనలు ఆకాశాన్ని అంటుతున్నాయి. నేను ఈ హఠాత్పరిణామానికి స్తంభించి పోయాను. ఏదో ఒనాడు అందరూ ఈ కరువురక్కసికి బలికావాల్సిందే.

బాబు ముందుకు వచ్చాడు. అతని నోటి నుంచి సానుభూతి మాటలేవీ రాలేదు. ఇంతకు ముందుకంటే కాఠిన్యం నిండిన కంఠంలో "మీరంతా

ఎప్పట్నించో ఎదురుచూస్తున్న బియ్యపు బండి వచ్చింది. ముందు మీకప్పచెప్పిన పని పూర్తిచేయండి" అని చెప్పి ముందుకు నడుచుకుంటూ వెళ్ళిపోయాడు రిజిష్టరు, పెన్ను చేతుల్లో పట్టుకొని.

'ఊ! బియ్యపుబండి కరువు సహాయం ఎందుకింత ఆలస్యంగా రావటం? జరగకూడనిదంతా జరిగిపోయాక. నా కళ్లముందు నా చిన్నారి ప్రపంచం తునాతునకలైపోయాక! ఇంత ఆలస్యంగా ఎందుకు?...' అనుకోవటం తప్ప మరేమి చేయలేకపోయాను నేను.

(విపుల, జనవరి 1990)

❖

నిశ్చయం

(రాజస్థానీ కథ)

శచీంద్ర ఉపాధ్యాయ

❋

టిన్‌రేకుల మీద చిటపటమంటూ పడుతున్న వర్షపు చినుకుల సవ్వడికి మెళుకువ వచ్చింది అతనికి. ముఖమ్మీద రజాయి తొలగించి అమ్మ పడుకున్నవైపు చూశాడు. అమ్మ పడుకోలేదు. మంచం పక్కన నేలమీద కూచొని బుడ్డి వెలుగులో ఏదో కుడుతోంది. మినుకు మినుకుమంటున్న మసక వెలుతురు గదిలో పరుచుకుంది. గోడమీద వేలాడుతున్న కేలండరు ఏదో మరకలా కనిపిస్తోంది.

అతడు మళ్ళీ రజాయి కప్పుకున్నాడు. రోడ్డు మీద ఏదో టాంగా పోతోంది. వేపచెట్టు మీద నెమళ్ళు కూయసాగాయి. చీకటి గుహలా ఉన్న ఆ ఇరుకు సందులో దారి తప్పిన మేక దీనంగా అరుస్తోంది.

తను మేలుకున్న సంగతి అమ్మకు తెలియదనుకున్నాడు. తెలిస్తే లేచి అమ్మతోబాటు తనూ కూచోవాలి. అసలు విషయం అమ్మకు తెలుస్తుందేమోనని భయపడుతున్నాడు.

రాత్రి చాలా ఆలశ్యంగా ఇంటికి వచ్చాడు. చీకట్లో తారాడుతూ వచ్చి తలుపు తట్టాడు. అమ్మ మేలుకొని ఎదురు చూస్తోంది. అమ్మను లేపకూడదని కింద అంతస్తులో ఉన్న కిశ్నాను మెల్లగా పిలిచాడు. ఎదురు చూస్తూ మేలుకున్న అమ్మ మెట్లు దిగసాగింది. అలకా మీద అతనికి కోపం వచ్చింది.

అమ్మ దృష్టిలో పడకుండా వెళ్ళి పడుకోవాలనుకున్నాడు. అమ్మ మెట్లు దిగి తనవద్దకు వచ్చేసరికి జేబులోని రూమాలు తీసి నోటికి అడ్డంగా పెట్టుకున్నాడు. అతని కాళ్ళు వణుకుతున్నాయి. శరీరంలో చిత్రమైన టెన్షన్ కలుగుతోంది. సందులో పరుచుకున్న చీకటి అతని కళ్ళకు గోడలా కనిపిస్తూంది. చలిలో అమ్మ గడగడలాడిపోతోంది.

తను లోనికి వెళ్ళగానే స్టౌ ముట్టించి, "అర్థరాత్రి వరకు ఏం చేస్తుంటావు సతీష్ ! పెందరాళె రొట్టె తినాలి నాయనా?" అంది అమ్మ.

లోతైన గుహలోంచి మాటాడినట్టు వినిపించాయి అమ్మ మాటలు. వేలాది చీమలు శరీరమ్మీద పాకినట్లు అనిపించింది. తను అదరాబాదరా మంచంమీద పడి, "ఫైనలియర్‌కదమ్మా! అవసరమైన పుస్తకాలు కూడా నావద్ద లేవు. చదువుకోడానికి ఎక్కడెక్కడికో వెళ్ళవలసివస్తోంది" అన్నాడు.

ఆ మాటలు విన్న అమ్మ ముఖం పాలిపోయినట్లు మత్తులో కూడా తను గమనించాడు. చితికిపోయిన ఆర్థిక పరిస్థితిలో సతమతమైపోతున్న అమ్మ తనకేసి దీనంగా చూడ్డం మినహా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉంది.

"లే బాబూ! రొట్టె తిని పడుకో."

"వద్దమ్మా సదన్ వాళ్లింట్లో తిన్నాను. నన్ను డిస్టర్బ్ చేయకు. నిద్ర సరిగా లేక తలనొప్పి వస్తోంది" అంటూ రజాయి కప్పుకొని పడుకున్నాడు. స్పృహ కోల్పోతున్నట్లు అనిపించింది. తల తిరుగుతోంది. రేపటినుంచి భువనేష్‌తో కలసి వెళ్ళకూడదని నిశ్చయించుకున్నాడు.

ఈరోజు కూడా అటు వెళ్ళకూడదనుకొని తివోలి నుండి నేరుగా అలకా ఇంటికి వస్తున్నాడు. అలకా ప్రవర్తన తనకు సుతారమూ నచ్చలేదు. విపరీతమైన టెన్షన్‌తో రక్తనాళాలు పగిలిపోతున్నట్లు అనిపించింది.

నిష్ఠూరంగా మాట్లాడిన అలకా మాటలతో తన మనసు కలత చెందింది.

పగలంతా అలకా తనతో కలసి గడిపింది. ఆనకట్ట మెట్ల మీద ఎండలో గంటల తరబడి కూచున్నారు. సాయంత్రం తివోళికి వెళ్ళి కడుపు నిండా మెక్కారు. పుస్తకాలు కొనుక్కోవాలని అమ్మని పదిరూపాయలు అడిగి వచ్చి పగలంతా అలకాతో గడిపాడు.

కౌంటరులో డబ్బు చెల్లించగా కేవలం 50 పైసలు మిగిలింది. ఆనందంగా బయటికి వస్తుంటే చెట్టాపట్టాలు వేసుకున్న అలక, "సినిమా చూడాలనిపిస్తోంది సతీష్! నటరాజ్‌లో 'ఆరజూ' ఆడుతోంది, పద ఫస్టుషో చూద్దాం!" అంది.

సతీష్ వద్ద అర్ధరూపాయి మాత్రమే ఉంది. అకస్మికంగా అలకా సినిమాకు వెళ్దామనడం సతీష్‌కు నచ్చలేదు. సినిమాకు వెళ్ళాలని ముందే అనుకొని ఉంటే ఏదో ఏర్పాటు చేసుకొనేవాడు. ఇపుడు ఏం చేయడానికి వీల్లేదు.

కూలి నాలి చేసి తనను చదివిస్తూన్న తల్లి మీద జాలికలిగింది సతీష్‌కు. తను పోకిరిగా తిరగకూడదని శ్రద్ధగా చదువుకొని మంచివాడు అనిపించుకోవాలని నిర్ణయించుకున్నాడు. అయితే ఆ నిర్ణయం ఎంతో కాలం నిలవలేదు.

అలకా తనను ఇబ్బంది పెడుతోంది. అనారోగ్యంగా ఉన్న అమ్మను ఒంటరిగా వదలివచ్చానని తొందరగా ఇంటికివెళ్ళాలని, సినిమాకు వెళ్ళడానికి వీల్లేదని అన్నాడు అలకాతో.

అలకా అతని మాటలు నమ్మలేదు. అతని మీద చిర్రుబుర్రుమంది. అప్పుడే ప్రదీప్ తివోళి నుండి బయటికి వచ్చాడు. అతనితో కలిసి సినిమాకు వెళ్ళింది అలకా. ఓ చిన్న సంఘటనతో ఎన్నాళ్ళ స్నేహమో, తెగిపోయింది. తాడు తెగిన గాలిపటంలా ఉండిపోయాడు తను. తన శరీరం కోపంతో కుతకుత ఉడికిపోతోంది. ఓ గంటపాటు నిరర్ధకంగా బజార్లో తిరిగాడు. భువనేష్ బలవంతంగా బార్‌కు లాక్కెళితే కాదనలేకపోయాడు. భువనేష్‌కు ఈరోజే ఇంటినుంచి డబ్బు వచ్చింది. అర్ధరాత్రి వరకు బార్‌లో కూచుని తాగారు.

ముఖమ్మీది రజాయి తొలగించి అమ్మకేసి చూశాడు సతీష్. అమ్మ తనవేపు వీపు మళ్ళించి కూచుంది. మసక వెల్తుర్లో కూచొని ఏదో కుట్టుకుంటూన్న అమ్మ తల వెంట్రుకలు చెదిరిపోయిన పక్షిగూడులా ఉన్నాయి.

మాటనిలకడ... నిశ్చయంలేని అలకా లాంటి గర్ల్‌ఫ్రెండ్ మోజులోపడి జీవిత సర్వస్వాన్నీ తనకోసం అంకితం చేసిన ఈ కన్నతల్లిని ఎన్నటికీ మరువకూడదని గట్టిగా నిశ్చయించుకుని నిశ్చితంగా నిద్రలోకి జారాడు.

(విపుల, జనవరి 1990)

❖

నేరము - పరిహారము

(ఇండో ఆంగ్లియన్ కథ)

మోహన్ రాకేష్

❃

గతంలో లాగానే ఈ సంవత్సరం కూడా మా బంగ్లాలోని గడ్డిని కోసుకుపోవటానికి పండిట్‌కు అనుమతినిచ్చాం.

పండిట్ న్యూస్‌పేపర్లను ఇంటింటికి తీసుకెళ్ళి వేస్తుంటాడు. ఇప్పుడిప్పుడే సెప్టెంబరు ప్రారంభమవుతుండటంచేత గడ్డి కుప్పలుతెప్పలుగా పెరుగుతోంది. గడ్డి కోయటానికి సహజంగా పండిట్ భార్యే వస్తుంటుంది.

రహదారినుంచి మా బంగ్లాకు వచ్చే తోవ గడ్డిలో మూసుకుపోకుండా ఉండాలంటే గడ్డి కోయటం ఎంతో అవసరం. మా బంగ్లా తోటలో ఎన్నోరకాల పూలుపూస్తుంటాయి. ఒకప్పుడు దేశవిభజనకు ముందు ఈ బంగ్లా ఓ ముస్లింది. ఆయనకు ప్రకృతిపట్ల అభిరుచి ఆసక్తి మెండుగా ఉండేవట. ఎంత ఆసక్తంటే బంగ్లాలో తివాసీలపట్లకన్నా తోటలో పూలచెట్లపైనే ఎక్కువ శ్రద్ధ కన్పరిచే వాడట. ఆయన హయాంలో స్వదేశీపూల మొక్కలే కాకుండా విదేశాల్నుంచి రంగురంగుల ఆకర్షణీయమైన పూలమొక్కలు తెప్పించి నాటించేవాడట. కానీ ఆ మహనీయుడు ఇప్పుడు లేడు. దేశ విభజనలో తరలిపోయాడు. ఆయన పోయాక ఆ బంగ్లాలో తివాసీలు మటుమాయమయ్యాయి. తోటలోని మొక్కలు ఎంతోమంది పాదాలకింద నలిగిపోయాయి. ఆయన వెళ్ళిపోయినా కూడా

చాలాకాలం ఆ బంగ్లా తోటమాలి అక్కడే అవుట్‌హౌస్‌లో నివసిస్తూ తోట ఆలనాపాలనా చూసుకొంటుండేవాడు. అతనితోపాటు ఈ భవంతి యజమాని పోషించి వదిలిపెట్టిన రెండు కుక్కలు కూడా ఉండేవి. అతను మాత్రం ముస్లిం కాదు. తన యజమాని వెళ్ళిపోయాక కూడా పూలమొక్కలపట్ల ఎంతో ప్రేమ, ఆదరణ వ్యక్తపరిచేవాడతను. ఒక్కోసారి పూలుకోసుకొని బంగ్లాలోని పూల కుండీల్లో పెట్టేవాడు. పాపం అలాంటి పనికి అలవాటున పడిన అతని మనసు తన యజమాని పోయాక వచ్చిన నిర్లిప్తతను సహించగల్లేది కాదు కామోసు, బహుశా అలవాటంటే అదేనేమో!

అలాంటి ప్రకృతి ఆరాధకుడోరోజు ఈ ప్రపంచం నుంచి శాశ్వతంగా వీడ్కోలు తీసుకొని వెళ్ళిపోయాడు అతని నిష్క్రమణంతో మొక్కలు అనాథల య్యాయి. గత రెండేళ్ళుగా నేను ఆ బంగ్లాలో ఓ భాగంలో ఉంటున్నాను. క్రమంగా కాలం గడిచేకొద్దీ తోటమాలి ఎంతో ప్రేమగా, ఆదరంగా, అభిమా నంగా చూసుకొనే తోట భీభత్సంగా, భయంకరంగా మారటం కన్పించి నా హృదయం ఎంతో ఆవేదనకు లోనయింది. బ్లూబెల్స్ మొక్కలు రోజా పూలచెట్లతో మెలిపడిపోయాయి. దాలియా మొక్క ఆకర్షణీయమైన ఎర్రటి పత్రాలు గోడల సందుల్లోని చీలికల్లోంచి దూరి బయటికి వచ్చాయి. ఒకప్పటి వైభవంతో పోలిస్తే ఇదెంతటిమార్పు. అందుకే గత చరిత్ర మన కళ్ళముందు యిప్పటికీ ఓ మధురానుభూతిగా నిలుస్తుంటుంది. ఎప్పుడూ గతవైభవం అనేది తిరిగివచ్చేది కాదు. ఊహల్లో నిల్చిపోయే అందమైన చరిత్రే అది.

ఇప్పుడు నేను చెప్తున్నది సుమారు రెండు సంవత్సరాల క్రితం సంగతి. అది సెప్టెంబరు. ఓ రోజు సాయంత్రం నేను యింటికి తిరిగి వచ్చేసరికి ఓ అమ్మాయి గడ్డికోస్తూ కన్పడింది నాకు. ఆమెకోసిన గడ్డిని పరిచిన ఓ గుడ్డపై కుప్పగా వేస్తుంది. ఆమె వయస్సు సుమారు పద్దెనిమిది. యిరవై సంవత్సరాల మధ్య ఉండవచ్చు. ఎంతో మృదువైన శరీరం, పాలుకారే స్వచ్ఛత, తేటదనం ఆమె అందంలో నన్ను ప్రధానంగా ఆకర్షించినయి. ఆమెను అమ్మాయి అనటం కన్నా నవజవ్వని అంటే మధురంగా ఉంటుందేమో. శల్వార్, కుర్తా వేసుకొనుం దామె. చొక్కాను మోచేతులవరకూ, శల్వార్‌ను మోకాళ్ళపైకి మడ్చింది. పసిమి

ఛాయతో మిసమిసలాడే తామరతౌనల్లాంటి ఆమె కాళ్ళు, కలువ కాడల్లాంటి ఆమె చేతులు నా హృదయాన్ని యిట్టే గాలంవేసి లాగినట్లు లాగాయి. తలపై నుంచి రంగు ఓణీ భుజాల పైకి జార్చింది. ఆమెను అలానే చూస్తుంటే నాలో ఓ అందమైన సెలయేరు ప్రచండవేగంతో పరుగులుతీస్తున్న స్పందన. అదో తీయని అనుభూతి.

గడ్డితోపాటు ఆమె అక్కడక్కడ వికసించిన పూలనుకూడా కోస్తోంది. కోసిన పూలను పరిచిన గుడ్డలోని గడ్డిపైకి విసిరేస్తోంది చకచకా. ఓసారి నావైపు పట్టీపట్టని చూపు సారించి తనపనిలో నిమగ్నమయింది ఆ అమ్మాయి.

'ఎందుకు పూలుకోసి గడ్డిలోకి విసిరేస్తున్నావు?' అని అడిగాను ఉండ బట్టలేక.

"పండిట్ చెప్పాడు 'వీటిని కూడా కోసేయమని'. మీరు పండిట్‌కు చెప్పారట కదా" అంది ఆమె. ఈ మాటలంటున్నప్పుడు ఆమె ముఖంలోని మార్పులు స్పష్టంగా కన్పించాయి నాకు. కాని, కళ్ళుమాత్రం నవ్వుతున్నాయి.

"నేను వాటిని కోసేయమని చెప్పానా?" ఆశ్చర్యంగా ప్రశ్నించాను నేను.

"అవును మీరే పండిట్‌కు చెప్పారట ఈ పూలనుకూడా గడ్డితోపాటు కోసేయించమని" బదులు చెప్పిందా అమ్మాయి.

"మీరు పండిట్‌కు ఏమౌతారు?" అడిగాను నేను ఆసక్తితో.

"ఆయనతో కల్సి జీవిస్తుంటాను" పేలవంగా చెప్పిందామె. మరుక్షణం తనను తాను నంబాళించుకొని మామూలుగా అయిపోయింది.

"గుల్జారీసాహెబ్ అడిగి వుండవచ్చు నేను కాదు" అన్నాను నేను. ఇక అక్కడ ఆగకుండా యింటివైపు కదిలాను. అప్పుడు విన్పించాయి వెనుకనుంచి ఆమె మాటలు.

"నిజమే గుల్జారీసాహిబే అడిగిఉండవచ్చు" అని. ఆ తర్వాత ఆమె తన పనిలో తలమునకలయిపోయింది.

గుల్జారీసాహిబ్ నేనుండే బంగ్లాలో రెండో భాగంలో ఉంటాడు. ఆయన లెక్కల టీచరు. ఆయన అవతారం చూస్తే ఏ ఈజ్ ఈక్వల్ టు బి, బి ఈజ్ ఈక్వల్ టు సి, దేర్‌ఫోర్ ఎ ఈజ్ ఈక్వల్ టు సి అనే ఈక్వేషన్ గుర్తుకొస్తుంది

ఎవ్వరికైనా. అలా విడ్డూరంగా ఉంటాడు. ప్రతి విషయాన్ని ప్రయోజనత్వ పరంగా ఆలోచిస్తాడు. ఆయన అభిప్రాయంలో పూలకుండీల్లో అమర్చడానికి చాలినన్ని పూలుంటే మిగతాపూలు అనవసరమని.

పండిట్ భార్య యిప్పుడు ప్రతిరోజు వస్తోంది గడ్డికోయడానికి. ఆమె కన్పించేది రోజూ ఒకేరకమైన దుస్తుల్లో. అప్పుడప్పుడు ఆమె వహారిపాటలు కూడా పాడ్తుంది. ఓసారి ఆమె కొండపైనుంచి కిందికి వస్తుండగా చూశాను. ఆమె కొండ దిగినంతసేపు ఎంతో తేలికగా గంతులు వేస్తూ, ఎగురుకొంటూ విశ్రాంతి తీసుకోకుండా దిగింది. ఆమెలోని పొంగుతున్న యవ్వన సౌరభానికి అంతకంటే అందమైన దృశ్యం ఉండదు.

ఆ సమయంలోనే పండిట్ మరోవైపునుంచి రావటం చూశాను. ఓసారి వారిద్దర్ని పక్కపక్కనబెట్టి బేరీజు వేసుకోటానికి అది నాకు చక్కటి అవకాశం.

అతను నాకు రెండడుగుల దూరంలోకి వచ్చాక నన్ను గుర్తుపట్టాడు. బహుశా అతని కంటిదోషం చాలా తీవ్రస్థాయిదై ఉంటుంది. ఎందుకంటే కళ్ళద్దాలున్నా అతను మనుషుల్ని బాగా దగ్గరికొచ్చాకే గుర్తుపడతాడు. అలాగే ఆమెను కూడా గుర్తుపట్టాడు. చేతిలో పేపర్లకట్ట వదులుగా పట్టుకొని ఆమె, అంటే, తన భార్యతో ఏదో మాట్లాడాడు. సరిగ్గా అప్పుడే పండిట్ వయస్సు శరీరదారుఢ్యం లాంటి అంశాలు నా మనోమందిరంలో పరిశీలనకు వచ్చాయి.

పండిట్‌కు ఉజ్జాయింపుగా నలభైసంవత్సరాలకు తక్కువ వుండవు. అంటే ఆ అమ్మాయి వయస్సుకు రెట్టింపు వయస్సున్న వాడు. అంతేకాదు ఏమాత్రం కండలేని అతని పల్చనికాళ్ళు, ముడుతలుపడ్డ ముఖం, పగిలిన కళాదాల వెనుకనున్న అతని కళ్ళు అన్నీకల్పి అతన్ని వయస్సు మళ్ళిన తరానికి ప్రమోట్ చేస్తాయే తప్ప వయస్సున్నవారి లెక్కలోకి రానివ్వవు.

చాలా నెలలు గడిచాయి వర్షాకాలం వచ్చింది. మేఘాలు నీలాకాశాన్ని కప్పివేస్తున్నాయి. కొన్ని మేఘాలు లోయల్లోకి చొచ్చుకొని కూడ వచ్చాయి. మధ్యాహ్నం సాయంత్రంలా అన్పించసాగింది. మధ్య మధ్య చిరుజల్లులు కూడ పడ్తున్నాయి. వర్షాకాల ఆగమనాన్ని ఆహ్వానిస్తూ వాతావరణం చల్లబడింది కూడ. చెట్లు గాలికి తలాడిస్తున్నాయి. ఈ చిరుజల్లులు ఆకలి పెంచసాగాయి

కాని తగ్గించే ప్రయత్నం చేయటంలేదు.

ఆరోజు నేను నాల్గు గంటలకు ముందే తిరిగి వచ్చేశాను. మధ్యాహ్నం ఆ వాతావరణానికి హాయిగా కాళ్ళుజాపి బల్లపై పెట్టి కూర్చుని ఓ కప్పు కాఫీ త్రాగుదామనిపించింది. కాఫీ కెటిల్‌పై పెట్టి కటికీ దగ్గర కూర్చున్నాను. బయట వర్షంలో వడగళ్లు పడ్తున్నాయి. కొన్ని దేవదారు చెట్లను ఢీకొని ఎగిరి పడ్తున్నాయి. డాబాపై అవిపడ్తున్న చప్పుడు సంగీతంలా విన్పిస్తోంది చెవులకు. నీళ్ళుమరగటం ప్రారంభమయింది. నేను లేచి ఓ కప్పు కాఫీ తయారు చేసుకొన్నాను. కాఫీ కప్పును బల్లపై పెట్టి పండిట్ రోజు పేపర్ పెట్టే చోట వెదికాను పేపర్ కోసం. అక్కడ పేపర్‌లేదు. పండిట్‌కు అప్పుడప్పుడు పేపర్లు ఆలస్యంగా తేవడం అలవాటే. కానీ ఇంత ఆలస్యం ఎప్పుడూ చేయలేదు. నేను కాఫీ చప్పరిస్తూ దాస్తోవిస్కీ బ్రదర్స్ కర్మజోల్ అనే పుస్తకం చదవటం మొదలుపెట్టాను. ఇంకా ఆ పుస్తకంలో నేను రెండు వందల పైచిలుకు పేజీలు చదవాల్సి ఉంది.

క్రమంగా చీకటి పడ్తోంది. నేను దీపం వెలిగించాను. నేను రష్యను కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ గారి ఉపన్యాస భాగం చదువుతుండగా హఠాత్తుగా పండిట్ గొంతు విన్పించింది. 'న్యూస్‌పేపర్ సార్' అని. అంతలోనే కిటికీలోంచి న్యూస్‌పేపర్ లోపల పడింది.

"పేపర్ తేవడానికి యిదా సమయం' ఆరిచినంత పనిచేసాను. నేను పండిట్‌ను కిటికీలోంచి బయటికి చూస్తూ. అతను వర్షంకు తడవకుండా తలపై ఏదో కప్పుకొన్నాడు. అతని బట్టలు దాదాపుగా తడిసేపోయాయి. పత్రికలకట్టలో దాదాపుగా యింకా యివ్వవల్సిన పత్రికలు నలభైనుంచి నలభైఐదు దాకా ఉండి ఉంటాయి.

'ఈరోజు పేపర్లు సమయానికి అందివ్వలేకపోయాను సార్' అన్నాడు పండిట్ క్షమాపణ స్వరంతో. 'ఈరోజు యింత వరకూ నాల్గు పేపర్లను మించి యివ్వలేదు. మీది ఐదోది' అని కూడ చెప్పాడు చిన్నస్వరంతో.

'ఎం ఎందుకని?' అడిగాను నేను.

"ఈరోజు ఉదయమంతా పోలీస్‌స్టేషన్లో గడపాల్సి వచ్చింది సార్".

"ఎందుకు పోలీస్ స్టేషన్‌కు వెళ్ళవల్సి వచ్చింది?" అడిగాను నేను ఆసక్తిగా.

అతనేదో ఆలోచిస్తున్నట్లుండిపోయాడు. అతని వళ్ళు చలికి గడగడ వణుకుతున్నాయి. అతన్ని లోపలికి రమ్మని ఆహ్వానించాను నేను. 'నాతోపాటు కాఫీ తాగుతావా?' అని అడిగాను. అతను లోపలికి వచ్చాడు. నేను మళ్ళీ కాఫీ కాచేందుకు కెటిల్ స్టౌవ్‌పై పెట్టాను. దాస్తోవిస్కీ పుస్తకంలో రష్యన్ ప్రాసిక్యూటర్ వాదన చదవాలని ఎంతో ఆసక్తిగా ఉంది. అదే సమయంలో పండిట్ చెప్పేది వినాలని కూడ అన్పించింది.

పుస్తకంలో నేను వదిలేసిన చోటునుంచి చదవటం ప్రారంభిస్తూ అడిగాను. "ఇంతకూ పోలీస్ స్టేషన్ కెందుకెళ్ళాల్సి వచ్చింది చెప్పవేమిటి?" అని.

పండిట్ ఏదో గొణిగాడు. నాకు అది అర్థంకాకపోవటంతో పుస్తకంపై నుంచి దృష్టి మరల్చి అతనివైపు చూశాను.

"దానివల్ల ఈరోజు నేను పోలీస్‌వాళ్ళ బూట్లు నాకాల్సిన పరిస్థితి వచ్చింది అన్నాడు. పండిట్ చెప్పిన విషయమే మళ్ళీ చెప్తున్నట్లుగా.

'ఏమైంది?' అడిగాను నేను.

"ఎలా చెప్పను సార్? నా దురదృష్టం నన్నిలా శాసిస్తుందని భావించలేదు. కాని ఇలా నిర్ణయించింది ఏం చేయను. నిజానికి యిలాంటి విషయాలు నోటితో మనిషి ఉచ్చరించటమే భగవంతుడు క్షమించడు. అందునా స్వయానా భార్య గురించి యిలా మాట్లాడటం మరీ దారుణమనిపిస్తుంది. ఏమయ్యిందో దానికి తెలిదు. నిన్న రాత్రి యింట్లోంచి వెళ్ళిపోయింది" అన్నాడు పండిట్ వివణ్ణవదనంతో.

"పారిపోయిందా" అని అడిగాను ఆశ్చర్యంగా. నిజానికి పండిట్ పట్ల ఆమె పారిపోయినందువల్ల నాకేటువంటి సానుభూతి కల్గలేదు. పండిట్ ముఖం వంక ఓసారి చూసినే మళ్ళీ అడిగాను. "ఆవిడ యిక్కడే ఉందా? లేక మరెక్కడికైనా సిమ్లా వదిలేసి వెళ్ళిపోయిందా?" అని.

"ఆవిడ యెక్కడికెళ్ళిందో తెలిస్తే పోలీస్ కంప్లైంటు ఎందుకిస్తాను? ఆవిడిక్కడుంటే జుట్టుపట్టుకొచ్చి ఈడ్చి యింట్లో పడేయనూ" అన్నాడు పండిట్ అదేదో తనొక్కడికే చేతనైనట్లుగా.

అతని ముఖంలోకి చూశానోసారి. అతనికి ఆమెపైనున్న కక్ష స్పష్టంగా తెలుస్తోంది అతని వదనంలో. అతనికి ఆమె వెళ్ళిపోవటం వలన ఎంత కక్ష ఏర్పడిందంటే ఈ ప్రపంచం మొత్తంపై ఏదో పగతీర్చుకోవాలన్నంత స్థాయిలో ఉంది.

"ఎంతకాలం క్రితం ఆమెను పెళ్ళి చేసుకొన్నావు పండిట్?" అని అడిగాను నేను.

"ఎనిమిది లేక పదిసంవత్సరాల క్రితం" అన్నాడు పండిట్.

'అప్పుడు నీ వయస్సెంత? అని అడిగాను నేను.

ఆ ప్రశ్నకు అతని ముఖంలో రంగులు మారాయి. ఆ ప్రశ్నను దాటేస్తూ సమాధానం చెప్పచూశాడు అతను. 'వయస్సు కదా మీరడుగుతున్నది. మీకు తెలుస్సకదా. ప్రతి ఒక్కరు ఏ వయస్సులో పెళ్ళి చేసుకొంటారో? ఆ వయస్సు కన్నా బహుశా నేను కొంత పెద్దవాడ్ని కావచ్చు. నిజానికి చూడ్డానికి నేనిలా కన్పడుతున్నానేగాని, కన్పడుతున్నంత వయసులేదు నాకు. ఎందుకో నేనిలా కన్పిస్తున్నాను. నిజానికి నేను చాలా బలిష్టంగానే ఉన్నాను". ఓ క్షణం ఆగి మళ్ళీ చెప్పాడు పండిట్ "ఎవరైనా నాట్లు, పైసలు చేకూరాకే పెళ్ళి చేసుకొంటారు. పైగా మాలో ఆడపిల్లని డబ్బిచ్చి కొనుక్కోవటం ఉంది. నేను దాదాపు నూటయాభై రూపాయలిచ్చి ఈమెను కొనుక్కొన్నాను" అన్నాడు. పండిట్ మనుష్యుల్ని కొనుక్కోవటం ఏమాత్రం సంస్కారం కాదన్నట్లుగా ముఖంపెట్టి.

"ఏమిటి నువ్వు నూటయాభై యిచ్చి ఈమెను కొనుక్కున్నావా?" అని అడిగాను నేను దిమ్మెరపోతూ.

నా ప్రశ్న సరిగ్గా అర్థంకాలేదేమో పండిట్‌కు. "అసలు నేను దీని అక్కయ్యనే చేసుకొందామనుకొని వందరూపాయ లిచ్చాను. కాని అక్కకన్నా ఇదే బాగుంది. అందంగా ఉంది. చిన్నదిగా ఉంది. అందువల్ల దీన్ని చేసుకొన్నాను. ఎవరికి తెల్సు- ఇదిలా మోసం చేస్తుందని" అన్నాడతను. కాఫీ నీళ్ళు కాగాయి. రెండు కప్పులు కాఫీ కాచి ఓ కప్పు పండిట్‌కిచ్చాను. నేను ఒక కప్పు తీసుకొన్నాను. నేవేసిన చక్కెర చాల్లేదంటూ పండిట్ మరికాస్త చక్కెర కల్పుకొని చెప్పాడు నాతో... "ఆమె తండ్రి కూడా చాలా కోపంతో ఉన్నాడు" అని.

"అరె... ఆమె తండ్రి కీవిషయం అప్పుడే తెల్సిందా?" అని అడిగాను నేను.

"అవును నేను చెప్పాను. 'నీ మద్దత్తుతోనే నా భార్య యింట్లోంచి వెళ్ళి పోయింది. అందువలన నీమీద కోర్టులో రెండువందల యాభై రూపాయలకు కేసువేస్తాను. వంద నేను ఆమెపై పెట్టిన ఖర్చు ఇన్నాళ్ళ సంసారంలో అని కూడ చెప్పాను" అని అన్నాడు పండిట్.

"అందుకు ఆయనేమి అన్నాడు?"

"ఆయనేమంటాడు. అసలే బీదవాడు. నన్ను శాంతించమని ప్రాధేయ పడ్డాడు. నాకూ ఆయన్ను బాధపెట్టే ఉదేశంలేదు. అందుచేత తన చిన్నకూతుర్ని నా భార్య తిరిగొచ్చే వరకు ఉండటానికి అంగీకారమైతే నేను కోర్టుకెళ్ళను అని చెప్పాను. నాకంటూ అన్నం వండి పెట్టడానికి ఎవరో ఒకరు ఉండాలికదా"

"ఆయన ఒప్పుకొన్నాడా?"

"ఇంతవరకూ ఒప్పుకున్నట్లు చెప్పలేదు. కాని ఇరుగూ పొరుగూ పెద్ద మనుషులు సలహా యివ్వకపోతారా? ఆయన పంపకపోతాడా? అంటూ పండిట్ కాఫీ కప్పు కిందపెట్టి మళ్ళీ కొనసాగించాడు – "మా మామగారు నిజాయితీ పరుడు. నల్గురు చెప్పింది వినేరకం. అందువల్ల ఆయనకు మంచీ, నాకూ లాభం' కోర్టుకెళ్ళడంవల్ల ప్రయోజనం ఎవరికి?" అంటూ లేచి "చూద్దాం... ఏం జరుగుతుందో?" అంటూ పేపర్లకట్ట చంకపుచ్చుకున్నాడు.

కొన్ని రోజుల తర్వాత పండిట్ భార్యకి బదులు అతని మరదలు గడ్డి కోయటానికి రావటం మొదలుపెట్టింది. ఈ అమ్మాయి కూడా చాలా చిన్న పిల్లయినా పండిట్ భార్య అంత అందగత్తెగాదు. ఈ అమ్మాయి కూడా పండిట్ భార్య వేసుకొనే సల్వార్, కుర్తా వేసుకుని పాటలు పాడ్తూ గడ్డికోసేది. కానీ ఆమె కళ్లలో పండిట్ భార్యకున్న మెరుపు కూడాలేదు. ప్రపంచం పట్ల పండిట్ భార్యకున్న తేలిక వైఖరి కూడా ఈమెలో, ఈమె కళ్లలో లేదు.

కాలం గడిచేకొద్ది పండిట్ భార్య లేచిపోయిందన్న సంగతి మరుగున పడిపోసాగింది. ఓ సంవత్సరం కూడా గిర్రున తిరిగిపోయింది. అది ఆదివారం. నేను కిటికీ పక్కన కూర్చుని ఏదో చదవటానికి ఉద్యుక్తుడనవుతున్నాను. అవతల

ఓ చెట్టు నరుకుతున్న శబ్దం విన్పించసాగింది. బహూశా గుల్హరిసాహెబ్ తన నౌకరు గులాబ్‌సింగ్‌ను ఓ చిన్న ఎప్రికాట్ చెట్టు కొట్టి వంటచెరకుగా వాడమన్నాడేమో. చెట్టు నరుకుతున్నాడు గులాబ్‌సింగ్. గొడ్డలి శబ్దం నాచెవుల్లో ప్రతిధ్వనించ సాగింది.

పావురాలు దేవదారు చెట్లపైనుంచి ఎగుర్తున్నాయి. కాసేపు కిందికి వెళ్తున్నాయి. కాసేపు పైకి ఎగుర్తున్నాయి. ఇంతలో హఠాత్తుగా చెట్టు విరిగింది. దానితోపాటే ఓ ఆడ కంఠం విన్పించింది నాకు.

"గులాబ్‌సింగ్. ఈ చెట్టు పచ్చనికొమ్మల భాగాలు నాకివ్వు"

ఆ కంఠం వెంటనే గుర్తుపట్టాడు అది పండిట్ భార్య కంఠం. వెంటనే నేను కిటికీలోంచి చూశాను. పడిపోయిన చెట్టుపక్కన అక్కా చెల్లెలు నిల్చుని కనపడ్డారు.

"ఈ కొమ్మలతో మీరేం చేస్తారు?" అడుగుతున్నాడు గులాబ్‌సింగ్.

"కొమ్మల్ని కాల్చేస్తాం, ఆకుల్ని ఆవుకు పెడతాం.

"మీ మున్నాకి బాగలేదని విన్నాను. ఎలా వుంది?" అడిగాడు మళ్లీ గులాబ్‌సింగ్.

"అదిప్పుడు బాగానే ఉంది".

ఇంతలో గుల్హరి సాహెబ్ బైటికొచ్చాడు. ఏ మున్నా!" అడిగాడాయన వాళ్ళిద్దర్నీ.

అదే ప్రశ్న నా మనస్సును తొలిచింది. ఆ క్షణంలో పండిట్ భార్యకు పిల్లపుట్టడం ఏదో అసంబంధమైన విషయంగా అన్పించింది నాకు.

"మున్నా వాళ్ల ఆవుపేరు' చెప్పాడు గులాబ్‌సింగ్ గుల్హరిసాబ్‌తో.

'అలాగా' అని గుల్హరిసాహిబ్ నవ్వి "పోన్లే వాళ్లను కొమ్మల్ని తీసుకోని" అంటూ ఓసారి పండిట్ భార్యవైపు మదమెక్కిన చూపును విసిరి లోపలికి వెళ్లిపోయాడు.

పండిట్ భార్య ఆమె చెల్లెలు చెట్టుకొమ్మలు తుంచసాగారు. గులాబ్‌సింగ్ చెట్టు ముదురు కొమ్మలు కత్తిరించసాగాడు. కాసేపాగి గులాబ్‌సింగ్ "అదిగో పండిట్ వస్తున్నాడు" అని చెప్పాడు వాళ్లిద్దరితో.

పండిట్ న్యూస్‌పేపర్ల కట్ట మోసుకొంటూ ఇటువైపే రాసాగాడు. వస్తూనే పండిట్ చూపులోసారి సారించి తన భార్య, ఆమె చెల్లెలు చేస్తున్న పని గమనించి మా యింటివైపు వచ్చాడు పేపరు యివ్వడానికి. నేను చేయిజాపి పేపర్ అందు కొన్నాను. ఓక్షణం మౌనంగా ఉండి పండిట్ చెప్పాడు నాతో. "నా భార్య తిరిగొచ్చింది" అని.

"నిజంగానా?" అని అడిగాను నేను అంతగా పట్టించుకోవాల్సిన విషయం కానట్లు దినపత్రిక హెడ్‌లైన్స్ చదువుతూ.

పండిట్ మరోసారి తన భార్య ఆమె చెల్లెలువంక చూసి చెప్పాడు చాలా మెల్లగా "ఈరోజు నన్ను పోలీసులు పోలీస్టేషన్‌కు పిలిపించారు. నా భార్య మండీలో దొరికిందట. నన్ను ఆవిణ్ణి గుర్తుపట్టడానికి పిలిపించారట. నిజానికి నేను ఆశలన్నీ వదులుకున్నాక దొరికింది. కానీ ఈ విషయంలో పోలీసులకు పూర్తి మార్కులివ్వాలి. వాళ్లు ఆలస్యం చేస్తారేగాని విషయాన్ని వదిలేయరు పూర్తిగా".

అతని మాటలు వింటూ ఓసారి ఆమెవైపు చూశాను.

ఆవిడ ద్వేషం, అసహ్యం నిండిన కళ్లతో ఓసారి చూసి తిరిగి కొమ్మలు కోయటంలో నిమగ్నమైపోయింది.

పండిట్ మళ్లీ చెప్పసాగాడు. "నిన్న ఆమెను ఆమె తండ్రి బాగా కొట్టాడు. కానీ అది మొండిది. ఒక్క సమాధానం కూడా చెప్పకుండా తన్నులన్నీ భరిం చింది. ఆయన చాలా కోపంతో ఉన్నాడు. నేను కనుక జోక్యం చేసుకోక పోయినట్లయితే ఆవిడ తోలు వలిచేసేవాడే. ఆయనతోనే చెప్పాను – ఇక ఆమెను కొట్టడంలో అర్థంలేదని. అయిందేదో అయింది. ఆవిణ్ణి ఆవిడే అవమా నించుకొంది అలాచేసి. ఇకమీదట నేను ఆవిణ్ణి ఓ కంటితో కనిపెట్టుంచుతాను అని".

పండిట్ భార్య, ఆమె చెల్లెలు ఇద్దరూ కొమ్మల్ని కట్టలుకట్టి భుజాలపై వేసుకొని రోడ్డు వైపు వెళ్లసాగారు. నేను ఓ క్షణం పండిట్ వైపు చూశాను. "ఇప్పుడు నీ భార్య చెల్లెలు తిరిగి వెళ్లిపోతుందా?" అడిగాను నేను పండిట్‌ను ఆసక్తిగా.

"ఆమె ఎక్కడికి పోతుంది? పాపం మా మామగారు చాలా బీదవాడని చెప్పాగదా. ఏం పెట్టి ఆయన ఈమెను పోషిస్తాడు. ఆమె ఖరీదు వంద రూపాయలు. ఆయనకి అవే కావాలి. అది నేను ఆయనకెటూ ఇస్తాను. ఆవిడ ఈ యింట్లో చాలాకాలం నుంచి ఉంటోంది. ఇప్పుడామెను వదలటం నాకే యిష్టంలేదు. ఏమో! ఎవరికి తెల్సు నా మొదటి భార్య మళ్లీ పారిపోదని? అలాంటి బజారుదాన్ని నమ్మేవాళ్లెవరుంటారు" అన్నాడు పండిట్.

పండిట్ భార్య అతని చెల్లెలు బంగ్లాదాటి పోయారు. రోడెక్కారు. గులాబ్ సింగ్ ఆంకా చెట్లకొమ్మలు నరుకుతూనే ఉన్నాడు. గుల్వారీసాహిబ్ మళ్లీ బయటికొచ్చి గులాబ్సింగ్కు ఏవో సూచనలు ఇస్తున్నాడు.

ఇక ఆ విషయం అంతటితో ముగిద్దామని పండిట్తో అన్నాను. "దయచేసి పేపర్ త్వరగా తెస్తూండు. రోజూ ఆలస్యంగా తెస్తున్నావు. ఈరోజు కూడా యిప్పుడు రెండుగంటలయింది" అని.

"రేపట్నించి త్వరగా తెస్తాను" అంటూ పేపర్లు తీసుకొని బయటకి వెళ్లాడు. కాసేపట్లోనే ఇదే విషయం గుల్వారీసాహిబ్తో అతను మాట్లాడ్తుండటం నాకు అతనుండే గదినుంచి విన్పించింది.

పండిట్ ఈరోజు కూడా పేపర్ ఆలస్యంగానే తెస్తాడు. అతని జీవనసరళిలో ఏమాత్రం మార్పులేదు. అదే పాత డ్రస్సు, అదే వేషం, అతని చొక్కాపైన గుండీల్లేక ఎండిపోయిన గుండె ఎముకలు అలాగే కన్పిస్తుంటాయి. కాలిమీద ఆధారపడ్తూ ఊగుతూ నడుస్తాడు. అప్పుడప్పుడు పేపర్లకట్ట కిందపడేసి దాని మీద కూర్చుంటాడు. పొగతాగుతూ రిక్షావాళ్ళతో గడుపుతుంటాడు. ఒక్కోసారి చెట్లనీడలో పడుకొని తలకింద న్యూస్పేపర్ల బండిల్పెట్టుకొంటాడు. ఒక్కొక్క ప్పుడు న్యూస్ పేపర్లను రాయికింద పెట్టి కొమ్మలు, ఎండుపుల్లలు, మొగ్గలు ఏరుతుంటాడు.

పండిట్ భార్య రోజూ గడ్డికోయటానికి వస్తూనే ఉంటుంది. కాని ఆమె శరీరంలో ఇదివరకటి లాలిత్యం, మృదుత్వంలేవు. ఇదివరకన్నా బండబారింది. మొద్దెక్కింది ఆమె శరీరం. అయినా అప్పుడప్పుడు ఆమెలో ఎక్కడో లీలగా అందం గోచరిస్తూనే ఉంటుంది. కాని ఆమె కళ్లు ఇప్పుడు ఎర్రగా సూర్యగోళాలా

మందుతుంటాయి. ఏ కారణం లేకుండా ఆమె రోడ్డుపై రాళ్లను కాలితో తంతుంటుంది.

ప్రజలిప్పటికి పండిట్‌కు శుభాకాంక్షలు చెప్తూనే ఉంటారు. పారిపోయిన భార్య తిరిగి వచ్చినందుకు.

అందుకు కృతజ్ఞతగా పండిట్ ప్రజలకు నమస్కరిస్తూ – "అదంతా మీ ఆశీస్సులవలన సార్. నేను కష్టపడి సంపాదించిన డబ్బుతో ఆమెను కొనుక్కున్నాను. భగవంతుడు న్యాయమూర్తి కాబట్టి ఆవిడ తిరిగొచ్చింది. కాకపోతే ఆవిడ తిరిగొచ్చే ఆశ ఎక్కడుందీ?" అంటూంటాడు. తనకు భగవంతుడిపట్లున్న అపారమైన విశ్వాసాన్ని తన ముఖంలోంచి ప్రస్ఫుటంగా అవతలివారికి కన్పించేలా వ్యక్తం చేస్తూ.

(విపుల, మార్చి 1990)

❖

తొలిరేయి

(తమిళ కథ)

పి.ఏ. జయ ప్రకాశం

❋

చెరువుకట్టపై ఆడుకొంటున్న ఆడ, మగ పిల్లల్లో ఒక్కసారిగా కలకలం బయల్దేరింది.

"అరె! కొత్త పెళ్ళికొడుకు, పెళ్ళికూతురు ఇటువైపుగా వస్తున్నారర్రా! చూడండి" అంటూ అరిచారు వారిలో కొంతమంది ఆడపిల్లలు.

ఆ చెరువకట్టపైనున్న చింతచెట్టు నుంచి లేత చింతకాయగుత్తులు కోయటంలో నిమగ్నమై ఉన్న పిల్లలంతా తలెత్తి చూశారు.

చెరువులోని అలలపై నుంచి వచ్చే చల్లని గాలికి పరవశిస్తున్న దానిలా ఉంది ఆ చింత చెట్టు.

చింతకాయలు కోయడానికి లంగాలు బొడ్లో దోపి, కొక్కెంతో చింత గుత్తులను కొట్టే సాహసం చేస్తున్న ఆడపిల్లలే మిగతా వారికంటే ముందు ఆ పెళ్ళికొడుకునూ, కూతురిని చూసింది కూడా. వారి కేకలు విని కట్టకింద ఎద్దుబళ్ళు పోయే దారి పక్కన మర్రిచెట్టు నీడన ఆడుకొంటున్న మగపిల్లలు కూడ పోలోమంటూ చెరువుకట్టను ఎక్కేశారు.

మొత్తం మీద ఇప్పుడా పిల్లల దృష్టంతా దూరాన గ్రామంవైపు వస్తున్న కొత్తజంటపై పడింది. వాళ్ళ సంబరానికి అవధుల్లేవు.

"కొత్త పెళ్ళికొడుకూ... కూ... కూ..! కొత్త పెళ్ళికూతురూ... రూ... రూ..! అంటూ అంతా జపం చేయనారంభించారు ఆ సంబరంలో.

దూరాన వస్తున్న ఆ కొత్త దంపతులెవరో స్పష్టంగా తెలియరావడంలేదు. వారిని గుర్తు పట్టటం కష్టంగా ఉంది. కొద్దిసేపట్లో ఆ కొత్త జంట మాదస్వామి గుడి పక్కనున్న కాలువ పడమర వైపుకు చేరారు.

ఇది ఆ పిల్లలందరికీ విడ్డూరంగా ఉంది. ఎందుకంటే ఏ బాజాభజంత్రీ లేకుండా, హడావుడి, సందడీ లేకుండా, కనీసం పక్కన ఎవ్వరూ రాకుండా ఒక కొత్తజంట ఆ ఊరికి రావటం ఇదే ప్రథమం.

నిజానికి ఆనాటి ఉదయమే ఆ ఊరి గ్రామ పెద్ద కూతుర్లిద్దరికీ వివాహం జరిగింది. వారి పెళ్ళిళ్లు వేరేవేరే ఊర్లలో జరిగినా ఆ ఊరికి మాత్రం ఎంతో హల్లాగుల్లాతో ఆ కొత్త జంటలను తోడ్కొని రావటం వారంతా ఎరిగిన వారే. అది చూసిన ఆ పిల్లలు ఎంత ముచ్చట పడిపోయారో! చెప్పలేం!

బండిలాగే ఎద్దుల మెడల్లో గంటలు లయబద్ధంగా ఆడుతుంటే, తదను గుణంగా పరిగెడుతూ మిలమిల మెరిసే కళ్ళతో ఎద్దులు బళ్ళను ఆ ఊరికి చేర్చటం ఆ పిల్లలనెంతో ఆకర్షించింది. ఆ బళ్ళు చక్కని కొయ్యతో వేసినవి. చక్కగా ఊగటానికి ఆ బళ్ళకు స్ప్రింగ్‌లను అమర్చారు. వరుసగా అలాంటి బళ్ళు ఊరివైపు దారితీస్తుంటే పిల్లలంతా ఆశ్చర్యంగా కళ్ళు అప్పగించి చూస్తుండి పోయారు. భయంభయంగా ఆ బళ్ళ చువ్వలు తాకి, ఏదో పామును తాకిన సాహసం కలిగించే అనుభూతిని పొందారు.

గ్రామంలోకి ప్రవేశిస్తున్నప్పుడే ఊరిలోని ఆడవాళ్ళంతా ఆ కొత్త జంట లను నిలవేసి, సంతోషంగా ఎన్నో పాటలు పాడతారు. అంతే గాక, కొత్తజంటలు ఊరి ముంగిట్లో ఉన్న దేవుడి గుళ్ళో పది కొబ్బరికాయలు కొట్టి, తమలపాకులు, వక్కలను ఆఊరి కుర్రకారుకు పంచుతారు కూడా. అందుకు అనుగుణంగా ఊరివారు కూడా కొబ్బరికాయలు కొట్టి ఆకూ, వక్క అందరికీ పంచుతారు. ఆ సమయంలో ఆ ప్రాంతమంతా తెల్లని కొబ్బముక్కల మయమవుతుంది. వాటికి కొంచెం దుమ్ము తగిలినా ఫర్వాలేదనుకొని, కొంతమంది పిల్లలు వాటిని తమ సంచుల్లో వేసేసుకొంటారు.

అయితే, మొదటిసారిగా ఒక కొత్త జంట ఒంటరిగా రావటాన్ని చూసిన, పిల్లలు, ఆనాటి పొద్దున జరిగిన వేడుకనంతా గుర్తుచేసుకొని ఆశ్చర్య పోతున్నారు.

ఆ వస్తున్న పెళ్ళికూతురి చేతిలో ఒక చిన్నచాప ఉంది. బహుశ దానిపై ఆ నవవధువు కూర్చుని ఉండి ఉంటుంది. ప్రతి వధువుతో విధిగా రాజసం పలకబోస్తూ నడిచే వధువు తల్లి ఈమె వెంటరాలేదు. అలాగే తన కోడలిని అందరికీ చూపిస్తున్నట్లు దర్పంగా చూపులు, హావభావాలు ప్రదర్శించే వరుడి తల్లి అతని పక్కనలేదు. ఆ పిల్లలకి ఇదేదో చాలా వింతగా ఉంది. కనీసం స్ప్రింగ్‌లేని బళ్ళలోనైనా వధూవరులు రావటం వారు చాలాసార్లు చూశారు. కాని, ఇలా పాదచారులై కొత్తజంట రావటం ఇదేమొదటిసారి. పైగా వధువు చేతిలో మారుకట్టుకోవడం కోసం మరో కొత్తచీర కూడ లేదు. నుదుట పాపిడి మొదట ఒక చిన్న స్వేదబిందువు సూర్యుడి వెలుగువడి ముత్యంలా మెరుస్తోంది. దాని ప్రక్కనే పెళ్ళయిన సందర్భాన గుడిపూజారి పెట్టిన బొట్టు చుక్క ఉంది. అది చెమటతో చెదిరి రూపం కోల్పోయిన దేవాలయ గోపురంలా మారింది. వరుడి నెత్తిమీద జుట్టుకు తైలసంస్కారం కూడ లేదు. అయినా ఒత్తుగా దువ్వి ఉంది. అతని నడుము చుట్టూ ఒక పసుపుపచ్చ గుడ్డ కట్టి ఉంది. ఆ మిట్ట మధ్యాహ్నపు సూర్యుడి వెలుగులో అతని బలిష్ఠమైన దేహం రాయిలా నిగనిగ మెరుస్తోంది.

చింతచెట్టు కింద తుండుగుడ్డలను పరుచుకు కూర్చుని ఉన్న ఆ ఊరి పెద్దలు ఈ గొడవకు తిన్నగా లేచారు. తుండులను విదిలించి, భుజాలపై వేసుకొని కొత్తజంటవైపు వెళ్ళారు.

"అరే! మన మననంగాడి కొడుకు మార్తాండం పెళ్ళి చేసుకొచ్చాడయ్యా" అన్నారు వారిలో ఒకరు పెళ్ళికొడుకును గుర్తుబట్టి.

"ఎవరు? మార్తాండమా?" అన్నారెవరో.

"ఆ జంటని ఆపండి. కదలనీయకండి" అంటూ చెట్టుకిందనుంచి ముసలి రాధారెడ్డి అరిచాడు.

పిల్లలంతా ఒక్కసారిగా ''పెళ్ళికొడుకు, పెళ్ళికూతురు..!'' అని

లయబద్ధంగా అరుస్తూ వారి చుట్టూ ప్రదక్షిణ చేయసాగారు.

❖ ❖ ❖

అక్కడే వేరేచోట పులి–జింక ఆటలాడుతున్న మరికొంతమంది యువకులు కూడ అక్కడికి చేరారు. ఆ ఆటను చూస్తున్న వారికంటే చిన్న పిల్లలు కూడా ఆటమధ్యలో ఆగిపోయేసరికి కొత్తజంట నిలబడిన చోటికి వచ్చేశారు. అంతా కలిసి జంటను ఉద్దేశించి –

"పెళ్ళికొడుక్కు ఇవ్వాల్సిన వక్క. ఆకు ఇవ్వకపోతే కదలనివ్వం" అని పట్టుబట్టటం మొదలు పెట్టారు.

"అరే! పెళ్ళికొడుకును గట్టిగా పట్టుకోండి. లేకపోతే వాడు తప్పించుకు పోతాడు. జాగ్రత్త!" అరిచాడు సంగయ్యరెడ్డియార్.

ఆకు, వక్క కోసం వారి నోళ్ళలో నీరు ఊరసాగింది. నిజానికి అలాంటి సందర్భాలలో వారికి కావలసినంత వక్క, ఆకు లభిస్తుంటుంది. పైగా ఆ ప్రాంతం ఆకులు చాలా రుచిగా కూడా ఉంటాయి.

మార్తాండం సిగ్గుతో కుంచించుకోపోయాడు తప్ప పెదవి విప్పలేదు. పైగా ఆ సిగ్గుతో మిళితమైన కొంత భయంకూడ ఉండింది. నిజానికి సిగ్గుకన్నా మార్తాండానికి భయమే ఎక్కువ. ఆ కుర్రకారును పక్కకు తీసుకెళ్ళి, "ఈ హడావుడంతా దేనికి? అనవసరమైన ఈ తతంగానికి ప్రాధాన్యం ఎందుకు!" అని అడిగాడు మార్తాండం.

"ఆ పప్పులేం ఉడకవు! మాకు ఇవ్వవలసిన ఆకు, వక్క ఇవ్వకపోతే వదిలేది లేదు" తెగేసి చెప్పారు ఊరివారు.

మార్తాండాన్ని అడిగేవారంతా అతని స్నేహితులే. వారంతా మార్తాండంతో కలిసి పనిచేస్తుంటారు. ఎరువుల బళ్ళు తోలటం, అడి నెలలో రోడ్డు సరిచేయటం, ఇళ్ళు కట్టడంలాంటివి వారంతా కలిసి చేస్తుంటారు. వారిలో ఇతరుల పెళ్ళిళ్ళప్పుడు మార్తాండం వారి దగ్గరనుంచి ఆకు, వక్క వసూలు చేసిన సందర్భాలు వారికి గుర్తుకురాకపోలేదు.

మార్తాండానికి ఏమీ పాలుపోలేదు.

"చూడు! ఈ గ్రామానికి ఒక సంప్రదాయం ఉంది. దాన్ని ఈనాడు

బద్దలు కొట్టేందుకు సాహసించకు" అని చెప్పారు మార్తాండ మిత్రుల్లో కొందరు.

"ఊ! త్వరగా ఇవ్వు, డబ్బులు తీయి వెంటనే వక్కా, ఆకు కొనుక్కోవడానికి మా ప్రయత్నం మేం చేసుకోవాలిగా!"

ఇలా కుర్రకారు గొడవ చేస్తుండగా కొంతమంది పిల్లలు మరో నినాదం లేవదీశారు.

"మాకు కొబ్బరిచెక్కలు కావాలి. త్వరగా కొబ్బరికాయలు కొట్టండి గుళ్ళో" అని వారు అరవటం మొదలుపెట్టారు.

పిల్లలను అదుపుచేయడానికి కుర్రకారు ప్రయత్నించేసరికి "అదేమిటి. మొట్టమొదట వాళ్ళిద్దరూ గ్రామానికి వస్తున్నట్టు చూచింది మేము. మాకు కొబ్బరికాయలు లేకపోతే ఎలా?" అన్నారు వాళ్ళు.

"అసలు కొబ్బరికాయలు కొట్టకుండా వారు ముందుకు ఎలా వెళ్తారో చూస్తాం కదా అన్నారు మరికొంతమంది పిల్లలు.

ఇంతలో ఆ ఊరి పెద్దవాళ్ళు మళ్ళీ పిల్లలను కేకవేయబోయారు.

"అదేంటి! మీరు మాత్రం వక్క, ఆకు తీసుకోవచ్చుగానీ, మాకుమాత్రం కొబ్బరిచెక్కలు లేవా!" అని అడిగారు పిల్లలు ఉక్రోషంగా.

ఇంతలో మార్తాండం కలుగజేసుకొని అయ్యో! నా దగ్గర డబ్బూ దస్కం అసలు లేవు. ఇక ఈ హడావుడి అంతా ఎవరికోసం! అసలు ఈ సంప్రదాయలు అన్నీ దేనికి" అని అన్నాడు.

అతని మాటలు విని అక్కడి వారెవ్వరు ఆశ్చర్య పడలేదు. అప్పుడే పెళ్ళి చేసుకొన్న నవ వరుడు దగ్గర డబ్బులెలా ఉండవు? పైసలు లేకుండా పెళ్ళాంతో కాపురం పెట్టే ధైర్యం అసలు ఎవరికి ఉంటుంది. ఇవే వారి ప్రశ్నలు.

"లేదు.. నేను అబద్ధం చెప్పటంలేదు, నా దగ్గర రెండు రూపాయలు మాత్రమే ఉన్నాయి" అంటూ తన నడుముచుట్టూ ఉన్న గుడ్డమెలికలో నుంచి నలిగిన రెండురూపాయల నోటు తీసి వారికిచ్చాడు. అతని ముఖంలో అప్పటి వరకూ వెలిగిన పెళ్ళికల ఒక్కసారి వెలవెలబోయింది. పెళ్ళికూతురు ఇదంతా అయోమయంగా చూస్తోంది.

ఆ రోజు సాయంత్రం ఆ ఊరి కుర్రకారంతా వేపచెట్టు కిందకి చేరారు.

అందరూ వరుసల్లో నిల్చొని ఉన్నారు. వారి చేతుల్లోని ఆకుపచ్చ ఉత్తరీయాలు మిలమిలా మెరుస్తూ గాలికి ఊగసాగాయి. ధోవతి గోచీపోసి కట్టి, 'ఓయిలాట్టం' ఆట ఆడసాగారు. గదిలో మూడువరుసల పడవలు పోటీ ప్రయాణం చేసే లాంటి ఆటే ఆ ఆట. వాళ్ళ కాళ్ళకు కట్టుకున్న "గిజ్జాయి గజ్జెలు మోగుతున్నాయో లేదో ఒకసారి పరిశీలించారు. ఇంకా ఆ ఊరిలోని ఇతర కుర్రకారునంతా పిలవడానికి ఒకతను బయల్దేరాడు.

కొత్తగా పెళ్ళయిన కూతుళ్ళు అల్లుళ్ళతో ఆ ఊరి పెద్ద ఇతర పెద్దలతో చెట్టుకింద కుర్చీల్లో ఆసీనులయ్యారు. ఈ వేడుకను చూడటానికి కొత్తజంటల ముఖంపై సిగ్గు తాండవిస్తోంది. పెట్రోమాక్స్ దీపాల వెలుగు వాళ్ళ అందాన్ని ద్విగుణీకృతం చేస్తోంది. పెట్రోమాక్స్ వెలుగులని భరించలేనట్లుగా వాళ్ళు తలలను కిందికి దించేశారు.

వారి ముందు 'ఓయిలాట్టం' ప్రారంభమైంది. ఈ ఆట ఆడినవారికి కాఫీ, చల్లని పానీయం ఉచితంగా లభిస్తాయి.

ఈ ఆటకోసం మార్తాండాన్ని పిలుచుకు వెళ్ళడానికి ఒకరు మార్తాండం ఇంటికి కూడా వచ్చారు.

"ఓ కొత్తపెళ్ళికూతురా... అక్కడ ఓయిలాట్టం జరుగుతోంది. నిద్దరబోకు" అన్నాడతను.

వెదురు తలుపు తెరుచుకొని, గజ్జె చేత బుచ్చుకొని మార్తాండం ఇంటి బయటికి వచ్చాడు. అక్కడే కూర్చుని కాలిగజ్జెలు కట్టటం మొదలు పెట్టాడు.

మార్తాండం భార్య బయటికి వచ్చింది. ఆమె ముఖం వెలావెలాబోయి ఉంది.

"మీరు ఆ ఆటకు వెళ్ళొద్దు" అంది ఆమె. అతను వెనుదిరిగి "ఏం.. దేనికని?" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఇప్పుడు వెళ్ళే సమయం కాదు. ఇవాళ మన తొలి..." అతనికే వినబడేంత నెమ్మదిగా చెప్పినా సిగ్గుతో ఆమె బుగ్గలు కందిపోయాయి.

"ఈ గ్రామపెద్ద ఇంట్లో పెళ్ళిళ్ళు జరిగాయి. అందరూ అక్కడికి వెళ్ళి ఆటలు ఆడతారు. మనం వెళ్ళకపోతే గ్రామ ఐకమత్యం దెబ్బతింటుంది".

ఆమె ఆశ్చర్యపోయే సమాధానం చెప్పాడు మార్తాండం.

"భలే.. మనింట్లో కూడా పెళ్ళి జరిగింది. కదా!" అంది ఆమె. అప్పటికే ఆమె కంటినుంచి రెండు కన్నీటి చుక్కలు చెంపలపై నుంచి కిందికి జారాయి. ఆమె పెదవులు వణికాయి. ఆ చీకటిలో ఎవ్వరికీ ఆమె వేదన, బాధ తెలియటం లేదు. నిశ్శబ్దం తప్ప మరో తోడులేని మనసు మూగబోయింది.

కొత్తజంటలు వినోదంగా ఆటపాటలను చూస్తున్నాయి. చంద్రుని కిరణాల వెలుగులో వేపచెట్టు నీడలు బాగా విస్తరించుకుంటున్నాయి. మార్తాండం కూడా బ్రహ్మాండంగా ఆట ఆడి, పాట పాడుతున్నాడు. ఇతరులని మించి పోతున్నా డొక్కొక్కసారి. పొద్దున అతని పెళ్ళికై ఛాతీకి పూసుకొన్నచందనం ఆ ఆట చెమటలో క్రమంగా కరిగిపోయింది.

అయితే తలుపునానుకొని, వీధిలోని కారుచీకట్లలోకి చూస్తున్న నూతన వధువు మార్తాండం భార్య పేషీ మాత్రం అలానే అతని నిరీక్షణలోనే రాత్రంతా ఒంటరిగా గడిపేసింది.

పైకి 'తొలిరేయి' స్పృహే లేనట్లు ఓయిలాట్టం ఆడుతున్న మార్తాండం మనసు పేషీమీద మరులతో మరిగిపోతున్న సంగతి అతనికి మాత్రమే తెలుసు.

(విపుల, సెప్టెంబర్ 1990)

❖

మృత్యుగవాక్షం ముంగిట్లో

(అమెరికన్ కథ)

గ్రాహం గ్రీన్

❋

కొందరు మృత్యువును ఒక నేరంలా భావిస్తారు కాబోలు! – అందుకే తప్పనిసరిగా తమని కబళించనున్న ఆ మృత్యువు గురించి మిత్రలకు, ఆప్తులకు కూడ చెప్పుకోవటానికి సిగ్గుపడుతుంటారు. అయితే, మరో కొత్తవ్యక్తికి, మళ్ళీ కనబడని వ్యక్తికి, వీధిలో కనబడి మటుమాయం అయ్యే వ్యక్తికి ఎవరికి ఈ విషయం చెప్పాలన్న తీవ్రవాంఛ వారిలో ఉంటుంది. అలాంటివారిలో ఆర్థర్ బర్టన్ ఒకరు.

అతనిని మృత్యువు కౌగిలిలోకి తీసుకోనున్నదన్న సంగతి తెలిసిన నాటి నుంచి అతని మనస్సు మనస్సులో లేదు. స్నేహితులకి, బంధువులకి కాకుండా, వేరే ఎవరైనా కొత్త వ్యక్తికి తన మనస్సులోని ఈ బాధ చెప్పుకొని కనీసం వారి చూపుల్లో వర్షించే సానుభూతి జల్లులతోనైనా సంతృప్తిగా ప్రాణం విడవాలని అతని కోరిక. ఈ కోరికతోనే అతని ఆలోచనలన్నీ ముడిపడి ఉన్నాయి. ఆ ఆలోచనలతోటే ఆర్థర్ రెస్టారెంట్‌లో తన పనిచేసుకుపోతున్నాడు. ఆర్డర్లు అడుగుతున్నాడు. వంటగదికి వెళ్తున్నాడు. తెచ్చి ఆర్డర్లు సర్వ్ చేస్తున్నాడు. కాని, అతని చూపులు, మనస్సు మాత్రం తన గోడు వినే ఒక కొత్త వ్యక్తి కోసం రెస్టారెంట్‌ను పరీక్షిస్తూనే ఉన్నాయి.

ఆర్థర్ పనిచేసే హొటల్ పేరు కెన్ సింగ్టన్ రెస్టారెంట్. దీనినే 'చేజ్ ఆగస్టీ' అని ఫ్రెంచ్‌లో ముద్దుగా పిలుస్తారు. నిజానికి ఆ హొటల్‌లో 'ఫ్రెంచ్'ది అంటూ ఏమీ లేదు. కేవలం హొటల్లో లభించే ఐటెమ్స్‌కు ఫ్రెంచ్ పేర్లు తగిలించేశారు. మెనూ పుస్తకంలో కింద ఇంగ్లీషులో వివరణ మాత్రం తప్పని సరిగా రాస్తారు. ఆ హొటలుకు వారానికి రెండుసార్లు ఒక అమెరికన్ జంట వస్తుంటారు. ఒక మూలగా కిటికీ వద్ద ఉండే టేబిల్‌ను వాళ్ళు ప్రతిసారి బుక్ చేసుకొంటారు.

హొటల్‌కు నిత్యం వచ్చే కస్టమర్లంటే కొందరు బట్లర్‌ల కెంత ప్రత్యేక గౌరవం, శ్రద్ధా ఉంటాయో, కష్టమర్లక్కూడా ఆ బట్లర్‌లంటే ఒకరకమైన అభిమానం ఉంటుంది. అలాంటివారిలో తనంటే అమితంగా ఇష్టం చూపించే అమెరికన్ జంట అతనికి మరీమరీ ఇష్టం. వాళ్ళు ఏదైనా ఆర్డర్ ఇవ్వబోయే ముందు బర్టన్‌ను సలహా అడిగి మరీ ఇస్తారు. తర్వాత దాన్ని రుచి చూశాక సంతోషం కూడా వ్యక్తపరుస్తారు. తమ తొలి పర్యటనలో వారికి ఆర్థర్ బర్టన్ నిజాయితీపరుడని నమ్మకం కలిగాక, తర్వాత సందర్శనలలో అతనిని వ్యక్తిగత మైన ప్రశ్నలు వేయటం ఆర్థర్ బర్టన్‌కు ఎంతో ఆశ్చర్యం కలిగించినట్లయింది. ఆ జంటలో భర్త వయస్సు అరవైయేళ్ళదాకా ఉండవచ్చు. భార్య వయస్సు మాత్రం నలభైకి మించవు.

"ఇక్కడ ఎంతకాలం నుంచి పనిచేస్తున్నావు?" అడిగాడు నలభైయేళ్ళ ఆవిడ భర్త హాగ్‌మిన్‌స్టర్.

"గత ఇరవై సంవత్సరాల నుంచి" బదులిచ్చాడు బర్టన్. ఒక క్షణం ఆగి, "అప్పుడు ఈ రెస్టారెంట్ పేరు ఇదికాదు. 'ది క్వీన్స్' రెస్టారెంట్ అని అప్పట్లో దీనిని వ్యవహరిస్తుంటారు".

"అప్పట్లో ఇంతకంటే బాగుండేదా?" అడిగాడు హాగ్‌మిన్‌స్టర్.

"ఈ ప్రశ్నకు నిజాయితీగా సమాధానం ఇవ్వాలను కొన్నడేమో!" బాగంటే పెద్ద బాగేమీ కాదు. మహా అయితే సాదా సీదాగా ఉండేది. అయినా రుచులు, అభిరుచులు, మారుతుంటాయి గదా" పెదవి విరిచాడు బర్టన్.

"మీ యజమాని ఫ్రెంచ్‌వాడా?"

"కాదు సార్! ఫ్రాన్స్ తరుచూ వెళ్ళివస్తుంటాడు".

"అలాగా! నీ సహాయం లభించినందుకు మేం నీకు ఎన్నో కృతజ్ఞతలు తెలపాలి. నిజానికి ఐటెమ్స్ విషయంలోకాని, వాటి రుచుల విషయంలోకాని మాకీ ఫ్రెంచ్ పదాలే తెలియవు" అన్నాడతను.

"కాని వాటి వివరాలు ఇంగ్లీషులో ఉన్నాయి సార్".

"ఓ! అదా! నిజం చెప్పాలంటే ఇలాంటి రెస్టారెంట్ ఇంగ్లీషు మాకు అర్థం అయ్యేదికూడా కాదు. ఏదయితేనేం? రేపు మళ్ళీ వస్తాం అని, అప్పుడు కూడ ఇదే టేబిల్ ఇప్పించాలి సుమా? ఓకే", అంటూ ఓ క్షణం కౌంటర్‌వైపు చూసి "అదిగో మీ యజమాని పిలుస్తున్నట్లుంది, వెళ్ళు" అన్నాడు హాగ్‌మిన్‌స్టర్.

"ఓ అలాగే! రేపు మీకు ఈ టేబిల్ దక్కేలాగానే ప్రయత్నం చేస్తాను సార్! మరి నేవెళ్తా" అన్నాడు బర్టన్.

"ఆర్థర్! మరి నీ సహాయమో?" అడిగింది నలభైయేళ్ళ హాగ్‌మిన్‌స్టర్ భార్య.

ఆమె తనని పేరుతో సంబోధించటం అతనికి ఏదో కలకలం రేపినట్ల యింది. ఆవిడ ప్రశ్నలో చిరునవ్వు సమ్మిళిత మవటం, అతను క్షుప్తంగా గమనించాడు. ఇన్నేళ్ళు అతనో 'వెయిటర్', 'బాయ్' మాత్రమే. కాని, ఈనాటి ఈ అనుభూతిని అతను ఏనాడూ పొందలేదు.

"హొటల్‌కు వచ్చే కష్టమర్లతో తగుమాత్రంగా వ్యవహరించటం ఇంత వరకూ బర్టన్‌కు అలవాటు. అది కూడ ఈ ఉద్యోగం పోతే మరో ఉద్యోగం రాదనే భయంతో. పైగా అతను ఈనాటివరకూ ఒంటరివాడు కూడ. అందు వలన ఎవరికోసం, దేనికోసం ఉద్యోగం మారాలన్న సమస్య కూడా ఉండేది కాదు.

ఆర్థర్ రాత్రిళ్ళు ఇంటికి వెళ్తే తన గదిలో ఒంటరిగా కూర్చుని ఆరోజు జరిగిందంతా అవలోకించేవాడు. ఎంతోమంది కష్టమర్లు వచ్చేవాళ్ళు. వాళ్ళు రకరకాలు. పెళ్ళయినవారు, కొందరు ఎడముఖం, పెడముఖంగా ఉంటే, కొంత మంది కొత్తగా పెళ్ళయినవాళ్ళు. అంతులేని మాటల్లో మునిగితేలేవాళ్ళు, ఒక్కోసారి పడుచు పెళ్ళాం, ముసలి మొగుడువస్తే వాళ్ళ పక్క టేబిల్ ఖాళీగా

ఉంచేవాడు ఆర్థర్. ఎవరికైనా ఆ టేబిల్ దగ్గర కూర్చుంటే ముసలి మొగుడు తన సమస్యలను పడుచు పెళ్ళానికి ఏమని చెబుతాడు.

ఆ రాత్రి ఎప్పటిలాగే ఇంటికివెళ్ళి పక్కపై కూర్చుని ఉదయం తాను కలుసుకొన్న హాగ్‌మిన్‌స్టర్ దంపతులను తలచుకోసాగాడు. బహుశా తను కోరుకున్న కొత్తవారి కోవలోకి వీళ్ళు రావచ్చు. తనపై మృత్యువు చేయబోయేదాడి గురించి వారికి చూచాయగా చెపితే బాగుంటుంది అనుకొన్నాడు ఆర్థర్.

మర్నాడు హాగ్ దంపతులు ఇద్దరూ అరగంట ఆలస్యంగా వచ్చారు.

ఈలోగా వచ్చినవారికి హాగ్ దంపతులు టేబుల్ ఇద్దామని అంటున్నాడు హొటల్ యజమాని. వద్దని వారిస్తున్నాడు ఆర్థర్! "మేం అరగంట ఆలస్యం" అంది మిసెస్ హాగ్‌మిన్‌స్టర్.

ఆవిడ తన పేరు గుర్తుంచుకొని అలా పిలవటం ఆర్థర్‌కు ఆనందం కలిగించింది.

"ఓసారీ! మీరు మరో హొటల్‌కు వెళ్తారా?" అడిగాడు ఆర్థర్ విచారంగా. వాళ్ళు బుక్ చేసుకొన్న టేబుల్ మేనేజర్ మరెవరికి ఇచ్చివేసినందుకు తన సంతాపం వెలిబుచ్చుతూ.

"ఓ! నో! ఆర్థర్. మాకు చెజ్ ఆగస్టీన్‌నే కావాలి' అంది మిసెస్ హాగ్ ఎంతో సొంపుగా.

సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అయిపోయాడు ఆర్థర్.

"అంతకన్నా మేం అంటే ఇష్టపడే ఆర్థర్ కావాలి" అంది ఆవిడ హొయ లొలికిస్తూ.

"ఆగస్టీన్ కాదు, ఆగస్టీ" సరిచేశాడు ఆవిడ భర్త హాగ్‌మిన్‌ష్టర్.

"సారీ మేడమ్. రేపు నేను ఉండబోవటంలేదు. కాని, మేనేజర్‌కి చెప్పి ఉంచు తాను. మీ టేబిల్‌ను ఇంకెవ్వరికీ ఇవ్వకుండా జాగ్రత్తపడ్తాను" చెప్పాడు ఆర్థర్. అతని మనసులో దాగిన రహస్యం అతన్ని మరీ ఒంటరివాడిని చేస్తోంది. అది ఎప్పుడెప్పుడు వీళ్ళ ముందుకు దుముకుదామా అని తొంగి తొంగి ప్రయత్నిస్తోంది.

"రేపుండవా? ఏం కొంపలంటుకుపోయే ప్రమాదం వచ్చిపడింది?"

అడిగింది మిసెస్ హాగ్.

"రేపు హాస్పిటల్‌కు వెళ్ళాలి?" అన్నాడు ఆర్థర్ విచారం వెలిబుచ్చుతూ.

"ఓ అర్థర్! ఏమైందీ? ఏదైనా సీరియస్ విషయమా?

"కేవలం చెక్–ఆప్ మెడమ్" చెప్పాడు ఆర్థర్.

"వెరీగుడ్... అది చాలా మంచిది ఒంటికి" అన్నాడు హాగ్.

మా వారికి నాలుగో, ఆరో చెక్అప్‌లు చేశారు. ఆయనకు అవి అంటే చాలా సరదా. కాని, నాకు చచ్చేంత భయం. అసలు చెక్–అప్‌లు ఎందుకు?" అంది మిసెస్ హాగ్.

"వాళ్ళు చెక్ ఆప్ చేశారు. రేపు కేవలం ఫలితం చెపుతారు" అన్నాడు ఆర్థర్.

"అయితే ఫలితం తప్పక మంచి ఫలితం అయి ఉంటుంది. నీకేం ఫర్వాలేదు ఆర్థర్" అంది మిసెస్ హాగ్.

"పొన్లేండి! ఇక్కడ మీరు సంతోషంగా కాలం గడిపారనుకొంటా! కరెక్టేనా మేడమ్" అన్నాడు ఆర్థర్.

"ఓ... నిజానికి మా కృతజ్ఞతలన్నీ నీకే" అంది మిసెస్ హాగ్.

"సరే.... దయచేసి నాకు శలవు ఇప్పించండి" అన్నాడు ఆర్థర్.

"ఓ, అప్పుడేనా! మేం మళ్ళీ గురువారం వస్తాం. రేపు వచ్చి నీ సలహా తీసుకొని నువ్వు చెప్పిన వేరే హెూటల్‌లో భోజనం ఎలా ఉంటుందో కూడా రుచి చూస్తాం. కాని, గురువారం మాత్రం ఆగస్టీన్‌లో నీకోసం, మీ పదార్థాల కోసం తప్పక ఎదురుచూస్తుంటాం సుమా" అంది మిసెస్ హాగ్.

"ఆగస్టీ" సరిచేశాడు మిస్టర్‌హాగ్.

"శుక్రవారం మేం న్యూయార్క్ బయల్దేరి వెళ్తున్నాం. అయితే ఈ లోగా నిన్ను గురువారం కలిసి, నీ నుంచి మంచి శుభవార్త విని మరీ వెళ్తాం. ఆర్థర్ నాకు నమ్మకం ఉంది. తప్పక నీకు శుభం జరుగుతుంది. అప్పటివరకూ నేను నీ గురించే ఆలోచిస్తుంటాను సుమీ!" అంది మిసెస్ హాగ్ భర్త ఇందాక చేసిన సవరణను పట్టించుకోకుండా.

"నేను ఎన్నోసార్లు మెడికల్ చెక్ అప్ చేయించుకున్నాను. ఎప్పుడూ

శుభమే జరిగింది" చెప్పాడు మిష్టర్ హాగ్.

"మీకు గురువారం కోసం ఏదైనా ప్రత్యేకం కావాలా, ఆర్డరిస్తారా?" అడిగాడు మిసెస్ హాగ్ని ఆర్థర్.

"నో!నో! అవసరం లేదు... గురువారం నిన్ను కలిసి నువ్వు చెప్పాకనే ఆర్డరిస్తాం. సరేనా. గుడ్‌లక్ ఆర్డర్" అంది మిసెస్ హాగ్ చిరునవ్వుతో వీడ్కోలు చెబుతూ.

తననే కొత్త అదృష్టం వరించబోవటం లేదని ఆర్డర్ బర్టెన్‌కు స్పష్టంగా తెలుసు. తనని డాక్టరు పరిశీలించకముందే ఆయన కనబరిచే ఉదాసీనతను బట్టి తను విషయం తీవ్రత గ్రహించగలిగాడు. ఒక హంతకుడికి తనకు పడబోయే మరణశిక్ష గురించి ముందే తెలిసినట్లు, తనకు కూడా రాబోయే మృత్యువు గురించి ముందే తెలుసు. అందుకే తను మిసెస్ హాగ్‌తో సగం రహస్యం ముందే చెప్పేశాడు. ఫలితంగా తనకు ఆమె ప్రతిస్పందన ముందుగానే తెలుసుకొనే వీలు కలిగింది. ఒకవేళ డాక్టర్లు ఆ రాబోయే మృత్యువును తీయని మాటల్లో కప్పిపుచ్చి, ఇంకా చిరుఆశను కల్పించాలని చూసినా, తను ఆ విషయం ముందే పసిగట్టి మిసెస్ హాగ్‌కు వ్యక్తపరిచి సగం సంతృప్తిని పొందే శాడు. ఇక ఆమె తనకు కన్పించే అవకాశం తక్కువ. అంటే తను కోరుకున్నట్లే రోడ్డునబోయే ఒక కొత్తవ్యక్తిలాంటిదే అయింది. ఆమె శుక్రవారం న్యూయార్క్ వెళ్ళిపోతుంది. వాళ్ళిద్దరికి పరిచయం ఉన్న స్నేహవర్గం ఏదీ వారిమధ్యలేదు. కాబట్టి తన మృత్యు రహస్యం మరెవ్వరికీ తెలియగూడదన్న తన కోరిక కూడా నేరవేరినట్లే. అందువలన ఆవిడంటే అదోరకమైన అభిమానం అతనిలో ఆ క్షణంలో కలిగింది కూడ. ఆ రాత్రికి మిసెస్ హాగ్ అతనికి కలలో కన్పించింది. కామ కోరికలతో కాదు. ప్రేమ పూరితంగా అంతకంటే కాదు. కేవలం ఆర్థర్ కోరుకుంటున్న ఒక నూతనవ్యక్తిగా అతని కలలో వచ్చింది మిసెస్ హాగ్. ఆ కల వలన ఆర్థర్ ఎంతో ప్రశాంతి పొందిన అనుభూతికి లోనయ్యాడు.

మర్నాడు సాయంత్రం డాక్టర్‌ను కలిశాడు ఆర్థర్.

"ఫర్వాలేదు... ఏం కంగారుపడకండి. కేవలం క్యాన్సర్. అంతే. వెంటనే ఆపరేషన్ చేయాలి. ఇలాంటి ఆపరేషనులు పూర్వం ఎన్నోచేశాను నేను"

అన్నాడు డాక్టరు.

"మౌనంగా అలా ఎందుకు ఉన్నావు ఆర్థర్?"

"ఎప్పుడు చేయమంటావు ఆపరేషన్? అడిగాడు డాక్టర్ మళ్ళీ ఆర్థర్ ఏమీ మాట్లాడలేదు.

"రేపు ఉదయం హాస్పిటల్‌లో చేరిపో? ఎల్లుండి ఆపరేషన్ చేస్తాను."

"చూడండి... రేపు ఉదయం నేను హొటల్ డ్యూటీకి వస్తానని చెప్పాను. కాబట్టి రేపు మధ్యాహ్నం వీలుందేమో చూడండి" చెప్పాడు ఆర్థర్. అతని మనస్సులో హొటల్ డ్యూటీ కన్నా మిసెస్ హాగ్‌ని కలుసుకోవటం ఎంతో ముఖ్యమైనది.

"అది కాదు ఆర్థర్. పూర్తిగా ఒకరోజు విశ్రాంతి తీసుకొంటేగాని ఆపరేషన్ చేయడం మంచిదిగాదు. సాయంత్రం ఆరుగంటలకల్లా ఎనస్థీస్ట్‌ను తీసుకు రావలసి ఉంటుంది" అన్నాడు డాక్టర్.

ఆ రాత్రి పడుకొని ఆర్థర్ ఆలోచించసాగాడు.

డాక్టర్లకు రోగి శరీరంమీద ఉన్న అదుపు అతని మనస్సుపై ఉండదు. అందుకే వారు మాటల్లో తాను ఎంత గ్రహించింది వారికి తెలియదు. కేవలం "హొప్" అనే మాటతో పేషెంట్లను బ్రతికిద్దామని ప్రతి డాక్టరు భావిస్తాడు. ప్చ్! మనస్సులోనే అనుకొన్నాడు ఆర్థర్.

తనకు చనిపోతానన్న భయం లేనేలేదు. ఇది జగమెరిగిన సత్యం. అయినా ప్రపంచం ఎప్పుడూ చావుకు భయపడినట్టు తోచదు.

తన మరణవార్త బంధువుని, పిల్లల్ని బాధపెట్టేలాంటిది కాకూడదనే తను ఎవ్వరికి తెలియపర్చుకోదల్చలేదు. నిజానికి తనకు ఎవ్వరూ లేరు. స్నేహితులు ఆ వార్తవిన్ని వ్యథచెందటం తనకు ఇష్టంలేదు. అందుకే మిసెస్ హాగ్ అంటే అంత శ్రద్ధ తనకు. రేపు ఉదయం మిసెస్ హాగ్ తనని అడుగుతుంది. "ఆర్థర్, డాక్టర్ ఏమన్నారు?" అని.

"అంతా అయిపోయింది. ఇక మాటలనవసరం. తలుచుకోవటం అనవసరం. ఈ చిరిక్షణంలో మీరు నా గురించి తలుచుకొన్నందుకు మీకు నా కృతజ్ఞతలు" అంటాడతను.

ఆమె "ఓ! నీ రహస్యం అర్థమైంది? అన్నట్లు జాలిగా వాత్సల్యంతో చూస్తుంది తన కళ్ళలోకి. ఆ చూపులు తనకెంతో సంతృప్తినిస్తాయి.

"నువ్వు ఆ టేబిల్‌ను ఖాళీగా ఉంచనక్కర్లేదు. నిన్న ఆ అమెరికన్ జంట వచ్చారు" అన్నాడు హొటల్ యజమాని ఆర్థర్‌తో మర్నాడు ఆర్థర్ డ్యూటీకని హొటల్‌కు వెళ్ళినప్పుడు.

"ఏమిటి? వారు నిన్నవచ్చారా?" ఆశ్చర్యంగా అడిగాడు ఆర్థర్.

"అవును... వారికీ టేబిల్ బాగా నచ్చినట్లుంది" అన్నాడు ఆర్థర్.

"నిన్న వారు వేరే హొటల్‌కు వెళ్తారనుకొన్నానే" అన్నాడు ఆర్థర్ సంశయంగా.

"అదేంకాదు ఆర్థర్ వాళ్ళు నిన్న ఇక్కడికే వచ్చారు. బహుశ నువ్వు కష్టమర్స్‌తో ఎక్కువ మాట్లాడుతావులాగుంది. వాళ్ళు ఏకాంతం కోసం ఎంతో ఆత్రుతగా చూస్తున్నట్లు అనిపించింది నిన్న వాళ్లని చూస్తుంటే" అన్నాడు యజమాని. ఇంతలో దూరాన వస్తున్న హోగ్ దంపతులను చూశాడు ఆర్థర్. వెంటనే పరిగెత్తుకుంటూ వాళ్ల దగ్గరికి వెళ్ళాడు.

వాళ్ళు ఆర్థర్‌ను చూస్తూనే కళ్ళు ఎగరేసి, ఆర్థర్‌ని దాటి ముందుకు పోయారు. హొటల్‌లో ఒక మూల ఉన్న ప్రత్యేక టేబిల్ దగ్గర వాళ్ళు ఏకాంతంగా ఆసీనులయ్యారు. బహుశ అక్కడైతే ఎవ్వరూ పలకరించే ఇబ్బంది ఉండదేమోనని వారి ఆశ కావచ్చు.

వారిద్దరు కాసేపు మాట్లాడుకున్నాక, భోజనం ముగించి లేవబోయేముందు, "ఆర్థర్! ఒక క్షణం ఇటురా! మాతో రెండు మాటలు మాట్లాడి వెళ్ళు" అని పిలిచింది మిసెస్ హోగ్ మిన్‌స్టర్.

అతను తేలికయిన గుండెతో మిసెస్ ఆర్థర్ దగ్గరికి వెళ్ళాడు.

"ఆర్థర్.. నిన్న నిన్ను కలుసుకోలేపోయినందుకు మేమెంతో అనుకొన్నాం. మీ మేనేజర్ చాలా మంచివాడు. మాపట్ల ఎంతో సానుభూతితో వ్యవహరించాడు. అందుకే అతని హృదయం గాయపర్చదల్చుకోలేదు మేము" అన్నది మిసెస్ హోగ్.

"మీకు భోజనం నచ్చిందా?" అడిగాడు ఆర్థర్.

"ఓ మాకు చెజ్ ఆగస్టీన్‌లో భోజనం ఎప్పుడు నచ్చుతూనే ఉంది" అంది మిసెస్ హాగ్.

"ఆగస్టీన్ కాదు, ఆగస్టీ" సవరించాడు హాగ్.

ఆర్థర్ వాళ్ళిద్దరికీ క్షమాపణ చెప్పి కిచెన్‌లోకి వెళ్ళాడు. తను ఇక ఈ హోటల్ మేనేజర్‌తో మాట్లాడడు. కనీసం రేపు రావటంలేదని కూడ చెప్పడు. తను పోయాక హాస్పిటల్‌వారే తన మరణవార్తని ఆయనకి తెలియపరుస్తారు. తనబదులు వేరే సర్వర్లు హాగ్ దంపతులకు పరిచర్యలు చేయటం ఆర్థర్‌కు ఎంతో దుఃఖాన్ని, ఆగ్రహాన్ని కల్గించింది.

అరగంట తర్వాత మేనేజర్ స్వయంగా కిచెన్ గదికి వచ్చి ఆర్థర్‌ని కలిశాడు.

"ఇదిగో నీకు ఇమ్మని మిసెస్ హాగ్ ఈ ఉత్తరం ఇచ్చింది" అంటూ ఆర్థర్‌చేతిలో చీటీ పెట్టాడు.

ఆర్థర్ ఆ ఉత్తరాన్ని జేబులో వేసుకొన్నాడు. అతనికి ఇప్పుడు మనస్సు కొంత నెమ్మదించింది.

నిజమే. తన రహస్యం గురించి హాగ్ దంపతులు మిగతా బట్లర్‌ల మధ్య చర్చించేవారు. అందువలన రహస్యంగా ఈ ఉత్తరం రాశారు. రేపు హాస్పిటల్‌లో ఆపరేషన్ ఘడియముందు దీనిని చదువుతాను. తన ఆరోగ్యం గురించి మిసెస్ హాగ్ వేసిన చివరిప్రశ్నకు తన సమాధానం ఎప్పటికీ లభించదు. అదే తమ కోరుకొన్నది. ఇలా అనుకొంటూ ఇంటికి చేరాడు ఆర్థర్.

హాస్పిటల్లో ఆపరేషన్ ముందు మిసెస్ హాగ్ రాసిన చీటీ చదివి ఆశ్చర్యపోయాడు అందులో ఆర్థర్ ఆరోగ్యానికి సంబంధించి ఒక్క ప్రశ్నలేదు. కేవలం ఆర్థర్‌కు కృతజ్ఞత చెప్తూ మిసెస్ హాగ్ రాసిన వాక్యాలను, మిస్టర్ డాలీ హాగ్ సంతకం ఉంది. తను ఈ చివరి క్షణందాకా ఏకొత్త వ్యక్తి తన ఆరోగ్యం గురించి చింతను, ప్రేమను వ్యక్తం చేయాలని ఆశించాడో, ఆ వ్యక్తి నుంచి అది లభించలేదని ఆర్థర్‌కే విశదమైంది.

(విపుల, సెప్టెంబర్ 1990)

❖

ముసుగు తొలగిన వేళ

(ఇండో ఆంగ్లియన్ కథ)

జహనారావాసీ

❃

రానురాను తనకు కలిగే విసుగును దాచిపెట్టుకోవటం చాలా కష్టంగా ఉంది ఆమెకు.

ఈసారి ఒక వస్త్రప్రదర్శనకు ప్రారంభోత్సవం చేయాల్సివుంది. సంప్ర దాయరీతుల్లో నేసిన ఈ చేనేత బట్టల ప్రదర్శనను నగరం మధ్యలోని ఒక కళాత్మకమైన చిన్నహాలులో ఏర్పాటు చేశారు.

ఎప్పటిలాగే ఈసారి కూడా తను మాట్లాడవలసిన నాలుగు చిలుక పలుకులు గురించి ఆమె ఆలోచించుకోవాలి. అయితే సహజమైన ఊహాశక్తిలేని ఆమె ఆ నాలుగు వాక్యాలను ఏ పుస్తకంనుంచో కొట్టుకొచ్చి స్వంతం చేసుకుని ఒప్పజెప్పాలి.

తను గవర్నరు కూతురు కావటంలో కొన్ని కష్టాలు, సమస్యలు కూడా వున్నాయి.

తను మాట్లాడే మాటలు అచ్చం చిలుక పలుకుల్లాగానూ, సంక్షిప్తంగాను కూడా వుండాలి. చాలా అందమైన ముత్యాల కూర్పులా వుండి వినేవారిని సమ్మోహనపర్చాలి. ఇందుకోసం ఆమె తను ఉపన్యాసాన్ని అద్భుతంగా మలిచేం దుకు తన 'రాణిసం' వుట్టిపడేందుకూ తన చీరను పదేపదే హుందాగా

సరిచేసుకుంటూ, మధ్యమధ్య ఒక చిరునవ్వును పెదాలపై విరబూయిస్తూ యువరాణీలా మాట్లాడానికి తంటాలు పడసాగింది.

ఆమె అందంగా అలంకరించుకుంది. సంప్రదాయరీతిలో అందంగా మేకప్ కొట్టించుకుంది. కారులోంచి పాదం కింద పెట్టగానే జనం ఆవిడని చుట్టుముట్టారు. నిజానికి వారు ఆవిడ్ని తమ భుజాలపై మోసుకుపోవటానికి సైతం వెనుకాడేటట్లు లేరు.

తనను ఆహ్వానించేందుకు వచ్చిన ఆడవారు ఎంతో అందంగా కన్పించారు యువరాణికి. తను అలాంటివారినెంత మందినో చూసింది. వారి జుత్తు నిగనిగలాడుతూ మృదువుగా, కోమలంగా చక్కగా దువ్వి వుంది. వారి చేతుల గోర్లు శుభ్రంగా తొలగించి వున్నాయి. చక్కటి అందమైన పూలపాల డిజైన్ అంచులతో వారి చీరెలు మరింత అందంగా ఉన్నాయి. వారి మర్యాద, పిల్చినవారి హోదా యువరాణికి ఎంతో నచ్చాయి. అయితే వారిలో ఎవ్వరూ ఆమెకు తెలిసినవారులేరు.

ఆమె ప్రదర్శన ప్రారంభించినట్లు ప్రకటించింది. వారి కరతాళధ్వనులతో ప్రదర్శన ప్రాంతం మిన్నంటింది. తను అక్కడ గడిపిన ఇరవైనిమిషాల కాలంలో, ఆ రద్దీలో ఒకే ఒక ముఖం తనంటే అంత మోజు లేనట్లుగా, ముభావంగా వున్నట్లు ఒక్కక్షణంలో పసిగట్టింది యువరాణి. ఉన్నవారిలో కొద్దిమంది పాతకాలపు ఆడవారు ఉన్నా తనంటే ఎంతో ఇష్టంగా ముఖభావాలు వ్యక్త పరచటం ఆమె గమనించకపోలేదు. అయితే వారికి తన సమస్యల్లో ఏమాత్రం శ్రద్ధ వున్నట్లు ఆమెకు తోచలేదు. ఎంతసేపూ ఆమెకు తమ సమస్యలు చెప్పుకుం దామనే వారి ఆరాటం అంతా!

తన వయస్సున్నవారిలో ఎంతో అందమైన ఆడవారున్నారు. వారిలో ప్రభుత్వ సెక్రటరీల భార్యలు ఊడా వున్నారు. వారి హోదా, ఐశ్వర్యం, మేథస్సు అన్నీ కలిసి ఆ ప్రదర్శన శోభను మరింత ఇనుమడింప చేశాయన్నది నిర్వివాదం. వారందరికీ ఆమె వంగి సలాం చేసింది. వారు ఆవిడకన్నా ఎక్కువగా వంగి మరీ సలాం చేసి తృప్తి పడ్డారు.

ఒకరి ముఖంపై నుంచి మరొకరి ముఖం చూస్తున్న యువరాణికి తనంటే

ఇబ్బందిగా, ఇరుగ్గా ముఖంపెట్టిన ఆ యువతి ఎవరో ఇప్పుడు స్ఫురణకు వచ్చింది. ఆవిడపేరు లీలాచక్రవర్తి. ఒకప్పటి తన స్నేహితురాలు. లీలముఖం మిగతా అందరిముఖాలకంటే అందంగా లేదు. పైగా ఏదో కవ్వించి రెచ్చ గొడ్తున్నట్లుగా కూడ తోచింది యువరాణికి.

తననుతాను మర్చిపోగల క్షణాలు కూడ ఉంటాయని యువరాణికి తెలియదు. ఆమెకు తెలిసిందల్లా తను గవర్నరు ఏకైక ముద్దుల కూతురని మాత్రమే.

ఈ సందడిలో ఇప్పుడామె మనస్సు క్షణకాలంపాటు గతంలోకి పరుగులు తీసింది.

ఒకప్పుడు తను లీలను ఆవిడ స్టూడియోలో కలవటం మదిలో క్షణకాలం కదిలింది. ఆనాడు తాను నేటి ఆధునిక చిత్రకళకు ప్రాణమైన సంప్రదాయ చిత్రకళకు, ఒకనాడు వ్యతిరేకంగా పెల్లుబికిన ఉద్యమం గురించి లీలతో గంటలతరబడి చర్చింటం తన స్మృతిపథంలో ఒక్కసారి లీలగా మెదిలింది. రకరకాల చిత్రకారుల గురించి, వారి ఎత్తుగడలగురించి తాము చేసిన చర్చ తాను ఇంకా మర్చిపోలేదు.

పోన్లే! లీల పైకి ఆకారంలో ఎట్లా ఉన్నా ఈ మయంలో తను ఎరిగిన వ్యక్తి ఇక్కడుండటం ఒక సుగుణమే అనుకొంది గవర్నర్‌గారి కూతురు.

అయితే తాను గవర్నర్‌గారి కూతురైన హోదా నీడలా తనని వెంటాడటం ఆమెకు చాలా చికాకుగా ఉంది. ఒక్కక్షణం పాటు ఆ నీడను పక్కకుతోసి, బాధ్యతల బరువు దించేసుకొని, గవర్నర్‌గారి కూతురు భూమికనుంచి తప్పుకొని, లీలవద్దకు నడిచింది.

“ఈ ప్రదర్శన అయిపోగానే నేను మీ స్టూడియోవైపుకు రావచ్చా! అయితే అక్కడ కప్పు కాఫీ కూడా ఇవ్వకూడదు నాకు?” అడిగింది యువరాణి.

అయితే లీల మనస్తత్వం ప్రత్యేకమైంది. గొప్పవారి స్నేహానికి ఆమె పొంగి పోదు. దేనికీ ఆమె ఆశ్చర్యపోదు. కంగారు పడదు, భయపడదు. యువరాణి తనతో గుసగుస మాట్లాడుతుంటే తనవైపు కళ్ళెర్రజేసిన వారిని అసలు లక్ష్యపెట్టదు.

"నాకూ నిజానికి నీకు కాఫీ ఇవ్వాలనే వుంది. అయితే ముందు నే వెళ్ళి చూడాలి. అసలు కప్పు కాఫీకైనా నా దగ్గరేవైనా ఉన్నాయో లేవోనని. కనీసం ఒక బిస్కట్ పాకెట్ అన్నా ఎక్కడ్నుంచైనా సంపాదించాలి బిచ్చమెత్తైనా సరే!" అంటూ లీల కదిలిపోయింది.

లీల మాటలకు రాణిగారి భ్రుకుటి ముడిపడింది. తను వస్తున్నానంటే బిస్కట్ ప్యాకెట్‌కు, కాఫీకి కూడా అడుక్కోవలసి వుందంటుందా ఆ లీలా చక్రవర్తి.

ఛీ... ఎటువంటి మనుషులు... వీళ్లకు మర్యాదలు, సంప్రదాయాలు అన్నీ తోసి రాజనేందుకు బోలెడంత ధైర్యం ఇచ్చాడు. ఆ భగవంతుడు. వీరికి ఎంత అధిక్యభావం! లేకపోతే ఏమిటి? ఓ బిస్కట్ ప్యాకెట్ కోసం అడుక్కు రావాల్సిన అవసరం ఎక్కడుంది? సిగ్గులేకపోతేసరి. అందుకు కూడా డబ్బులు లేవా ఈ లీల దగ్గర అనుకుంది గవర్నర్ కూతురు.

తన స్టూడియో తలుపులు తీసి, కుర్చీలపై దుమ్ము దులిపేందుకు అవసర మయ్యే అయిదు నిమిషాల సమయం లీలకు అనుగ్రహించింది యువరాణి. ఒక పౌండు బరువు బిస్కట్ ప్యాకెట్ తెచ్చింది. కాఫీని స్టౌపై పెట్టింది లీల.

ఇంతలో యువరాణి రానే వచ్చేసింది. సాధారణంగా లీల స్టూడియోలోకి పరుగెట్టేలా నడిచే యువరాణి ఈసారి తలుపు దగ్గర ఆగిపోయింది.

ఈసారి లీలతో మరో స్త్రీ వుండటం చూసి యువరాణి సిగ్గుపడింది. ఆవిడ అడుగులు ముందుకు పడలేదు.

లీలతో ఉన్న మరో స్త్రీ ఎవరో తను పూర్వం చూసినట్టే వుందే! బాగా లావైన ముఖం. విచలితురాల్లా కనిపించే ఆమె అపార అనుభవం వున్న స్త్రీలా ఎదుటివారిని ఇట్టే చదివేయగలిగినట్టు కనిపించింది యువరాణికి.

అయితే యువరాణికి తెలిసిన మేరకు ఆవిడ ఏ ప్రముఖ స్త్రీ కాదు. ఆవిడ కట్టిన బట్టలే ఆ విషయం చెబుతున్నాయి. ఆవిడ జుత్తు బోలెడు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. కొన్ని వెంట్రుకలు కనుపాపలపైకి జారితే, మరికొన్ని మెడ వాలుగా జారి ఉన్నాయి. ఆవిడ యువరాణికి, లీలా చక్రవర్తికి విరిగిపోయిన జగ్గులో కాఫీని నీలం కప్పుల్లో పోసి అందించింది. ఆవిడ కంఠం కూడా

ఆవిడలాగానే బొంగురుపోయి చాలా మందంగా వుంది. ఆవిడ మాట్లాడితే లక్షల మైళ్ల దూరం నుంచి మాట్లాడినట్లు అనిపిస్తోంది.

"అవును ఇంట్లో పింగాణీ వంట వస్తువులు చాలా అందంగా ఉంటాయి. స్టూడియో ఊడా నగర మధ్యన వుంది. ఇన్నింటికన్నా ఇక కావల్సిందేమిటి?... అవును. కాదు... అఫ్‌కోర్సు" అంటూ సంభాషిస్తోంది ఆవిడ పెద్దగా.

వీరిద్దరినీ ఒకళ్ళనొకళ్ళకి పరిచయం చేయటం మర్చిపోయింది లీలా చక్రవర్తి.

కాని యువరాణికి ఆవిడెవరు? ఆవిడెందుకు తనంటే అంత అయిష్టంగా ముఖం పెట్టిందో బాగా తెలుసు. ఆవిడ దేనిగురించో తీవ్రంగా ఆలోచిచటాన్ని యువరాణి గమనించింది.

ఆవిడ చూడటానికి మానసికంగా ఆరోగ్యంగా వున్నట్లు కన్పించినా, ఎటువంటి చర్చలో తామున్నా హఠాత్తుగా ఆ చర్చను చెడగొట్టగలదు అని భావించింది యువరాణి.

ఇంతలో యువరాణి మస్తిష్కంలో తళ్ళుక్కున ఏదో మెరుపు మెరిసింది. ఆ మెరుపులో ఇప్పుడు తాను చూస్తున్న రూపంకాక, ఒక దశాబ్దంన్నర వెనక ఆమె రూపం కనబడింది. తామిద్దరం విదేశాల్లో చదువుతున్నప్పటి రూపం అది. ఇప్పుడు యువరాణికి స్ఫురణకు వచ్చింది ఆవిడ ఎవరో స్పష్టంగా. "ఓ అందుకా... ఈవిడ రూపం నన్ను ఇంతగా ఆకట్టుకొంది'' అనుకొంది యువరాణి.

లీలతో వున్న స్త్రీకి ఏదో బలమైన సమ్మోహనశక్తి వుంది. ఎవరినైనా క్షణాల్లో ఆకర్షించగలిగినది. ఆవిడలోని అంతర్గత శక్తిని గుర్తించటానికి సామాన్యులకు సాధ్యంకాదు. ఎంతో దృఢమైన, విశాల దృక్పథం గల వారు మాత్రమే ఆవిడని ఎదుర్కొనగలరు. ఒకటి తర్వాత ఒకటిగా గుర్తుకువస్తున్నాయి యువరాణికి అన్ని విషయాలు.

అతికష్టం మీద గతంలోని చేదు అనుభవాలను మనోమందిరంలో తీవ్రంగా వెతకసాగింది.

అది ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలోని ఒక సాయంత్రం. ఇండియన్ సొసైటీ

పేరుతో మజ్లిస్ ఏర్పరచిన సాంస్కృతిక కార్యక్రమం.

క్రమంగా సంవత్సరాలు మంచుకరిగినట్లు కరిగి పోతున్నాయి. లీల ఇంట్లోని స్త్రీ స్పష్టమైన యువతిలా కళ్ళముందు రూపుదిద్దుకోసాగింది.

భారతీయతకు ఆకర్షితమైన ఒక అమెరికన్ స్త్రీ స్టేజిపై చేస్తున్న నృత్యం తిలకిస్తున్నారంతా.

పక్కనే ఉన్న అందమైన యువతితో అంది యువరాణి. "ఎలా వుంది ఈ నృత్యం నీకు?" అని.

"నాకు నృత్యంగురించి ఏమీ తెలియదు? నీకు బాగుందా?" అని తిరిగి అడిగింది ఆ అందమైన యువతి రాణిని.

"ఛీ... ఛండాలంగా వుంది" చెప్పింది యువరాణి.

ఆ యువతి రాణి అభిప్రాయంతో ఏకీభవించలేదు.

"ఓహో.. అలాగా... నాకు అలా అనిపించలేదు" అనేసి మౌనం వహించింది.

"అయితే నీకు నచ్చిందా?" మళ్ళీ ఒత్తిడి చేస్తున్నట్లుగా ఆ యువతి అభిప్రాయం కోరింది.

"ఆ... ఫర్వాలేదు.... కాసేపు కాలక్షేపం చేయడానికి బాగానే వుంది" అంది ఆ యువతి.

అప్పట్లో అక్కడ భారతీయులు నడిపిస్తున్న ఆధిక్యతను లక్ష్యపెట్టని దాని లాగా వున్నాయి ఆ యువతి మాటలు.

"అంటే ఇంకా నీకు ఆ నృత్య ప్రదర్శన చూడాలనిపిస్తోందా?" మళ్ళీ రెట్టించి అడిగింది యువరాణి.

"ఏం? ఫర్వాలేదనే అనిపిస్తోంది. నృత్యం చేసే ఆమె చేయాలనుకున్నంత మేరకు నృత్యం బాగానే చేస్తోంది" అంది ఆ యువతి.

"అసలీ నృత్యం చేయకపోతే ఏమిట్టా? అడిగింది యువరాణి అహంకా రంతో మరోసారి.

"అది నీ మనోగతంపై ఆధారపడి వుంటుంది. నీకు డాన్సు ప్రధానమా? డాన్సు చేసే వ్యక్తి ప్రధానమా తేల్చుకో... బహుశా ఆ చికాకు వలనే నువ్వు

ఇలా మాట్లాడుతున్నా వనిపిస్తోంది" అంది ఆ యువతి.

మరోసారి ఆ యువతి, యువరాణి, న్యూబ్లారెట్‌ను, సేంట్ హ్యూలో కలుసు కోవటం జరిగింది. ఈసారి ఆ యువతి యువరాణి కంటే ముందు వచ్చింది. సాధారణంగా న్యూబార్లెట్ తెలివి, నిజాయితీ ఉన్న యువతులనే స్నేహితులుగా ఎన్నుకుంటుంది. కనుకను యువరాణికి ఆ యువతితో మాట్లాడక తప్పలేదు. 1968లో ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ క్యాంపస్‌లో జరిగిన అల్లర్ల గురించి ముచ్చటించుకున్నారు ఆ ముగ్గురు.

"అదంతా చాలా అనిశ్చితంగా మిగిలింది. కాని, ఆనాటిగొడవలు అనేక అనర్థాలకు దారితీశాయి" అంది న్యూబార్లెట్.

ఆ యువతి న్యూబార్లెట్‌తో ఏకీభవిస్తున్నట్లుగా తలూపింది.

"ఆలోచించే తత్వానికి, హఠాత్ నిర్ణయాలకు మధ్య ఎప్పుడూ వైరుధ్యం వుంటూనే వుంది" చెప్పిందా యువతి.

"మీరేమంటారు?" అడిగింది యువరాణిని న్యూబార్లెట్.

"అయితే ఆ వైరుధ్యం ఎప్పుడూ వుండటమే మంచిది" అంది యువరాణి.

"1939-1945ల మధ్య ఏమీ జరగనట్టు మనం ప్రవర్తించలేం" అంది న్యూ బార్లెట్.

"నువ్వు రాకముందు నేను, ఆయేషా చరిత్ర గురించి బాగా చర్చించు కున్నాం. ఆయేషా అభిప్రాయంలో చరిత్రే కాకుండా మన ఆలోచనా పంథా కూడా మారాలి. మనకి చరిత్ర గురించి చాలా తప్పుడు అభిప్రాయాలు వున్నాయని ఆయేషా భావం" అంది న్యూబార్లెట్ యువరాణితో.

ఆయేషా దీర్ఘంగా ఆలోచించి- "మనం ఇక్కడున్నది తెలుసు కోవటానికి, కనీసం తెలుసుకోవటమెలానో నేర్చుకోవడానికి. నీరు పీల్చుకునే కాగితంలా ఇండియాలో నేను వృధాచేసిన కాలంతో పోల్చుకుంటే, బ్రిటన్‌లో నాకు ఒక్క నిమిషం వృధా చేయ బుద్ధి పుట్టదు. మనకు కావలసిందేదో స్పష్టంగా తెలిస్తే, బ్రిటన్‌లో చదువుకోవటం, తెలుసుకోవటం నిజంగా ఒక మహత్తరావకాశం" చెప్పింది అయేషా.

న్యూబార్లెట్ ఆయేషా వంక తీక్షణంగా చూస్తూ ఆమె చెప్పేది వింటున్నది.

"మనిషి ఎప్పుడూ ఒకే ఒక విషయం తెలుసుకుని కూర్చుంటే సరి పోదు. నిజానికి చరిత్ర మనకెన్నో విషయాలు చెబుతుంది. కాని చరిత్రనే వివరించి చెప్పవలసింది ఎంతోవుంది. చరిత్రను అర్థం చేసుకోవటంలో ఈ కోణం నుంచి చరిత్రను చదవాలి" చెప్పింది ఆయేషా.

న్యూబార్లెట్‌కు ఆయేషా చరిత్రపై ఏర్పరచుకున్న భావాలు కొంచెం కొంచెం అర్థమవుతుండగా, యువరాణికి తనలోని సరుకంతా ఆయేషా తుడిచిపెట్టేసిందా అనే భావం కల్గింది.

మరోసారి ఈ ముగ్గురు లేడీస్ మార్గరేట్ హాల్‌లో కలుసుకున్నారు. నల్గురు భారతీయ విద్యార్థులు లండన్‌లో కలిస్తే మామూలుగా ఏం చర్చించు కుంటారో వీరు కూడా అదే భారత రాజకీయ వ్యవస్థ గురించి చర్చించసాగారు. అప్పుడు కూడా ఆయేషా తన అనమాన ప్రతిభతో ఈ యువరాణిని స్తబ్దురాలిని చేసింది. క్రమంగా గతంలోంచి యువరాణి వర్తమానంలోకి వస్తోంది. ఆనాటి ఆయేషాయే ఇప్పుడు ఈ ఇంట్లో వున్న స్ఫురద్రూపి, లావైన ముఖం కలస్త్రీ. తాను ఈమెను లండన్‌లో చదువుకొన్న కాలంనాటి నుంచి ఎరుగును. కాని ఈ జ్ఞాపకం యువరాణిలో కొత్త సంతోషాన్ని, వెచ్చదనాన్ని అభినందించే సుగుణాన్ని కలిగించలేకపోయింది. యువరాణి మళ్ళీ ఆయేషాతో స్నేహం పెంపొందించుకోవాలని అనుకోలేదు కూడా. ముక్తసరిగా ఆయేషాను పలక రించి, కొన్ని జ్ఞాపకాలను నెమరేసుకుంది. అది కూడా అర్థ సంశయంతోనే. ఎందుకంటే ఆనాటి యువరాణిపట్ల ధిక్కారం ఆయేషాలో ఇప్పటికీ వున్నట్లే తోచింది యువరాణికి. తను ఆమెతో స్నేహం చేసినా, మారిన నేటి కాల పరిస్థితులకు అనుగుణంగా ఆయేషా తనను మార్చగలదా? తనకు, ఆయేషాకు మధ్యనున్న భావాంతరాలను ఎవరు తొలగించగలరు? తనకీ ఆయేషా ఏ విధంగా వుపయోగపడగలదు.

ఈ విధమైన ఆలోచనలతో యువరాణి వెళ్లడానికి ఉద్యుక్తురాలైంది. లీల ఆమెను అనుసరించింది. స్టూడియో దాటి బయటకు వెళ్ళేముందు రాణి వెనక్కి తిరిగి చూసింది. ఆయేషా చూపులు, తన చూపులు ఒక్కక్షణం పాటు ఐక్యమయ్యాయి.

లిల్లీ పూలమధ్య బొమ్మజెముడులా, ఈ నాటక ప్రపంచంలో ఆయేషా కంటగింపు అవుతుందని యువరాణికి బాగా తెలుసు. ఆవిడ తనను ధిక్కరించటం వల్లనే తను అంతగా ఆవిడ గురించి జ్ఞాపకాలతో తహతహలాడినట్లు కూడా ఆమెకు తెలుసు.

పరాకుగా కారులో కాలుపెట్టింది యువరాణి. ఈనాడు తనస్థాయి మరచి లీల స్టూడియోకి రావటంలాంటి పొరపాటు. మళ్లీ ఎప్పుడూ జీవితంలో చేయకూడదని యువరాణి మనస్సు తీర్మానించింది. కారు కదిలిపోయింది. యువరాణి మనోమందిరంపై తెర మరోసారి కిందకి వాలింది. అంతే.

(విపుల, ఫిబ్రవరి 1991)

❖

జటిన్

(గుజరాతీ కథ)

శ్రీ జయచార్

❋

కొంత మారాంచేసైనా తొలిసారిగా జీవితంలో స్కూల్‌కు వెళ్లటానికి తరుణ్ అంగీకరించటంతో అనిత మనస్సు కుదుటపడింది.

ముందు మారం చేసినా తీరా కారు ఎక్కాక హుషారుగా కనపడ్డాడు తరుణ్.

కారెక్కి తండ్రి పక్కన కూర్చున్నాడు. స్కూల్లో తినడానికి తల్లి ఇచ్చిన టీ, బిస్కట్ల పాకెట్ ఉన్న బ్యాగు పక్కనే పెట్టుకొంటూ, కారు కదులుతుండగా మిలమిల మెరిసే కళ్లతో తల్లివైపుకు గాలిలో చెయ్యి ఊపాడు. టాటా చెబుతున్నట్లు కొడుకు అలా ముద్దులు కురిపించేలా చేతులు గాలిలో ఊపుతూ, చిన్ని చిన్ని కళ్లతో చూస్తుంటే, గబుక్కున పరిగెత్తి వాడిని కారులోంచి వెనక్కి తీసుకొచ్చేద్దామనుకొంది అనిత సంతోషం పట్టలేక.

వాస్తవానికి తను కూడా వాడితో ముందు స్కూలుకు వెళ్దామనుకొంది. మరీ మొదటిరోజుగదా! కాని తను అలా వాడిపై ప్రేమతో వెళ్తే వాడు స్కూల్లో ఉండటానికే పేచీ పెడ్తాడేమో అని భయపడింది. ఈ విషయమై టీచర్ కూడా అతనితో ఏకీభవించటం తో అనిత ఆ ప్రయత్నం మానుకొంది.

మధ్యాహ్నంలోపుగా అనిత ఎన్నిసార్లు గడియారం చూసుకొందో.

మధ్యాహ్నం దాటినప్పటి నుంచి ఆవిడ మనస్సు అవిశ్రాంతం మారింది.

పక్కింటి వారమ్మాయితో తరుణ్ తిరిగి రావలసి ఉంది. ప్రక్క రోడ్డుమీద కారు ఆగినప్పుడల్లా అనిత కిటికీ వైపుకు చటుక్కున పరుగెత్తి తొంగి తొంగి చూస్తోంది. చిట్టచివరకు తాను పదేపదే అనుకొంటున్న తరుణ్ రానేరావటంతో అనిత ఉబ్బి తబ్బిబ్బు అయిపోయింది.

తలుపు తీసి తరుణ్‌ను ఎత్తుకొని ముద్దుల వర్షం కురిపించింది అనిత. తరుణ్ చేతులు, కాళ్ళు కడుక్కొని అన్నం తినటానికి టేబుల్ దగ్గరికి వచ్చి కూర్చున్నాడు. తరుణ్ భోజనం బల్లదగ్గర చాలా అసహనంగా ప్రవర్తిస్తున్నాడు. అంతా అటూ, ఇటూ కిందా పైన పోసి హడాహడావుడి చేశాడు.

"స్కూల్ ఎలా ఉంది తరుణ్?" అడిగింది అనిత పిల్లవాడిని.

"ఓకే... ఏం అలా అడుగుతున్నావు?" అడిగాడు తరుణ్ అమాయకంగా.

"నచ్చిందా?" అడిగించి అనిత మళ్లీ..

"నచ్చిందనే అనుకొంటాను" అన్నాడు తరుణ్ బుంగమూతి పెట్టి.

రేపు మళ్లీ నీకు వెళ్లాలని ఉందా? లేదా? అడిగింది తరుణ్ మనస్సు కనుక్కుందామని.

"ఏం? ఎందుకు వెళ్లను..." అన్నాడు తరుణ్.

'పోన్లే ఈ రోజు నుంచి స్కూల్ జీవితం ప్రారంభించినా స్కూల్ వాతా వరణం వాణ్ణి ఆకర్షిస్తే అదే పదివేలు' పదేపదే మనస్సులో అనుకొంది అనిత.

ఈసారి సమాధానంతో అనిత మనస్సు తృప్తి పడింది. హమ్మయ్య ఇక ఫర్వాలేదు. మళ్లీ స్కూల్‌కువెళ్లే ఉద్దేశ్యంతో ఉన్నాడంటే వాడికి నిజంగానే స్కూల్ నచ్చిందన్నమాట. ఒక్కసారి నిట్టూర్పు విడిచింది హాయిగా.

ఆనాటి సాయంత్రం టీవీ చూస్తూ తరుణ్, తరుణ్ డాడీ భాస్కర్, వాడి మమ్మీ అనితలు కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేయసాగారు.

భాస్కర్ కాసేపు ఆకబుర్లు, ఈ కబుర్లు విని "తరుణ్... నువ్వు స్కూల్లో ఈ రోజు ఏం చదువుకొన్నావు?" అని అడిగాడు తరుణ్‌వైపు తిరిగి నిదానంగా.

"ఏం లేదు?" అన్నాడు తరుణ్ తండ్రివైపు తలతిప్పకుండా.

"ఏం లేదా? అడిగాడు భాస్కర్ ఆశ్చర్యంగా.

"మేం స్కూల్లో ఎలా నడుచుకోవాలో చెప్పారు... అంతే" అన్నాడు తరుణ్.

"సో... అదైనా చెప్పారుగా మరేం చెప్పలేదంటావే. అదైనా చదువుకిందే వస్తుంది కదా?" అన్నాడు భాస్కర్ తరుణ్‌తో.

"అదేమోగాని ఒకబ్బాయిని ఈరోజు టీచర్ బాగా అరిచి కేకలు వేసింది. అతను చాలా తప్పుపని చేశాడు. పక్కనే ఉన్న ఒక చిన్నమ్మాయిని గిల్లాడు. ఆ అమ్మాయి కుయ్యో అని ఏడుపు లంఘించుకొంది. మరో అబ్బాయి బల్లపై నీళ్ళు పోశాడు. అందువల్ల ఆ అబ్బాయికి టీచర్ పనిష్మెంట్ ఇచ్చింది" చెప్పాడు తరుణ్.

"ఎవరా అబ్బాయి?" అడిగాడు భాస్కర్ ప్రేమగా.

"పేరా... పేరు... ఒక్కక్షణం ఆలోచించినట్లు ఆలోచించి "జటిన్.. జటిన్... డాడీ.... ఆ... అవును జటినే" అని సమాధానం చెప్పాడు.

"ఆ అబ్బాయి మరి అంత చెడ్డవాడా ఏంటీ?"

"అవును... టీచరైతే చాలా చెడ్డబ్బాయనే అనుకొంది. అతన్ని ఒకవైపున కార్నర్‌లో నుంచోపెట్టింది కూడా.

అనిత తరుణ్‌ని త్వరగా పడుకోబెట్టేసింది. మళ్లీ పొద్దున్నే స్కూల్‌కు పోవాలంటే తరుణ్ లేవటానికి మారాం చేసే అవకాశం ఉండకుండా.

రెండో రోజు కూడా తరుణ్ విజయవంతంగా స్కూలుకు వెళ్లి వచ్చాడు. వస్తూనే మామూలుగా కాక సంతోషంగా పరుగులు తీస్తూ వచ్చాడు.

"అమ్మా.. జటిన్ చాలా అల్లరిపిల్లాడు. ఇవాళ్ళ టీచర్‌ని కూడా కొట్టాడు" అని వస్తూనే జటిన్‌పై పితూరీలు చెప్పాడు.

"ఓరినాయినో.. వాడెవడ్రా... టీచరుకు కోపం రాలేదూ, ఛీ అవేం చేష్టలు" అంది అనిత.

"అవునమ్మా ఆవిడకు చాలా కోపం వచ్చింది. మళ్లీ వాణ్ణి శిక్షించింది" చెప్పాడు తరుణ్.

"అసలు టీచర్‌ని ఎందుకు కొట్టాడు?"

"తను చెప్పిందానిని తిరిగి నోటితో పలకమని చెప్పింది టీచరు. కానీ వాడు ఎంతకీ చెప్పడే. ఆవిడ రెండుమూడుసార్లు చెప్పినా వాడు తిరిగి చెప్పలేదు.

అందువల్ల ఆమె వాణ్ణి అల్లరివెధవా అని అరిచింది. వాడు ఆమెను కొట్టేశాడు" చెప్పాడు తరుణ్ అంతా వివరంగా.

"మంచిపని చేసింది. నీకూ అలా అనిపించదా... అడిగింది తరుణ్‌ని. ఈ మాటకు ఒత్తాసు పలుకమన్నట్లుగా.

"అంతేలే..." అన్నాడు తరుణ్ నెమ్మదిగా.

"వాడికేం శిక్షవేసింది టీచర్" అడిగింది అనిత.

"పిల్లలెవ్వరినీ వాడితో మాట్లాడవద్దని చెప్పింది. కాని టీచర్ చూడకుండా అందరూ వాడితో కలిసి మెలిసే ఆడారు" చెప్పాడు తరుణ్.

"అదంతాసరే ఇకదాని సంగతి మర్చిపోదాం. ఇంతకీ ఈరోజు నువ్వేం నేర్చుకున్నావు?"

"అమ్మా! నిదరొస్తోంది. ఈపూట పడుకోనా" అడిగాడు తరుణ్ తల్లి అడిగిన ప్రశ్నకు సమాధానంగా.

మూడో రోజు కూడా జటిన్ కబుర్లే చెప్పాడు తరుణ్.

"ఒకమ్మాయిని జటిన్ బాగా కొట్టాడు. ఊయ్యాల ఊగుతున్న మరో అమ్మాయిని పైనుంచి కిందికి తోశాడు. ఫలితంగా టీచర్ వాణ్ణి ఇంటర్వెల్లో కూడా విడవకుండా క్లాస్ రూపంలోనే కూర్చోపెట్టింది".

"మరుసటి రోజు కూడా జటిన్‌ను క్లాసు బయట నిల్చోబెట్టింది. తన బల్లని తోసెయ్యడమేగాక, వాడి ఆటవస్తువులను క్లాసంతా విసిరేయటంతో టీచర్ జటిన్‌కు ఆ శిక్ష విధించింది".

"ఆ మర్నాడు మరీ దరిద్రంగా ప్రవర్తించాడు జటిన్. జటిన్ ఒక బంతిని టీచర్ రాసే బ్లాక్‌బోర్డుపైకి విసిరేశాడు. టీచర్ వాడి వీపుమీద ఓ దెబ్బవేసింది".

ఈ విధంగా రోజూ జటిన్ గురించి తరుణ్ చెప్పడం విని అనిత బాగా కంగారు పడిపోయింది.

శనివారంనాడు భర్తతో "పిల్లవాడికి ఈ స్కూల్లో చదువు బాగా సాగుతుందని నమ్మకం నాకులేదు. ఆ జటిన్‌లాంటి పిల్లలు చేసే గొడవ ఎంతైనా న్యూసెన్సే? ఏమంటారు" అని అంది అనిత ఆదుర్దాతో.

"మరేం ఫర్వలేదు. ఈ సమస్యవల్ల తరుణ్‌కేం నష్టం కలగదు. సంఘం, స్కూలు అన్న తర్వాత ఇవన్నీ ఉంటాయి. ఇలాంటి వారితో వాడికి చిన్నప్పుడే అనుభవం కలగటం వాడి మంచికేలే" అన్నాడు భాస్కర్.

సోమవారం తరుణ్ ఆలస్యంగా ఇంటికి వచ్చాడు. వస్తూనే జటిన్ కబుర్లను ఓ బస్తాడు మోసుకొచ్చాడు.

"జటిన్ ఇవ్వాళ మళ్లీ గొడవ, రోజల్లా టీచర్ పక్కనే కూర్చోవలసివచ్చింది. ఆటకు కూడా పోనీయలేదు టీచర్"

"పోన్లే! ఆ జటిన్ తలనెప్పి మనకెందుకు? నువ్వేం చదువుకొన్నావు స్కూల్లో.

"1,2,3,4... 5... 6..." చెప్పాడు తరుణ్.

"సరే... రా... భోంచేద్దువుగాని" అంది అనిత.

సాయంత్రం తరుణ్ జటిన్ గురించి తండ్రికి బోలెడన్ని చెప్దామను కున్నాడు. నీళ్ళు తాగుతున్న అమ్మాయి నోటికేసి గ్లాసు ఎలా గుద్దాడు?... ఎలా పిల్లల పెన్సిల్స్ లాగేసుకున్నాడు? ఎలా టీచర్ కుర్చీ కింద చాక్‌పీసుల్ని చోరీ చేశాడు? ఇవన్నీ తండ్రికి చెప్పాలని తరుణ్ తహతహ...

"అసలీ జటిన్ ఎలా ఉంటాడు తరుణ్?" అడిగాడు తండ్రి భాస్కర్.

"నాకంటే పొడుగ్గా, లావుగా ఉంటాడు. డాడీ... నీకంటే ఎక్కువ బలం కూడా. అతనో పెద్ద రౌడీలాగుంటాడు.."

తరుణ్ స్కూలుకు వెళ్లటం ప్రారంభించి రెండవవారం మొదలైంది. ప్రతి మంగళవారం పిల్లల తల్లిదండ్రులతో టీచర్ల చర్చలు జరుగుతాయి ఆ స్కూల్లో.

ఆ రోజు జరిగే మీటింగ్‌కు స్కూల్‌కు వెళ్దామనుకొంది అనిత. తరుణ్ టీచర్ని కలిసి జటిన్ గురించి అడగాలనుకొంది వీలైతే. జటిన్ తల్లిని కూడా కలవాలనుకుంది. అసలీ పిల్లవాడు ఇంటిదగ్గర కీచకుడై ఉంటాడనుకుంది. కాని అనితకు హఠాత్తుగా ఆరోజు కొంచెం జ్వరం రావటంతో స్కూలుకు వెళ్లే ఉద్దేశ్యం విరమించుకుంది. పోన్లే.. వచ్చేవారం వెళ్దాం అని భావించి ఊరుకుంది.

తరుణ్ స్కూల్‌కు వెళ్లి రావటం మొదలై మూడోవారం ప్రవేశించింది. ఇప్పుడు తరుణ్ ఇంట్లో జటిన్ పేరు రామనామంలా మారింది. జటిన్ చేసే

గొడవ గురించి తల్లి స్నేహితులకు, తన అమ్మమ్మ, బామ్మలకు అందరికీ ప్రచారం చేసేశాడు తరుణ్. జటిన్ గురించి తరుణ్ చెప్పటం ఏ స్థాయికి వెళ్లిందంటే జటిన్‌ను తరుణ్ విపరీతంగా అభిమానిస్తున్నాడేమోనని పదిమంది భావించే స్థాయికి ఎదిగిపోయింది. చివరికి ఇంట్లో భాస్కర్, అనిత, తరుణ్‌లు ఎవరైనా సరే పొరపాటు చేస్తే ఏయ్.... జటిన్ లాగా చేకండి" అని తమాషాగా హెచ్చరించుకునే స్థాయికి వెళ్ళిపోయింది.

నాల్గవ వారంలో జటిన్ హఠాత్తుగా మారిపోయిన వార్తని తెచ్చాడు తరుణ్.

"ఇవాళ, నిన్న జటిన్‌లో మార్పువచ్చింది. చాలా మృదువుగా మంచిగా ఉంటున్నాడు" చెప్పాడు తరుణ్.

"అయిదవవారం మరీ మంచిగా ఉన్నాడు. ఇప్పుడు జటిన్ క్లాసు లీడర్ కూడా" చెప్పాడు తరుణ్.

"క్రమంగా అయిదవవారం అంతా మంచిగా ఉండటంతో జటిన్ టీచరుకు అభిమాన స్టూడెంటు అయ్యాడు. పిల్లలంతా అతనంటే చాలా ఇష్టపడుతున్నారు. టీచరైతే జటిన్‌కు ఏపిల్ పండు కూడా బహుమతిగా ఇచ్చింది. జటిన్ బ్లాక్ బోర్డు తుడుస్తున్నాడు. కిందపడ్డ చెత్తకాగితాలు ఏరి బయటపడేస్తున్నాడు. పిల్లలను వరుసలో నిలబెట్టడంలో జటిన్ ఎంతో సహాయం చేస్తున్నాడు. అతనికి ఎంతో మంచిపేరు రావటంతో స్కూలువారు అతనికి బంగారు రంగు నక్షత్రాన్ని కానుకగా ఇచ్చి అతని పేరును స్కూలు నోటీస్ బోర్డులో వేశారు" ఇలా వారం వారం జటిన్ గురించి తరుణ్ తల్లికి రిపోర్టు ఇస్తున్నాడు.

"రేపు వచ్చేవారం టీచర్ల తల్లిదండ్రుల మీటింగ్ నేను వెళ్లి జటిన్ తల్లిని కలుస్తాను" అంది తరుణ్ తల్లి అనిత భాస్కర్‌తో.

"అసలు జటిన్ అంత త్వరగా ఎలా మారాడో కనుక్కో! నాకు నిజంగా తెలుసుకోవాలని ఉంది" అన్నాడు భాస్కర్.

ఆ వారంలో జటిన్ హఠాత్తుగా మళ్లీ చాలా చెడ్డవాడిలా ప్రవర్తించాడని తరుణ్ చెప్పాడు.

"ఏమైంది?" అడిగింది అనిత.

"ఒకమ్మాయిని అనకూడని బూతు తిట్టాడు" చెప్పాడు తరుణ్.

"అయితే టీచర్ ఏం చేయలేదా?"

"క్లాసు అయిపోయే వరకూ వాటి నోటికి ప్లాస్టర్ అంటించింది" చెప్పాడు తరుణ్.

"ప్లాస్టర్ క్లాసు అయిపోయేముందు తీసేసింది టీచర్. కాని వాడు గేటు దాటిపోతూ మళ్లీ ఆ అమ్మాయిని అదే తిట్టు తిట్టాడు. ఎవ్వరూ వినలేదు" తరుణ్ అదోలా నవ్వుతూ చెప్పాడు అనితతో.

"అయితే ఆ తిట్టేదో నువ్వు విన్నావన్నమాట" అడిగింది అనిత.

"అవును నేనొక్కడినే విన్నాను" అని పరిగెత్తుకుంటూ లోపలికి వెళ్లి పోయాడు. భాస్కర్ వచ్చే సమయానికి అనిత స్కూల్లో మీటింగ్‌కు బయల్దే రుతుంది.

"వీలైతే జటిన్ తల్లిని మనింటికి ఒక కప్పు టీకి ఎందుకు పిలవకూడదు?" అన్నాడు భాస్కర్.

"ఆవిడుంటే తప్పక పిలుస్తాను" అంది అనిత.

"ఆవిడ రాకుండా అసలు మీటింగ్ జరిగే అవకాశమే లేదే" అన్నాడు భాస్కర్ చిరునవ్వు నవ్వుతూ.

మీటంగ్ జరుగుతున్నంతసేపు అనిత ఆదుర్దాగానే ఉంది. ఆవిడకళ్ళు జటిన్ తల్లి కోసం తీవ్రంగా గాలిస్తున్నాయి.

ఒక తల్లి లేచి తన బిడ్డ ప్రవర్తనకు క్షమాపణ చెప్పుకొంది. కాని ఆవిడ జటిన్ తల్లి మాత్రం కాదని అనితకు స్పష్టంగా తెలుసు. చివరికి మీటింగ్ అయిపోయింది. జటిన్ తల్లి మాత్రం ఎవరో అనిత కనుక్కోలేకపోయింది.

తరుణ్ క్లాస్ టీచర్ వద్దకు వెళ్ళి "నేను తరుణ్ తల్లిని" అని పరిచయం చేసుకుంది అనిత.

"మీరా? మీ కోసమే మేం ఎదురుచూస్తున్నాం. మీ అబ్బాయి తరుణ్‌తో చచ్చిపోయాం మొదటి రెండువారాలు. ఇప్పుడు కాస్త మెరుగులేండి. ఇప్పుడు తరుణ్ క్లాస్ మానిటర్ తెల్సా!" చెప్పింది క్లాస్ టీచర్.

"అవును.. జటిన్ తల్లి రాలేదు మీటింగ్‌కు?" అడిగింది అనిత ఆదుర్దాగా.

"జటిన్. జటినెవరు? అసలు జటిన్ అనే అబ్బాయే ఈ క్లాసులో లేదు" అంది టీచర్ తెల్లమోహం వేస్తూ.

ఈసారి తెల్లమోహం వేయటం అనిత వంతయింది. పొరలు వీడి అసలు నిజం తెల్సినట్లయి కాలి కింద భూమి కదిలిపోతున్నట్లనిపించింది అనితకు.

(విపుల, జులై 1991)

❖

సన్మానం

(హిందీ కథ)

ఎం. మనుజ

ఆ నాటి సాహిత్య సదస్సుకు ఛైర్మన్ స్థానం అలంకరించిన కవి ప్రముఖులు తన సీట్లోనుంచి లేచి ప్రసంగించడానికి ఉద్యమించారు. ఒకసారి గొంతు సవరించుకున్నారు.

“జంటిల్మెన్... ప్రతి సంవత్సరంలాగా ఈసారి కూడా మనం ‘కవితా వీర్’ అవార్డుకు సరైన వ్యక్తిని ఎంపిక చేయవలసి ఉంది”. ఒక్కక్షణం ఆగా రాయన. తన ముందు బల్లపైనున్న కాగితాలను ఒకసారి పరిశీలించారు.

వేదికపై ఇరువైపుల సదస్యులు కూర్చుని వున్నారు. వారిలో ముగ్గురు సూట్, టై ధరించినవారు. ఇద్దరు సఫారి సూట్‌లు, మిగిలిన ఇద్దరు ఇన్‌షర్టు చేసుకొన్నవారు. ఒకరుమాత్రం తెల్ల లాల్చి, పైజమా వేసుకొని, దానిపై నెహ్రూ జాకెట్ వేసుకొని ఆసీనులై ఉన్నారు.

“మనం ఎంపిక చేయవలసిన వ్యక్తి ధర్మం, భాషా, ప్రాంత బేధాలను తన కవితల్లో చొరనీయని కవి అయి ఉండాలి. యావత్ జాతి సమగ్రతా సర్వధర్మ సమత్వభావం, రక్షణ ఆకాంక్షించే ఏ వ్యక్తి కవితలవల్ల ఈ దేశ యువత హృదయాల్లో నిస్త్రాణమై ఉన్న శక్తి ఉత్తేజితమవుతుందో అటువంటి కవిని, కవిత్వాన్ని మనం నిజంగా సన్మానించాలి. మీరంతా మీమీ అనుభవంతో

అటువంటి కవి పేరొకటి సూచించాలని నా ప్రార్థన".

ఈ మాటలు చెప్పి ఛైర్మన్‌గారు కుర్చీలో జారగిలబడ్డారు. సమావేశ నిర్వాహకులు బిస్కట్, మిఠాయి, బూందీ ఉంచిన ప్లేట్లు ఛైర్మన్‌గారి ముందు టేబిల్‌పై సదస్యుల అల్పాహారం కోసం ఉంచారు.

అల్పాహారం ముగిసేసరికి మరో నిర్వాహకుడు వచ్చి చక్కటి కొత్త కప్పుల్లో చాయ్‌ని పోసివెళ్ళాడు.

మళ్లీ పదిహ ఏను రోజుల తర్వాత కలుద్దామని సదస్యులు నిర్ధారించి సభనుంచి లేచిపోయారు.

❖ ❖ ❖

రాంప్రసాద్‌మిశ్రా తన ఇంటిమెట్లు కేవలం మూడే మూడు ఎక్కేసరికి ఆయాసపడసాగారు. ఆయన భుజాన ఇంకా సంచి వేలాడుతునే ఉంది. ఇంకా మూడు మెట్లు ఎక్కాల్సి ఉంది. గత రెండు రోజులుగా రాంప్రసాద్‌గారి ఆరోగ్యం ఏమంత బాగుండటంలేదు. రెండు మెట్లేక్కేసరికి ఆయనకు ఆయాసం వస్తోంది. మామూలుగా ఆయనకు నడవటం ఎప్పుడూ సమస్యకాదు. తన పెన్షను తీసుకోవడానికి ఆయన తను పనిచేసిన పూర్వకార్యాలయానికి మూడు కిలోమీటర్లయినా నడిచిపోగలరు. కేవలం గుడిపక్కనించి పోయే దారి ఎత్తుగా ఉండటం వలన కొంత ఇబ్బంది మాత్రం ఎదుర్కొన వలసి వచ్చేది.

ఆయనకు రావలసిన పెన్షన్ తాలూకు బిల్లు ప్రతినెలా ఇరవై తారీఖు లోపల ట్రెజరీ ఆఫీసుకు రావలసి ఉంది. తన కార్యాలయ అధికారి ఆ బిల్లును ట్రెజరి ఆఫీసుకు ఇరవై తారీఖు లోపల పంపుతానని చెప్పాడు కూడా. అందువలన తను కూడా పెన్షన్ తీసుకోడానికి వెళ్లాడు.

తీరా అక్కడికి వెళ్లాక తెలిసింది వేరు. ఆయన పెన్షను తాలూకు బిల్లు ఇంకా సిద్ధంకాలేదని కార్యాలయ సిబ్బంది చెప్పటంతో రాంప్రసాద్‌గారు నీరుగారిపోయారు.

రాంప్రసాద్‌మిశ్రాగారికి కోపం కూడా వచ్చింది. నియమం ప్రకారం ఒకటవ తారీఖుకు అందవలసిన పెన్షను ఆ నెల ఇరవై రోజులు గడిచినా అందకపోవటం రాంప్రసాద్‌గారి కోపానికి కారణం. మరి ఈ కాలంలో

ఇల్లు గడవాలంటే కుటుంబ ఖర్చులు ఎదుర్కోవాలంటే ఎంత కష్టమో ఎవరైనా ఊహించవచ్చు. ఆయనకు ఆ కార్యాలయ నిర్వాహకుడి మీద ఎంత తీవ్రంగానో కోపం వచ్చింది. ఆ కార్యాలయంలో పనిచేసే సిబ్బందికి ప్రజల సమస్యలంటే చీమప్రాణం కన్నా అల్పం అన్న భావన. వారికి వారి సొంత పనులంటేనే ఇష్టం. ఒకప్పుడు రెండువేలు పైచిలుకు జీతంలో తను అక్కడే వారితో పనిచేసిన సంగతి కూడా వారి స్మృతిపథంలో లేదు. కేవలం తన అయిదు వందల రూపాయల పెన్షను కోసం తనని అష్టకష్టాల పాలు, ఇక్కట్లపాలు చేస్తున్నారని వాళ్లు ఎందుకు గ్రహించలేకపోతున్నారో రాంప్రసాద్‌కు అర్థం కావటంలేదు.

"ఏమిటండీ మీరంతా నాతో పని చేసినవారు. కనీసం మీరు మీ వాడి కోసమైనా ఈ పని చేసి పెట్టలేరా?" చాలా చికాకుగా అడిగారు రాంప్రసాద్ మిశ్రా అక్కడి సిబ్బందిని.

రాంప్రసాద్‌గారి వ్యధలో అర్థంలేకపోలేదు. ఈ కార్యాలయ సిబ్బంది తమ జీతభత్యాలకు సంబంధించిన ప్రతి నెలా బిల్లును పదిహేనవ తారీఖు లోపునే పంపుకుంటున్నప్పుడు ఒక రిటైరయిన ఆఫీసరు తన పెన్షను అయిదువందల కోసం ఎంత తహతహలాడ్తారో తెలుసుకోలేకపోవటం ఎంతో అమానుషం. వారిష్టం వచ్చినట్టు ఒకసారి ఐదవ తారీఖు, ఒకసారి ఇరవై తారీఖు బిల్లులు తయారుచేసి ఇస్తుంటారు. కారణం ఇక్కడ పెన్షన్ ఇచ్చే క్లర్కు పనిచేస్తే కదా! ఎప్పుడూ ఏదో ఒక పనిపై బయట తిరుగుతూ ఉంటాడు. తను అద్దెకు నడిపే టాక్సీ సంగతి చూసుకోవటం ప్రభుత్వ పనివేళల్లో అతను చేసే ముఖ్యమైనపని.

రాంప్రసాద్‌గారి ప్రశ్న విన్న క్లర్కు "నువ్వు ఏం చేసుకుంటావో చేసుకో. నాకు ఇక్కడ పోయేదేమీలేదు" అని కటాకటి సమాధానం ఇచ్చాడు. అతని పేరు టింగే. టింగే సమాధానం విని రాంప్రసాద్ మిశ్రా గారు అవాక్కయినారు.

కోపంవల్లనో లేక అహం దెబ్బతినటం వల్లనో మిశ్రా అవాక్కయి పోలేదు. అతని జవాబు వెనుక దర్శనమిస్తున్న నేటి సమాజస్థితి మిశ్రాగారిని అవాక్కు చేసిందంటే బాగుంటుందేమో. తను నేటి సమాజం గురించి రాసిన కవిత యథాతథంగా కళ్లముందు జరుగుతున్నందుకు కూడా మిశ్రా అవాక్కయినారు.

రాంప్రసాద్ మిశ్రాగారు కవి. ఆయన హెడ్ క్లర్క్‌గా పనిచేశారు. క్లర్కు ఉద్యోగం మినహాయిస్తే ఆయనకున్న ఒకే ఒక కాలక్షేపం కవితలు రాయటం. ఆయన రిటైర్ అయి కూడా ఐదు సంవత్సరాలు దాటాయి. కాని నేటివరకూ ఆయన పెన్షను నిర్ధారణకాలేదు. సమయానికి తన పెన్షన్ తుది రూపం రాని కారణాన ఆయన తన పెన్షనును ప్రభుత్వానికే అమ్ముకొనే వసతిని వినియోగించుకొని కూతురు వివాహం చేయ సంకల్పించారు. అంతకు పూర్వం ఉద్యోగంలో ఉన్న రోజుల్లో వేతన నిర్ధారణలో వచ్చిన తేడాల పట్ల రావలసిన జీతం బకాయిల కోసం ఆయన కోర్టుకు వెళ్లవలసి వచ్చింది. ఒక వైపు కూతురు వివాహం కోసం అమ్ముకున్న పెన్షన్ డబ్బులు కొన్ని వేలు రావాలి. మరోవైపు కోర్టు వ్యాజ్యంలో గెలిచిన తర్వాత ప్రభుత్వం ఇవ్వవలసిన జీతం బకాయిలు కొన్ని వేలున్నాయి. ఇన్ని రావలసి ఉన్నా ఆయన తన ఖర్చులన్నీ అప్పుచేసే తీర్చుకోవలసి వస్తోంది. గవర్నమెంటుకు ఎన్నిసార్లు వినతి చేసినా బడ్జెట్ లేదనో, ప్రభుత్వం దగ్గర ధనం లేదనో కొంటె సమాధానాలు వస్తాయేకాని ధనం మాత్రం రాదు. ఇక టింగేలాంటి క్లర్కుల ప్రవర్తన మాట వేరే చెప్పనక్కర్లేదు.

అక్కడే నిలబడి ఉన్న రాంప్రసాద్‌గారిని చూసి "సార్... నేటి తరం మీలాగా రూల్స్‌కి, చట్టాలకి భయపడేదికాదు. మీరు ఎవరితో చెప్పుకొన్నా నాకేం భయంలేదు. ఏమనుకొంటున్నారు" మరోసారి కోపంగా చెప్పాడు టింటే. టింగే సుమారు ముప్పై ఐదు సంవత్సరాల వయస్సున్నవాడు. వాళ్ల కులానికి చెందిన వ్యక్తి ఉద్యోగాల ఖాళీని భర్తీ చేయటంకోసం ప్రభుత్వం టింగేకి ప్రొమోషన్ అర్హత లేకపోయినా అన్ని నియమాలు పక్కకు తోసి ఈ కార్యాలయంలో అతన్ని నియమించింది.

"పోన్లేవయ్యా... నేను ఎవ్వరి సహాయంకోరకుండా నేరుగా నిన్నే అడుగుతా నువ్వు చెప్పు, నా పెన్షన్ సంగతి ఏం చేయదల్చుకొన్నావు?" అడిగారు రాంప్రసాద్‌గారు.

"మీ పెన్షన్ సంగతి గురించి నేనేం చేసేదుంది? ఇక్కడ గత మూడు రోజులుగా ఎగ్జిక్యూటివ్ కమిటీ వారి జీతాల బిల్లులు తయారు చేయటంలో మేమంతా తలమునకలై ఉన్నాం. ఈ బిల్లులు తయారు చేయమని పైనుంచి

మాకు ఉత్తర్వులు. కాని ఇంతవరకూ పై అధికారులెవ్వరూ మిశ్రాగారి పెన్షన్ ఫైనల్‌గా సెటిల్ చేయమని ఉత్తర్వులు జారీచేయలేదు. అలాంటప్పుడు నేను మీ పనిచేసి బయట, లోపల కూడా తన్నులు చీవాట్లు తినాలా? మీరు రిటైరయి చాలా కాలమయింది. బహుశా మీకిక్కడి పరిస్థితులు సరిగ్గా తెలియవు లాగుంది. మీ పోస్టులో వచ్చిన క్లర్కు ఇలాంటిదేదో చేయబోతే అతన్ని ఉద్యోగంలోంచి పీకేయబోయారు. చివరికి అతనే రాజీనామా చేసి వెళ్లిపోయాడు. ఆయన ఖాళీ చేసిన స్థానంలో శాంతబాయిగారు వచ్చి చేరింది. ఆమె మెటర్నిటీ శలవుపై వెళ్లి శలవును నేటికీ పొడిగిస్తూనే ఉంది. మీరు రిటైరయిపోయిన వేళ ఎలాంటిదోకాని, ఆ సీట్లో కూర్చున్న ఎవ్వరికీ జీతం స్థిరంగా ఉండదు. సిబ్బంది అయిదుగురు, వారిలో ముగ్గురు ఇలాంటి కేసులే. మిగతా ఇద్దరితో ఎంత పనైతే అంతే చేస్తాం. ముఖ్యమంత్రి ఆదేశాలమేరకే ఈ బిల్లులు తయారు చేస్తున్నాం. ఒకవేళ మీరు కూడా ముఖ్యమంత్రి సిఫారసు తెచ్చుకోగలిగితే మీకు చేస్తాం. ఒకవేళ అలా కాకపోతే కొంత కాలం ఆగడండి. ఈ బిల్లుల తయారీ అయితే మీ పెన్షన్ గురించి నేను ఆలోచిస్తాను. ఈ మధ్యలో మమ్మల్ని డిస్టర్బ్ చేయకండి" అన్నాడు టింగే.

టింగే మాటలు విని మిశ్రాగారు చాలా బాధపడ్డారు. అతని వయస్సులో తనలో ఎంతటి దేశభక్తి, సేవాభావం ఉండేది. కేవలం కొన్నేళ్ళ సర్వీసులోనే టింగే లాంటి యువత లంచాలు, సిఫార్సుల ఊబిలో ఎలా కూరుకుపోయింది. ఈనాడు దేశంలో ప్రతి సీటులోనూ దాదాపు లంచగొండో, దళారో పెత్తనం చెలాయిస్తున్నాడు. ఇంతమంది రోజూ చేసే పని కాబట్టే ఇదే ప్రజాస్వామ్యం అని టింగే అన్నా ఆశ్చర్యపోవలసిన పనిలేదు.

ఇలా ఆనాటి సంఘటనలన్నీ నెమరేసుకుంటూ, ఒకప్పటి తన కవితలను తలుచుకుంటూ మెట్లమధ్యనే కూర్చున్నారు రాంప్రసాద్‌మిశ్రా. కాసేపటికి క్రమంగా తేరుకుని మిగతా మూడు మెట్లెక్కి పైకి చేరారు.

❖ ❖ ❖

సాహిత్య సదస్సు ప్రారంభమైంది. టై సర్దుకుని ఛైర్మన్‌గారు ప్రసంగం ప్రారంభించారు.

"జంటెల్మెన్ ఈసారి ప్రస్తావితమైన పేర్లలో శ్రీ రాంప్రసాద్ మిశ్రాగారి పేరు ప్రముఖంగా నిల్చింది నిజమే. ఆయన మహాకవే. స్వాతంత్ర్య యుద్ధ సమయంలోను, అనంతరమూ ఆయన రాసిన కవితలు ప్రశంసనీయమే. అటువంటి వారిని సన్మానించవలసిందే. కాని గత సంవత్సరం మహిళా సంవత్సరం కాబట్టి ఈ సందర్భంగా గత సంవత్సరానికి సాహిత్యంలో ఇచ్చే కవితా పురస్కారం ఒక మహిళకు ఇస్తే బాగుంటుందని నా అభిప్రాయం" అని ముగించారు.

ఛైర్మన్‌గారి ప్రసంగం విని సభికులు ముగ్ధులై చప్పట్లతో వేదిక మారు మ్రోగించేశారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖ అధికారి భార్య అయిన శ్రీమతి నీలాహనదార్ తన మారుతీకారులో, తన కవితలు అచ్చు వేసేందుకు భర్త సిఫార్సుపై అంగీకరించిన ఒక పబ్లిషర్‌తో సహా ఈసారి సాహిత్య సదస్సుకు వచ్చేసింది.

ఆవిడ కవితలను చదివిన సభ్యులు ఆమె కవితల్లోని శృంగార భావాలను, భావ కవితా ధోరణులను అత్యంత ఉన్నత మైనవిగా ప్రశంసించారు. ఆ కవితలను విన్న పబ్లిషింగ్ హౌస్ జనరల్ మేనేజర్ తాను ఆ కవితలను త్వరలోనే ఒక సంపుటిగా అచ్చు వేయబోతున్నట్టు సభాముఖంగా ప్రకటించారు.

తర్వాత ఛైర్మన్‌గారు లేచి ప్రసంగించటం ప్రారంభించారు.

"సభ్యులారా... గతంలో మనం ఒక స్త్రీ కవితామూర్తికి ఉత్తమ కవిత పురస్కారం ఇవ్వదలచుకున్న మాట వాస్తవమే. అందువలన మనముందు నేడు ఇద్దరు ప్రముఖ కవయిత్రుల పేర్లు ప్రత్యక్షమయినాయి. అయితే వీరిలో ఒకరిది విప్లవ సాహిత్యం. దేశంలోని అరాచకత్వాన్ని ఎండగడ్తూ ఈ విప్లవ సాహిత్యం హింసనే బోధిస్తున్నది. మరో కవయిత్రిది భావ సాహిత్యం. ఆ కవితామూర్తి ఇక్కడ కవితలల్లి విదేశాలకు వెళ్ళి అక్కడే స్థిరపడాలని భావిస్తోంది. అంతేకాక, ఆవిడ సాహిత్యంపై విదేశీ కవితల ప్రభావం చాలా ఎక్కువ. పైగా ఆమె భవిష్యత్తులో ఇక దేశీయ కవితరాసే ఉద్దేశ్యం లేనట్టు తెలుపుతోంది. తన భర్తతో విదేశాలకు వెళ్లి అక్కడ కవిత్వోద్యమరీతులు పరిశోధించాలని ఆవిడ సంకల్పం. ఈ నేపథ్యంలో నా దృష్టిలోకి ఇటీవల మన ప్రధాని అన్న

మాటలు గుర్తుకు వస్తున్నాయి. ఆయన అన్న మాటలను ఆచరణలో పెట్టటం మనందరి కర్తవ్యం కూడా. ఈ దేశం ప్రధానంగా ఆదివాసులది. వారి హక్కులను కాలరాచి మనం అనేక సౌఖ్యాలు అనుభవిస్తున్నాం. అడవులు, కొండలు, లోయలు ఆక్రమిం చేస్తున్నాం. వారి జీవన భృతి కొల్లగొడుతున్నాం. ఈ పరిస్థితుల్లో దేశ ఐక్యతలో ఆదివాసుల పాత్రను ప్రత్యేకించి గుర్తించే కవితా సంకలనానికి మనం బహుమతి ఇస్తే బాగుంటుందని నా సంకల్పం. మీరేమంటారు?" అని కూర్చున్నారు చైర్మన్.

ఛైర్మన్ ప్రసంగానికి ముగ్ధులై మరోసారి కరతాళధ్వానాలు మోగించారు సభికులు.

❖ ❖ ❖

"సభికులారా! గతసారి నిశ్చయించినట్టుగానే ఈసారి మన కవితా పురస్కారం ఆదివాసులపై ఉత్తమ కవిత్వం రాసినందుకు ఆదివాసై పుట్టిన శ్రీ టింగేకి ఇవ్వదలిచాం. టింగే ప్రస్తుతం ప్రభుత్వ పెన్షన్ కార్యాలయంలో క్లర్కుగా పనిచేస్తున్నారు. ఆయన 1955 మే నాలుగవ తారీఖున ఆదివాసి ప్రాంతమైన టింగేలో జన్మించారు. వారి కుటుంబంలో ఈయన మొదట చదువుకున్న వ్యక్తి. టింగే తండ్రి గొప్ప సేవాభావ సంపన్నుడు. కార్యకర్త. తండ్రి ఆలోచనలలో ప్రేరితుడై టింగే కూడా ఎంతో సేవాభావాన్ని అలవరచుకున్న వ్యక్తి. ఇంతవరకూ ఆదివాసి భాషల్లో టింగే రాసిన కవితా సంపుటే మొదటిది. అందువలన అతనికి లక్షరూపాయల నగదు, ప్రశంసాపత్రం ప్రదానం చేయటమైంది" అని ఛైర్మన్‌గారు తర్వాత జరిగిన సాహిత్య సదస్సులో ప్రకటించేశారు.

రాంప్రసాద్‌మిశ్రాగారు మాత్రం యథావిధిగా తన పెన్షన్ వేటలో పెన్షన్ కార్యాలయానికి వెళ్ళారు. కాని ఇప్పటికీ ఆయన పెన్షన్ బిల్లు తయారు కాలేదని తెలిసి ఎక్కడలేని నిరాశ నిస్సత్తువ ఆయన్ని ఆవహించాయి. ఆయనకు బిల్లు తయారు చేస్తానని మాట ఇచ్చిన టింగేకు ఆదివాసుల కోటా క్రింద డిప్యూటీ కలెక్టర్ ప్రమోషన్ వచ్చి వేరే చోటికి బదిలీ చేశారని కూడా మిశ్రాగారికి తెలిసింది. ఇప్పుడు ఆ పెన్షన్ ఆఫీసులో కేవలం చప్రాసీ మాత్రం మిగిలాడు.

రాంప్రసాద్ మిశ్రాగారు బయటికి వస్తూ చప్రాసీని అడిగారు. "టింగేగారు

పోతూ పోతూనైనా కనీసం మా పెన్షన్ బిల్లు తయారు చేశారా?" అని.

"చేశారు సార్. ఆయన ట్రాన్స్‌ఫర్ అయిపోతూ ఛార్జి ఇచ్చిపోవాలి కదా. అందుకని ఇప్పుడొస్తారు. ఆయనకు 'ఉత్తమ జాతీయ కవి' అవార్డు ప్రకటించారుగదా. ముఖ్యమంత్రి చేతులమీదుగా దాన్ని అందుకోవటానికి ఇప్పుడే వెళ్లారు. మధాహ్నం వస్తారు. సరేనా" చెప్పాడు చప్రాసీ.

ఇక రాంప్రసాద్‌మిశ్రాగారి నోట మాట వెలువడే అవకాశం లేనట్లుగా నోరు బిగుసుకుపోయింది.

(విపుల, ఆగస్టు 1991)

❖

ప్రాణం విలువ

(ఇండో ఆంగ్లియన్ కథ)

ఆర్.ఎం. బొర్గాంవ్‌కర్

✻

నేను డాక్టరు కాకపూర్వం జీవితంపట్ల నా లక్ష్యం వేరుగా ఉండేది. "జీవించు, ఎదుటివారిని జీవించనీయి" అప్పట్లో నా జీవితాశయం. కాని, డాక్టరునయినాక నా జీవితాశయంలో తీవ్రమైన మార్పు సంభవించింది. "మరణించు, ఇతరులని మరణించనీయి" ఇది డాక్టరుగా మారాక నా జీవితాశయం. ఎంత ఆశ్చర్యం!

ఎవరైనా చికిత్సలేని రుగ్మతతో బాధపడుతుంటే, ఆ బాధనుంచి త్వరగా విముక్తి పొందాలని తహతహలాడుతుంటే, వారికోసం చక్కటి పరిష్కారమార్గాన్ని కనుగొన్నాను నేను. వారికి తెలియకుండా, బాధ కలిగించకుండా ఒక్క ఇంజెక్షనుతో వారిని చంపటం. ఎంత సులువైంది! ఎంతో బాగుందికదూ!

ఈ ఆలోచన నాకు మెడిసిన్ చదివేరోజుల్లో రాలేదుగాని, ప్రస్తుతం మాత్రం ఇంతకంటే అద్భుతమైన ఆలోచన లేదని నాకు అనిపించింది. దీనివలన జనాభా సమస్య పరిష్కారమవటమేగాక, జనుల బాధలకు కూడా శాశ్వత పరిష్కారం లభిస్తోంది. ఒక్క దెబ్బకు రెండు పిట్టలు.

అయితే, ఈ ఆలోచన నాకు స్వతహాగా తట్టిందేమీకాదు. దీనికో అద్భుత ప్రేరణ ఉంది.

నా దగ్గర చాలాకాలం నుంచి తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న పేషెంటు ఒకరుండేవారు. "అమ్మో! ఈ బాధ నే పడలేను. నాపై దయచూపి నన్ను చంపేయండి బాబోయ్. నేను దీన్ని భరించలేను. అమ్మో! నన్ను చంపండి బాబోయ్" అని అతను తెగ అరిచి కేకలు పెడుతూ గోల చేస్తుండేవాడు.

నిజమే అతననుభవిస్తున్న రోగం భయంకరమైంది. ఆ బాధ తట్టుకోవటం చాలా కష్టం.

సరిగ్గా ఈ వ్యక్తే నా ఈ కొత్త ఆలోచనా వైఖరికి ప్రేరణ. అతనికి చికిత్స చేయటం శుద్ధ దండగ. అలాంటప్పుడు అతన్ని శారీరకంగా బాధపడమంటూ, చికిత్స కొనసాగించటంలో ఔచిత్యమేమిటి? పోనీ తనంతట తనే చావలేడా అని వదిలేద్దామంటే అతను నిజంగానే పక్కపైనుంచి లేవలేని అశక్తుడు. మరెలా ఛస్తాడు? రోజూ నేను అతని బాధ చూడలేను కూడా. కాలేజీ నుంచి నేరుగా ఉద్యోగంలోకి వచ్చిచేరిన కొత్త కావటంవలన నా మనస్సు అంత గట్టిపడలేదుకూడ. అతని బాధ చూస్తే నాకళ్లలో నీళ్లు తిరిగేవి. అయినా అతన్ని ఓదార్చాలని ప్రయత్నించేవాణ్ణి.

కాని, ఏం ప్రయోజనం? అతనికి, నాకూ ఇద్దరికీ తెలుసూ ఈ రోగం గురించి. కాబట్టి ఓదార్పువలన ఫలితం బొత్తిగా శూన్యం.

"నేనెవ్వరికీ ఏమీ అన్యాయం చేయలేదు... ఎవరినీ గాయపర్చలేదు. ఎవ్వరినీ కష్టపెట్టలేదు. అయినా నాకెందుకీ రోగం? నాకెందుకీ బాధ" అంటూ అతను ఆక్రోశిస్తుంటే, నేనతనికి కర్మయోగం, పుట్టుక, చావులతత్వం గురించి బోధించలేనుగదా! అందువలన ఒక మత్తు ఇంజెక్షన్ ఇచ్చి వెళ్లిపోయేవాణ్ణి.

అతన్ని బతికించాలని నా శాయశక్తులా చాలాకాలం కృషి చేశాను. కాని నిష్ప్రయోజనం.

మత్తుమందు ప్రభావం నుంచి బయటికి రాగానే అతని అరుపులు మామూలే. నేను సందిగ్ధంలో పడ్డాను. షేక్స్పియర్ రాసిన హేమ్లెట్ నవల నాకు గుర్తువచ్చేది. ఒకవేళ నేనతనిని చంపితే నాకు నిజంగా మనశ్శాంతి లభిస్తుందా? భగవంతుడు నన్ను క్షమిస్తాడా?

అయితే ఈ ఆలోచనలు నన్ను ఎంతోకాలం బాధించలేదు. మరోమాటలో

చెప్పాలంటే నేను వాటిని లక్ష్యపెట్టలేదుకూడా. నా అభిప్రాయంలో న్యాయం కన్నా దయ, సానుభూతి త్వరగా ఫలితాలను ఇస్తాయి. చనిపోయే రోగి దీవెనలను అసలే లక్ష్యపెట్టను. ఒక్కోసారి న్యాయం జరగటానికి అవకాశం లేనప్పుడు, దయ ఒక్కటే మరణాన్ని శాంతిని ఏకకాలంలో ప్రసాదిస్తాయి.

ఇక్కడే నా ఆలోచన కొత్తదారి తొక్కింది. ముసలివారు, రోగానికి వైద్యం పొందే వసతిలేనివారు, చికిత్సలేని రోగంతో బాధపడేవారు ఎంత త్వరగా ఈ లోకంనుంచి వెళ్లిపోతే అంత మంచిదేమో! కాని, వారికి ఈ ప్రపంచంనుంచి బయటపడటం అంత సులువైన పనికాదు. ఉదాహరణకు పక్షవాతంతో మంచంలో పడ్డవాడు తన చావును తాను ఎలా తెచ్చుకోగలడు? అలాంటప్పుడు డాక్టర్లయిన మాలాంటివారు ఆ కర్తవ్యం నిర్వర్తిస్తే ఎంత బాగుంటుంది. డాక్టరుగా నేను వారి బాధలను చూసినప్పుడల్లా ఎంతో పశ్చాత్తాపపడతాను.

నేను పనిచేసే షిఫ్టు అయిపోయాక నా కొలిగ్ డాక్టర్ వెంకటేశ్‌తో మాట్లాడాను.

"వార్డు నెం. 5లో నిత్యం అరుపులతో జీవితం గడిపే ఆ రోగి గురించి నీ అభిప్రాయమేమిటి" అడిగాను నేను వెంకటేశ్‌ను.

"ఏమిటి ప్రశ్నలోని ఆంతర్యం?" సీరియస్‌గా అడిగాడు డాక్టర్ వెంకటేష్.

నేను నా గొంతు మెల్లిగా తగ్గించి అడిగాను. "మీకు నిజంగా ఈ ప్రశ్నలో ఆంతర్యం అర్థం కాలేదా?" అని.

"భలేవాడివే. నీ అభిప్రాయం ఎంత ప్రమాదకరమో తెలుసా? అసలలాంటి పని చేయాలనుకోవటమే అరిష్టం, అరాచకంకూడా" మందలింపుగా అన్నాడు డాక్టర్ వెంకటేశ్.

"అదికాదండి. ఇలాంటి కేసుల్లో కూడా మీరలా భావిస్తే ఎలా? దయచేసి మీ అభిప్రాయం వెనుకున్న ఫిలాసఫీ నాకు చెప్పండి?" గట్టిగా అడిగాను వెళ్లిపోతున్న వెంకటేశ్ చెయ్యిపట్టుకొని ఆపుతూ.

"చూడండి... ఇప్పట్లో అటువంటి దానిగురించి ఆలోచించటం సాహసమే అవుతుంది. ఎందుకంటే చికిత్స లేదని రోగులను చంపటమే పరిష్కారమైతే అసలీ వైద్యశాస్త్ర అవసరం ఏనాడూ ఉండేది కాదు. తొలినాటి నుంచి ఈ

అభిప్రాయం ఆమోదయోగ్యమైతే ఏ రోగానికి వైద్యం తాలూకు అవసరం ఉండవలసి వచ్చేదికాదు. నిజానికి రోగులు, చికిత్సకాని రోగాలే వైద్యశాస్త్రానికి ఊపిరి, రోగులను రక్షించటంకోసం, వారిని సమీపించే మృత్యువును తరిమివేయ టానికే వైద్యశాస్త్రం పుట్టింది. మనం చావుకు బద్ధ వ్యతిరేకులం. చావును జయించలేమని మనకుమనం పుట్టిననాడే తెలిసినా బ్రతకాలనే ప్రయత్నిస్తున్నట్టు, రోగి రోగం ప్రమాదకరమైందని తెలిసికూడా వీరుడిలాగా పోరాటం చేయాలి. అంతేగాని, ఇలాంటి దరిద్రపు ఆలోచన చేయటం పరమ నీచం. అందునా డాక్టరయినవాడు చేయగూడనిపని ఇది" అన్నాడు డాక్టర్ వెంకటేశ్.

వెంకటేశ్ మాటల్లోని నిజాయితీ నన్ను ఎన్నిసార్లో కదిలించింది. నా చెవులో ఆయన మాటలు గింగిర్లెత్తాయి.

అవును.... మనిషి చావును జయించలేకపోయాడన్నది పరమ గొప్ప సత్యం. అలాంటప్పుడు ఇంకేమి వీరత్వం మిగిలిఉంది కాబట్టి చావుకు వ్యతి రేకంగా పోరాడాలి?

నిజానికి అష్టకష్టాలుపడి శస్త్రచికిత్సలు చేసి, ప్రాణం పోకుండా అడ్డు పడాలని ఎంత ప్రయత్నించినా అరుస్తూ, కేకలేస్తూ బతికిన రోగి చావనే చచ్చాడు. అతని చావు మా అందరికీ, అతని బంధువులకు కూడా ఎడతెగని విశ్రాంతిని ప్రసాదించింది.

అయినా తగ్గే రోగాలకు వైద్యం చేయటంలో అర్థం ఉంది. కాని, తగ్గని రోగం ఉన్న రోగులను ఇలా వందలలో, వేలల్లో ఆస్పత్రులలో పెట్టు కోవటం ఎంతవరకూ సమంజసం?

ఇటీవల ప్రమాదవశాత్తు కాళ్లు పోగొట్టుకొని ఆస్పత్రిలో చేరిన ఒక రోగి బాధ అంతా ఇంతా కాదు. అతనికి రోగం తగ్గేదే. కాని, హఠాత్తుగా ఇన్‌ఫెక్షన్ రావటంతో అతని బాధ మరింత ఎక్కువైంది. చావు తిన్నగా తన కాళ్లని, చేతులని అతనివైపుకు బారచాపింది. ఇక అతని జీవితానికి అర్థం ఉందంటారా? అతను బతికి ఎవరిని ఉద్ధరించాలి?

ఇక్కడే నా ఆలోచనను తొలిసారిగా ఆచరణలో పెట్టాలని నిశ్చయించు కున్నాను. మొదట కొంత సెంటిమెంట్ అడ్డం వచ్చినా క్రమంగా దాన్ని

అధిగమించగలిగాను. అతనికి చావాలని ఉందన్న సంగతి వేరే చెప్పనక్కర్లేదు. నేను రౌండ్లకు వెళ్లినప్పుడల్లా ఆ పేషంటు తన కోరికను చెపుతూనే ఉన్నాడు.

ఒకరోజు నా ఆలోచన కార్యరూపం దాల్చింది. నర్సును ఇంజెక్షను తెమ్మని ఆజ్ఞాపించాను. ఆవిడ తెచ్చింది. నేచేయబోయేది ఆవిడకు తెలియ గూడదని, నర్సును వేరేపనికి పురమాయించాను. సిరంజి నీడిల్‌లో గాలి బుడగలు బయటకి పోకుండా, మందుతో సహా పేషెంటు రక్తనాళంలోకి ఎక్కించేశాను క్షణంలో.

అంతే గాలిబుడగ రక్తనాళాల్లోకి ప్రవేశించి క్షణాల్లో అతని ప్రాణాన్ని హరిస్తుంది. అందుకని ఇక అక్కడుండకుండా వెంటనే మరో పేషంటు గదికి వెళ్లిపోయాను.

కాసేపటికి నేను ఎదురుచూస్తున్న శుభవార్త రానేవచ్చింది. – ఆ పేషంటు ఇక లేడు. అంతే! నాకు ఎక్కడలేని ఆనందం కలిగింది. ఇకపై అనేకమంది పేషంట్లకు ఇదే పరిష్కారం అని నిశ్చయించుకొన్నాను.

అయితే ఈ ఆలోచన, ఈ సంఘటన నన్ను చాలా భయపెట్టేసిన మాట వాస్తవం. ఒక్కోసారి ఈ పని చేసినందుకు నన్ను ఏదైనా దయ్యం ఆవహించిందా అనిపించేది. నేను చేసిన పని మంచిదే అనిపించుకోవడానికి మిత్రుల సాంగత్యం ఆశించటం మొదలుపెట్టాను. పాశ్చాత్యదేశాల్లో ఇది అమలులో ఉన్నట్లు వాళ్లు అన్నప్పుడల్లా నాకెంతో ధైర్యంగా ఉండేది. కాని, వృత్తి రిత్యా డాక్టర్లెవరూ ఈ విషయంలో నాతో ఏకీభవించలేదు.

రోజురోజుకు నాలో సంఘర్షణ అధికం కాసాగింది. ఏ చావు వార్త విన్నా నేను చేసిన దుష్టత్వం నాకు గుర్తుకువచ్చేది. నా మనస్సు కకావికలు అయ్యేది. దాన్ని అదుపు చేయడానికి నేను మరింత క్రూరంగా ప్రవర్తించాల్సి వచ్చేది. ఫలితంగా ఒకటి, రెండు... మూడు చొప్పున చాలామంది దీర్ఘరోగులను ఈ ప్రపంచంనుంచి విడిపించసాగాను. కాని ఎప్పుడు, ఎవ్వరికీ ఈ సంగతి తెలియనివ్వలేదు. ఆవిధంగా వార్డు నెం. 7లోని మరో పేషంటుకు కూడా ముక్తినొసగాను. కాని, నా సిగరెట్లు వాడకం మరింత ఎక్కువయిపోయింది. ఆ తర్వాత ఒక అందమైన స్త్రీని కూడా ఇలానే చంపవలసివచ్చింది. ముందు

చంపాలనిపించి కాదు. కాని, క్రమంగా ఆవిడ బాధ చూడలేక ఆ ప్రయత్నం చేశాను అనుకోకుండా నా పొరపాటు, కంగారు కారణంగా ఆవిడ చావునుంచి తప్పుకుంది. అదీ మంచిదేననుకొన్నాను. అంత అందమైన ఆవిడ అప్పుడే చావటం నాకే నిజంగా ఇష్టంలేదు.

నేను చేసిన మంచిపని ప్రభుత్వం దృష్టికి వెళ్లిందా లేదా అన్నది ఎప్పుడు ప్రశ్న కాలేదు. నే పనిచేసే హాస్పిటల్ ప్రభుత్వానిది కనుక రోగులు హఠాత్తుగా మరణిస్తున్నందుకు నేనే కారణం అని అనడానికి ఎవ్వరూ సాహసించలేదు. ఎందుకంటే ప్రభుత్వం హాస్పిటల్స్‌పై ప్రజలకున్న నమ్మకం అంతంతమాత్రమే. ఆకాస్త కూడా ఊడిపోగలదు. అయితే, నాకు మాత్రం ట్రాన్స్‌ఫర్ తప్పలేదు. క్రమంగా నేను చీఫ్ మెడికల్ ఆఫీసర్ స్థాయికి ఎదిగాను.

కాలం గడుస్తున్నకొద్దీ ఒకప్పుడు నే చేసిన పని తాలూకు మంచిచెడ్డలపై ఎన్నో ప్రశ్నలు నా మనస్సులో తలెత్తేవి. అయినా నేను వాటిని అణిచివేసే ప్రయత్నంచేసేవాడిని. నా కీర్తిని నిలబెట్టుకోవడానికి, నాకు పిచ్చెక్కకుండా నన్ను కాపాడుకోవటానికి నేను కాల్చిన సిగరెట్లు నా జీవితాన్ని మరోరకంగా కాల్చివేశాయి.

ఇప్పుడు అందరు రోగుల్లానే నేను కూడా ఒకప్పుడు నేను పనిచేసిన హాస్పిటల్‌లోనే పేషంటుగా చేరాను. డాక్టర్లు పరీక్షించి నా అనారోగ్యం గొంతు కాన్సర్‌గా నిర్ధారించారు. నిజానికి నేను ఈ హాస్పిటల్‌లో అనేకమందిని రోగబాధనుంచి మరో ప్రపంచానికి పంపిస్తునప్పుడు అందరూ ఈ హాస్పిటల్‌ను ఏమనేవారో నాకే బాగా తెలుసు. దీనిని మరణాలయం అనేవారు. ఆత్మహత్యకు ప్రత్యామ్నాయం ఈ హాస్పిటల్ అని నా అభిప్రాయం కూడా.

నా భార్యాబిడ్డలకు ఈ విషయం తెలిసికూడ నన్ను ఇక్కడే చేర్చారు. కారణం వారికి నా రోగం బాగుకాదని తెలుసు. అనవసరంగా ధనం వృధా చేయవద్దని నేను కూడా వారికి చెప్పాను. వారికి కావలసింది కూడా అదే కాబట్టి చక్కగా నేనీ ఆస్పత్రిలో పడ్డాను.

అయితే మాత్రమేమి? నామదిలో ఒకప్పటి సంఘర్షణ ఇప్పటికీ ఇంకా సమసిపోలేదు. ఆత్మహత్య చేసుకొందామా? వద్దా? ఏ నిర్ణయానికి రాలేని

ఆశక్తత నన్నావహించింది. చావుపుట్టుకల గురించి అనేక ఆలోచనలు నాకు తెలుసు. ఈ రోగానికి వైద్యం లేదని తెలుసు. కాని చావాలని మాత్రం అనిపించటం లేదు. బాధ మాత్రం తక్కువేంకాదు.

నా కొడుకు నన్ను గడ్డంగీసుకోమనేదాకా నాకు గడ్డం పెరిగిన సంగతి తెలియదు.

కాని, వాడు వచ్చినక్షణంలో ఆప్యాయంగా వాడు పలకరించే ఆ నాలుగు మాటలు నా కళ్లవెంట నీళ్లుదొర్లేలా చేస్తాయి.

బహుశ వాడు అడిగినట్టు గడ్డం గీసుకుంటే యమధర్మరాజైనా నా శుభ్రతకు మెచ్చి నన్ను త్వరగా తీసుకెళ్తాడేమోననిపించింది. నా ఇష్టా ఇష్టాలతో సంబంధం లేదన్నట్టు నా కొడుకు గడ్డం గురించి అడిగిన రెండు రోజులకే హాస్పిటల్‌కు మంగలి వచ్చి గడ్డం గీచేసివెళ్లాడు.

కాని, డ్యూటిలోవున్న ప్రతి డాక్టరును ఈ నరకం నుంచి నన్ను తప్పించమని అడగని రోజులేదు. అయితే, వాళ్లకాధైర్యం ఏది? వాళ్ళు నాలాగా రోగులను ఒక్క ఇంజెక్షన్‌తో చంపరు. ఏడిపించి, ఏడిపించి నరకయాతనబెట్టి చంపుతారు. యమలోకం ఎక్కడోలేదు. ఈ హాస్పిటల్‌లోనే ఉంది.

క్రమంగా ఇలా ఆలోచిస్తున్న నాలో ఏవో మార్పులు రాసాగాయి. నేను చేసిన పాపాలకు, తప్పులకు ఈ శిక్ష అనుభవిస్తున్న భావన కలగసాగింది నాలో. నా భార్యపట్ల నేను ఎంతో అనుచితంగా ప్రవర్తించాను ఎన్నోసార్లు. ఇప్పుడు బుద్ధివచ్చింది కాని ఏంప్రయోజనం? నన్నిప్పుడెవరైనా బతికించగలిగితే ఆమెపట్ల నేచూపిన కాఠిన్యానికి శిక్ష వేసుకొందును. పశ్చాత్తాప్పడి ఆమె క్షమాపణ కోరుకొందును. కాని, జీవితంకొడిగట్టే దిశలో ఈ ఆలోచనవస్తే మాత్రం ఏం లాభం?

కాని, ఈ క్షణంలో నాకొచ్చే ఆలోచనలు పూర్వం నేచేసిన ఆలోచనలను సవాలుచేస్తున్నాయి. ఇప్పుడు నాకు చావంటే కోర్కెలేదు. ఇప్పుడు రోగులను బాధనుంచి విముక్తి చేయడానికి మునుపటిలాగా ఇంజెక్షన్ ఇచ్చి చంపటాన్ని నేను అంగీకరించను. నేను ఆనాడు వారి అనుమతితోటే ఆ పని చేశానను కోవటం ఒట్ఠి భ్రమ. వారికి చావాలని ఎన్నిసార్లు అనిపించిందో బ్రతకాలని

కూడా అన్నిసార్లు అన్పించి ఉంటుంది. కాకపోతే డాక్టరును చూసినప్పుడల్లా బాధతో పిచ్చిగా మాట్లాడిన మాటలయి వుంటాయి వారి మాటలు. దాన్ని అనుమతిగా భావించి నేను వారిని చంపాను. చంపి పైగా వారి అనుమతి పొందానని నన్ను నేనే వంచించుకొంటున్నాను. ఎంత ఘోరం! జీవితం ఎంత బాధాకరమైనా అది అంతా మరణం కోరుకొనే తీవ్రత ఏనాటికీ కాదు. కారణం ఎక్కడో జీవితంలోని మాధుర్యం ఒక చిరు ఆశకు దివ్వెలా కన్పిస్తూనేవుంటుంది. అందుకని ఈ సానుభూతి హత్యలు దుర్మార్గం అని నా ప్రస్తుత తీర్మానం.

దూరాన మృత్యునీడలు నా కళ్లముందు నృత్యం చేస్తున్నాయి. అయినా ఇంకా వ్యవధి ఉన్నట్లు నాకు తెలుస్తోంది. అందువల్లనే నా కొడుకుని పిలిచి. "రేయి! నన్నింటికి తీసుకెళ్లండి. అక్కడే నాకు మనశ్శాంతి" అని చెప్పాను.

కాన్సర్ చికిత్సవలన నా శరీరం కాంతి విహీనమైనా నాకు ప్రాణంపై తీపి నశించలేదు.

❖ ❖ ❖

కొద్దిరోజులు గడిచాక ఒకనాడు పేపర్లో ఈ ప్రకటన వెలువడింది చిరువార్తలా...

"మెర్సికిల్లింగ్ సానుభూతి హత్యలను ప్రోత్సహించి, బహుళంగా ప్రచారం చేసిన డాక్టర్ అశోక్ మరణించారు. ఆయన జీవితంలో ఎంత వివాదాస్పదుడో, అంత వివాదాస్పదమైన వ్యాసాలను ఆయన అనేక పత్రికల్లో ప్రచురించారు. కాని, ఆయన తాను ప్రచారం చేసింది ఆచరించినట్టు కన్పడదు..."

(విపుల, ఆగస్టు 1991)

❖

సమర్థత

(బెంగాలీ కథ)

ఆశా పూర్ణాదేవి

❋

ఆకాశం మేఘావృతం కావటం వలన మధ్యాహ్నం సాయంత్రంలా మారిపోయింది హఠాత్తుగా

భూతన్ చీకటిగా మారుతున్న గదిలో, కిటికీకి బాగా దగ్గర జరిగి కూర్చుంది. ఏవో బొమ్మలను పలకమీద గీస్తోంది. చక్కగా రాసి, బొమ్మను వెంటనే చెరిపేస్తోంది. మళ్ళీ కొత్త బొమ్మ గీయటం ప్రారంభిస్తోంది.

ఇంతలో వాళ్ళమ్మ గదిలోకి రావటం చూసింది భూతన్.

"అమ్మా, అప్పుడే వచ్చేశావా ఆఫీసునుంచి. అరే, మళ్ళీ ఎక్కడికో వెళ్తు న్నట్లుందే" అంది భూతన్.

"అవునమ్మా డాక్టరు దగ్గరికి వెళ్లాలి" చెప్పింది తనీమా.

"ఏం? ఎందుకు? ఎవరికి కన్నా ఒంట్లో బాగాలేదు" అడిగింది భూతన్ తల్లి తనీమాని అమాయకంగా.

"అబ్బే ఎవ్వరికి ఏమీ కాలేదు భూతన్. నాకే తరచూ తలనొప్పి వస్తుంటే డాక్టరుకు వెళ్ళి కళ్ళు చూపించుకోవాలను కుంటున్నాను" అంది తనీమా.

"కాని, ఇటీవలే కదా నువ్వు కొత్త కళ్ళద్దాలు తీసుకొన్నావు". "అవును... ఆ కళ్ళద్దాలు సరిగ్గా లేవమ్మా అందుకే డాక్టరు దగ్గరికి పోదామనుకొంటున్నా."

"అంటే నేను మళ్ళీ ఒంటరిగా ఉండాలన్నమాట" బుంగమూతి పెట్టి అడిగింది భూతన్.

"ఒంటరిగా ఏముంది? మాలతి ఆంటీ ఉందిగా!"

"చత్... చెత్త కబుర్లు" అలిగినట్లు అంది భూతన్.

"హుష్.. అటువంటి మాటలు పెద్దగా మాట్లాడకు. నువ్వు మంచిపిల్లలా ప్రవర్తించాలి. ఆమె ఇచ్చే పాలు తాగాలి. గొడవచేయకూడదు. నేను నీగురించి ఎటువంటి ఫిర్యాదు మాలతీ ఆంటీనుంచి వినకూడదు సుమా" అంది తనీమా.

భూతన్ మనస్సు చిన్నబుచ్చుకొని వికారంగా ఉండిపోయింది.

ఆ రోజూ నేను ఆఫీసునుంచి తిరిగి రాగానే "భూతన్ పాలను విసిరేసింది", "భూతన్ గుడ్డు పారేసింది", "భూతన్ గుడ్డు పగలగొట్టి నీళ్ళలో కలిపింది", "భూతన్ ఏం చెప్పినా వినదు" అని మాలతి ఆంటీ నీమీద కంప్లైంట్స్ ఇవ్వటం నీకు తెలియదా?"

భూతన్‌కు తల్లి మాటలు కోపం, దుఃఖం రెంటిని కలిపి తెప్పించాయి.

"అసలు ఈ మాలతీ ఆంటీని ఉద్యోగంలోంచి ఎందుకు తీసేయవు?"

"హే! హుష్! చెప్పేది విను. ఆవిడని మాన్పించేస్తే ఎవరు చేస్తారు. ఇంటిపనులు? ఇవాళ, రేపు పనివాళ్ళు దొరకటం సులభమా? నాకూ ఆవిడని వదిలించుకోవాలని ఉంది. కాని ఎలాసాధ్యం?"

నాలుగేళ్ల భూతన్‌కు పాలు ఇచ్చి తనకు భగవంతుడు ప్రసాదించాడని భావించే ఆ పాపకు ముద్దులు గరపి, ప్రేమగా, "మంచిపిల్లలా ఉండు. మాలతీ ఆంటీని ఇబ్బంది పెట్టకు, బాధ పెట్టకు, సరేనా! టా! టా!" అంటూ తిన్నగా బయటపడటానికి ప్రయత్నించింది తనీమా.

అయిష్టంగా తల, చేతులు ఊపుతూ "అయితే మరి ఎప్పుడొస్తావు? అని దీనంగా అడిగింది భూతన్.

"అదెలా చెప్పగలను? బస్సులు దొరకటం చాలా కష్టం. దొరికినా ట్రాఫిక్ జామ్స్ ఉంటాయి. జనాన్ని బట్టి కదా డాక్టర్ నన్ను త్వరగా చూసేది, లేంది తెలిసేది. కాబట్టి, కొన్ని గంటలు పట్టవచ్చు."

"ఓహో! అంటే ఇవాళ నువ్వు వచ్చేప్పటికి బాగా ఆలస్యమవుతుందంటావు.

అంతేనా! అలా మీకు నేను ఏమాత్రం పట్టకపోతే మీ మాటలు నేను కూడా విననుం. సరేనా" అంది భూతన్ పట్టుదలగా.

"భూతన్! నువ్వు రోజురోజుకి మొండిపిల్లలా మారుతున్నావు. నేను నిన్ను ఎప్పుడూ బయటికి తీసుకువెళ్ళలేదా? అసలు ఆలస్యం ఎందుకవుతుందో తెలిసి గూడ నీకెందుకు అర్థంకాదు. మనకు కారేమన్నా ఉందా?"

"అవును. డాడీకి బొత్తిగా తెలివిలేదు. లేకపోతే ఎన్నోసార్లు చెప్పినా కారు ఎందుకు కొనరు?" కోపాన్ని తండ్రిమీదికి మళ్ళించింది.

పోబోతున్న తనీమా మళ్లీ వెనక్కి వచ్చి పాపతో కుమ్మక్కు అవుతున్నట్లు భూతన్ చెవిలో రహస్యంగా చెప్పింది. "మీ నాన్నతో గట్టిగా ఈ విషయం ఎందుకు అడగవు? నువ్వు గొడవ చేస్తే కాని మీ నాన్న వినడు".

"ఆ నే చెబితే వింటాడు. మా క్లాసులో ప్రతి పాపకు కారుంది" అంది భూతన్.

"అదేమిటి? మీ క్లాసు పిల్లలు అంతా బస్సులో కాదా వచ్చేది" అడిగింది తనీమా.

"వస్తారు... అయితే మాత్రమేమిటి. వాళ్ళ నాన్నలు ఆఫీసుకు వెళ్తారు కాబట్టి పిల్లలను కారులో స్కూలుకు తీసుకువెళ్ళరు. కాని, ఆఫీసునుంచి వచ్చాక వాళ్ళు షాపింగ్‌కు వెళ్తారు వాళ్ళమ్మలతో" అంది భూతన్.

దీర్ఘంగా నిట్టూర్పు విడిచి చెప్పింది తనీమా "ఆ అదృష్టం నాకు లేదమ్మా! అయినా నేను వెళ్ళాలి. బాగా ఆలస్యమై పోయింది."

భూతన్ మొహం మాడ్చుకొంది తల్లి మాటలకు.

ఇంతలో తనీమా తన లక్ష్యాన్ని భూతన్ మీద నుంచి మాలతిపైకి మార్చింది.

"మాలతీ! ఎందుకిలా ఊరికే కూర్చున్నావు? వంటపని త్వరగా పూర్తి చేయాలని ఎందుకనుకోవు? త్వరగా చపాతీలు చేసేయి. తర్వాత మళ్ళీ కరెంటు కోత కారణంగా కరెంటు పోతుంది."

"అప్పుడే వంటింట్లోకి పోవటం ఎందుకండి? అంత త్వరగా చపాతీలు, వంట చేసినా ప్రయోజనం ఏముంది? కనీసం టి.వి.ని చూసే అవకాశం

కూడా లేకుండా అంత త్వరగా వంటపని ఎందుకు? కరెంటు పోతుందంటే రెండు కాండిల్స్ బయటపెట్టి వెళ్ళండి" అంది మాలతి. మాలతి తనీమా అంటే ఏమాత్రం భయం, గౌరవం వ్యక్తపర్చలేదు తన మాటల్లో. ఎలా కూర్చుందో, అలానే కూర్చుని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పింది.

"సర్లే, కేండిల్స్‌ని చైనా షెల్ఫ్‌పైన ఇందాకనే పెట్టాను. కరెంటు పోగానే వెలిగే లైట్లు పనిచేయటంలేదు తెలుసుకదా! అందువలన కరెంటు పోగానే కిరోసిన్ దీపం వెలిగించి భూతన్ గదిలో పెట్టు" అంది తనీమా, మాలతి నిర్లక్ష్యాన్ని గమనించి కూడా గమనించనట్టే.

"మీరు చెప్పక్కర్లేదు ఆ విషయాలన్నీ నాకు తెలుసు. ఇంతకీ మీరు ఎప్పుడు వస్తారు?" అడిగింది మాలతీ.

"చెప్పలేను. నేను రావటం ఆలస్యమయ్యే పక్షంలో భూతన్‌కు భోజనం పెట్టేసేయ్" అంది తనీమా తన యాజమాన్య హోదాను ముఖమంతా పులుము కుంటూ.

"ఆ మీ అమ్మాయి తినాలేగాని సంతోషంగా పెడ్తాను" అంది మాలతి.

"అదేంటి? అది వినకపోతే, దానికి తెలియకపోతే నువ్వు దాన్ని లాలించి, బుజ్జగించి మనస్సు నీవైపు తిప్పుకోవాలి. ఎవరన్నా వస్తే తలుపు తీసేముందు కిటికీలోంచి బయటికి చూడు. ఇంట్లో ఎవ్వరూ లేరని అసలు చెప్పబోకు. ఇప్పుడే యజమానురాలు బయటికి వెళ్లిందనో, లేక ఇంటి పెద్దాయన వచ్చే సమయం అయిందనో చెప్పాలి" జాగ్రత్తలు చెప్పబోయింది తనీమా మాలతికి.

"అబ్బా, చిలకకు చెప్పినట్టు నాకివన్నీ చెప్పవలసిన అవసరం ఏముంది? నాకు తెలుసులేండి" విసుగ్గా సమాధానం చెప్పింది తనీమా ఒళ్ళునొకసారి మెలితిప్పి వదుల్తూ.

"అయినా సరే నువ్వు మర్చిపోయి పొరపాట్లు చేస్తుంటావు కదూ! సరే, రా! ముందు వచ్చి తలుపు వేసి వెళ్ళు".

ఆవలిస్తూ... నిల్చుంది మాలతి? "మీ ఇంటిలోనే ఈ అవస్థంతా. ఇతరుల ఇళ్ళలో ప్రతి ఒక్కరి దగ్గర తాళం చెవి ఉంటుంది. వస్తూ తాళం తీసుకొస్తారు. పోతూ తాళం వేసుకువెళ్తారు" అంది మాలతి.

తనీమా నిరసన ముఖంపెట్టి ఇంటి బయటికి నడిచింది. ఆవిడకు భూతన్ మీద, తన భర్త మీద, ఊరరొదిలిపెట్టి ఇక్కడికి వచ్చి ఉండటానికి ఇష్టపడని అత్తగారి మీద పీకలదాకా కోపంగా ఉంది. నిజానికి ఆ ముసలి అత్తగారు ఎంత మొండిమనిషి. ఊర్లో వున్న ఇల్లు తను లేకపోతే నిర్లక్ష్యానికి గురయి కూలిపోతుందని ఆవిడ వాదన. పోన్లే! అదీ ఒకందుకు మంచిదే లేకపోతే మా ఇంట్లో ఉండి, అనుక్షణం తన్ను షంటుతుంటే చచ్చేది తను. అసలు ఆ మొసల్ది తన ఇల్లు అమ్మేయడానికి ఎందుకు ఒప్పుకోదు. తనీమావాళ్ళుంటున్న ఒంటి అంతస్తు ఇల్లు చాలా పాతది. సరైన వసలతులున్నది కాదు. కాకపోతే రోడ్డు పక్కనే ఉండటం వలన ఎక్కువ ధర వచ్చే అవకాశం ఉంది. కాని ఆవిడ "ఒరే అలోక్! మీనాన్న ఈ ఇంటిపై మరో అంతస్తు వేయించాలను కున్నారు. కనీసం ఇంటిని నేనుండగా అమ్మాలని ప్రయత్నించకు. నేను పోయాక నీ ఇష్టం" అంటుంది తరచూ తన భర్తతో.

కాని, ఆవిడ చచ్చేట్టు ఉందా? ఉక్కు శరీరంతో ఉన్న ఆవిడకు చావు ఎప్పుడు రావాలి. తన భర్త తల్లి ఆ మాట అన్న తర్వాత మళ్ళీ ఇంటి విషయమై ఇంత వరకూ పెదవి విప్పలేదు. ఒకవేళ తనెప్పుడన్నా మాట్లాడితే, తను వాళ్ల అమ్మగారి చావుకు కుట్ర పన్నుతున్నంత గొడవ చేస్తారు ఆయన. అసలు ఆవిడ ఉద్దేశ్యం ఏమిటి? ఎప్పుడైన ఆవిడ అనారోగ్యం పాలైతే కలకత్తాలోని ఈ ఇంటికి వచ్చి ఉండవచ్చునా?

ఒకవేళ తాము ఈ ఇల్లు అమ్మేసి మరో ఇల్లు కొంటే, ఆవిడని రావద్దని బయట బోర్డు పెడతామా! నిజానికి ఈ ముసలివాళ్ళు సగం సెంటిమెంట్లతో చస్తారు. పోతూపోతూ బతికి ఉన్నవాళ్ళను తమ సెంటిమెంట్లతో కట్టేసి మరీ పోతారు. అసలు వేరే వాళ్ళ సంతోషాన్ని సుఖాన్ని కట్టేసేహక్కు వీరికెక్కడిది. ఒకవేళ ఈ ఇల్లు అమ్మే అవకాశం తమకు లభిస్తే చక్కటి ప్లాట్‌గాక ఒక సెకండ్ హాండ్ కారు కూడా కొనుక్కోవాలని తన మనస్సు ఎప్పటినుంచో ఉబలాటపడుతోంది.

'ఎందుకు ఈ పనికిమాలిన ఊహలు?' అనుకుంటూ తన ఆలోచనలను భర్త అలోక్‌వైపు తిప్పింది.

అమ్మో తన భర్త అలోక్ పెద్ద మొండి పిండం. తనకంటే రెండు నిముషాలు ముందు వచ్చినా గంట నుంచి ఎదురు చూస్తున్నట్టు గొడవ చేస్తాడు అలోక్.

ఇటీవల ఒక కొత్త సిన్మా విడుదలైంది. తనీమా పెద్దక్క ఆ సిన్మా చూసివచ్చి దాని గురించి తనీమాకు గొప్పగా చెప్పినప్పటి నుంచి తనీమా ఆ సిన్మా చూడాలని ఉవ్విళ్లూరసాగింది.

కాని తన కోర్కె తీర్చుకోవటం అంత సులభమా? ముందు తన భర్త చెవుల్లో ఆ సిన్మా గురించి గూడు కట్టుకొని పోరాలి. తర్వాత భూతన్ ఉండనే ఉంది. ఎక్కడికీ పోకుండా అడ్డుపడ్డానికి. తను ఎక్కడికి పోవటానికైనా బూతన్‌కు ఇష్టం ఉండదు. అందువలన డాక్టర్ దగ్గరికి పోతున్నాననో, దాని పెద్దత్త దగ్గరికి పోతున్నాననో అబద్ధాలు ఆడి బయటపడుతుంది తను. అంతేగాని, తను సిన్మాకు వెళ్తున్నట్లు భూతన్‌కు తెలిస్తే ఇల్లు వాకిలీ ఏకం చేయదూ? ఆ మాటకొస్తే తన భర్త కూడా తక్కువేమికాదు.

"రాత్రింబవళ్లు నీకు సిన్మా నాటకం, ఆటలపిచ్చి, డాన్సులు, టీ.వి. చూడటం, బెంగాలీ, ఇంగ్లీషు, హిందీ సిన్మాలంటే పడిచావటం మరీ అలవాటై పోయింది. అసలు అంతగా అవంటే పరుగులు తీయాల్సిన అవసరమేముంది?" అంటాడు.

"భర్తతో జీవితం తనకు తప్పని సరైంది? ఏం చేయటం?"

ఈసారి అలోక్ "నువ్వు మీ అక్క, బావలతో పోరాదు సిన్మాచూడటానికి, నా ప్రాణం ఎందుకు తీస్తావు?" అని అంటే తనకు చాలా కోపం వచ్చింది.

"ఏం నేను నీకు ఎలా కనిపిస్తున్నాను? నేను విధవలాగా మరొకరిమీద ఆధారపడేదానిలాగా ఎందుకుండాలి, నువ్వు బ్రతికుండగానే" అంది తాను గట్టిగానే.

ఇక మాలతి పనిమనిషి కాదు ఒక పెద్ద రాక్షసి. "నీ కూతుర్ని నీ వెంట తీసుకెళ్ళరాదు నా ఎదాన పడేసి పోకపోతే, నువ్వు లేనప్పుడు నీ కూతురును సంభాళించటం అయ్యేపనికాదు సుమా అంటుంది."

"దానిపని కాదట. ఊరికే దానికి జీతం ఇస్తున్నామనో, ఇవ్వాలనో అనుకుంటే ఎలా? నెలకు రెండు వందల యాభై రూపాయలు అప్పనంగా

'దొబ్బటంలా? ఇంతా చేస్తే ఎంతమంది మనుషులం ఉన్నాం? మొత్తం రెండున్నర టిక్కెట్లు, మా కుటుంబం అంతా కలిపి. రోజుకు నాలుగుసార్లు రాజభోజనం, చక్కటి విశ్రాంతి, చూడటానికి టీ.వి., పైన కట్టుకోను బట్టలు. ఇన్ని సౌకర్యాలు ఊరికే ఎవరిస్తారు? ఆమె గిన్నెలు తోముతుంటే చేతులు పుండ్లు అవుతున్నాయని గొడవచేస్తే గిన్నెలు తోమడానికి మరో పనిమనిషిని పెట్టింది దేనికి? వేరే ఇళ్ళలో అయితే కేవలం ఒక్క పనిమనిషే అన్నీ చూసు కొంటుంది.

ఇలా ఆలోచించుకుంటూ వెళ్తున్న తనీమాకు మినీ బస్సు దొరకటంతో త్వరగా సిన్మాహాలు చేరింది.

❖ ❖ ❖

ఎప్పటిలాగా సాయంత్రం కాగానే, పవర్ కట్ పుణ్యమా అని కరెంట్ పోయింది.

ఒక్కొసారి భూతన్ బిగ్గరగా అరిచింది. "మాలతీ! త్వరగా లైట్ తీసుకురా! ఎందుకు ఆలస్యం చేస్తున్నావు? మాలతీ ఆంటీ"

మాలతి కిరోసిన్ బుడ్డిని జాగ్రత్తగా తీసుకొచ్చి భూతన్ రూంలో పెట్టింది.

"ఏంటి భూతన్? కరెంట్ పోగానే క్షణంలో రావటానికి నాకు రెక్కలు ఉన్నాయా? అందుకే మీ అమ్మతో చెప్తాను, నువ్వు పోతూ నీకూతురిని నీ వెంట తీసుకెళ్ళమ్మా అని, మీ ఇంట్లో కరెంటు పోయే అవకాశం ఉంది కనుక కిరోసిన్ దీపం వెలిగించి వెళ్ళమ్మా అని. కాని మీ అమ్మవినదు. పైగా "కిరోసిన్ చౌకనా! నీకేం అలానే చెప్తావు?" అని ఎదురు చెబుతోంది మీ అమ్మ. కాని, నీలాంటి గయ్యాళి పిల్ల గురించి మీ అమ్మకు ఏం తెలుసు?" అంది మాలతి.

"నువ్వు నన్ను 'గయ్యాళి పిల్ల' అని అంటున్నావా? ఎంత ధైర్యం? నీ చిన్నప్పుడు మీ ఇంట్లో కరెంటు పోతే నువ్వు మాత్రం భయపడలేదా?" అంది భూతన్.

"అవునవును! కాని, మా ఇంట్లో ఎవ్వరూలేని సమయం ఎప్పుడుండేది కాదు నా చిన్నప్పుడు. మా ఇల్లు ఎప్పుడూ జనంతో రద్దీగా ఉండేది. తాత, అమ్మమ్మ, నాన్న అమ్మ అయిదుగురు ప్లిలలతో మా ఇల్లు కళకళలాడేది".

"అమ్మో! ఐదుగురా మీరు? అందుకనేమో నువ్వు నన్ను పేరుపెట్టి

'గయ్యాళి' అంటున్నావు" అంది భూతన్.

"ఏం? అంటాను ఏం చేస్తావు?" అంది మాలతి భూతన్ మనస్సును మరింత గాయపరుస్తూ.

"మా అమ్మతో చెప్తానుండు నీ సంగతి."

"ఆ మీ అమ్మ నా తల కొట్టి మొలేస్తుంది?" అంది మాలతి.

"నిన్ను ఉద్యోగంలోంచి తీసేస్తుంది తెలుసా?"

"చూడు! చిన్నపిల్లవి, చిన్నపిల్లలా ఉండు. పెద్దపెద్ద మాటలు మాట్లాడకు. అయినా మీ అమ్మ నన్ను ఉద్యోగంలోంచి తీసేస్తే ఏమటా? నాకు మరోచోట ఉద్యోగం వస్తుంది. ఎదురుగా ఉన్న ఫ్లాట్‌లలో ఉండేవాళ్ళు నన్ను ఎప్పటినుంచో వాళ్ల దగ్గరికి పనికిరమ్మని అంటున్నారు అంది మాలతి కళ్ళు తిప్పుతూ.

మాలతి గదిలోంచి బయటికి వెళ్ళిపోతుంటే "ఓ మాలతి ఆంటీ! బయటికి పోవద్దు. నాకు చీకటంటే భయం" అంది భూతన్.

"అయితే నేనేంచేయను. నేను నీ దగ్గరే కూర్చోనా? నాకు వేరేపని లేదా? ఏ పని చేయకుండా నీ దగ్గరే కూర్చుంటే మీ అమ్మ వచ్చి అష్టోత్తరం చదువుతుంది" అంటూ మాలతి వెళ్ళిపోసాగింది.

వెనువెంటనే బూతన్ కూడా బయటికి వచ్చింది.

"మాలతీ ఆంటీ! నాకు బాగా దాహం వేస్తున్నది. ఫ్రిజ్ నీళ్ళు ఇవ్వవా" అడిగింది భూతన్.

"భలేదానివి నీకు చల్లని నీళ్ళు ఇస్తే మీ అమ్మ నన్ను చంపదూ?నీ రూంలో కాచి చల్లార్చిన నీళ్ళున్నాయి. పోయి తాగు" అంది మాలతి. భూతన్‌కు రూంలోకి వెళ్ళాలని లేదు. అందువల్ల కబుర్లు కొనసాగించాలని నిశ్చ యించుకొంది.

"నేను మా అమ్మతో చెప్పను. నువ్వు దయచేసి ఫ్రిజ్‌లోంచి ఐస్ వాటర్ తీసి ఇవ్వవా?"

"లేదు తల్లి! నువ్వు జలుబో, దగ్గో అని మీ అమ్మకు చెప్పగానే మీ అమ్మ పోలీసుకుక్కలా నన్ను అనుమానిస్తుంది. వెంటనే నువ్వు నేను ఐస్ వాటర్ ఇచ్చానని నాపైన మీ అమ్మకి చెప్పి నా కొంపముంచుతావు" అంది మాలతి.

"నామీద ఒట్టే. ఐస్ వాటర్‌ని ఇవ్వు" అడిగింది భూతన్.

"సర్లే. ఈ కబుర్లకేంగాని నువ్వు వెళ్ళి చదువుకోపో" అంది మాలతి.

"ఈ చీకట్లో, క్రీనీడలమధ్య చదువా? పైగా కాండిల్ దీపం మిణుకు మిణుకుమని కదులుతుంటే చదవటం ఎలా?"

"మరేం చేస్తావు?"

"మాలతి ఆంటీ? నాకు రొట్టెలు పెట్టవా?"

"చూడు... పని చేసుకొంటున్న నన్ను డిస్టర్బ్ చేయకు. అసలు మీ అమ్మ ననుకోవాలి. ఎప్పుడూ నిన్ను నానెత్తిన పడేసి ఎందుకు వెళ్ళుతుంది? పోయి నీరూంలో చదువుకోపో! నన్ను విసిగించగకు" అంది మాలతి.

మాలతి మాటలకు భూతన్ కళ్లలో నీళ్లు తిరిగాయి. ఎలాగోలాగా దుఃఖాన్ని అదుపుచేసుకుంటూ పలకను చేతిలోకి తీసుకుంది. కాని, ఆ మిల మిలలాడే కాండిల్ వెలుగులో బొమ్మలు గీయటంకాని, చదవటంగాని కష్టం అని భూతన్‌కు తెలుసు. గాలికి పరదాలు ఎగరి రకరకాల నీడలు గొడపైన పడుతుంటే, అసలు ఈ గాలి ఎందుకు వీయాలి ఇలాగా అని విసుక్కోసాగింది.

భూతన్ మనస్సులో అనేక ప్రశ్నలు రేకెత్తసాగాయి. అసలు అమ్మ డాక్టర్ దగ్గరికి ఇంతసేపు ఎందుకు వెళ్ళాలి? పోనీ నాన్నయినా త్వరగా ఎందుకు రాడు? రోడ్లమీద వెళ్ళే కార్లను చూస్తున్న కొద్దీ తనకు ఆరాటం ఎందుకు పెరుగుతోంది. తన హృదయంలో ఈ గందరగోళం ఏమిటి? ఇవి భూతన్‌ను సంక్షోభపెడుతున్న ప్రశ్నలు.

వంటింట్లో శబ్దాలవల్ల ఒంటరితనం తొలగి ఎవరో తోడున్న భావన కలగసాగింది భూతన్‌కు అప్పుడప్పుడు.

అందువలన తిరిగి వంటింటికే వెళ్ళాలని నిశ్చయించుకొంది భూతన్.

"మాలతీ ఆంటీ కరెంట్ ఎందుకు రాలేదింకా?"

"ఆ విషయం ఎలక్ట్రిసిటీ బోర్డును అడుగు" అంది మాలతి.

"సరే! అమ్మ ఎప్పుడొస్తుంది?"

"ఎప్పుడు సిన్మా అయిపోతే అప్పుడు" అంది మాలతి.

"సిన్మా ఏమిటి?" ఆశ్చర్యంగా అడిగింది భూతన్.

"నీకు తెలియదు. మీ అమ్మ, నాన్న సిన్మాకు వెళ్లారు. విను నే చెప్తున్నది" అంది మాలది.

"ఛీ! అబద్ధాలాడకు, మమ్మీ డాక్టర్ దగ్గరికి వెళ్ళింది" అంది భూతన్ కోపంగా.

"అలా అని చెప్పిందా మీ అమ్మ నీకు?" వికృతంగా నవ్వుతూ అంది మాలతి.

ఈ ఉద్యోగాన్ని ఎట్లాగైనా వదిలేయాలని మాలతి ఏనాడో నిశ్చయించుకొంది. ఇక ఎవరినీ లక్ష్యపెట్టాల్సిన అవసరంలేదు మాలతికి. "మీ నాన్న ఇంకా ఎందుకు రాలేదో ఊహించావా? మీ అమ్మ నాన్న ఇద్దరు సిన్మాహాలు దగ్గరికి రావాలని ముందే అనుకొని మరీ వెళ్ళారు. ఇద్దరూ కలిసే తిరిగివస్తారు" చెప్పింది మాలతి.

భూతన్ కళ్ళు ఎర్రబడ్డాయి మాలతి మాటలకు.

మాలతిలో వికృత మనస్తత్వం, వింత దరహాసం చేసి, ఆ పసికందులో మరిన్ని గాయాలకు తావిచ్చే ఆలోచనలను రేకెత్తింపసాగింది.

"మీ అమ్మ నాన్నా ఇంగ్లీషులో మాట్లాడుకొంటున్నా నాకు అర్థమవుతాయి తెల్సా" చెప్పింది మాలతి.

"ఛూ! నువ్వు అబద్ధాలకోరువి" అంది భూతన్.

కాని, భూతన్ అక్కడినుంచి తప్పించుకోలేదు. ఎక్కడికీ వెళ్ళలేదు. అందువలన ఆ చిన్ని మనస్సుమళ్ళీ మాలతి వికృత మనస్సుతో రాజీపడాలని భావించింది.

"మాలతీ ఆంటీ. నాకు ఆకలేస్తోంది. రొట్టెలు పెట్టవా" బ్రతిమాలుతూ అడిగింది.

"తల్లీ... దయ్యాలు వేదాలు వల్లించినట్లు నువ్వు ఆకలనటం రొట్టెలు తినటం కూడానా ఎంత వింత? మామూలుగా నువ్వేగా, మా అమ్మ రాందే భోంచేయను అనిమొండికెత్తేది" అంది మాలతి.

భూతన్ మారుమాట్లాడకుండా మాలతి ఇచ్చే రొట్టెలు తీసుకుంది.

❖ ❖ ❖

సిన్మాహాలు నుంచి బయటికి వస్తూనే తనీమా అంది అలోక్‌తో, "నేను చెప్పలేదా సిన్మా చాలా బాగుంటుందని."

"కావచ్చు" క్లుప్తంగా బదులిచ్చాడు అలోక్.

"కాని, ఇంటిదగ్గర జరుగుతున్న నాటకం గురించే నేను ఆలోచిస్తున్నాను. భూతన్, మాలతీలు ఎంతగా ఒకరినొకరు గాయపరుచుకొంటున్నారో' తన ఆలోచనలు బయటపెట్టాడు అలోక్.

"అవన్నీ చెప్పి నన్ను బాధపట్టెవద్దు. ఇప్పటిదాకా ప్రాణం హాయిగా ఉంది" అంది తనీమా.

"సరే... ఇప్పుడెలా పోవటం?" అడిగాడు అలోక్.

"టాక్సీలో పోదామా?" అనుమానంగా అడిగింది తనీమా.

"ఏం? బస్సులో పోతే ఎలా ఉంటుంది?"

"అబ్బ.. ఈ జనంలో తోసుకొంటూ బస్సు ప్రయాణం చేసే ఓపికలేదు నాకు. ఏం ఫర్వాలేదు టాక్సీలో వెళ్తే ఆస్తేమీ తరిగిపోదు" అంది తనీమా.

"అలాగే... ఏదైనా టాక్సీ దొరుకుతుందేమో ప్రయత్నిద్దాం" అన్నాడు అలోక్.

"ఏంటి నీరసంగా "ప్రయత్నిద్దాం" "చూద్దాం" లాంటి మాటలు! నీ జేబులో డబ్బులుంటే, ఈ నీరసం ఎందుకు?" అంది తనీమా.

"మీ అమ్మాయి భూతన్ ఏమంటుందో తెలుసా? వాళ్ల క్లాసులో ప్రతి అమ్మాయికి కారుందిట. నిజానికి కారుంటే మనం స్వర్గానికి వెళ్లటానికి వేరే టిక్కెట్టు అవసరంలేదు" అంది తనీమా.

"ఒకవేళ కారున్నట్లయితే మనకు ఇప్పుడు భూతన్‌ను తేవలసి వచ్చేది. అవునా, కాదా?" అడిగాడు అలోక్.

"భూతన్‌ను తీసుకొని ఈ సిన్మా చూడటానికా" అడిగాడు అలోక్, తనీమాను నచ్చచెబుతున్నట్లుగా.

"ఓహ్... బాగా చెప్పావు. భూతన్‌కు ఏమర్థమవుతుంది ఈ సిన్మా... మనతో రావటం ఒక్కటే దానికి సంతోషం కలిగిస్తుంది. ఇక ఆ మాలతి మాటలు వింటుంటే నా రక్తం ఉడికిపోతుంది. భూతన్‌ను ఆమె ఎంత బాధపెడు

తుందో కాని, మాలతీకి దొంగ బుద్ధిలేదు. అందువలన ఊరుకొంటున్నాను నేను" అంది తనీమా.

"నిజమే.. అదో మంచివిషయమే. మాలతికి దొంగ బుద్ధిలేకపోవటం నిజంగా ఒక సుగుణం. ఆ విషయం అటుంచితే చెప్పేది విను. శనివారం నేను షామ్‌నగర్ వెళ్తాను" అన్నాడు అలోక్.

ఇటీవల అలోక్ మాటలు మార్చటం బాగా నేర్చుకొన్నాడు. ఇదివరకూ "మా అమ్మ దగ్గరికి వెళ్తున్నాను" అని అనేవాడు. ఇప్పుడు "అక్క దగ్గరకి" అంటున్నాడు. ఇటీవల అలోక్ అక్కయ్య "మీరిద్దరూ ఉద్యోగం చేస్తున్నారని నాకు తెలుసు. కాని ఆదివారం రోజల్లా నిద్రపోతారా ఏమిటి? రావచ్చుగా" అని అంది.

అలోక్ మాటలు విని తనీమా. "శనివారం రాత్రికి ఎందుకు? మనం వెళ్తే మళ్లీ భూతన్ ఏడుస్తుంది. నేనూ మా అమ్మ దగ్గరికి వెళ్దామనుకొంటున్నాను ఆదివారం. మరి దాని సంగతి ఎలా?ఏమిటో హడావుడిగా మీ అమ్మ దగ్గరికి వెళ్లాల్సిన అవసరం? ఆవిడ ఆరోగ్యం బాగాలేదా?" అడిగింది తనీమా.

"అదేంలేదు... అమ్మ గురించిన వార్తలేవీ లేవు. అందుకని" చెప్పాడు అలోక్.

"అయితే మేమూ వస్తాం. భూతన్‌ను కూడా తీసుకువస్తాను. భూతన్ వాళ్ల నానమ్మని చూడక చాలాకాలం కూడా అయింది".

తనీమా మాటలు అలోక్‌కు ఆశ్చర్యం కలిగించింది. "ఇదో నాటకమా" మెల్లిగా అన్నాడు అలోక్.

తనీమా ఆలోచనలు వేరుగా ఉన్నాయి. ఎలాగైనా ఈసారి అత్తగారి నొప్పించి ఇల్లు అమ్మేయించేలా చూడాలి. ఎందుకంటే ఆవిడ ఉండగా అలోక్ ఏమీ చేయలేడు.

ఇంతలోనే తనీమా తన ఆలోచనలను మరోవైపు తిప్పి, అలోక్‌ని అడిగింది "మనం శనివారం రాత్రికన్నా ఆదివారం ఉదయం వెళ్తే ఎలా ఉంఉటంది. అప్పుడు రైల్లో కన్నా హాయిగా బస్సులో పోవచ్చు."

అలోక్‌కు కొంచెం కోపం వచ్చింది. "అసలిలాంటప్పుడు పోకపోతే

ఏమిటి? మనం వెళ్ళేప్పటికి బాగా ఆలస్యమవుతుంది. పైగా రోజంతా మా అమ్మకు వంట సరిపోతుంది. ఇక ఆవిడకు మాట్లాడ్డానికి అవకాశం ఎక్కడ? శనివారం వెళ్తే ఆ రాత్రి అయినా మాట్లాడవచ్చు అని నా ఉద్దేశం” అన్నాడు అలోక్.

“ఆ.. ఈ ఫార్మాలిటీలు అన్నీ ఎందుకు”

అలోక్ ఏదో అందామనుకొని కూడా ఊరుకొన్నాడు.

“ఒకవేళ మనం రాత్రిపూట వెళ్తే మాలతిపై ఇల్లు వదిలి వెళ్ళాలి. అది నాకు ఇష్టంలేదు. ఎవరికి తెలుసు మనం లేనప్పుడు మాలతి ఏ మగవాడ్ని ఇంటికి తెస్తుందో. నేను భూతన్‌కు చెప్పాను. “మాలతీ ఆంటీ చేసే పనులు ఒక కంట కనిపెట్టుంచమని”. ఒకసారి భూతన్ చెప్పింది “మాలతీ ఆంటీ ఎవరో కుర్రవాడితో మాట్లాడుతోందని” అంది తనీమా.

“అంటే పిల్లలకు ఇలాంటివి కూడా నేర్పుతున్నావన్న మాట” అన్నాడు అలోక్.

“సర్లెండి... మీరు నాకు నీతులు చెప్పకండి” అంది కోపంగా తనీమా.

“మనిద్దరం తొమ్మిదింటికి వెళ్తామా ఇంట్లోంచి బయటకి. భూతన్‌మాత్రం పదిన్నరకే వస్తుందికదా! మరి మాలతీని గమనించమని భూతన్‌కు చెప్పక మరెవ్వరికి చెబుతాను? మాలతీకి ఎవరెవరితో సంబంధాలున్నాయో మనకెలా తెలుస్తుంది. ఏదన్నా అడిగితే అది పొగరుబోతుగా సమాధానం చెప్తుంది. ఉద్యోగం లోంచి తీసేద్దామంటే నేను ఉద్యోగం మాని ఇంట్లో కూర్చోవాలి. అందువలన ఈ నాగుపాముతో జీవితం వెళ్లబుచ్చుతున్నాను.

అలోక్‌కు తనీమా మాటలు కోపం తెప్పించాయి. “రోజల్లా నీ కూతరును పరాయి మనిషికి అప్పగించి ఉంచటానికి నీకేమీ సిగ్గనిపించదు. కాని, పనిమనిషి విషయంలో మాత్రం నీకు లక్షాతొంభై వంకలు” అరిచాడు అలోక్.

ఇంతలో టాక్సీ వచ్చి అలోక్ వాళ్ళింటి ముందు ఆగింది.

తనీమా, అలోక్ టాక్సీ దిగారు.

“అలోక్.. నువ్వు కాసేపు బయటనే నుంచుని తర్వాత రా. నేను ముందువెళ్తాను. ఇద్దరం కలిసి ఒకేసారి వెళ్లే బూతన్ మనం సిన్మాకి వెళ్ళామని

తెలుసుకొంటుంది. వాస్తవానికి నేను డాక్టర్ దగ్గరికి వెళ్తున్నానని చెప్పి సిన్మాకి వచ్చాను. చూశారా! పనులు ఎలా సమర్థించుకొస్తానో' గర్వంగా చెప్పింది తనీమా.

అలోక్ ఆశ్చర్యపోయాడు. తనీమా మాటలకు తనీమా వెళ్ళి పోయింది. అలోక్ సిగరెట్టు వెలిగించి ఆలోచించటం ప్రారంభించాడు. కాసేపు గడిచాక అలోక్‌కు తను అప్పటికే మూడు సిగరెట్లు తాగానన్న సంగతి గుర్తువచ్చి ఇంటి ముఖం పట్టాడు.

తనీమా తలుపు తీసింది.

ఇంతలో భూతన్ కేకలు వినిపించాయి. "మాలతీ ఆంటీ! చూశావా! నీ మాటలన్నీ అబద్ధాలే! డాడీ ఇప్పుడే ఆఫీసునుంచి వస్తున్నాడు. నువ్వు వాళ్లిద్దరూ సిన్మాకు వెళ్ళారు అని చెప్పావు. అబద్ధాలకోరు. నిన్ను కొట్టాలి, తల పగల కొట్టాలి!" ఆక్రోశంగా నిద్దరలో అరుస్తోంది భూతన్.

అది భూతన్ నిస్సహాయ హృదయంలోని లేత పసిప్రేమ ఆక్రోశంతో అన్న మాటలు. ఇప్పుడు భూతన్ నిజాయితీ, ప్రేమ ముందు నిల్చునే శక్తి ఆ ఇంట్లో ఎవ్వరికీ లేదు.

తనీమాకు మాత్రం ఇదేమి పట్టలేదు. తను ఏదోవిధంగా తన పనులు చక్కబెట్టుకురాగలగుతున్న సంతృప్తితో భూతన్ దగ్గరికి వెళ్ళింది తనీమా.

"భూతన్.. ఎందుకలా కలవరిస్తావు నిద్దరలో? మాలతీ ఆంటీ నిన్ను ఏడిపించాలని అలా అంటుందన్న సంగతి నీకు తెలియదా?" సర్ది చెప్పబోయింది తనీమా.

భూతన్ ఆవేదనపై తనీమా నాగరికత వ్యామోహం విజయపతాకం ఎగరేసిందా?

పిల్లల గురించి తీవ్రంగా ఆలోచిస్తూ, అంకితభావంతో సేవ చేసుకుంటూ పోతే పెద్దల జీవితానందం తరిగిపోతున్న భావన! అలా అని ఏమాత్రం వది లేసినా అశ్రద్ధ, అలక్ష్యంవల్ల వాళ్లు పాడైపోతే మనోవేదన! దానికి అంతెక్కడ?

(విపుల, సెప్టెంబర్, 1991)

❖

ఒప్పందం

(మరాఠీ కథ)

ప్రతిమా ఇంగోలే

❋

నా భర్త నిజంగానే చాలా సహృదయుడు. ఆయనకి నేనంటే చాలా ఇష్టం కూడా. ఆయనేం తెచ్చినా నాకు అందులో భాగం ఇవ్వనిదే ఆయన మనస్సుకు శాంతి కలగదు. కాని, ఈ విషయం ఇంత స్పష్టంగా చెప్పినా మా నాన్న నన్ను నమ్మకపోవటం నిజంగా నా దురదృష్టం. నిజానికి ఈనాడు కట్నాలను, లాంఛనాలను తప్పించుకొంటున్న పెళ్లిళ్లు ఎన్ని ఉన్నాయి? ఎంత మంది కట్న కానుకలు ఇవ్వకుండా పెళ్లి చేసుకొంటున్నారు? కాని కేవలం అయిదు వందలు మాత్రమే కట్నంగా ఇవ్వటానికి మా నాన్న చాలా బాధ పడిపోవటం నేను బాగా గమనించాను.

ప్రతి సందర్భంలోనూ ఆయన మా వారికి అయిదు వందలు కట్నంగా ఇచ్చినట్టు దెప్పిపొడుస్తూ గుర్తు చేస్తారు.

"పుష్పీ... మీ ఆయనకు నేను అయిదు వందలు కట్నంగా ఇచ్చాను తెలుసా..." అని అంటారు.

మీరే న్యాయం చెప్పండి. కట్నం ఇవ్వాలని ఒప్పుకొన్నాక ఆయన తప్పని సరిగా ఇవ్వవలసిందే కదా... కాని మా నాన్న తన మాట నిలబెట్టుకోనూ లేదు. పూర్తిగా ఇవ్వనూలేదు. కేవలం పాతిక రూపాయలకు కక్కుర్తిపడి

తక్కువ కట్నమే ఇచ్చిన సంతృప్తికోసం నాలుగువందల డెబ్బయి అయదు రూపాయలే ఇచ్చాడు. అలాంటప్పుడు మా మామగారువాళ్ళు గొణుక్కోవడంలో తప్పేమిటి? మీరు చెప్పండి? అమ్మో... మా నాన్నగారికి ఆ గొణుగుడు విన పడితే ఏమన్నా ఉందా. రైలు ఇంజనులా పొగలు కక్కటం మొదలుపెడతాడు. అసలు ఆయన నా పెళ్లి చూసింది ఎక్కడ. పెళ్లికి వచ్చి వారితో ఈ విషయంపై వాదోపవాదాలు చేసేసరికి ఆయనకున్న సమయమంతా సరిపోయింది. నా గుండె వణకటం ప్రారంభించింది ఆయన ప్రవర్తన చూసేసరికి. అసలు మా నాన్నగారి ప్రవర్తన చూశాక పెళ్లి వారు పెళ్లి జరగనిస్తారా అన్న భయం మరీ ఎక్కువైంది. నిజానికి నా భర్తని పెళ్లిచూపులనాడు చూసిన మరుక్షణమే అతని దర్జా నన్ను ఇట్టే ఆకర్షించింది.

చక్కగా తెల్లగా ఉంటాడు. మనోహరమైన మీసకట్టు, తెల్లటి బట్టలు అన్నీ నన్ను ఆకర్షించేయి. మా గ్రామం మొత్తం మీద అతనిలాంటి అందగాడు లేడంటే అబద్ధం కాదు. అయితే అప్పుడే కట్నం తాలూకు బేరసారాలు మొద లయ్యాయి. అక్కడికి అక్కడే మా అమ్మకు నా మనసులోని మాట చెప్పేద్దా మనుకొన్నాను కూడా.

"చూడు... ఇంకో రెండు వందలు ఇవ్వవలసి వచ్చినా ఈ సంబంధాన్ని ఒప్పేసుకోండి కాని ఆ అబ్బాయిని చెయిజారిపోనీయవద్దు" అని చెప్పాలని నోటిదాకా వచ్చింది.

కాని నన్ను సంప్రదించేదెవరు? నా మాట వినేదెవరు? ఆనాడు నా పెళ్లి మాటలు కేవలం డబ్బు లెక్కల్లో వచ్చిన తేడాతో విఫలమయ్యాయి. నేను చాలా బాధపడ్డాను. రాత్రింబవళ్ళు అతని ప్రతిమే నా మనఃఫలకం మీద ప్రతిఫలించేది. గుర్రంపై తేలుతూ వచ్చి నన్ను కూర్చోబెట్టుకొని వెళ్తున్నట్లు కలలు వచ్చేవి. ఎంత ప్రయత్నించినా నా మనస్సు నామాట వినటంలేదు. ఇప్పుడు మీరు చెప్పండి... పోనీ ఇంతకుముందు ఆ అబ్బాయి నేను ఒకరినొకరు ఎరుగుదుమా? కేవలం పెళ్ళి చూపుల్లో అతనిని చూసినంత మాత్రాన ఎవరైనా ఇలా మనసుపారేసుకొంటారా? పోనీ నేను పెళ్లికి అంత ఉబలాటపడటంవలన నాకు అలాంటి భావాలు కలిగాయని మీరనవచ్చు. అలా అయితే హీరాపూర్

నుంచి ఇంకొక పెళ్ళివారు వచ్చినప్పుడు ఆ అబ్బాయి వంక చాలాసేపు చూశాను. కానీ పూర్వం పెళ్లి సంబంధంలో కలిగిన అపూర్వమైన అనుభూతులు ఇప్పుడు కలుగలేదు. కేవలం అలా చూస్తున్నందుకు అపుడు మా అమ్మ కోప్పడిందే తప్ప ఆ సంబంధం అబ్బాయి నన్నేమాత్రం ఆకర్షించలేకపోయాడు.

"పుష్పీ... ఏంచేస్తున్నావు? ఏవేళ చూసినా ఏదో కోల్పోయినట్టు దిగాలుగా మొహం పెట్టుకుంటావు? ఇలాగైతే నీ చదువు గట్టెక్కినట్లే" అనేది మా అమ్మ.

కాని ఏంచేయను? ఆ అబ్బాయి నా కళ్లలో కన్పిస్తూనే ఉన్నాడు. అప్పుడు నేను భగవంతుడిని ప్రార్థించాను. "ఓ గజానన బాబా నువ్వే ధర్మానివి. దయ చేసి ఆ పిల్లవాడి తండ్రిని ఒప్పించు. నన్నే కోడలిగా స్వీకరించమని చెప్పు. అలా చేస్తే నీకు ముప్పై పైసలు దక్షిణ ఇస్తాను. అలాగే షిగాం వచ్చి నీ దర్శనం చేసుకొంటాను".

గజానన బాబా నిజంగానే ధర్మాత్ముడు. ఆయన ఆ పెళ్లికొడుకు తండ్రిని ముక్కుపట్టి వెనక్కి లాక్కువచ్చాడు.

"రాస్కెల్... నా కొడుకు నా మాట వినటంలేదు. నేను పెళ్లి చేసుకొంటే ఆ అమ్మాయినే చేసుకొంటానని మొండికెత్తాడు" అంటూ మా దగ్గర కాబోయే భర్తపై ఫిర్యాదు చేశాడు మా మామగారు.

దాంతో మా నాన్నగారి రొట్టెవిరిగి నేతిలో పడ్డది. నా అదృష్టం ఇంకా బాగుందేమో. కేవలం అయిదు వందల కట్నానికే నా పెళ్లి నిశ్చయమయింది. నా హృదయం ఆనందంతో పొంగి పరవళ్లు తొక్కింది. నాకు నిజంగా గొంతెత్తి పాడాలనిపించింది. నర్తించాలనిపించింది.

"అమ్మాయి పెళ్లి నిశ్చయమయ్యేప్పటికి దానికి ఎక్కడ్లేని ఆనందంగా ఉంది" అని మా అమ్మ అనటం నేను స్వయంగా విన్నాను.

ఇప్పుడు మా అమ్మకు ఏం చెప్పాలి? నా హృదయం ఈ అబ్బయితో ఏనాడో మెలివేసుకుపోయిందని నేనెలా చెప్పను?

పెళ్లికి నేను ముదురు ఆకుపచ్చరంగు చీరెను కట్టుకొన్నాను. ఆనాడు నా భర్త చాలా అందంగా కన్పించాడు. అతను తెల్లని బట్టలు ధరించాడు. నెత్తిన తెల్ల టోపి పెట్టుకున్నాడు. నల్లని కోటు ధరించారు. మేమిద్దరం పక్కపక్కనే

కూర్చుంటే లక్ష్మీనారాయణుల జంటలా ఉన్నామని చూసిన వారంతా చెప్పుకొన్నారు.

నా భర్త నన్ను ఎప్పుడూ ప్రేమిస్తూనే ఉండేవాడు. ఎప్పుడు నన్ను పొగుడుతుండేవాడు. ఎప్పుడు అకోట్ వెళ్ళినా నా కోసం ఏదో ఒకటి తెచ్చేవాడు. నేనంటే ఎంతో ఎంతో చెప్పలేని ప్రేమ. అలాగే నేను కూడా ఆయన్ని చాలా గారాబంచేసేదాన్ని. అడగకముందే ఆయన మనస్సులోని మాట గ్రహించి కావలసిన వాటిని అందించే దాన్ని. ఎప్పుడన్నా అత్తగారు అరిచినా వాటిని పట్టించుకొనే దానిని కాదు.

నాకు పెళ్లయిన నాటి నుంచి "ఓ భగవంతుడా.. ఈ ప్రపంచం నిజంగా ఎంత అందమైనది. ఈ నక్షత్రాలు, పూవులు, చెట్లు అన్నీ నీ నామస్మరణే చేస్తున్నట్లున్నాయి" అని అంటుండేదానిని. నది ఒడ్డుకుపోయి నీళ్లలో కాళ్లు పెట్టి అలలపై వాటిని ఆడించటమంటే నాకెంతో ఇష్టం.

ఆషాడం వచ్చింది. మా నాన్నగారు నన్ను తీసుకువెళ్లడానికి వచ్చారు. కాని ఆయనతో వెళ్లడానికి నాకు ససేమిరా మనస్కరించలేదు. నా భర్త కూడా నన్ను వదిలి ఉండలేని స్థితిలోనే ఉన్నాడు. కాని మా నాన్న నన్ను తీసుకు వెళ్లడానికి వస్తే నేను ఎలా కాదనగలను?

అయినప్పటికీ మా ఆయన "మామగారు.. ఒక పనిచేయండి మీరు వెళ్లిపోండి. నేను పుష్పిని తీసుకొని ఆషాడానికి ఒకటి రెండు రోజులు ముందుందనంగా వస్తాను" అన్నాడు.

ఆ మాట వినగానే మా నాన్నగారికి కోపం వచ్చేసింది. కేకలు వేస్తున్నట్లుగా "నేను స్వయంగా అమ్మాయిని తీసుకెళ్దామని వచ్చినా దానిని నాతో పంపరా? ఔరా... మీకు చాకిరి చేయడానికి అది ఎంత చౌకగా దొరికిన కూలీ... దానికి కనీసం కడుపునిండా అన్నమైనా పెట్టరు. కేవలం ఒక బానిసను చూసినట్లు చూస్తారు. అందువలనే అది అంత సన్నబడి పోయింది" అరిచాడు.

వెంటనే 'మీ అమ్మాయినే అడగండి. ఇక్కడ మేమేం కష్టాలు పెట్టామో చెప్పమనండి. ఇక్కడ ఆడవారంతా చుట్టుపక్కల ఫాంలో పనిచేస్తారు. కనీసం అక్కడికైనా ఎప్పుడన్నా వెళ్లమన్నానేమో కనుక్కోండి" అని సమాధానపర్చబోయారు

మా వారు. కాని మా నాన్నకు అది వినేంత సంస్కారం ఉంటే కథ ఇంతదూరం రాకపోవును?

"చాల్లేవయ్యా... పెద్ద చెప్పొచ్చావు. మా అమ్మాయిని ఇక ఒక్క క్షణం కూడా ఇక్కడ ఉండనివ్వను" అని మా నాన్న ఉద్రేకంగా శివాలు తొక్కసాగాడు.

కనీసం నన్ను చీరె కూడా కట్టుకోనీయకుండా వెంబడిబడి బయల్దేరదీశాడు నన్ను.

"పుష్పీ.... నువ్వేమీ భయపడవద్దు నిన్నిక ఇక్కడికి పంపమన్నా పంపను. వాళ్లేమనుకొంటున్నారో నీ గురించి, నా గురించి చూపిస్తాను నా తడఖా. కావలిస్తే నీకు ఇంతకన్నా మంచి సంబంధం వెతికి మళ్లీ పెళ్లి చేస్తాను" అని అన్నాడు మా నాన్న వెర్రి ఆవేశంలో.

ఇంటికి చేరాక "ఇదిగో అమ్మాయిని తెచ్చాను. ఇక ఎప్పుడూ దీనిని ఆ స్కౌండ్రల్స్ దగ్గరికి పంపను" అన్నాడు ఆయన మా అమ్మతో.

"నాన్నా.. నీకు విషయం తెలియ అలా మాట్లాడుతున్నావు. నిజానికి వాళ్ళు నువ్వనుకొన్నట్లు స్కౌండ్రెల్స్ కారు. చాలా మంచివారు" అని నేను జోక్యం కలగజేసుకొని చెప్పిచూశాను.

"ఏమిటి? వాళ్లు నీకు మంచివాళ్లుగా కన్పించారా? వాళ్ల గురించి నాకు బాగా తెలుసా? నీకు బాగా తెలుసా?" మా నాన్న మళ్లీ అరిచాడు నా పైకి కోపంగా.

అంతే, నన్ను ఏది సౌఖ్యంగా ఉంచలేకపోయాయి అక్కడ. నా ఆకలి క్షీణించిపోయింది.

నా స్నేహితులు "పుష్పీ నీకేమైనా కష్టం వచ్చిందా? మాకు చెప్పవే" అని అడిగేవారు.

ఆషాఢం పోయింది, శ్రావణం వచ్చింది. కాని నా హృదయంలో ఎటువంటి మార్పురాలేదు. ఎప్పుడూ దేన్నోకోల్పోయిన న్యూనత నాలో చోటు చేసుకొంది. అప్పుడు మా అమ్మకు అన్ని విషయాలు సవివరంగా చెప్పాను. నిజానికి అత్తవారింట్లో నేను ఏ కష్టాలకు గురికాలేదని మా అమ్మ కూడా గ్రహించింది. కాని ఆవిడ నమ్మి ప్రయోజనం లేదుగా. మా నాన్న ఒక పెద్ద

మొండిబండయినా, కన్నతల్లిగా ఆవిడ నా తరపున మా నాన్న మనస్సు మార్చే ప్రయత్నం చేసింది.

"చూడండి... మనం ఇటీవలే అయిదు వందలు తగలేసి దీనికి పెళ్లిచేశాం. కానీ ఇప్పుడు మళ్లీ పెళ్లి గురించి మీరు మాట్లాడుతున్నారు. దానికి డబ్బెక్కడి నుంచి తెద్దామని మీ అభిప్రాయం. ముందు దీనికి విడాకులు తీసుకోవాలి. దానికి కూడా బోలెడంత ధనం వ్యయమవుతుంది. అంతకన్నా అదే స్వయంగా అత్తగారింట్లో దానికి హాయిగా ఉందని చెపుతుంటే దాని మాట నమ్మితే పోలేదా? ఇంత ఆర్ధిక నష్టం మనకి ఉండదు కదా. మన కర్తవ్యం దానికి పెళ్లి చేయటంవరకే. ఆ తర్వాత దాని కర్మని అది అనుభవిస్తుంది" అని అమ్మ నాన్నతో అంది.

డబ్బు మాట మా అమ్మ ఎత్తగానే మా నాన్నకు కంగారు పుట్టుకొచ్చేసింది. మర్నాడు ప్రభాకర్‌తో సహా నన్ను తీసుకొని మా అత్తగారి ఊరికి బయల్దేరాం.

నన్ను చూస్తూనే మా ఆయన చాలా సంతోషం వ్యక్తం చేశాడు. నా ఆరోగ్యం గురించి అడిగాడు.

"మీరు బాగా చిక్కిపోయారే" అన్నాను నేను.

"నువ్వు సన్నబడలేదూ...' అన్నారాయన ప్రతిగా.

ఒక నెల తర్వాత దీపావళి పండుగ వచ్చింది. మా నాన్న నన్ను తీసు కెళ్లడానికి మళ్లీ వచ్చారు.

ఈసారి మా మామగారు మౌనం వహించవద్దా. అబ్బే అలా ఎందుకు జరుగుతుంది?

"ఏం అన్నయ్యగారూ? మీరు ఇవ్వాల్సిన బాకీ చెల్లిస్తే బాగుంటుందేమో?" అని అడగనే అడిగేశారు.

"ఏమిటి? డబ్బా... నేను ఇంకా డబ్బు మీకు ఇవ్వాలని ఇస్తానని కలలు గంటున్నారా? మీరు మా అమ్మాయిని చూసినదానికి చాలా సంతోషం వేసింది. మా అమ్మాయిని బుద్ధిలేక మీ కుటుంబానికి అర్పించాను. ఇంతకన్నా కసాయి వాడికి అప్పగిస్తేఎంతో బాగుండేది" అన్నాడు మా నాన్న మూర్ఖంగా.

"అలా అయితే ఎంచక్కా కసాయివాడికి అమ్ముకోకపోయారా? మీ

అమ్మాయి కోసం వెతుక్కుంటూ మేం రాలేదే పెళ్లి సంబంధానికి? మీకు మీ అమ్మాయికి పెళ్లి కావాలని కోరిక కలిగింది. మీరే మా ఇంటికి వచ్చారు వియ్యమందడానికి. ఇప్పటికైనా మించిపోయింది లేదు. నా కొడుక్కు ఇవ్వడానికి పదిమంది ఆడపిల్లల తండ్రులు ఇప్పుడు కూడా తయారుగా ఉన్నారు. మీ పప్పులు నా దగ్గర ఉడకవు. ముందు డబ్బు తెచ్చి, ఈసారి మీ అమ్మాయిని తీసుకురండి ఇక్కడికి. ఊ తీసుకెళ్లండి మీ అమ్మాయిని" అన్నాడు మా మామ గారు ఆయన ధీశక్తినంతా ధారపోస్తూ.

ఆ దెబ్బతో మా నాన్న నేను బయటపడక తప్పలేదు. ఇంటికి వచ్చాక మా నాన్న మా మామయ్య దగ్గరకు వెళ్లాడు.

"వాళ్లు మేము ఇక కలిసి ఉండే ప్రశ్నలేదు. కోర్టులో విడాకులు సూట్‌వేయి. దెబ్బతో వారి పీడ, మన పీడ వదిలిపోతుంది" అన్నాడు మా నాన్న మా మామయ్యతో. ఆ తర్వాత నేను ఎంతో దుఃఖపడ్డాను. మా నాన్న కాళ్లపై సాష్టాంగప్రమాణం చేశాను. కాని మా నాన్న నా మాట వింటేగా.

"వాళ్లు నన్ను రెండుసార్లు అవమానించారు. ఏది ఏమైనా నేను ఇక నిన్నక్కడికి పంపించనుకాక పంపించను. కాని నీకేం భయమక్కర్లేదు. నీకు నేను మరో మంచి భర్తను తెస్తాను" అన్నాడు మా నాన్న తనేదో గొప్ప ఘన కార్యం చేస్తున్నవాడిలాగా.

ఆ తర్వాత మా నాన్న లాయర్ దగ్గరికి వెళ్లనే వెళ్లాడు. తిన్నగా కేసు కోర్టుకెక్కింది. వాళ్ల వైపు నుంచి మా ఆయన, మా మామగారు కోర్టుకు హాజరయ్యారు. ఆయన నన్ను చూశారు. నేను ఆయన్ని చూశాను. నాకైతే ఆయన వద్దకి పరిగెత్తి, ఆయన్ని కౌగిలించుకోవాలన్నంత ఆప్యాయత నాలో పెల్లుబికింది. కోర్టు కేసు విచారణను వాయిదా వేసింది.

"పోదంపద పుష్పి" అన్నాడు మా నాన్న నా దగ్గరికి వచ్చి...

కాని దూరాన మా వారిని చూస్తూ ముందుకు కదలాలంటే టన్నుల టన్నుల బరువు కాళ్లకి కట్టినట్లు, కాళ్లు భూమిలోకి పాతుకు పోతున్నట్లు అనిపించింది.

మా నాన్న పెద్దగా "నువ్వు ఇంటికి రావా? నువ్వు వాడివంక ఎందుకు

చూస్తున్నావు? మీ ఇద్దరి మధ్య ఇకబంధం ఏమిటి? ఈసారి కోర్టు విచారణలో మీ ఇద్దరికీ విడాకులు ఇచ్చేస్తారు కూడా. దాంతో మనం, వాళ్లు హాయిగా ఊపిరి పీల్చుకొంటాం. ఇక జీవితంలో ఇలాంటి స్కాం(డెల్స్‌ను మనం చూడం. వీళ్లకి మెదడు అనేది ఉందని నేను అనుకోను. ఈసారి కోర్టు ద్వారా నా డబ్బును కూడా నేను వెనక్కి తీసేసుకొంటాను. ఇక వాళ్లబ్బాయికి మళ్ళీ పెళ్లి ఎలా అవుతుందో చూస్తాను?" అని అరిచాడు.

దాంతో నాకు చింత, తాప(త్రయం మరీ ఎక్కువయ్యాయి. ఇంటికి వచ్చాక నా స్నేహితురాలు కుసుమీ ఇంటికి వెళ్లాను. ఆ అమ్మాయి చాలా తెలివిగలది. ఆమెకు అంతా వివరించాను.

"నువ్వు నీ భర్తకు విషయం అంతా వివరిస్తూ ఉత్తరం రాసేయి. ఆయనకి ఇష్టమైతే నువ్వు వచ్చేయటానికి సిద్ధంగా ఉన్నానని కూడా రాసేయి" సలహా ఇచ్చింది కుసుమీ.

కాని, నాకు ఉత్తరం రాయటం రాదుగా. అందువల్ల దాన్నే ఉత్తరం రాసి పెట్టమని ఆడిగాను.

కుసుమీ ఉత్తరం రాసింది. దానికి జవాబు వస్తుందా రాదా... అన్న మీమాంసంలో ఉండగానే నాల్గో రోజున మావారి నుంచి జవాబు వచ్చేసింది.

"నాకూ మరో పెళ్లి చేసుకోవాలని లేదు. కాని మా నాన్నగారికి ఈ విషయం అర్థం కాదు. అయినా దిగులు పడవలసిన పనిలేదు. నీకు ఇష్టమైతే మనిద్దరం వెళ్లిపోయి ఎక్కడైనా స్వేచ్ఛగా (బతుకుదాం" అని రాశాడాయన.

ఆనాటి రా(త్రి నాకు మా సహజీవనం, సాంసారిక జీవితం కలగా వచ్చాయి. మర్నాడు ఉదయం ని(ద్రలేచి స్నానానికి నదీ ఒడ్డుకు వెళ్తున్నానని అమ్మతో చెప్పి, బస్టాండుకు వెళ్లిపోయాను. అక్కడి నుంచి నేరుగా అకోట్‌కు బస్సులో వెళ్లాను.

బస్టాండుకి నా భర్త ముందరే వచ్చేశాడు. నన్ను ఇంటికి తీసుకెళ్లడానికి.

"రేపు కోర్టులో విచారణ ఉంది. ఈ రా(త్రికి ఇక్కడే మా అత్తయ్యగారింట్లో పడుకొని, (పొద్దున్నే నేరుగా కోర్టుకు వెళ్దాం" అన్నారు మావారు.

కోర్టులో మమ్మల్ని చూసి మా నాన్న, మా మామగారు గు(రులు పెట్టారు.

కాని కోర్టు రక్షణలో వాళ్ల పప్పులేవీ ఉడకలేదు. ఇద్దరూ మమ్మల్ని శాయశక్తుల దూషించారు. కోర్టులో వారంతా మావైపే చూడసాగారు.

లాయర్ అడిగిన ప్రకారం జీవితాంతం ఒకరికొకరం తోడుగా ఉంటామని బాండ్ రాసి ఇచ్చాం. అతను పలకరింపుగా నవ్వాడు.

ఇప్పుడు చెప్పండి. నేను నా భర్త దగ్గరికి పరిగెత్తుకు వెళ్లటంలో నేరం చేశానంటారా? ఆయన నన్ను కావాలనుకొన్నారు. నేనూ ఆయనతోనే జీవించాలనుకొన్నాను. ఎవరేం అనుకొంటే మాకేమిటి? అవునా? కాదా?

(విపుల, సెప్టెంబర్ 1991)

❖

అభిలాష

(ఇండో ఆంగ్లియన్ కథ)

షీలా గుజ్రాల్

❃

విమానం శాంతాక్రజ్‌లో దిగగానే కిటికీ అద్దాల్లోంచి బయటికి చూసింది మారిస్. విమానాశ్రయం టెర్రస్‌పైనుంచి ఎంతో ఆతృతతో తన కోసం ఎదురు చూస్తున్నట్లున్న మదన్, అతని తండ్రిని ఆమె దృష్టి ఆకర్షించింది. తను ఎంతో త్వరగా విమానంనుంచి దిగి వారి వద్దకు వస్తానన్నట్టుగా పూలదండలు వేసి తనను అభినందించటానికి తండ్రీ, కొడుకుల్దిరూ పెద్దపెద్ద పూలమాలతో టెర్రస్‌పైనుంచి చూస్తున్నారు.

ఆమె వారిద్దరివద్దకు రాగానే ఇద్దరూ ఆమెతో కరచాలనంచేసి ఆమెకు పూలమాలు అందించారు.

ఇద్దర్నీ తన కారులో కూర్చోమని కోరారు మదన్ తండ్రి. విమానాశ్రయ అధికారులతో కాసేపు కులాసాకబుర్లు చెప్పి ఆయన కూడా కారువద్దకు వచ్చేశారు.

శాంతాక్రజ్ నుంచి బొంబాయి ఎయిర్‌పోర్ట్ దగ్గరికి కారు రాగానే అక్కడ పెద్దసంఖ్యలో మదన్‌వాళ్ళ కుటుంబీకులు వరుసలో నిల్చొని ఉండటం చూసింది మారిస్. ముందుగా అందరికంటే వయస్సులో పెద్దదైన స్త్రీ ఒకరు మారిస్‌ను గట్టిగా ఆలింగనం చేసుకొంది. ఆవిడ హడావుడిగా మారిస్‌ను

ఆలింగనం చేసుకోవటంలో, మారిస్ జుత్తు అంతా చెదిరి పోయింది. సరిగ్గా అదేస్థితిలో వారిద్దరినీ ఫొటో తీశాడు ఫొటోగ్రాఫర్.

ఆవిడ తర్వాత మరో భారీదేహంగల స్త్రీ ముందుకు వచ్చింది. ఆవిడ పైనుంచి కిందివరకూ బంగారు గొలుసులతో, వజ్రాల ఆభరణాలతో అలంకరించుకొని ఉంది.

"చాలండి వదినగారు...! మారిస్ నలిగిపోయేలా ఉంది అయినా మీ తర్వాత నేనున్నాను వరుసలో.. నాకు అవకాశం ఇవ్వరా ఏంటి? అంటూ తన భారీకాయం కిందపడకుండా హైహీల్స్ చెప్పులమీద తూకంలాగా జాగ్రత్తగా నడుపుతూ మారిస్ దగ్గరికి వచ్చింది.

మారిస్‌కు పూలమాలనిచ్చిక, ఆమెను నలిగిపోయేలా కౌగలించుకుంది ఆ భారీకాయం. మారిస్‌కు ఊపిరి ఆడలేదు.

మదన్ తల్లీ, మేనత్తలు మారిస్‌ను కౌగలించుకోవటం ముగిశాక, మదన్ చెల్లెళ్ళిద్దరూ ఒకరి తర్వాత ఒకరు ఆమెను పలకరించారు.

ఒకేరకమైన దుస్తులు, ఆభరణాలు ధరించిన ఆ ఇద్దరు అక్క చెల్లెళ్ళు ఒకేవిధంగా కన్పించారు మారిస్‌కి.

వాళ్ళు ధరించిన బంగారం, దుస్తులు ఆ తళుకు, ఆ మెరుపు చూసి మారిస్‌కు స్పృహతప్పినంత పనైంది. అయితే వారి చిరునవ్వులు ఆమెను ఆకర్షించాయనటంలో సందేహంలేదు. వారి ప్రేమాభిమానాలకు ఆమె తననుతానే మర్చిపోయింది.

అంతలోనే తేరుకొని అటూ ఇటూ చూస్తే మదన్ కనుచూపుమేరలో ఎక్కడా కన్పించలేదు మారిస్‌కు. అతనికోసం ఆమె కళ్ళు శోధిస్తుండగా, తండ్రి, కొడుకులిద్దరూ హడావుడిగా ఎయిర్‌పోర్ట్ హాలులోకి రావటం గమనించింది మారిస్.

"అందరూ త్వరగా కార్లలో కూర్చోండి. సామాన్నంత నేరుగా హొటల్‌కు పంపే ఏర్పాట్లు చేసేశాను" అన్నాడు మదన్ తండ్రి.

అంతా వేగంగా వెళ్ళి కార్లెక్కి సర్దుకు కూర్చున్నారు. మారిస్ ఇద్దరు అక్క చెల్లెళ్ళ మధ్య కూర్చుంది. వాళ్ళిద్దరూ కార్లో ముందు సీట్లో కూర్చున్న మేనత్తను

తమ కబుర్లతో ముగ్ధురాలిని చేయడానికి తీవ్ర ప్రయత్నం చేస్తుండగా, ఆవిడా, మారిస్ చాలా అసహనంగా కూర్చున్నారు.

మధ్యమధ్య వాళ్ళు మారిస్‌ను అనేక ప్రశ్నలు వేసి వేధిస్తున్నారు. "ఈ కథ తెలుసా, ఆ కథ తెలుసా?" అని అడిగి ఒక్కో కథ చెబుతున్నారు. ఆమె ఈ కథలు ఈ జన్మలో వినివుండదు.

ఇద్దరు అక్కచెల్లెళ్ళ కబుర్లు భరింపరానంత తలనొప్పిగా ఉన్నా హెూటల్ చేరాగానే తనకిష్టమైన వంటకాలతో భోంచేసి, వేడివేడి కప్పు కాఫీ తాగాక ఆమెకు వాళ్ళ కథలు, విశేషాలు నిజంగా తలనొప్పి కాదనిపించాయి. ప్రయాణ బడలికవలన పోయిన శక్తి, కల్గిన నీరసం అలా అనుకునేలా చేశాయని ఆమెకు తెలుసు. ఇప్పుడు కొత్త శక్తి నరాల్లో పుంజుకొంటుంటే హాయిగా ఉంది. పది నిమిషాలు హెూటల్లో విశ్రాంతి తీసుకొంది మారిస్.

ఇంతలోనే మదన్ మేనత్త కంఠం విన్పించింది మారిస్‌కు.

"త్వరగా తయారవ్వండి... మరో రెండు గంటల్లో మనమంతా మళ్ళీ బయల్దేరాలి" అరుస్తోంది మదన్ మేనత్త.

మొత్తం కుటుంబం అంతా కలిసి పాశ్చాత్య పెళ్ళికూతురైన మారిస్‌ను భారతీయ పెళ్ళి కూతురును చేశారీ రెండుగంటల సమయంలో.

మారిస్‌కు చీర కట్టి భారతీయ వధువును చేయటంలో అక్క చెల్లెళ్ళు పడ్డ శ్రమ అంతా ఇంతాకాదు. ఇదంతా ఒక పెద్ద వ్యాయామంగా తోచింది మారిస్‌కు.

మదన్ మేనత్త మారిస్‌ను వజ్రాల ఆభరణాలతో అలంకరించసాగింది. బొంబాయిలోని ప్రఖ్యాతిగాంచిన హెయిర్‌డ్రెస్సర్ ఆవిడ. పాశ్చాత్య హెయిర్ స్టయిల్‌ను భారతీయం చేస్తోంది. అందరూ కలిసి మారిస్‌ను అజంతా శిల్ప సుందరిగా మార్చారు.

తర్వాత మొత్తం పటాలం విమానంలో అంతా డిల్లీ చేరారు. విమానం సమయానికే ఢిల్లీ చేరింది. అక్కడ స్నేహితులు, శ్రేయోభిలాషు లతో విమానా శ్రయం క్రిక్కిరిసిపోయింది. మేనత్త ముందుగా మారిస్‌ను ఇంటికి తీసుకుపోగా, మదన్ మిగతా మిత్రులతో పార్టీకి వెళ్ళాడు.

భారతీయ సంప్రదాయం ప్రకారం మదన్, మారిస్‌లు శోభనానికి ముందు ఒకే ఇంట్లో విడిది చేయరాదు. మారిస్‌కు సనాతనమైన ఈ సంప్రదాయాలన్నీ పచ్చి చాదస్తంగా కన్పించాయి. ఆ వారం అంతా ఒకరోజు సంగీతం, ఇంకొక రోజు మెహిందీ అలంకరణ, మరోరోజు గాజుల అలంకరణ ఇలా ఒక్కో దినం ఒక్కో అలంకారంతో మారిస్‌ను ముంచెత్తారు వారం రోజులు. కొన్ని కార్యక్రమాలు మదన్ మేనత్త ఇంటికి దగ్గర చేశారు. అక్కడ కేవలం పిల్లలు, స్త్రీలు మాత్రమే హాజరయ్యారు. మిగతావన్నీ మదన్‌ఉండే బంగళాలోనే జరిగాయి. మదన్ బంగళాను అందమైన షామియానాలతో మహారాజుకాలం నాటి ఆడంబరంతో నింపేశారు. అదో భూతలస్వర్గంలా కన్పించింది. మదన్ గార్డెన్ అంతా కాంతులతో శోభాయమానంగా అలంకరించారు.

ఇలా వారం అంతా సంబరాలతో, వేడుకలతో జరిగిపోయింది. తర్వాత మారిస్‌ను తీసుకొని తన ఇంటికి రమ్మని మదన్‌ను ఆహ్వానించింది అతని మేనత్త.

చిట్టచివరకు శోభనంరాత్రి రానేవచ్చింది. మారిస్ తనకు చేసిన అలంకారాన్ని అద్దంలో చూసుకొని, తను అచ్చం ఊర్వశిలాగా తయారైందనుకొని సంతోషించింది. తొలిరాత్రి మదన్ చేతుల్లో వలపువిందు మత్తులో తేలిపోయింది మారిస్. మర్నాడే ఇద్దరు హనిమూన్‌కు బయల్దేరి వెళ్లారు.

మనాలిలో వాళ్ళిద్దరూ సంపూర్ణానంద పారవశ్యంలో డోలలాడారు. వారి ఇద్దరికీ పగలు, రాత్రి భేదం కల్పించలేదు. వారిరువురి మధ్య గడియారం స్తంభించిపోయింది.

తిరిగి ఢిల్లీ చేరగానే ఆమె పరిస్థితిని తమ ఉనికిని మర్చిపోయిన పసిపిల్లలా అయింది. ఢిల్లీలో మగవారంతా ఉదయాన్నే బస్సులు పట్టుకొని ఆఫీసులకు పరిగెత్తటం, పొద్దునే నాలుగు రొట్టెలు గతికి తండ్రీ కొడుకు బయటకి వెళ్ళిపోవటం, ఇంట్లోవాళ్లంతా తేనెతుట్టెలు తేనటీగల్లా ఇంటిపనుల్లో మునిగిపోవటం మారిస్‌కు ఒక వింతగా తోచింది. ఎప్పుడైనా కాస్త గాలి పీల్చుకోవడానికి తోటలోకి రావటంతప్ప మారిస్‌కు వేరే కాలక్షేపమే లేదు. అక్కడికి కూడా మదన్ బంధువర్గం అంతా ఆవిడ వెంటపడిరావటం ఆవిడకి నచ్చలేదు.

మారిస్‌కు సంగీతం అంటే ప్రాణం. ఎప్పుడైనా మరీ వినాలనుకొని సంగీతం పెట్టుకోగానే మదన్‌చెల్లెళ్ళు పెద్దగా గొంతెత్తి టేప్‌రికార్డర్ స్వరంతో గొంతు కలుపుతారు. దాంతో మారిస్‌కు సంగీతం మీద విరక్తి కలుగుతోంది.

పోనీ పుస్తకాలు పట్టుకొందామంటే, అవి కూడా ఏమంత ఓదార్పు నివ్వటంలేదు. ఏ పుస్తకం తీసినా, వెంటనే మదన్ చెల్లెళ్ళు ఆవిడ దగ్గరకు వచ్చి ఆంగ్లనవలలు, షెల్లీ, కీట్స్ గురించి మాట్లాడటం ప్రారంభింస్తారు అనర్గళంగా. అంటితో పుస్తకాలంటే అసహ్యం పుట్టింది మారిస్‌కు.

రోజంతా బంధువర్గం చుట్టుముట్టి చెప్పే కబుర్లకు అంతుండదు. సాయంత్రం ఆరు గంటలయ్యేసరికి స్నేహితులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తారు. ఇక వారి రాకతో కాక్‌టైల్ వినోదాలు, విందులు అర్థరాత్రివరకూ అవిచ్ఛిన్నంగా సాగుతాయి. ఆదర్శ భారతనారీలా తను ఆ విందులను, వినోదాలను చూసి సంతోషిస్తున్నట్టు చిరునవ్వును పెదాలపై తెచ్చి పెట్టుకుని వారి మధ్య తిరుగుతుంది మారిస్.

మొదటి మూడు నెలలు వీటన్నింటినీ తేలిగ్గా భావించింది మారిస్. కొద్దికాలమైన తర్వాత ఇవన్నీ అవంతటవే తగ్గిపోతాయని మారిస్ తలపోసింది. ఒకరకంగా తన భర్తకు సంఘంలో ఉన్న అపరిమితమైన పలుకుబడి, గౌరవానికి తనూ కొంతకాలం సంతోషించింది. తనవారికి రాసే ఉత్తరాలలో వీరంతా తనపట్ల చూపుతున్న ప్రేమను, తను పొందిన మన్ననలను ఎంతో గొప్పగా వర్ణించింది కూడా. పశ్చిమాన కన్పించని ప్రేమబంధాలు ఇక్కడ వ్యక్తుల జీవితాల్లో ఎంతటి అనిర్వచనీయంగా ఉంటాయో గొప్ప పరిశోధనా వ్యాసం కూడా రాసింది మారిస్.

దినాలు... వారాలు... నెలలు... దొర్లిపోయాయి. వీరందరి ప్రేమ అతిగా అన్పించసాగింది మారిస్‌కు. ఇప్పుడామెలో పూర్తి నిరుత్సాహం చోటు చేసుకుంది. తనను తాను ఇక వంచించుకొనే స్థితిలో లేనప్పుడు పరులనెలా వంచించగలదు.

తరచూ ఈ క్లిష్ట సమస్యను గురించి ఆలోచించేది మారిస్.

ఎవ్వరూ తనని అవమానించలేదు. ఎవరూ తనని అగౌరపర్చలేదు.

శత్రువే లేనప్పుడు తాను ఎవరిపై కొరడా ఝుళిపించాలి!?

భారతదేశానికి వచ్చేప్పుడు తను ఎంతో ఉజ్వల భవిష్యత్తును ఆశించింది. తన కుటుంబంలోని వారంతా ఉన్నత విద్యాభ్యాసం చేసినవారని మదన్ చెప్పినప్పుడు తను ఎంతో సంతోషించింది. వారు ఎంతో విశాల హృదయులని మదన్ తనకు చెప్పటం గుర్తుచేసుకుంది. వారంతా పశ్చిమదేశాల జీవనశైలిని అనుకరిస్తారని కూడా మదన్ చెప్పినట్టు మారిస్‌కు గుర్తుంది. మదన్ చెప్పినవన్నీ నిజమే. వారి కుటుంబానికి సంఘంలో ఉన్నత స్థానం కూడా ఉంది. తన మామగారు గొప్ప సంఘసేవకుడు. ఆయన పేరు తరుచూ జాతీయ, అంతర్జాతీయ దినపత్రికలలో కన్పిస్తుంది కూడా.

తన స్నేహితురాలు 'యాన్' మధ్యతరగతి యువకుణ్ణి పెళ్ళి చేసుకొంది. కాని, తమ ప్రపంచంలోని ధనికుల్లో ఒకరైన మదన్‌ను పెళ్ళి చేసుకొని కూడా భారతదేశ జీవన సరళిలోని తీరిక, విశ్రాంతికి సర్దుకోలేక తనెందుకు అంత చికాకును పడుతున్నట్లు?

తల్లిదండ్రులీ వివాహానికి అసలే అంగీకరించలేదు. వారీమెకు ఈ సమస్యల గురించి ఇదివరలోనే వివరంగా చెప్పారు. కానీ, మారిస్ తన మొండిపట్టుదలతో వినలేదు. మదన్‌ను తప్ప మరొకరిని వివాహమాడనని మంకుపట్టు పట్టింది. మదన్ తన ఎమ్.బి.ఏ. అయిపోగానే భారతదేశం పోక తప్పలేదు.

మారిస్‌కే భయాలు కలుగలేదు. భారతీయుల్లో ప్రాక్, పశ్చిమాల మేళవింపైన సృజనాత్మక ఆలోచనలెన్నో ఉంటాయని, అవి ఆచరణలో ఎంతో ఉపకరిస్తాయని తన స్నేహితురాలు యాన్ చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి మారిస్‌కు. భారతీయులు బాగా కృషి చేసే స్వభావం ఉన్నవారని, ప్రతిభావంతులని కూడా యాన్ చెప్పింది. పశ్చిమాన కన్పించని బలమైన కుటుంబ బంధాలు వీరిలో కన్పించటం విశేషం అని కూడా యాన్ తెల్పింది.

యాన్ భారతదేశంలో ఉన్నప్పుడు సుధీర్ అనే యువకునితో కలిసి భారతీయుల్లో ప్రాథమిక ఆరోగ్య విద్యావ్యాప్తికి చేసిన కృషి గురించి మారిస్‌కు ఎన్నోసార్లు వివరించింది. భారతీయుల్లో ఇటీవలే పెరుగుతున్న సేవాభావనను యాన్ మారిస్‌కు అర్థమయ్యేలా చెప్పేది.

మదన్‌లో కూడా ఇటువంటి సేవాతత్పరత ఉండటం చూసి తను కూడా భారతదేశంలో ఇటువంటి కృషి చేయాలని ఎంతో ముచ్చటపడింది మారిస్. కాని తనకు మదన్ ప్రేమ, అందరి అప్యాయతలు లభించినా, సాంఘిక సేవ తత్పరతకోసం తన మనస్సు పరితపించటం మాత్రం నిజమైన విశ్రాంతినివ్వలేక పోయింది. తన ఈ బాధను చెప్పుకొనేందుకు యాన్‌కు ఉత్తరం రాద్దామని మారిస్ కాగితం, కలం అందుకొంది.

ప్రియమైన యాన్...

నీవు ఊహించినదంతా నూటికి నూరుపాళ్ళు నిజమని నేను ముందే ఒప్పుకోవాలి. గత కొద్ది నెలలుగా నేను రాస్తున్న ఉత్తరాలన్నీ కేవలం మర్యాదను పాటించినవే తప్ప మరేవీ కాదు. నేను నిజం ఒప్పుకోవటంలో ధైర్యం కన్పరచలేక పోయానంటే నీకు ఆశ్చర్యంకదూ!

నిజానికి నాకు ఎవ్వరిపై ఫిర్యాదు చేసేందుకు ఏదీ లేకపోయినా, నేను సంతృప్తిగా మాత్రం లేను అన్నది స్పష్టం. నేనిదివరకు ఉత్తరాల్లో రాసినట్టు మదన్, అతని కుటుంబ సభ్యులు, మిత్రులు నన్ను ఆకాశాన నిలబెట్టే ఆప్యాయత, ప్రేమారాధనలతో పులకింపచేశారన్నది నిజం. నా వాక్కు వీరికి వేదవాక్కు కన్న మిన్న. అయితే ఇంత ప్రేమే నన్ను వివశురాలిని, భయస్థురాలిని, పిరికిదాన్ని చేస్తున్నట్లు తోస్తోంది. నేను కోరుకునే జీవితం నాకు ఇక్కడ లభించేటట్లు లేదు. అంత అందనంత స్థాయిలో ఉన్నాను.

నీవు గతంలో అహ్మదాబాదులో ఉన్నప్పుడు భారతీయుల కోసం ఎలా కష్టించి పనిచేసేదానివో నాకు చెప్పిదానివి... గుర్తుందా! ప్రజల కష్టసుఖాలు, ఈతిబాధలు, వారి సేవకన్నా భోగైశ్వర్యాలు నాకు, నీకూ కూడా నిజంగా ఆనందాన్ని కల్గించలేవు. ఇదో ఐశ్వర్యవంతమైన బందిఖానా. ఎప్పుడైనా బీదల గురించి వారి కష్టాల గురించి నేను మదన్‌కు గుర్తుచేస్తే వెంటనే నేను చెప్పిన మొత్తం ధనాన్ని చెక్ రూపంలో సేవాసంస్థకు పంపించి నన్ను సంతోష పెడ్తాడు మదన్. ఆ తర్వాత మరి వారి గురించిన ఆలోచనే చేయడు. అయితే అతని హృదయం నిర్మలం. ఎందుకంటే మా వారి కుటుంబీకుల పేరున ఈ దేశంలో గొప్ప దాతృత్వసంస్థ ఉంది. నేను అట్టడుగు ప్రజానీకానికి సేవ

చేయాలని తహతహలాడుతున్నానని, అందుకోసం వేరే జీవనవిధానాన్ని కోరు కొంటున్నానని చెప్పే సాహసం నాలో లేదిప్పుడు. నాలోని ఈ బలహీనతను మదన్ వేరే రకంగా అర్థంచేసుకొని నన్ను ఓ ఆదర్శభార్యగా భావిస్తున్నాడు. నిజానికి నేనీ రాజప్రాసాదంలో, భోగభాగ్యాల మధ్య సుఖం కోల్పోయాను. నేను అనుభవిస్తున్న విషాదాన్ని ఆయనెరుగడు. అయితే మదన్‌వంటి ఆదర్శ ప్రేమమూర్తి మరొకరు లభించటం కూడా దుర్లభమే. ఈ సందిగ్ధంలో ఇరుక్కున్న నాకు తరుణోపాయం ఏమిటీ? ఆయన హృదయం నొప్పించకుండా ఆయనకీ విషయం చెప్పేదెలా? ఈసారి నీవు నైరోబి నుంచి రాగానే ముందు మమ్మల్నే కలిసి వెళ్ళు. నీవు అక్కడ నిర్వహించవలసిన పని వచ్చే నెలలో ముగుస్తుంది కదా! త్వరగా రా! నన్ను ఈ బంధాలనుంచి తెలివిగా తప్పించు... నిన్ను అర్థిస్తున్నాను. ప్లీజ్... దయ ఉంచు... అప్పటిదాకా నేను ఎట్లాగో పెదవి బిగువుపై ఈ పరిస్థితిని భరిస్తుంటాను.

ఇట్లు

ప్రేమతో

మారిస్

(విపుల, మే 1992)

❖

కోర్కె

(ఇండో ఆంగ్లియన్ కథ)

వీణా అడిగె

❃

కాలింగ్ బెల్ నొక్కబోయిన దీప ఎందుకో సందేహంగా వెనుకంజ వేసింది.

తలుపు అద్దంలోంచి చూసింది దీప. ఇంట్లో టి.వి. చూస్తున్న సూరజ్ స్పష్టంగా కనిపిస్తున్నాడు.

అతన్ని చూస్తూ ఎంతసేపు తను అలానే ఉండిపోయిందో దీపకే తెలియదు.

అలా నిల్చున్నకొద్దీ ఆమెలో ధైర్యం నశించిపోసాగింది. తన్ను సూరజ్ చేరదీస్తాడన్న నమ్మకం కదిలిపోసాగింది. ఆమెకు తిరిగి బొంబాయి వెళ్ళిపోదా మనుకుంది. తల్లిదండ్రులు, మిత్రులు ఎంతచెప్పినా వినకుండా వేల మైళ్ళు ప్రయాణించి తను ఇక్కడికి వచ్చింది ఇలా నీరుగారిపోవడానికా? దీప నరాల్లో సన్నగా వణుకు పుట్టింది.

"అతను తిరస్కరించి వెళ్ళగొడితే తనేం చేయగలదు?" హఠాత్తుగా రేకెత్తిన ఈ ఆలోచన ఆమెలో మరింత కంగారు రేపింది.

అద్దంలోంచి సూరజ్‌వైపు చూస్తునే ఉంది దీప. అతని పొడవాటి చేతులు టేబిల్‌పైనున్న బిస్కట్లనందుకొని అతని నోటికందించటం, కరకర శబ్దం చేస్తూ అతను వాటిని తినటం దీప గమనిస్తూనే ఉంది.

దీప కడుపు ఆకలితో నకనకలాడిపోతోంది. తన ప్రయాణం పొడుగునా మనస్సు బాగులేక ఎంత ఆకలిగా ఉన్నా ఏమీ ముట్టుకోలేదు. తల్లిదండ్రుల నుంచి దూరమై సుమారు ఇరవై నాలుగు గంటలైన తర్వాత ఇప్పుడు ఆకలి అన్నింటికన్నా ప్రధాన సమస్య అయి కూర్చున్నట్టు అన్పించసాగింది దీపకు.

తను ఇలా ఇంటి ముంగిటే నుంచొని అద్దంలోంచి చూడటాన్ని పలువురు గమనిస్తున్న సంగతి ఎప్పటికోగాని దీప గ్రహించలేదు. మేడపైకి వచ్చేపోయే వాళ్ళు తనను పదే పదే గుచ్చి గుచ్చి చూడటాన్ని గ్రహించి ఆమె సిగ్గుపడి చటుక్కున బెల్ నొక్కేసింది. బెల్ శబ్దాలు, సూరజ్ చేసిన చప్పుడు దీపని క్షణంపాటు కంపింపచేశాయి.

తలుపు తెరుచుకొంది.

'దీపా' ఆశ్చర్యంగా సూరజ్ నోటినుంచి వచ్చిన పిలుపుకు తుళ్ళిపడ్డట్లయి తలెత్తి చూసింది దీప.

సూరజ్ చాలా అందంగా, ఆత్మవిశ్వాసంతో ఆరోగ్యంగా ఉన్నట్టు కన్పించాడు దీపకు.

దీపను చటుక్కున లోపలికి తీసుకెళ్ళాడు సూరజ్. అంతవరకూ తను వర్షంలో తడుస్తున్నట్లు, అందుకే తను వణుకుతున్నట్లు దీపకు తట్టనేలేదు.

దీప సూట్‌కేసును లోపలికి తెచ్చాడు సూరజ్. అతని చూపులోసారి దీపను నఖశిఖపర్యంతం పరీక్షించాయి.

"ఏంటిలా అనుకోకుండా ఊడిపడ్డావు?" ఆసక్తి ఉండీ లేనట్లుగా అడిగాడు సూరజ్.

"మధ్యాహ్నమే నేను హీత్రూ విమానాశ్రయంలో దిగాను. వెంటనే టాక్సీ తీసుకొని ఇక్కడికి వచ్చేశాను" నిదానంగా తలొంచుకుని చెప్పింది దీప.

"ఏం? ఇలా హఠాత్తుగా ఊడిపడ్డానికి అంత పుణ్యం ఏం చేశానబ్బా?" పెదవి విరిచి. భుజాలెగరేశాడు సూరజ్.

సూరజ్ మాటలకు దీప కళ్ళలో నీళ్ళుబికాయి. తనను చూడగానే సూరజ్ ఎగిరి గంతేయకపోయినా ఎంతో ప్రేమ కనబరుస్తాడని తను ఆశించింది. కాని, ఆయనలో ఏమాత్రం తొణుకు, బెణుకు, మమతానురాగం ఉన్నట్లు

ఆమెకు కన్పించలేదు. కనీసం రెండేళ్ళ ఎడబాటున్నట్టు కాకపోయినా రెండు రోజుల ఎడబాటున్నట్టు కూడా అతను ఫీలయినట్టు కన్పించలేదు.

"సూరజ్" ప్రేమగా పిలిచింది దీప. అతను తలెత్తి చూశాడు.

"నన్ను క్షమించలేవా? జరిగిందేదో జరిగి పోయింది. గతం మర్చిపోవా?" అని అడిగింది దీప దీనంగా.

ఆ మాటలంటూ ఆమె స్పృహతప్పి పడిపోయేలా ఉండటం గమనించి చటుక్కున ఆమె భూజాన్ని పట్టుకొని, నడిపించుకొంటూ తీసుకెళ్ళి సోఫాలో కూర్చోబెట్టాడు సూరజ్.

ఆమె మౌనం దాల్చింది. కళ్ళు మూసుకు సోఫాలో కూర్చుంది. క్షణంలో ఆమెకు వేడివేడి కాఫీ అందించాడు సూరజ్.

"ఇదిగో నీ ఫేవరైట్ హాట్ అండ్ స్ట్రాంగ్ కాఫీ" అని చెప్పాడు సూరాజ్ కాఫీ ఇస్తూ దీపకు.

తన ఇష్టాఇష్టాలు అతనికింకా బాగా గుర్తుండటం ఆమెను ఎంతో సంతోష పర్చింది.

అతను మౌనంగా ఆమెవంకే చూస్తూ, ఆమె అందాన్ని మౌనంగా అభినం దించకుండా ఉండలేకపోతున్నాడు. సన్నగా, పొడుగ్గా, తీగలా మెలిపడిన ఆమె శరీరం ఎంతో అందంగా కన్పించింది సూరజ్ కళ్ళకు. ఆమె కళ్ళలో నిండుకొన్న విషాదం ఒక్కటే ప్రస్తుతం ఆమె అందాన్ని సౌకుమార్యాన్ని తగ్గిస్తోంది.

"దీపా... నీకు తెలుసో లేదో... నువ్వు ఇక్కడ ఉండటానికి వీల్లేదు" అంత లోనే కటువుగా సూరజ్ నోట్లోంచి మాటలు విని ఆశ్చర్యపోయింది దీప.

"ఆ హక్కు నీకు రెండేళ్ళ క్రితమే పోయింది. ఎప్పుడైతే నువ్వు నాతో ఇంగ్లాండుకు రావటానికి తిరస్కరించావో ఆనాడే నీకు ఆ హక్కు పోయింది" అన్నాడు సూరజ్.

దీప నిశ్చేష్టురాలైపోయింది. సూరజ్ తనను అరుస్తాడు, కోపడ్తాడు, తనపై అలుగుతాడు.. ఇలా ఎన్నెన్నో తనూహించింది కాని ఇలా తనను సాంతంగా తిరస్కరిస్తాడని మాత్రం తను ఏనాడూ భావించలేదు.

"నీ అభిప్రాయం ఏమిటి?" అడిగింది దీప సూటిగా.

"ఏముంది? కోర్టులో విడాకుల కాగితాలు దాఖలు చేయటమే?" సూటిగా నదురు బెదురు లేకుండా చెప్పాడు సూరజ్.

ఈసారి ఆమె షాక్ తిన్నట్లు స్తబ్ధురాలైంది.

ఇంత సాయంత్రంవేళ, రాత్రివేళ తను ఎలా? ఎక్కడికి పోగలదు? అందులోనూ ఇది పరదేశమైన ఇంగ్లాండు.

తనను సూరజ్ తప్పక పరిగ్రహిస్తాడని ఆమె ఎన్నో ఆశలు పెంచుకొంది. ఎంతమందితోనో పందెం కాసింది. మొత్తం పరిస్థితులంతా తానే చక్కపెట్టకో గలనని ఆత్మ విశ్వాసం ప్రకటించి ఇండియా నుంచి ఒంటరిగా బయల్దేరింది తను. పెళ్ళయ్యాక తను, సూరజ్ వెళ్ళిన హనీమూన్, ఇద్దరు కలిసి చెప్పుకొన్న స్వీట్‌నథింగ్స్ తనకు ఇప్పటికీ గుర్తున్నాయి.

సూరజ్ వంటింట్లోకి వెళ్ళి సాయంత్రం భోజనం తయారు చేయసాగాడు.

తనకు ఆ పూటకు ఇక అన్నం నహించదనిపించినా, ఆమె ఆకలి ఆ ఆలోచనను తోసేసింది.

ఆమెకు స్నానాల గది, ఆమె పడుకోవడానికి బెడ్‌రూమ్ చూపించాడు సూరజ్.

దీప ఆ రాత్రంతా ఏడుస్తూ దిగులుపడుతూనే గడిపింది. సూరజ్‌కు మరో స్త్రీతో పరిచయం కలిగిందా? తన బదులు సూరజ్ మరో అమ్మాయిని అంగీకరిస్తాడేమోనన్న ఆలోచన ఈ రెండేళ్ళలో తనకు కలగనే కలగలేదు. ఈ రెండేళ్ళకాలంలో తనూ మరో పురుషుడివంక కన్నెత్తి చూడలేదు... సూరజ్ ఎప్పుడూ తనకు సన్నిహితంగా ఉన్నట్టే తను భావించింది.

"ఈరోజు సాయంత్రం ఆఫీసునుంచి తిరిగిరాగానే నీకొకచోట ఉద్యోగం, ఉండటానికి స్థలం ఏర్పాటు చేస్తాను" అన్నాడు సూరజ్.

ఆరోజు పగలంతా ఖాళీగా ఏమీ తోచనట్టు అటూ ఇటూ తిరగటంతోనే కాలం గడిపేసింది దీప. తమ పెళ్ళినాటి ఫొటోలను చూసి దుఃఖపడింది. పుస్తకం తీసి చదువుదామనుకొంది కాని చదవలేకపోయింది. తనే సూరజ్‌కు వంట తయారుచేద్దామనుకొంది. కాని, తనపైన బొత్తిగా మనసు లేని మనిషికి వంట చేసి పెట్టటం అర్థంలేదని భావించింది. తనకు విడాకులిచ్చే మనిషిని

కావలించుకోవటం అర్థరహితంగా భావించింది.

సాయంత్రం సూరజ్ ఆఫీసునుంచి రాగానే ఇద్దరూ షాపింగ్‌కు వెళ్ళారు. కాని వారికి షాపింగ్‌లో ఏది కొనడానికి మనస్కరించలేదు.

రాత్రికి సూరజ్ పడుకోవడానికి అతని పడక గదికి వెళ్తుంటే తనూ అతని వెనుక వెళ్ళింది.

"సూరజ్... నీకు బొత్తిగా నేనంటే ప్రేమే లేదా?" అడిగింది దీప.

అతను ఆమెవైపు ఓసారి చూశాడు.

"పోన్లే... నా ప్రశ్నకు జవాబు చెప్పలేని పక్షంలో కనీసం నాకు బొంబాయి టిక్కెట్టయినా తెచ్చిపెట్టు" అన్నది దీప.

సూరజ్ ఏమీ బదులు పలకలేదు.

దీప అతని గదిలోంచి వెళ్ళిపోబోయింది. ఆమె తలుపు దాటబోతుండగా సూరజ్ వెళ్ళి ఆమె చేయిపట్టుకొని గట్టిగా వెనక్కి లాగాడు.

ఆమె కళ్ళలో నిల్చిన నీళ్ళు అతన్ని మరింత కరిగించాయి.

ఆమెను తన హృదయానికి బలంగా హత్తుకుంటూ ఆమె కన్నీళ్ళను తుడిచాడు సూరజ్.

"దీపా... నేను నిన్ను కావాలని ఏడిపించడానికే ఇలా నటించాను. నిజంగా నీకు విడాకులిస్తాననుకొన్నావా? అంతేనా నువ్వు నన్ను అర్థం చేసుకుంది?" అడిగాడు సూరజ్.

"అయితే మరి నన్నింత హింసెందుకు పెట్టావు?" అడిగింది దీప కళ్ళొత్తు కుంటూ.

"డార్లింగ్... నువ్వు నన్ను రెండు సంవత్సరాలు బాధపెడితే కనీసం ఒక్కరాత్రి నిన్ను బాధపెట్టకపోతే ఎలా? ఇప్పుడు చెప్పు. నేను లండన్ రమ్మని నిన్ను పిల్చినప్పుడే నాతో ఎందుకు రాలేదు?" అడిగాడు సూరజ్.

"నీకు గుర్తుందా? మన పెళ్ళినాటికి నా వయస్సు కేవలం పద్దెనిమిదే. అప్పటికి నా కాలేజి చదువు ఇంకా పూర్తికాలేదు. ఇంకా రెండు సంవత్సరాల చదువు కొనసాగించవలసి ఉండగా నీతో నాకు పెళ్ళయింది. పెళ్ళప్పుడు నా చదువును పెళ్ళి తర్వాత గూడా కొనసాగించడానికి నువ్వు ఒప్పుకొన్నావు.

అవునా? కాదా?" అడిగింది దీప.

అవునన్నట్లు తలూపాడు సూరజ్.

అత్యంత ప్రతిభావంతురాలైన దీప అసలు పెళ్ళికే ముందు అంగీకరించ లేదన్న విషయం సూరజ్‌కు ఇప్పుడు గుర్తు రాసాగింది. కాని, తన తల్లి చివరి కోర్కెమేరకు ఆమె చనిపోకముందే దీపను త్వరగా పెళ్లిచేసుకోవలసి వచ్చింది తను. అప్పుడు తను పెళ్ళి తర్వాత కూడా దీప చదువు కొనసాగించటానికి అభ్యంతరపెట్టనని మాట కూడా ఇచ్చాడు. ఇంతలో తనకు లండన్‌లో మంచి ఉద్యోగం దొరకటం, తను వెళ్ళిపోవటం జరిగింది. ఫలితంగా తను తన వెంట దీప కూడా వచ్చేయాలని పట్టుబట్టటం, అందుకు దీప తిరస్కరించటం కూడా జరిగి పోయింది. ఒక్కసారి సిన్మా రీలులా సమస్తం అతని మదిలో గిర్రున తిరిగింది.

"ఈ కారణంగా నేను నా డిగ్రీ పూర్తిచేయకుండా నీతో రావటానికి సిద్ధంగా లేను. నా పరీక్షలు త్వరలో అయిపోతాయి. నేను త్వరగా నిన్ను చేరి పోతాను అనుకొన్నాను. కానీ, ఇంతలోనే నువ్వు ఆజ్ఞలు జారీ చేయటం మొదలెట్టావు? నేను రాలేదని మాతో బంధుత్వాలన్నింటినీ హఠాత్తుగా తెంపేశావు కూడా" అంది దీప బాధగా.

"నేను నీకు భర్తే ప్రపంచంలో అన్నింటికంటే ఎక్కువను కొన్నాను. కాని, నువ్వు నన్ను నీ చదువుకన్నా తక్కువగా భావించి, బాధించావు కదా?" అడిగాడు సూరజ్.

"సూరజ్, నీ ప్రేమను, అభిప్రాయాన్ని నాకు సున్నితంగా చెప్పవలసిన రీతిలో చెప్తే నేను తప్పక నీ వెంట వచ్చేదాన్ని. కాని, అప్పుడు నువ్వు పూర్తిగా భూస్వామ్య మనస్తత్వంలో నన్నో బానిసలా భావించి శాసిస్తున్నట్లు ప్రవర్తించావు. ఉత్తరాలు రాశావు. అదీగాక నా చదువు పూర్తికావటానికి నువ్వు ముందు అంగీకరించి, తర్వాత ప్లేటు ఫిరాయించావు. ఇలా మాట తప్పటం నాకు ససేమీరా అంగీకారం కాదు. నీ ఆలోచనా వైఖరిలో, ప్రవర్తనలో కొంత మార్పున్నట్లయితే నేను రెండేళ్ళ కాలంలో నీ దగ్గరికి ఎన్నోసార్లు వచ్చి వెళ్ళి ఉండేదాన్ని" అంది దీప.

"దీపా... కొత్తగా పెళ్ళయిన భర్తని నీ చదువు అయ్యేంతవరకు ఆగ మనటం ఎంతవరకూ న్యాయం? మనం ముసలివాళ్లయ్యినాక కలిసికొని మాత్రం ప్రయోజనం ఏమిటి?" అన్నాడు సూరజ్.

"అయితే ఇప్పుడు నేను నీకు ముసలిదానిలా కన్పిస్తున్నానా?" అంటూ అతన్ని గిల్లింది.

ఇద్దరూ పకపక నవ్వుకొన్నారు.

❖

కన్నీరు

(బెంగాలీ కథ)

సునీల్ గంగోపాధ్యాయ

✻

"టింకు ఇంకా రాలేదా? పోనీ ఫోన్‌చేయరాదూ?" కోటు తొడుక్కుంటూ అడిగాడు బిభూ.

బయట బాగా చల్లగా ఉండటంతో జయ తలకు, చెవులకు మఫ్లర్ చుట్టింది. అమెరికాలోని ఫీనిక్స్‌లో ఒక్కోసారి ఉష్ణోగ్రత సెప్టెంబరులోనే బాగా పడిపోయి చలి ఎక్కువవుతుంది. బయట వీచే గాలి ఈల ఇంట్లోకి వినిపిస్తుంది.

"టింకు రాదు. నేనామెకు రావద్దని చెప్పాను" చెప్పింది జయ.

ఆ జవాబు విని బిభూ షాక్ తగిలినట్లు ముఖం పెట్టాడు. కనుపాపలు ఎగరేస్తూ, "ఏం? ఎందుకు రావద్దన్నావు?" అడిగాడు బిభూ.

"ఎందుకావిడ ఇక్కడ ఉండటం? అనవసరం. ఇక్కడనుంచి ఆవిడ పిల్లలు వెళ్ళే స్కూలు చాలా దూరం. పైగా ఎంతో శ్రమ" చెప్పింది జయ.

"కాని ఆవిడే వస్తానంది. అలాంటప్పుడు ఎందుకు ఒంటరిగా ఉండటం? కనీసం బాసు, సుమనలనన్నా ఫోన్‌చేసి పిలిపించుకో. వాళ్ళకేమీ పిల్లలు లేరుగదా. కాబట్టి వాళ్లకు మనవల్ల శ్రమేమీ కలగదు" అన్నాడు బిభూ.

"అబ్బ! ఏమీ అవసరం లేదండీ. చూడండీ, మీకు బాగా ఆలస్యం అయిపోతుంది" అంది జయ.

తన క్రెడిట్ కార్డులు రెండూ పాకెట్‌లో వేసుకొన్నాడు. అవునో, కాదో ఒకసారి చెక్ చేసుకొన్నాడు బిభూ. కోటు లోపలి జేబులో విమానం టిక్కెట్టు పెట్టుకున్నాడు. అతని మస్తిష్కం నిండా ఆఫీసు విషయాలే ముసురుతున్నా జయ ఒంటరిగా ఉంటుందేమోనన్న బెంగమాత్రం వీడలేదు.

"అయితే ఒంటరిగానే ఉంటావా ఏంటీ?" అడిగాడు బిభూ ఆందోళనగా.

"అబ్బా, ఏంటండీ? ఈ ప్రపంచంలో ఒంటరిగా ఎవ్వరూ ఉండరా ఏంటి? నేనొక్కదాన్నే మొదటిసారి ఒంటరిగా ఉన్నట్లు హడావుడి చేస్తారెందుకు?" బదులు చెప్పింది జయ.

"అదేంకాదు ఈ ప్రపంచంలో ఒంటరివాళ్ళు ఎంతోమంది ఉన్నారు. కానీ నువ్వెప్పుడూ ఇదివరలో ఒంటరిగా లేవుగదా! అందుకని" అన్నాడు బిభూ.

ఇద్దరూ బయటికొచ్చి పోర్టికోలో నుంచున్నారు. బయట వేస్తున్న చల్లని గాలికి ఇద్దరు శరీరాలు వణకసాగాయి. ఫీనిక్స్ దగ్గర ఎడారిపైనుంచి వచ్చే మంచుగాలి అది. కారును గారేజ్‌నుంచి బయటికి తీసి, తను పక్క సీట్లోకి మారి, జయకు డ్రైవింగ్ చేయమని తాళాలు ఇచ్చాడు బిభూ.

జయ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకొని కేవలం నాలుగు నెలలయింది. అయినా బిభూకి జయ డ్రైవింగ్‌లో ఇంకా విశ్వాసం కలగలేదు. ఇప్పటికీ పెద్దపెద్ద రోడ్లపై జయని డ్రైవింగ్ చేయనీయడు బిభూ. కాని ఈరోజు ప్రత్యేకంగా జయకి అవకాశం కలిగిస్తున్నాడు. ఎలా అయినా తనను ఏర్‌పోర్టుకు చేరవేశాక జయనే కారు నడుపుకుంటూ తిరిగి రావాల్సి ఉంటుంది. అందువలన ముందే జయ డ్రైవింగ్ చూస్తే అతని మనస్సుకు ఊరట కలుగుతుంది.

సీట్లో కూర్చున్న జయతో 'అదేమిటి? కారు సీటు బెల్టు కట్టుకోలేదు" అడిగాడు బిభూ.

జయ చిరునవ్వు నవ్వింది కాని బెల్టు కట్టుకోలేదు.

"మీరు లేని ఈ నాలుగు రోజులు నేను నా ఇష్టంవచ్చినట్లు కారు డ్రైవ్ చేస్తాను. ఈ నాలుగు రోజులే కదా నాకు స్వేచ్ఛ! అందువల్ల ఒంటరిగా ఎవ్వరి సహాయం లేకుండా బొమ్మజెముళ్లన్న ఫీనిక్స్ ఎడారికి కూడా నేనే డ్రైవ్ చేసుకొంటూ పోతాను" చెప్పింది జయ.

"చూడు అతి తెలివిగా ప్రవర్తించబోకు. నీ వెంట బాను, సుమన్‌లు వస్తారు. వారిని కూడా తీసుకువెళ్లు. నేను అబ్బూకర్క్ చేరగానే నీకు టెలిఫోన్ చేస్తాను. కనీసం రోజుకు అయిదారుసార్లు ఫోన్ చేస్తాను. తెలిసిందా? సరేగానీ, వంటింట్లో గ్యాస్ ఆఫ్ చేశావా లేదా?

'ఓ! దాన్నెప్పటికీ మరవను' అంది జయ గుడ్లు తిప్పుతూ.

"చూడు... రాత్రిళ్ళు దొంగలు వస్తే మోగే అలారమ్ ప్లగ్‌బెట్టి పడుకోవటం మరవకు సరేనా?"

"సరే! సరే!"

"రాత్రిళ్ళు, పగళ్ళు ఎవరొచ్చినా ముందు చూసి తలుపు తీయి. ఇటీవల ఫీనిక్స్‌లో దుర్మార్గాలు ఎక్కువవుతున్నాయి. మొన్నామధ్య ఎవరో ఎన్‌సైక్లోపీడియా అమ్ముతానంటూ ఒకావిడని మోసం చేసి..."

"అబ్బ మీకెందుకండి అంత భయం! కంగారు! నేనేమన్నా పసికందునా?" అంది జయ.

"చాల్లే! నీకు ఇరవై ఏడేళ్ళు వచ్చినా ఇంకా నా కళ్ళకు పసికందువే చూడు. ఇండికేటర్ ప్రెస్ చెయకుండానే కుడివైపుకు కారు టర్న్ చేస్తున్నావు ఇది కరెక్ట్ కాదు" అన్నాడు బిభూ.

కారు తిన్నగా మెయిన్ రోడ్డుపైకి వచ్చింది. బిభూ కంగారుగా అనేక డ్రైవింగ్ మెలకువలు చెప్పసాగాడు. జయ కారును యాభైయైదు మైళ్లస్పీడులో తీసుకుపోతుంటే, కంగారుగా వద్దని వారించసాగాడు బిభూ. అమెరికాలో ప్రధాన రహదారులపై ఎక్కువ వేగంగా కారు నడిపితే, వెనుక నుంచో, పక్కనుంచో వచ్చి పోలీసులు కారును ఆపేస్తారు. జయ కారును అనవసరంగా సందులు, గొందులు మెలికలు తిప్పేయసాగింది. బిభూ ఎన్ని చెప్పినా ఆమె డ్రైవింగ్‌లో ఏమీ మార్పులేదు.

విమానాశ్రయం జయా వాళ్ళింటినుంచి చాలా దూరం. సుమారు నలభై నిముషాలు పడుతుంది. ఎయిర్‌పోర్టు చేరి జయ కారును పార్క్ చేయడానికి తీసుకుపోబోతుండగా, "అక్కర్లేదు జయ. నన్ను ఎయిర్‌పోర్టు గేటు దగ్గరికి నేరుగా తీసుకువెళ్ళు. అక్కడ దించేసి నువ్వు వెంటనే వెళ్ళిపో" అన్నాడు బిభూ.

"అదేం? నేను నీకు వీడ్కోలు చెప్పి మరీ వెళ్తాను" అంది జయ

"అబ్బే అంత టైము ఫ్లైట్‌కే లేదు. కారు దిగగానే నేను లోపలికి వెళ్ళి పోవాలి" అన్నాడు బిభూ.

జయ కారుని గేట్ దగ్గర ఆపింది.

బిభూ ఆమె భుజాన్ని నొక్కి "నేనో నిజాన్ని చెప్పనా? నీ డ్రైవింగ్ ఇదివరకు కన్నా చాలా బాగుంది. అయినా, తిరిగి వెళ్ళేప్పుడు జాగ్రత్తగా వెళ్ళు" అన్నాడు.

సాధారణంగా పార్కింగ్ స్లాట్‌లో మినహా మరెక్కడా కారును నిముషం కన్నా ఆగనివ్వరు. బిభూ కేవలం ఒక చిన్న సూట్‌కేసు మాత్రమే తేవటంవలన కారు డిక్కీ తీసి సామాను తీసుకొనే సమయం కూడా పట్టదు. బిభూ కారు దిగగానే, కారు కదిలిపోవటానిక సరిగ్గా క్షణం వ్యవధి చాలు.

అయితే స్వదేశంలో బిభూని ఏం చేయలేరు. అందువల్ల ఇక్కడ ఆ పని చేసి సంతోషించాలని అనుకొన్నాడు బిభూ.

ఇక్కడ పదిమందిలో భార్యని ముద్దుపెట్టుకోవచ్చు. నేరం కాదు. అయినా పదిమందిలో భార్యని ముద్దుపెట్టుకోవటం ఇంతక్రితంలాగా సౌఖ్యంగా మాత్రం అన్పించలేదు బిభూకి. పోలీసులు ఎయిర్‌పోర్టుకు వచ్చే ప్రతికారును నిశితంగా పరిశీలిస్తున్నారు. ఒక్క నిముషం కన్నా ఏ కారును ఎక్కువసేపు ఉండనీయక పోయినా, వాళ్ళిద్దరూ ముద్దు పెట్టుకోవడానికి మాత్రం తగిన సమయం ఇచ్చారు పోలీసులు.

జయను గట్టిగా కౌగిలించుకొని బలంగా ముద్దుపెడుతూ, "నేను నీకోసం రోజంతా బెంగపడుతూనే ఉంటాను. వెళ్ళేప్పుడు జాగ్రత్తగా వెళ్ళు. వంటింట్లో గ్యాస్ ఆర్పటం మర్చిపోకు. నేను నాలుగురోజుల్లో తిరిగివస్తాను. ఈసారికూడా నువ్వే ఎయిర్‌పోర్టుకు రా. మంగళవారం ఎయిర్ పోర్టుకు వస్తే చాలు. నేను రాగానే నీకు ఫోన్ చేస్తాను" అన్నాడు బిభూ.

'ఓకే! మీరు ఇక సిరెట్లు తాగనని మాటిచ్చారు. దయచేసి అన్నమాటపై నిలబడండి" అంది జయ.

బిభూ కారు దిగి ముందుకు కదలగానే జయ కారు వెనక్కి మళ్ళించింది.

ఎయిర్‌పోర్ట్ దాటి ముందుకు రాగానే, జయ మనస్సు దూదిపింజలా

తేలిపోతున్న అనుభూతికి లోనైంది. బిభూ లేని ఈ నాలుగురోజులు బెంగ పడాల్సిన అవసరమే లేదు. ఎంతో స్వేచ్ఛగా, హాయిగా జీవితం గడిచిపోతుంది. ఈ నాలుగు రోజులు ఇప్పుడా కారు తన కారే. ఇంటి దగ్గర తను ఒక్కతే ఉంటుంది. ఎప్పుడు కావాలంటే తను అప్పుడు నిద్రలేవచ్చు.

ఇటీవల బిభూ కొత్త కాడిలాక్ కారు కొన్నాడు. జయ కూడా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకున్నాక, ఆమెకోసం సెకండ్‌హాండ్ టొయోటో లేక ఫోర్డ్ కొనమని అడిగితే బిభూ అందుకు అంగీకరించాడు కూడా.

ఆ కారేసుకుని తాను ఎక్కడికన్నా పోవచ్చు. యూనివర్సిటీ, షాపింగ్, ఎవరింటికైనా. అమెరికాలో ఫోర్డు కారు రెండువందల యాభై డాలర్లకే దొరుకుతుంది.

ప్రధాన రహదారిపై కారును శరవేగంగా నడుపుతూ జయ కొత్త థ్రిల్ అనుభవించసాగింది. కారు వేగంగా నడుపుతున్నప్పుడు పోలీసులు ఎలా పట్టుకుంటారో ఒకసారి చూడాలని ఉంది జయకు. తన స్నేహితులు చెప్పే ఎన్నో కబుర్లు ఆమెను ఎంతో ఆశ్చర్యపరిచేవి. పోలీసులు పట్టుకుంటే ఏమవుతుంది. బహుశా ఫైన్ వేస్తారేమో!

ఈ దేశంలో పోలీసుల ప్రతిభ ఎంతో అసామాన్యమైనది. పోలీసులు ఎంత నమ్రతగా, హాస్యంగా మాట్లాడతారు. లంచగొండితనం అసలు ఎరగరు.

జయ కారు వేగం బాగా పెంచసాగింది. అరవై, అరవైఐదు, ఎనభై, ఎనభైఐదు, జయకు ఎంతో ఆనందంగా ఉంది. తనని మందలించేవారు ఎవ్వరూ లేరు. తనిష్టమే ఇష్టం ఇప్పుడు. ఈ స్వేచ్ఛకోసమే తాను ఇంతకాలం కలవరించింది.

ఇంతలో తన కారును పోలీస్‌వారి కారు వెంటాడుతున్నట్టు గమనించింది. జయ. వాళ్ళ కారుమీద ఎరుపులైట్లు, నీలం లైట్లు మిలమిల మెరుస్తున్నాయి. జయకు హుషారు మరింత హెచ్చింది. తనని పోలీసులు పట్టుకున్నారన్న వార్త చదివి బిభూ ఎలా స్పందిస్తాడో ఊహించాలని సంబరపడుతోంది.

కానీ, పోలీస్‌కారు జయకారును దాటి పక్క వీధిలోకి మళ్ళి వేగంగా వెళ్ళిపోయింది. పోతూ, పోతూ పోలీస్ ఒకరు జయవైపు నవ్వుతూ చూడడం

కనిపించింది. జయ ఆశ్చర్యపోయింది. అదేమిటి? తనను అరెస్ట్ చేస్తారని తను ఎంతో ఆశపడితే, ఇలా జరిగిందేమిటి? జయకేమీ తోచలేదు. బహుశా వారికింకేదో అర్జంటు పని ఉండి ఉండవచ్చునని సరిపెట్టుకుంది జయ. కానీ, ఎంతో నిరుత్సాహపడింది.

పోలీసువారు కలిగించిన నిరుత్సాహానికి తోడు జయ ఇంటికి చేరగానే మరికొంత నిరుత్సాహమెదురయింది.

జయ ఇంటి దగ్గర రెండుజంటలు జయ కోసం నిరీక్షిస్తున్నాయి. బాసు, సుమనల జంట ఒకటి. సుభద్ర, ఐరీన్‌ల జంట మరొకటి.

"అబ్బో! ఎంత సాహసివి. మీ వారిని నువ్వే ఎయిర్‌పోర్టు దగ్గర దించి వచ్చేశావుగా నువ్వు ఇదివరకటికన్నా బాగా ఎదిగావు. లేకపోతే నేను బిభూని తీసుకెళ్ళి ఎయిర్‌పోర్టులో దించుదామనుకున్నాను. మా ఆవిడ, ఐరీన్ నీకు ముచ్చట్లు చెప్పేది" జయని చూస్తూనే అన్నాడు సుభద్ర.

"హల్లో జయా! మిమ్మల్ని కేవలం ఐదు నిమిషాలు ఆలస్యంవల్ల మిస్స య్యాను. సుభద్ర సంగతి నీకు తెలుసుగదా! బద్ధకస్తుడు" అంది ఐరీన్.

"చూడండి జయ వచ్చి కేవలం సంవత్సరన్నర మాత్రమే. కానీ ఎంత త్వరగా అన్నీ తెలుసుకుందో చూడండి. మా సుమన కూడా ఉంది ఏంలాభం? ఇంత వరకూ డ్రైవింగ్ నేర్చుకోలేదు" అన్నాడు బాసు.

"అమ్మో డ్రైవింగే నా వల్లకాదు" అంది సుమన.

జయ కారును గారేజ్‌లో పార్క్ చేసి అందరినీ ఇంట్లోకి రమ్మని ఆహ్వా నించింది.

ఇక వాళ్ళు ఎంత రాత్రివరకూ ఉంటారో భగవంతుడికే తెలియాలి అని అనుకుంది మనస్సులో. వీళ్ళ తాగుడు అయిపోయి, ఇళ్ళకు బయల్దేరబోయేసరికి రాత్రి రెండో, మూడో కూడా అవుతుంది. తను టీ.వీ.లో 'జనరల్ హాస్పిటల్' సీరియల్‌ను ఎంతో శ్రద్ధగా చూస్తోంది. 'డల్లాస్' సీరియల్ కన్నా ఇది ఎంతో బాగుంది. కానీ ఈ అనుకోని అతిథుల పుణ్యమా అని ఇక ఈ రాత్రికి టీ.వీ. సీరియల్‌కు గుడ్‌బై చెప్పక తప్పదు. ఇలా తనలో తనే ఆలోచనలతో సతమత మవసాగింది జయ.

"టింకు నాతో ఫోనులో మాట్లాడింది. ఆమెకు ఇక్కడికి రాను వీలుపడదట. నీకు అభ్యంరతం లేకపోతే నేను ఇక్కడ ఉంటాను. రెండు, మూడు రోజులు" అంది సుమన.

సుమన మాటలు విని కొంచెం కోపం కలిగినా అదుపు చేసుకుంది జయ.

మిగతావారంతా అమెరికాకు కనీసం ఏడెనిమిదేళ్ళ క్రితం వచ్చారు. జయ ఒక్కతే అమెరికాకు వచ్చి సంవత్సరంన్నర అయింది. ఈ కారణంగా తగుదునమ్మా అంటూ ప్రతి ఒక్కరూ జయకు ప్రతి విషయంలో తాము సహాయం చేస్తామంటే, తాము సహాయం చేస్తామని పోటీపడతారు. ఆమెకు అవసరం ఉన్నవీ, లేనివీ అన్నీ ఊదరకొడుతుంటారు. ఒకవేళ జయ తన అభిప్రాయం చెప్పడానికి సాహసిస్తే, "నీకేం తెలుసు. నిన్నగాకమొన్న వచ్చావు. ఇంకా నీకు చాలా తెలియాల్సినవి ఉన్నాయి" అంటూ ఆమెను చిన్నబుచ్చుతారు.

కానీ, అమెరికా విషయంలో జయకున్న అవగాహన వేరు. తనకు పరిచయమున్న అమెరికన్ల ద్వారా, చదివిన పుస్తకాల ద్వారా జయ తన మిత్రులకన్నా ఎక్కువ అమెరికా గురించి తెలుసుకున్న మాట వాస్తవమే. కానీ, తన ఈ అభిప్రాయానికి గుర్తింపు లేదు.

జయ వంట చేయటానికి వంటింట్లోకి పోగానే, వెనుకనే సుమన కూడా వెళ్ళింది.

"జయా! మాకోసం ఇప్పుడు నువ్వేమీ చేయనక్కరలేదు. మేం వచ్చేపుడు ఫ్రెంచ్ ఫ్రైస్, హంబర్గర్స్ తెచ్చాం. అవి ఈ రాత్రి భోజనానికి సరిపోతాయి" చెప్పింది సుమన.

కెంటకీకి చెందిన వేయించిన కోడి మాంసం తేగా, సుభద్ర బేర్‌బౌ బాటిల్ తెచ్చాడు. గ్లాసులు తీసి అందులో బేర్‌బౌ పోశాడు.

"జయా! మీవారు లేకుండా ఒంటరిగా నువ్వు ఉండటం ఇది మొదటిసారి కదా? అందువల్ల నువ్వు ఎంతో నిరుత్సాహంగా ఉన్నట్లు కన్పిస్తున్నావు. కానీ, మేమంతా ఉన్నాంకదా! మమ్మల్ని నీవాళ్లుగా భావించుకునైనా నువ్వు సంతో షంగా ఉండరాదా?" అన్నాడు సుభద్ర.

"ఇకపై బిభూ ప్రమోషన్ కారణంగా తరుచూ ఏదో ఒక ఊరికి వెళ్తుంటాడు. నువ్వు ఒంటరిగా ఉండటానికి అలవాటుపడాలి సుమా" అంది సుమన జయని హెచ్చరిస్తున్నట్టుగా.

ఇంతలో బాసు టీ.వి. స్టార్ట్ చేశాడు. ఒక ఛానెల్ తర్వాత మరో ఛానెల్ తిప్పుతుండగా హఠాత్తుగా ఒకచోట అతని దృష్టి ఆగిపోయింది.

"మరో భయంకర ప్రమాదం" టీవీ తెరపై కనిపించిన అక్షరాలను చూడగానే అతని చేతులు అప్రయత్నంగానే ఆగిపోయాయి.

అందరూ ఆసక్తిగా తెరవైపు చూశారు.

"అరే! విమానప్రమాదం! ఎయిర్‌పోర్టు దగ్గర జరిగిన విమానప్రమాదాన్ని టీవీ తెరపై ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నారు. అసలు వాళ్ళు ఎలా దీన్ని చూపించగలుగుతున్నారు?"

ఆ మాట వినగానే జయ హృదయం లయతప్పినట్లయింది ఒక్కసారి. అంతలోనే తేరుకొంది. బిభూ ఎక్కిన విమానం వెళ్ళిపోయి నలభైఐదు నిమిషాలు పైనే అయింది. బహుశా ఇది వేరే విమానం ఏమో అనుకుంది జయ తనలో తానే.

"ఇది ఏ ఎయిర్‌పోర్టు?" సుభద్ర టీవీ వైపు చూస్తూ ప్రశ్నవేశాడు.

"అదే! ఇది మన టేసన్స్ ఎయిర్‌పోర్ట్". ఎయిర్‌పోర్ట్‌లో విమానం గాలిలో లేవటాన్ని మరోసారి ప్రసారం చేయటంతో అది బిభూ విమానం ఎక్కిన ఎయిర్‌పోర్టేనని ఐరీన్ సులువుగా కనుక్కోగలిగింది.

"జీసస్! అయ్యో జరక్క జరక్క ఈ దుర్ఘటన మన ఎయిర్‌పోర్ట్‌లోనే జరగాలా! ఎంతటి దురదృష్టం?" అన్నాడు బాసు.

"ఉండండి చూపిస్తున్నదాన్ని జాగ్రత్తగా గమనించండి" అరిచింది సుమన.

ఇంతలో టీవీ తెరపై విమానం నెంబరు, చనిపోయినవారి పేర్లు క్రమంగా రాసాగాయి.

❖ ❖ ❖

నైట్‌గౌనులో జయ కింది అంతస్థులోకి వచ్చింది. ఏవో చప్పుడులు వినపడడంతో ఆమె కొంచెం కలవరపడింది. కానీ భయపడలేదు. ఏవో ఎలుకల

చప్పుళ్ళేమో అనుకుంటూ కిందికి దిగింది జయ. రెండురోజుల క్రితం ఎలుకలను తమ తోటలో కూడా చూసింది జయ. అవి ఎడారినుంచి వచ్చాయి.

మెట్లు దిగగానే కింద అంతస్తులోని అన్ని లైట్లూ వేసింది జయ. ఇల్లంతా ఎంతో నిశ్శబ్దంగా ఉంది. టీవీ సెట్ అంతా విప్పి కింద పరిచి ఉంది. బిభూ ఊరికివెళ్ళేముందు టీవీ రిపేర్ చేయడానికి అంతా విప్పి వెళ్ళాడు. బిభూ అప్పుడు వదిలివెళ్ళిన టూల్స్‌కిట్ ఇప్పటికీ అలానే ఉండిపోయింది. ఆ పక్కనే బిభూ వదిలివెళ్ళిన సిగరెట్ పాకెట్, దానిపైన లైటర్ ఉన్నాయి. వెళ్ళేముందు బిభూ నాలుగు రోజుల్లో వస్తానని చెప్పి వెళ్ళాడు. కానీ, నేటికి బిభూ పోయి నాలుగు నెలలవుతోంది.

బిభూ అన్నావదినలు వచ్చివెళ్ళారు. ఆ వెంటనే జయావాళ్ళ తల్లిదండ్రులు వచ్చి వెళ్ళారు. ఈ నాలుగునెలలు ఆ ఇంట్లో సంతాపంకన్నా వచ్చిపోయేవాళ్ళ హడావిడే ఎక్కువగా ఉంది. ఎంతోమంది బంధుమిత్రులు, దూరప్రాంతంవారు కూడా వచ్చివెళ్ళారు. ఆ రోజు ఉదయమే తన తల్లిదండ్రులను భారతదేశానికి వెళ్ళే విమానం ఎక్కించింది. వారు ఎంత బతిమాలినా వారి వెంట తిరిగి వెళ్ల టానికి జయ అంగీకరించలేదు. జయ తల్లి ఎంతో దుఃఖపడి మరీ వెళ్ళింది కానీ, జయ కళ్ళలో నీరు ఇంకిపోయింది.

అనేకమంది జయకు అనేక సలహాలిచ్చారు. అన్నింటినీ ఈ చెవితో విని మరో చెవితో వదిలేసింది జయ. ఆమెకు బిభూ గురించి ఆలోచించేందుకు కూడా వారు ఒక్కక్షణం అవకాశం ఇవ్వలేదు.

ఎన్నాళ్ళకో నేడు ఆమె ఒంటరిగా ఉంది. కించిత్తు భయానికి ఆస్కారం లేకుండా తన మనస్సును, ఇంటిని చక్కబెట్టుకొంది.

అమెరికాకి వచ్చి రెండేళ్ళు అయినా ఈనాడు తనకు లభించిన ఏకాంతం గతంలో ఏనాడు లభించలేదు.

తన ప్రేమతో, ఆప్యాయతతో బిభూ జయని దాదాపుగా రెండేళ్ళు వివశు రాలిని చేశాడు. అమెరికాకు వచ్చిన తొలినాటి నుండి జయను ప్రతి చిన్న విషయంలోనూ వెన్నంటి ఉండేవాడు బిభూ.

జయకు అమెరికా కొత్త కావటంవలన అనేక విషయాలు తెలియవని,

జయకు మతిమరుపు ఎక్కువని, ఎక్కువ సరదాగా కలివిడిగా ఉండదని, అన్యమనస్కంగా ఉంటుందని, ఆమె వెళ్ళే యూనివర్సిటీకి కూడా వెళ్ళి క్లాసులు అయిపోగానే ఆమెను కారులో ఇంటికి తెచ్చేవాడు బిభూ.

"నేనేమైనా చిన్నపిల్లనా? కలకత్తాలో చదివే రోజుల్లో ఒంటరిగా నేను వెళ్ళేదాన్ని కానా?" అడిగేది జయ బిభూని.

అమెరికా జీవితం అంతా హడావిడి. వారం అంతా పనిచేసి వారాంతానికి కార్లలో మైళ్ళ దూరాలకు వెళ్ళి విశ్రాంతి తీసుకొని వస్తారు. రోజులు, గంటలు తరబడి శలవుల్లో కబుర్లు చెప్పుకొంటారు.

జయ రానప్పుడు బిభూ తన మిత్రులతో రాత్రంతా కబుర్లు చెప్పి మర్నాడు నిద్రలేకుండా ఆఫీసుకు వెళ్ళేవాడు.

ఫీనిక్స్‌లో ఉన్న ప్రపంచఖ్యాతిగాంచిన బొమ్మజెముడు ఎడారిని చూడాలని ఎన్నోసార్లు అనుకున్నారు వాళ్ళు. కాని, ఒక్కసారి కూడా వీలుకాలేదు వారికి. జయ వచ్చాక రెండురోజులు అక్కడే ఉండే ప్రోగ్రాం పెట్టింది. కాని మిత్రులంతా జయ అమాయకత్వానికి నవ్వుకున్నారు.

ఇంకా గ్రాండ్ కెన్యాన్ చూద్దామనుకొన్నారు. కాని ఆ ఆలోచనలేవీ కార్యరూపం దాల్చలేదు.

జయ ఎన్నో చూద్దామనుకొంది. చికాగో, న్యూయార్క్, నయాగరా వాటర్‌ఫాల్స్, బోస్టన్, కేంబ్రిడ్జి ఎన్నింటినో చూపమని బిభూని అడిగింది ఎన్నోసార్లు. కాని, ఏదీ చూపకుండానే బిభూ అనంతంలో కలిసిపోయాడు.

ఇక భవిష్యత్తు అంతా జయకు ఆహ్వానాలే. ప్రయాణాలే. ఎలుకకోసం అటూ ఇటూ చూసింది ఎలుక జాడ ఎక్కడా కన్పించలేదు.

బిభూ మరచిపోయిన టీ.వి. ముందు కూర్చుంది జయ. బిభూ వస్తువులను అతని వారు తీసుకువెళ్ళిపోయారు. మిత్రులు కొన్ని తీసుకువెళ్ళారు. బిభూ జ్ఞాపకాలుగా నేడు ఆ ఇంట్లో మిగిలినవి చాలా తక్కువ.

ఈనాడు ఇంట్లో ఎవ్వరూలేరు. ఇప్పుడు ఇన్నాళ్ళకు బిభూ గురించి ప్రశాంతంగా ఆలోచించుకోవటానిక సమయం లభించింది జయకు.

భర్తపోయిన షాక్‌ను జయ ఎలా తట్టుకొంటుందోనని ఆమె స్నేహితులు

కలవరపడ్డారు. ముందు జయ అంతర్ముఖురాలైంది. తర్వాత ఆమె కంఠం కరుకుబారి మిత్రులను సైతం కటువుగా తుంచేసేస్థాయికి పెరిగింది. ఈ ప్రవర్తన చాలామందరికి అర్థంకాలేదు. అంతకన్నా ఆమె పెద్దపెట్టున ఏడిస్తే బాగుండునని అనుకొన్నారు బిభూ మిత్రులు.

చాలాసేపు ప్రశాంతంగా కూర్చున్నాక ఆమెకు ఏదో ఆశ్చర్యం కలగసాగింది. చివరిసారిగా వీడ్కోలు తీసుకొన్నప్పటి బిభూ ముఖం ఎలా ఉందో కూడా ఆమె స్ఫురణకు రావటంలేదు. కన్నీళ్ళు కూడా రావటంలేదు. అందుకు బదులుగా ఆమెలో అంతర్గతంగా ఏదో సంతోషం ఉబుకసాగింది. బిభూ తనని ఎంతో ప్రేమతో ఆదరించినా తనకు దుఃఖం కలగకపోవటానికి కారణం ఏమిటి? బిభూ ప్రేమను మరిచిపోవటానికి ఇష్టం లేకనే తను కలకత్తాకు తిరిగి వెళ్ళటానికి అంగీకరించలేదు. మరి దుఃఖం రాదేమిటి?

ఈ దేశానికి రాకముందు జయ అమెరికన్ స్త్రీల స్వేచ్ఛ గురించి ఎప్పుడూ తలచుకొని ఈర్ష్య పడుతుండేది. వారికి కావలసినట్లు వాళ్ళ జీవితాన్ని మలుచుకొనే స్వేచ్ఛ అమెరికన్ స్త్రీలకుంది. తనకు కూడా అలానే జీవించాలని లోలోన ఎంత ఉబలాటంగానో ఉండేది. తను కోరుకొన్న ఈ స్వేచ్ఛ నేటికి గానీ జయకు లభించలేదు.

బహుశ అందుకేనేమో తనకు దుఃఖం బదులు లోలోన సంతోషం ఉప్పొంగసాగింది.

స్వేచ్ఛ ప్రేమకన్నా బలమైందా?

"ఏమో! బిభూ... బిభూ నాకు నువ్వు కావాలి? స్వేచ్ఛా కావాలి? కాని బిభూ... బిభూ...?"

జయలో ఆ క్షణం నేరభావం, సిగ్గు అన్నీ కలిసి ఉప్పొంగాయి. క్రమంగా ఏడుపు పైకి రాసాగింది. భోరున బిభూకోసం ఏడ్చేసింది.

(విపుల, సెప్టెంబర్ 2000)

❖

ఎత్తుగడ

(బెంగాలీ కథ)

ఆశిష్బోరా

రంగు వెలిసిపోయిన గది గోడలవైపు తిరిగి పడుకొన్నాడు తరుణ్. ఒత్తిగిల్లి పడుకోవటం వలన అతని ఒళ్ళు ఒకవైపు కుదేసినట్టు నొక్కుకుపోయి పల్చటి పరుపును హత్తుకొంటున్నాయి. అలా ఎంతసేపు పడుకొన్నాడో, అటూ ఇటూ మాత్రం కదలటం లేదు తరుణ్. ఆశిష్, సుదీప్ లు మాత్రం మౌనంగా బట్టలు మార్చుకొని తయారవుతున్నారు. తరుణ్‌కు నిద్రాభంగం కాకూడదన్నట్లు మెల్లిగా, శబ్దం లేకుండా వాళ్లిద్దరూ తమ తమ పనులు నిర్వర్తిస్తున్నారు.

ఇదంతా ఒక వార గమనిస్తూ కూడా నిద్ర నటిస్తున్నాడు తరుణ్. తరుణ్ణి నిద్రలేపకుండా, వాళ్లిద్దరూ చుప్ చాప్‌గా రూము బయటికి పోయి రోడ్డుకు ఆవలి వైపు టీ స్టాల్‌లో రొట్టె, టీ స్వీకరిస్తున్నారు. ఇదివరలా సుదీప్, ఆశిష్‌లు ఇప్పుడు రూముకు టీ, టిఫిన్లు తెప్పించుకోవటం మానేశారు. ఇంతకు క్రితం కేవలం కిటికీ తలుపు తీసి రోడ్డు ఆవలనున్న టీ దుకాణం వాడిని కేకేస్తే కావలసినవి రూముకు వచ్చేవి.

అప్పట్లో అందరూ రూములోనే కలిసి టీ, టిఫిన్, భోజనం చేసేవారు. తరుణ్ ఉద్యోగం ఊడే దాకా ముగ్గురూ కలిసి అన్ని ఖర్చులు భరించి, వాటిని సమంగా పంచుకొనేవారు. టిఫిన్ స్టాల్ యజమాని బిషి వీరికి కావలసినవన్నీ

న్యూస్ పేపర్‌తో సహా అమర్చేవాడు.

తరుణ్ ఉద్యోగం ఊడిపోయింది. అయినా తరుణ్ రాత్రి భోజనం ఖర్చు భరించాలిద్దరన్నది వేరు. తరుణ్‌కి ఉద్యోగం పోయినా కనీసం రెండు ట్యూషన్ల యినా దొరక్కపోతాయా, అతని వంతు ఖర్చు అతను త్వరలోనే మళ్ళీ భరించటం మొదలు పెట్టడా అన్నది సుదీప్, ఆశిష్‌ల అంచనాలు. కాని, డిగ్రీ పరీక్షలు అయిపోయిన వెంటనే అతని ట్యూషన్లు రావటం కూడా ఆగిపోయాయి. ఈ పరిస్థితుల్లో ఆశిష్, సుదీప్‌లు బయట టిఫిన్, భోజనం చేయటం ప్రారంభించారు.

అయితే తరుణ్‌కి ఈ పరిస్థితులపై సరైన అవగాహన లేకపోలేదు. కొన్నిసార్లు తను ఎంత నిస్సహాయుడో తన స్నేహితులు కూడా అంత నిస్సహాయు లని అతనికి బాగా తెలుసు.

అప్పటి నుంచి తరుణ్ కూడా తనకు తోచిన ఎత్తులు, జిత్తులు అనువుగా వేయసాగాడు. ఫలితంగా నిద్ర నటించటం తప్పలేదు తరుణ్‌కు.

ప్రతిరోజు ఈ టైంకు తరుణ్ నిద్ర లేచి కాలకృత్యాలు ముగించుకొని దుస్తులు తొడుక్కొని బయటికి వెళ్ళిపోయేవాడు. బయటికి పోయేప్పుడు కనీసం రోడ్డు వైపున టీ దుకాణం వైపు చూడను కూడా చూసేవాడు కాదు. కానీ, ఈనాడు తరుణ్ పక్కలోంచి లేవలేదు. రాత్రంతా భోజనంలేక ఆకలితోనే జాగారం చేయటంతో తరుణ్‌ని నీరసం ఆవహించేసింది.

రాత్రి మిత్రులు నిద్దరపోతున్నప్పుడు రెండుసార్లు లేచాడు తరుణ్. ఒకసారి నిద్రలేచినప్పుడు ఆకలిబాధ నోర్చుకోలేక దొంగతనంగా ఆశిష్ నానేసుకొన్న శనగలను తినేశాడు. సాధారణంగా ఉదయాన్నే లేవగానే తినడానికి నీళ్లలో శనగలను నానేసి పడుకొంటాడు ఆశిష్ ప్రతిరాత్రి. అయితే ఆశిష్ శనగలను నానేసి ఎక్కువసేపు కాకపోవటంవలన అవి పచ్చిగా కటువుగా ఉన్నాయి. వాటిని తినటం వలన శబ్దం రావటం గమనించి బయటకు వెళ్లి అక్కడ నమిలాడు. తెల్లవారాక ఆశిష్ శనగలు తక్కువున్నట్లు గమనిస్తాడు. ఆకలినాపు కోలేక తరుణ్‌కు తినకతప్పలేదు. అంతే, రాత్రి తిన్న ఆశిష్‌వి నాలుగు శనగ గింజలు తప్ప తానేమి ఎరగడు. అందువల్ల నీరసం ఏమాత్రం తగ్గనంటోంది.

మిత్రులు రూము వదిలిపోయేదాకా తరుణ్ లేవడానికి ప్రయత్నం కూడా

చేయదలచుకోలేదు. తనకు తెలుసు కనీసం తనను ఆశిష్, సుదీప్‌లు రూంలో నైనా ఉండనిచ్చారు. అదే తనకు పదివేలు. ఒకసారి తనకు భూలుధ ఆకలి బాధ గురించి వారు వివరించింది తనకిప్పటికీ గుర్తుందనుకొన్నాడు తరుణ్ మనస్సులో.

భులుధా ఆఫీసులో ఎవరితోనో గొడవపడి నిరాహారదీక్షకుపక్రమించటం, తను ఆకలిబాధ ఎలా ఉంటుందో చెప్పమనటం, భులుధా వివరించటం ఒక్కక్కటే గుర్తు చేసుకున్నాడు తరుణ్. మొదటి మూడురోజులు నిరాహారదీక్ష భయంకరంగా బాధపెడుతుందని, తరువాత ఆకలిబాధ మందగించి నీరసం మనుషుల్ని ఆవహిస్తుందని, భావాలు, బాధలు అన్ని క్రమంగా క్షిణించి స్తబ్దత ఆక్రమిస్తుందని భులుధా చెప్పాడు. ఇంతలో తరుణ్ నోట్లో లాలాజలం ఊరింది. ఎక్కడి నుంచో కమ్మని రుచికరమైన వంటలవాసనలు తరుణ్ ముక్కు పుటాలను వచ్చి తాకాయి.

తరుణ్ ఆకలిబాధ రెట్టింపయింది. హఠాత్తుగా కళ్ళు మూసుకున్నాడు. గోడమీద ఉప్పుచారలు, గోడ పగుళ్లతో రకరకాల రూపురేఖలు సంతరించుకొన్న గోడ భాగాలు కూడా రకరకాల వంటకాలను తలపుకు తెస్తున్నాయి తరుణ్‌కు ఒకసారి కోడికాలు, ఒకసారి చపాతి, ఇంకోసారి వడలు... ఆహా! ఊహించు కొన్న వంటకాలన్నీ తరుణ్ ముందు ప్రత్యక్షమైనట్టు అనిపించేది. నిజానికి ఇటువంటి వంటకాలు ఇటీవల తినక చాలాకాలం అయింది. మూడుపూట్ల కాకపోయినా రెండు పూట్లయినా భోజనంకోసం తరుణ్ అనేక ఎత్తులు వేయక తప్పటం లేదు. ఏపూటైనా తరుణ్ ఎత్తుపారకపోతే ఆపూట పస్తే తరుణ్‌కి.

ఆశిష్, సుదీప్‌లు టీ తాగి, టిఫిన్‌చేసి వచ్చారు. 'తరుణ్ లే! ఏంటి ఇంకా పాడుకొనే ఉన్నావు?' తరుణ్‌ను లేపుతూ అడిగాడు సుదీప్. 'నేనా' అడిగాడు తరుణ్ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నట్లుగా. 'ఏమిటీ? జ్వరం ఎమన్నా వచ్చిందా?' అంటూ తరుణ్ తల పట్టుకొని చూసి, 'అబ్బే ఏమిలేదులే అన్నాడు సుదీప్.

తరుణ్ పేలవంగా నవ్వాడు. కానీ వాళ్ళవైపు ఒత్తిగిల్లడానికి ప్రయత్నించి నప్పుడు అతని కడుపు ఘోరంగా ఘీంకరించింది. బాధగా మూల్గాడు తరుణ్. 'అరె..రే.... ఉండు. ఒక కప్పు టీ తెప్పిస్తా' అన్నాడు ఆశిష్ తరుణ్ బాధ

చూసి భరించలేనట్లుగా, హఠాత్తుగా.

'అబ్బే అక్కర్లేదు, ఫర్వాలేదు' అన్నాడు తరుణ్ బింకంగా. అసరికే ఆశిష్ రోడ్డు ఆవల ఉన్న టీ స్టాల్ వాడికి టీ పంపమని కిటికీలోంచి కేకేసి చెప్పాడు. మౌనంగా ఉండి పోయాడు తరుణ్. 'చూడుతరుణ్! టీ తాగితే కాస్త ప్రాణం పుంజు కొంటుంది. ఇవ్వాళ నీకో ముఖ్యమైన పనిచెబుతున్నాను. తప్పక చేయాలి సుమా! దేబుదా నీకెక్కడో పని కుదురుస్తానని చెప్పాడు. మర్చిపోవద్దు. సరేనా!' అన్నాడు ఆశిష్. 'ఆ ... దేబుదా ఎప్పుడూ అలానే చేస్తుంటాడు'. మూలుగుతూ అన్నాడు తరుణ్.

'అరే ...అలా అంటేఎలా? నువ్వూ ప్రయత్నం చేస్తుండాలి గదా! అన్నాడు సుదీప్.

టీ స్టాలు భిషి టీ తెచ్చాడు. సుదీప్ కింద కూర్చుని తరుణ్ ట్రంకుపెట్టెను అతని మంచం కిందనుంచి లాగి, 'ఇందులో నువ్వు తినడానికి బిస్కెట్లు ఏమైనా ఉన్నాయా?' అంటూ దాని మూత తీశాడు.

ఇదివరలో అందరూ కలిసి సమంగా అన్నీ పంచుకొని తినే రోజుల్లో ఎవరి తిండి వారు దాచుకొనే అవసరం లేకపోయేది. అన్ని పదార్థాలు బయటనే ఉండేవి. ప్రతిఒక్కరు వారికి తోచింది ఎదోఒకటి ఎప్పుడూ తెస్తుండే వారు. కానీ, ఇప్పుడు ఎవరిది వారే ప్రత్యేక ట్రంకుపెట్టెల్లో దాచుకొంటున్నారు. ఫలితంగా రెండుజాడీలు ఖాళీగా అటకపైనే ఉంటున్నాయి గతం తాలూకు జ్ఞాపకాలు గుర్తుచేస్తూ.

తరుణ్ బాత్రూమ్‌కు వెళ్ళి ముఖం కడుక్కొని వచ్చాడు. ఈలోగా మూడు బిస్కెట్లను తరుణ్ తినటం కోసం సిద్ధంచేశాడు సుదీప్. తరుణ్ రాగానే సుదీప్ స్నానానికి వెళ్ళాడు. ఆశిష్ తన వంటికిరోజూ లాగే ఇవ్వాళ కూడా బాగా ఆవ నూనెపట్టించాడు బలంగా. తరుణ్ ముందు రెండు బిస్కెట్లు మాములుగా తినేసి, మూడవ బిస్కెట్ ముంచుకు తిన్నాడు. తరువాత టీని తాగేశాడు.

సుదీప్ హడావుడిగా ఆఫీసుకు పోతూ 'ఆశిష్, ఈ రాత్రి కార్యక్రమం మరిచిపోవద్దు' అన్నాడు.

'నువ్వెప్పుడొస్తావు' అడిగాడు ఆశిష్.

'ఏడు గంటలకు' చెప్పాడు సుదీప్ పోతూనే.

బహుశ వారు సినిమాకు వెళ్తుండవచ్చునేమో! ఇంతకు మునుపు ముగ్గురూ వెళ్తుండేవారు. కానీ, ఇప్పుడు తరుణ్ మానుకోవటంతో వాళ్లిద్దరూ వెళ్తున్నారు. అయినప్పటికీ రెండునెలల పాటు తరుణ్‌ను వాళ్లు తమ వెంట తీసుకెళ్లారు. కానీ, క్రమక్రమంగా వాళ్లిద్దరూ తరుణ్ని తమవెంట తీసుకెళ్లడానికి వెనుకాడ వలసి వచ్చింది. వాళ్ళ ఆర్థికస్తోమత కూడా అంతంత మాత్రమే కావడం ఇందుకు కారణం. వాళ్ళు పోషించాల్సిన కుటుంబాలు కూడాపెద్దవి. వారి బాధ్యతలూ ఎక్కువే. అలాంటప్పుడు తనవల్ల వారికి ఆర్థిక ఒత్తిడి కలగకూడదని తరుణ్ కూడా భావించాడు.

తరుణ్ మళ్ళీపడుకొని అర్ధనిమీలిత నేత్రాలతో ఆశిష్ చేసేదల్లా గమనించ సాగాడు. ఆశిష్ కూడా సుదీప్‌లానే త్వరత్వరగా స్నానం ముగించుకొని డ్రస్సింగ్ చేసుకొని ఆఫీసుకు తయారవు తున్నాడు. ఆఫీసుకు పోతూపోతూ 'ఏంటితరుణ్! నువ్వులేవవా? నేను చెప్పిన పనులు చేయవా? అని అడిగాడు.

అందుకు తరుణ్ 'లేస్తా! చేస్తా!' అని పొడిమాటలతో సమాధానం చెప్పాడు. 'అరే ! ఒకసారి స్నానం చేస్తే ఈ బద్ధకం పోతుందయ్యా. అవునుకానీ, నీ దగ్గరేమన్నా డబ్బులున్నాయా ?' అడిగాడు ఆశిష్. 'ఆ... ఉన్నట్టున్నాయి. నా షర్ట్ ప్యాకెట్లో చూడాలి'. వెంటనే ఆశిష్ తన జేబులోంచి ఒకరెండు రూపాయల నోటు తీసి, సిగరెట్తో సహా తరుణ్ బిల్‌పై పెట్టి, 'సర్లే, ఇదిగో అవసరమవుతుందేమో! దీన్నుంచు. దేబుదానీని కలవటం మరవకుసుమా' అని చెప్పాడు. 'థాంక్స్' చెప్పాడు తరుణ్.

ఆశిష్ వెళ్ళిపోగానే తరుణ్ మంచం మీద నుంచిలేచి సిగరెట్ అంటించాడు. కానీ అది రుచిగా అనిపించలేదు. తలా, ఒళ్ళు ఊపేస్తున్నట్టు అనిపించగానే దానిని ఆర్పేసి దాచుకొన్నాడు మళ్ళీ ఎప్పుడైనా ఊదచ్చు అనుకొని. లేచి స్నానం చేసి వచ్చి మళ్ళీ మంచంమీద వాలాడు. పడుకోగానే నిద్రపట్టింది తరుణ్‌కు. ఎప్పటికో బెల్ మోగగా తలుపు తీశాడు తరుణ్.

టీ కప్పులు తీసుకెళ్లడానికి బషి వచ్చాడు. 'టైం ఎంతయింది?' అడిగాడు తరుణ్. 'పన్నెండైయింది సార్! ఈరోజు బయటికి వెళ్ళటంలేదా సార్?' అడిగాడు

బషి. 'ఎందుకు లేదు. అదే పనిమీద ఉన్నాను' అన్నాడు తరుణ్. బషి టి కప్పు తీసుకోని వెళ్ళిపోయాడు. తరుణికి ప్రస్తుతం ఆదాయం ఏమీలేదు. బాగా ఆర్థిక ఇబ్బందులలో ఉన్నాడని బషికి కూడా బాగా తెలుసు. తరుణ్ బయటికివెళ్తే పాన్వాలా కూడా ముఖం తప్పించేస్తాడు. ఎందుకంటే అతనికి తరుణ్ని తనబాకీ తీర్చమని అడగవలసి వస్తుంది. తెలిసి ఆపని చేయలేడు పాన్వాలా. అదీగాక తనామాట అడిగాక తరుణ్ ఓ బీడీ ఇమ్మంటే ఇంకా అదనపు బాకీ కూడా అవుతుంది. ఆఖరుకు చాకలివారు కూడా బట్టలు ఉతకాలా అని అడగటం మానేశారు. ఇవన్నీ తరుణ్ గమనించినా గమనించనట్టు నెట్టుకొస్తున్నాడు. నిద్రపోవటం వలన కొంత ఊపిరివచ్చినట్లయింది తరుణ్కు. వెంటనే తయారై బయటికి బయల్దేరాడు. సాధారణంగా సెలవుదినాలలో బినోద్ వాళ్ళింట్లో భోజనం మధ్యాహ్నంపూట పన్నెండున్నర, ఒంటిగంట మధ్యలో సిద్ధంగా ఉంటుంది.

తను బినోద్కు ట్యూషన్ చెప్పే రోజుల్లో అడపాదడపా అక్కడే భోజనం చేయటం గుర్తుకు వచ్చింది తరుణ్కు. అయితే, అతను ఇటీవలికాలంలో బినోద్ వాళ్ళింటికి వెళ్ళటంలేదు. తరుణ్ ఇప్పుడు బినోద్కు ట్యూషన్ చెప్పటం కూడా చేయటంలేదు. పదకొండవ తరగతివాడికి చెప్పటం తరుణ్ శక్తికి మించినపని. తను వెళ్లేసరికి బినోద్ వాళ్ళు భోజనంచేసి ఉండకూడదని శత విధాల మనస్సులో కోరుకొంటున్నాడు తరుణ్. అంతేగాదు, ఎలాగోలాగా బినోద్ కూడా ఎక్కడికి పోకుండా ఇంట్లోనే ఉంటే బాగుండునని తహతహలాడు తున్నాడు. తరుణ్ బినోద్ వాళ్ళింటి బెల్నొక్కాడు.

ఒకవేళ బినోద్ లేకపోతే తనేం చేయగలడు? పోనీ పచ్చామిట్టెర్కు వెళ్లి బాయ్ హొటల్లో పచ్చదానీని పట్టుకొంటే? ఏమో? ఆ పచ్చాదానీని అనుగ్ర హించే వరకు ఆ పూట భోజనం సంశయమేకదా ! ఇలా ఆలోచిస్తూ నిల్చున్నాడు తరుణ్ తలుపు దగ్గర. ఇంతలోనే తలుపుతీశాడు బినోద్. అతన్ని చూడగానే ప్రాణంలేచి వచ్చినంతపనైంది తరుణ్కు. బినోద్ లేకపోతే, పచ్చాదానీ కరుణిం చకపొతే తనకు ఆశిష్ ఇచ్చిన రెండు రూపాయలే కదా దిక్కు అన్న భావన కలిగినందువల్ల తరుణ్ నుదుటంతా చెమటపట్టింది. తరుణ్ని చూసి, 'సార్!

మీరా "అడిగాడు బినోద్. 'అవును బినోద్. చాలాకాలం అయింది నిన్నుచూసి. నీ గురించి ఏ విషయం తెలియదు నాకు. ఎలా ఉన్నావు?' అడిగాడు తరుణ్.

'బాగున్నాను సార్. రండి లోపలికి'.

'కాదు బినోద్, నేను ఇటువైపు పోతూ పోతూ మీ ఇంటికి వచ్చాను. అంతే. బింకంగా నిల్చుని మాట్లాడాడు తరుణ్. 'అరే. ఫర్వాలేదు సార్. ఒక్క నిముషం రండి. నాకు మిమ్మల్ని అడిగి తెలుసుకోవాల్సినవి ఎన్నో ఉన్నాయి. తటపటాయిస్తున్నట్టుగా తరుణ్ బినోద్ ఇంట్లోకి అడుగుపెట్టాడు.

'సార్, లెక్కలు నాకు చాలా సమస్యగా ఉన్నాయి. ఏంచేయాలో పాలు పోవటం లేదు', అన్నాడు బినోద్. 'అరే ! అవి ప్రాక్టీస్చేస్తే సులభంగా వస్తాయి బినోద్', అన్నాడు తరుణ్. 'అదిగాదు సార్! నాకు అవిఅర్థం కావటం లేదు. చూడండి ఈలెక్క. ఎంతక్లిష్టంగా ఉందో, అంటూ కాలకులస్ పుస్తకం ముందు పెట్టాడు బినోద్. 'ఓ! కాలకులస్. దీనిని నేను మరిచిపోయి చాలాకాలం అయింది.' అన్నాడు తరుణ్.

'సార్, సార్! దీనిని కాస్త అర్థం అయ్యేట్టు చెప్పరూ. బినోద్ చాలా ప్రార్థనాపూర్వకంగా అడిగాడు. చూడు, దీనిని నీకు చెప్పటానికి చాలా టైం పడుతుంది. నాకు అవతల ఒకటిన్నరకెల్లా రెస్టారెంటు మూసేస్తారు. మళ్ళీ ఎప్పుడైనా చెప్తా. దయచేసి ఒక గ్లాసు నీళ్లు తెస్తావా? అడిగాడు తరుణ్.

'ఒక్క నిముషం ఉండండి' అంటూ బినోద్ ఇంట్లోకి పరుగెత్తాడు.

తనువేసిన ఎత్తు పారినట్లేనా, కాదా? తేల్చుకోలేక లోలోన సతమత మవుతూ కూర్చున్నాడు తరుణ్. లోపల బినోద్, అతని తల్లి ఏదో మాట్లాడు కోవటం వినిపిస్తోంది. ఆవిడ వంట చేస్తున్న శబ్దం వినిపించింది తరుణ్కు.

ఇంతలో బినోద్ గ్లాసుతో నీళ్లుతెస్తూ 'సార్, మా మమ్మీ మిమ్మల్ని భోజనానికి ఇక్కడే ఉండమంటోంది' అని చెప్పాడు. 'అబ్బే! కుదరదు. నేవెళ్ళాలి.' అన్నాడు తరుణ్. 'మీరు వెళ్ళిపోతే మా అమ్మ బాధపడుతుంది' అన్నాడు బినోద్.

ఎలాగైతేనేమి, తన ఎత్తు పారినందుకు లోలోన సంతోషిస్తూ తరుణ్ అక్కడే ఆపూట భోజనం ముగించాడు. బినోద్, తరుణ్ ఇద్దరూ లోపలి వెళ్లి చదువుమీద దృష్టిపెట్టారు. బినోద్కు కాలకులుస్ అర్థమయ్యేట్టు చెప్పాడు

తరుణ్. సాయంత్రం టీ తాగి బినోద్ ఇంటి నుంచి బయల్దేరాడు తరుణ్.

ఇక రెండవపూటకు పథకం పారవలసి ఉంది. ముందే రెండవపథకం కూడా వేసి ఉంచాడు తరుణ్. ఈమధ్య తరుణ్‌కి ఇదో తప్పనిసరి అలవాటై పోయింది. ఒకపూట భోజనం లభించగానే రెండోపూటకు ఆటోమాటిక్‌గా ఆలోచించటం మొదలుపెట్టాడు. ఎప్పుడైతే ఒక పథకం ఖరారవుతుందో అది ఆచరణలో అమలయ్యే వరకూ అతనికి విశ్రాంతి లభించదు. అందువల్ల బినోద్‌కు లెక్కలు చెప్తున్నప్పుడే తన రెండవపూట భోజనానికి పోల్టు ఇంటినెంచు కొన్నాడు తరుణ్. పోల్టు బాగా డబ్బున్నవారి బిడ్డ.

వాళ్ళు బాగా పొద్దుపోయాక టీ తీసుకొంటారు. పూరీలు, పరాఠాలు, హల్వా వేగించిన వంటకాలన్నింటినీ టీటైంలోనే తినేస్తారు. ఆ సమయంలో తానూ వెళ్తే తన రాత్రిభోజనం కూడా ముగిసినట్లే. అక్కడి వంటకాలను తలచుకోగానే తరుణ్ నోట్లో నీరు ఊరింది.

బినోద్ వాళ్ళింట్లో సంతృప్తికరంగా లభించిన భోజనం కారణంగా నాలుగు మైళ్ళు నడిచి పొల్టు వాళ్ళింటికి పోవటానికి తరుణ్‌కి కష్టమేమి కలగలేదు.

బస్సులో వెళ్ళడానికి తరుణ్ ఎంతమాత్రం సిద్ధంగాలేడు. తన జేబులో చిల్లర, ఆశిష్ ఇచ్చిన రెండురూపాయలనోటు తరుణ్ భవిష్యత్తుకు మిగిలిన ఏకైక ఆశాకిరణం. భవిష్యత్తు ఎప్పుడూ ఇలానే ఉండదన్న భావనతో మెల్లగా పోల్టు ఇంటివైపు నడకసాగించాడు తరుణ్.

తీరా పోల్టు ఇంటికి వెళ్లేసరికి ఇంటి జవాన్గేటు ముందు తూగుతూ ఉండటం గమనించాడు తరుణ్.

'సార్ వాళ్ళులేరా?' అని అడిగాడు జవాన్ని తరుణ్.

'లేరు, ఉరుకెళ్లారు సార్' బదులిచ్చాడు జవాన్.

'ఎక్కడికి వెళ్లారు?'

'ఊరెళ్ళారుసార్. పదిరోజుల దాకా వాళ్ళురారు సార్ అని చెప్పాడు జవాన్. తరుణ్ వరుస ప్రశ్నలకు ఉక్కిరిబిక్కిరి అయినాడు.

తరుణ్ కాసేపు స్తబ్దుడైనాడు. యాంత్రికంగా అతని అడుగులు వచ్చినదారి పట్టాయి.

కొంతమంది ఎంత అదృష్టవంతులు. ముందున్నరోజులన్నీ దిగులు, చింతా లేని రోజులని వారికి ముందే తెలిసి ఉండటం కన్నా అదృష్టమేముంది? తను క్షణంక్షణం లెక్కలు వేసుకోకుండా జీవితంగడపలేడుకదా? తనచుట్టూ గందరగోళంగా జీవిస్తున్న ప్రపంచంనుంచి వేరైపోతున్నట్టు ఆలోచనల్లో చిక్కుకు పోయి నడుస్తున్నాడు. అతనింకా చాలా దూరం నడవాలి. ఇంతలో ఎదో గుర్తుకు వచ్చింది తరుణ్‌కు. తన జేబులోంచి పాత రైలు టికెట్ నోదానిని చుట్టలా చుట్టి వేళ్ళ మధ్య సిగరెట్లా పట్టుకొన్నాడు. రోడ్డుపై వెళ్లే ట్రామ్పైకి ఎగిరి కూర్చున్నాడు. టికెట్ కోసం కండక్టర్ దగ్గరికి రాగానే వేళ్ళ మధ్య సిగరెట్లా ఉంచుకొన్న టికెట్ చూపించాడు తరుణ్.

దేబుదా ఇంటి దగ్గర పార్కుకు తరుణ్ చేరేసరికి బాగా పొద్దుపోయింది. కాసేపు పార్కులో విశ్రాన్తి తీసుకోవాలనుకొన్నాడు తరుణ్. పార్‌లో అక్కడక్కడా కొన్నిజంటలు కూర్చుని ఉన్నాయి. ఒంటరిగా ఉండే ప్రాంతం ఎంచుకొని కూర్చోవాలని పార్కును అంతా తరుణ్ చూడసాగాడు. చివరకు ఒకచోట చతికిలబడి పొద్దున కాల్చగా మిగిలిన అర సిగరెట్ను అంటించాడు. తను దేబుదా ఇంటికి భోజనం సమయానికిపొతే అక్కడే భోజనం కొట్టేయ వచ్చు ననుకొన్నాడు తరుణ్.

కాసేపు అలా ఆలోచిస్తూ నిద్రకుపక్రమించాడు తరుణ్. అతనికి మళ్ళీ మెళకువ వచ్చి టైం చూసుకొనేసరికి రాత్రి తొమ్మిదిన్నర అయింది. ఆసరికి పార్కులో జనం అంతా నెమ్మదిగా జారుకున్నారు.

తిన్నగా దేబుదా ఇంటి వైపు నడకసాగించాడు తరుణ్. ఇంటికి కొద్దిదూరం నుంచే వేలాడుతున్న తాళం కప్ప కనిపించింది. అలా జావకారిపోయిన తరుణ్ ముక్కుపుటాలకు కమ్మటివాసనలు వచ్చి తగిలేప్పటికీ కడుపులో ఆకలి ఉవ్వెత్తు లేచింది పెట్రోలు చల్లిన మంటలా.

వెంటనే గుర్తుకు వచ్చింది తరుణ్‌కి అక్కడికి దగ్గర్లోనే రఘు ఫుట్పాత్ హొటల్ ఉందని. ఆ ప్రక్కనే రకరకాల రుచికరమైన వంటలను చేసి తక్కువ ధరలకు రోడ్డుపైనేవడ్డిస్తాడు. రఘు హొటల్లో అన్ని రకాల తిండి వంటకాలు లభిస్తాయి. తన దగ్గర రెండు రూపాయలకు సరిపడేవన్నీ దొరుకుతాయి.

తరుణ్ హొటల్‌కు వెళ్లేసరికి రోడ్డుపై ఎప్పుడూ ఉండే జనసమూహాలు పలచబడి ఉండటం గమనించాడు. అంతలోనే తరుణ్ కళ్ళు దేబుదానీపై పడ్డాయి. అక్కడ ఒకబల్లపై దేబుదా ఎవరితోనో మాట్లాడుతూ కనిపించాడు. తరుణ్‌కు పోయేప్రాణాలు మళ్ళీసగంలో దొరికినట్టయినాయి.

తన ఆవేశాన్ని అదుపు చేసుకొంటూ దేబుదా కూర్చున్న చోటికివెళ్లి 'దేబుదానీ' అని మెల్లగా పిలిచాడు.

'ఓ! నువ్వా! రారా!' అన్నాడు దేబుదా.

'మీ ఇంటికి వెళ్లాను' అన్నాడు తరుణ్.

'ఓ! మీ వదినగారు లేరు. వాళ్ళ నాన్నగారి ఇంటికి వెళ్ళింది. కూర్చో! దా!' అన్నాడు దేబుదా.

'మీరు నన్నురమ్మన్నారుట గదా?' అడిగాడు తరుణ్ తడారిపోతున్న గొంతుపెట్టి.

'అవునవును. ముందుభోంచేయి. హే రఘు మా తరుణ్‌కు రెండు రొట్టెలు వంటకాలు వడ్డించు', చెప్పాడు దేబుదా రఘుకి.

'అరే! మాంసంలేదు. పప్పు వడ్డించనా?' అడిగాడు రఘు దేబుదానిని వినయనంగా.

'అదేమిటి రఘు? నాకు గెస్ట్ వచ్చినప్పుడు నువ్వు ఇలా అంటే ఏం బాగుంటుంది?' బుంగమూతిపెట్టి అన్నాడు దేబుదా.

'రేపైతే మాంసంతో భోజనంపెడతా.అయితే రాత్రి తొమ్మిది లోగా రావాలి.' అన్నాడు రఘు నిస్సహాయంగా.

'సర్లే'! అంటూ తరుణ్‌వైపు తిరిగి 'ఈపూటకు పప్పు భోజనంతో సరిపెట్టుకో' అన్నాడు దేబుదా.

అయితే తరుణ్ కొంచెం బాధపడకపోలేదు. తనని రమ్మని కబురంపి చివరకు దేబుదా ఇలా ప్రవర్తించటం తరుణ్ కేమాత్రం నచ్చలేదు.

తరుణ్ పరధ్యాసగా ఉండటం గమనించి 'ఏయ్ తరుణ్, ఎక్కడా ఆలోచిస్తున్నావు! ఏమిటీ పరధ్యాస? విన్నావా? రేపు రాత్రికి నీకు భోజనం ఇక్కడే'. గట్టిగా చెప్పాడు దేబుదా.

అవునవును! రఘు వండే మాంసంకోసంమైనా తప్పకవస్తాను', అన్నాడు తరుణ్. రఘుమాటలు, ఆప్యాయత తరుణ్ని బాగా ఆకర్షిస్తాయి.

'అలాగే రేపే నీ ఉద్యోగం గురించి కూడా ఒకమంచి వార్త చెబుతాను.రేపు తప్పక రాత్రి తొమ్మిదింటికి ముందే ఇక్కడికి రావాలి సుమా 'అన్నాడు దేబుదానీ మరోసారి.

'థాంక్స్! తప్పకవస్తాను" అన్నాడు తరుణ్.

వాస్తవానికి ఉద్యోగం గురించిన ఆలోచన తరుణ్కి ఎప్పుడూ ఆకాశ కుసుమము వంటిదే. అతనికి మిగిలిన ఏకైక ఆలోచనల్లా భుక్తి గడిచేదెలా అన్నదే. ఈలోగా రఘు వడ్డించిన ఘుమఘుమలాడే వంటకాలను చూసి, మనసారా వాటిని స్వీకరించడానికి ఉపక్రమించాడు తరుణ్.

(విపుల, ఏప్రిల్ 1995)

❖